జె. కృష్ణమూర్తి

ఈ విషయమై ఆలోచించండి

మొదటి భాగము

కృష్ణమూర్తి ఫౌన్‌డేషన్ ఇండియా

EE VISHAYAMAI ALOCHINCHANDI — Part One
Telugu Translation of the book appearing in Two titles:
in England as *This Matter of Culture* &
in U.S.A as *Think on these Things.*

Translation into Telugu by
C. Hanumantha Rao.

Copies can be had at:
Krishnamurti Foundation India,
64, Greenways Road, Madras - 600 028.

First Edition : 1991.

Laser Typesetting and Printed by:
GEE BEE GRAPHICS
40/3, Mint Subbarayalu Naidu St.,
Madras - 600 021.
Ph: 555542.

ప్రస్తావన

జె. కృష్ణమూర్తి (1895 - 1986) విశ్వవిఖ్యాత తత్త్వవేత్త. ప్రపంచంలోని వివిధ దేశాలను పర్యటిస్తూ, అరవయి సంవత్సరాలపాటు ప్రజలకు జీవనసందేశాన్ని తమ ప్రసంగాల ద్వారా అందజేశారు.

"ఒక నిర్దిష్టమైన మార్గం ద్వారా 'సత్యాన్ని' చేరలేము. 'సత్యం' అనేది మార్గంలేని ప్రదేశం. సంస్థల ద్వారా, నమ్మకాల ద్వారా, పూజా పునస్కారాల ద్వారా, గురువుల ద్వారా దాని చెంతకు చేర లేము. ఆధ్యాత్మిక బోధనలవల్ల, మానసిక వికాసానికై చేసే ప్రక్రియల వల్ల దానిని అందుకోలేము. ఇతరులతో గల పరస్పర సంబంధాలు అనే దర్పణం సహాయంతో మనలను మనము పరిశీలన చేసుకొని అర్థం చేసు కొనడం ద్వారా మాత్రమే యీ పని సాధ్యం అవుతుంది." — అని వక్కాణించారు.

కృష్ణమూర్తి వుపన్యాసాలు, రచనలు అన్నీ యింగ్లీషులోనే సాగాయి. భారతీయ భాషలు కొన్నింటిలోకి కొన్ని ప్రసంగాల, పుస్తకాల అనువాదం యిప్పటికే జరిగింది. కృష్ణమూర్తి ఆలోచనా స్రవంతిని యథాతథంగా, యితర భారతీయ భాషలలో సరళమైనశైలిలో అందించాలనే వుద్దేశ్యంతో కృష్ణమూర్తి ఫౌండేషన్ యిండియా స్వయంగా అనువాద కార్యక్రమాలను ఆరంభించింది. ఆ ప్రయత్నంలో భాగంగా తెలుగు, తమిళం, మల యాళం, కన్నడ భాషలలో అనువాదాల ప్రచురణను మద్రాసు కేంద్రంగా చేసుకొని నిర్వహిస్తున్నాము.

ఈ పుస్తకాల సహాయంతో కృష్ణమూర్తి ఆశించిన నవ మానవ ఆవిర్భావం, నవ్య సమాజ అవతరణ గురించి చదువరులు తమ తమ భాషల్లోనే చదివి అర్థంచేసుకొనడానికి వీలవుతుందని ఆశిస్తున్నాం. కృష్ణ మూర్తి తత్త్వదర్శనాన్ని తరచి చూసుకొని, అవగాహన చేసుకొనడానికి, ఆచరణలోనికి తీసుకొనిరావడానికి యీ పుస్తకాలు దోహదం చేస్తాయి. పాఠకులు వీటిని ఆదరిస్తారని నమ్ముతున్నాము.

వసంత విహార్,
గ్రీన్ వేస్ రోడ్డు,
మదరాసు - *600 028.*

సమన్వయ కర్త
దక్షిణ భాషల అనువాద విభాగం
కృష్ణమూర్తి ఫౌండేషన్, ఇండియా

* * *

అనువాదకుని
తొలిపలుకు

జిడ్డు కృష్ణమూర్తి ప్రతిసంవత్సరము తాను చేసెడి ప్రపంచ పర్యటనలో ఒక భాగముగా నవంబరు-ఫిబ్రవరి నెలల మధ్య షుమారు మూడు నెలలపాటు భారతదేశములో పర్యటిస్తూ వుండేవారు. వారి ప్రసంగాలు సాధారణంగా ఢిల్లీ, వారాణసి, మద్రాసు, రిషివ్యాలీ, బొంబాయిలలో జరుగుతూ వుండేవి. వారాణసిలోను, రిషివ్యాలీలోను వారు చేసిన ప్రసంగాలు ప్రధానంగా అక్కడున్న తమ పాఠశాలలలోని విద్యార్థుల నుద్దేశించి చేసినవి.

వారాణసిలోని తమ రాజ ఘాట్ బెసంట్ స్కూలు విద్యార్థుల నుద్దేశించి 1954వ సంవత్సరము డిసెంబరు నెల 27వ తేదీ మొదలుకొని 1955వ సంవత్సరము ఫిబ్రవరినెల 8వ తేదీ వరకు ఆయన మొత్తం 27 ప్రసంగాలు చేసియుండిరి. ఇంత దీర్ఘకాలము వారొకేచోట నిలిచి ప్రసంగించిన సందర్భములరుదు. ఆ 27 ప్రసంగాలున్ను పరిష్కరింపబడి This Matter of Culture అనే పేరుతో ఇంగ్లండులోను, Think on These Things అనే పేరుతో అమెరికాలోను ప్రచురింపబడినవి. వాటి కనువాదమే యీ పుస్తకము.

ఒక భాషలోనుండి మఱియొక భాషలోనికి సరియైన అనువాదము సుకరము కాదని అందరికిని తెలిసిన విషయమే. అందులోను కృష్ణజీ రచనలు అనువాదానికి సులభముగా లొంగునవి కావు. అయినా ఈ ప్రస్తుతానువాదములో మూలమునకు న్యాయము చేకూర్చడానికై యథాశక్తి ప్రయత్నింపబడినది.

ఈ ప్రసంగాలు పేరుకు విద్యార్థులనుద్దేశించి చేసినవే యైనప్పటికిన్ని పెద్దలకు గూడ, కృష్ణజీని అర్థము చేసికొనడంలో మిక్కిలి తోడ్పడగలవు. సోదరులైన తెలుగుదేశ ప్రజలు ఈ యనువాదమువలన ప్రయోజనము పొందగలరని ఆశిస్తున్నాను.

విషయ సూచిక

అధ్యాయము — పేజీ

N.B. చాల మెల్లగా, ఒక్కొక్క వాక్యమునే అర్థము చేసికొంటూ చదివితేనే గాని కృష్ణజీ రచనలు బోధపడవు. గబగబా చదివి దూరంగా పెట్టివేయ దగినవి కావివి.

1

చదువు – దానియొక్క ప్రయోజనము

చదువంటే యేమిటో మనలో మనమెప్పుడైనా ప్రశ్నించుకొని వుంటిమా? అని నా అనుమానము. మనం బడికి ఎందుకు పోతు న్నాము? అక్కడ రకరకాలైన విషయాలు ఎందుకు నేర్చుకొంటు న్నాము? పరీక్షలెందుకు పాసవుతున్నాము? మంచి మార్కుల కోసం, మంచి గ్రేడులకోసం ఎందుకు పోటీ పడుతున్నాము? ఈ చదువు అనే మాటకు అర్థమేమిటి? ఇదంతా దేనికి? ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న, విద్యార్థులకే కాదు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మఱి యీ భూమిని ప్రేమించే ప్రతి ఒక్కనికిన్ని. చదువుకోడం కోసం ఎందుకింత శ్రమ పడుతున్నాము? కేవలం ఏవో పరీక్షలు పాసై, ఏదైనా వుద్యోగం సంపాదించుకోడం కోసమేనా యీ శ్రమంతా? లేక చదువుయొక్క వుద్దేశం యీ మన జీవిత గమనాన్ని - జీవితము కొనసాగే రీతిని - అంతను సరిగా అర్థం చేసికోగల శక్తిని చిన్నప్పుడే మనలో కలిగించ డమా? ఉద్యోగం సంపాదించుకోవడం, లేదా ఏదైనా జీవనాధారాన్ని కల్పించుకోవడం అవసరమే. కాని మనం చదువుకొనేది కేవలమందు కేనా? నిజానికి జీవితమంటే కేవలం ఉద్యోగం చేయడం లేదా ఏదైనా వృత్తిని అవలంబించడం మాత్రమే కాదు. జీవిత మనేది అసాధారణమై నది, అతి విశాలమైనది, లోతైనదిన్ని. ఇది చాల అద్భుతమైనది. దీని విశాలమైన పరిధిలో మనం మానవులం జీవిస్తున్నాము. మనం కేవలం జీవనాధారం కోసమే ప్రయత్నిస్తూ వుంటే అసలు జీవితాన్నే జారవిడు చుకొన్న వాండ్లమౌతాము. జీవితాన్ని అర్థం చేసుకోవడం అన్నిటికంటె ముఖ్యం. పరీక్షలు పాసవడం, గణితశా, భౌతిక శాస్త్రము మొదలైన వాటిల్లో నైపుణ్యం సంపాదించడం దాని తరువాతనే.

కాబట్టి ఉపాధ్యాయు లెందుకు బోధిస్తున్నారో, విద్యార్థులెందుకు చదువుకొంటున్నారో అనే విషయమై మనం, ఉపాధ్యాయులం గాని విద్యార్థులం గాని ప్రశ్నించుకోవడం చాల అవసరం కాదా? మరి, జీవితమంటే అర్థమేమిటి? జీవితమంటే ఒక అద్భుతమైన విషయంకాదా? పక్షులు, పుష్పాలు, ఏపుగా ఎదుగుతున్న వృక్షాలు, ఆకాశము, అందులోని నక్షత్రాలు, నదులు, వాటిల్లోని చేపలు — ఇదంతా జీవితమే. బీదవాండ్లు, ధనికులు జీవితములోని భాగమే. సంఘాల మధ్య, తెగల మధ్య, జాతుల మధ్య గల ఎడతెగని పోరాటాలు జీవితమే. ధ్యానము జీవితమే. మతమనే పేరుతో పిలువబడేది జీవితమే. అంతే కాదు. మనస్సులో అతిసూక్ష్మమై నిగూఢముగా దాగియున్న ఈర్ష్యాసూయలు, రాగద్వేషాలు, ఆశలు ఆకాంక్షలు, ఆవేశ కావేషాలు, భయాలు ఆందోళనలు, సాఫల్యావైఫల్యాలు — ఇవన్నీ జీవితమే. జీవితమంటే ఇంతేకాదు. ఇంకా ఎంతో! కాని సాధారణంగా దానిలోని ఏ అత్యల్ప భాగమునో అర్థంచేసికోడానికి మాత్రమే మనం చేసే ప్రయత్నమంతా. ఏవో కొన్ని పరీక్షలు పాసై, ఉద్యోగం సంపాదించుకొని, పెండ్లి చేసికొని, పిల్లలను కని, రానురాను యంత్రాలవలె తయారవుతాము. జీవితమంటే భయపడతాం, ఆందోళన చెందుతాం. కాబట్టి చదువుయొక్క ప్రధానోద్దేశము జీవితగమనాన్ని పూర్తిగా అర్థం చేసికోవడంలో సహాయపడడమా లేక కేవలం ఏదైనా ఒక వృత్తికిగాని, మంచి ఉద్యోగానికి గాని మనలను తయారు చేయడమా?

మనం పెరిగి పెద్దవాండ్లమైనప్పుడు, మనందరికి ఏమౌతుందో తెలుసా? పెద్దవాండ్లైన తరువాత ఏమి చేయబోతున్నారో ఎప్పుడైనా మీలో మీరు ప్రశ్నించుకొన్నారా? బహుశా మీరు పెండ్లి చేసికొని, మీ పరిస్థితి యేమిటో మీరు గ్రహించే లోపలనే తల్లులు, తండ్రులు అవుతారు. అంతట మీరొక ఉద్యోగానికో లేక వంటగదికో కట్టుబడిపోయి క్రమక్రమంగా వాడి వత్తలై క్షయించిపోతారు. అదేనా మీ జీవితలక్ష్యం? మీలో మీరీ ప్రశ్నను ఎన్నడైనా వేసికోలేదా? తప్పకుండా వేసికోవలసిన ప్రశ్నకాదా యిది? మీ కుటుంబము ధనవంతమైన కుటుంబ మయినట్ట

యితే సంఘంలో మీకొక మంచి హోదా, మంచి స్థానం ముందే నిశ్చితము. మీ తండ్రి మీకన్ని సౌకర్యాలుండే ఉద్యోగమొకటి ఇప్పించవచ్చు. గొప్ప ధనవంతుల కుటుంబంతో మీకు పెండ్లి సంబంధం కుదిర్చి, ఘనంగా పెండ్లి చేయవచ్చు. కాని అక్కడైనా మీరు క్షయంపొందుతారు, మీ జీవితము వ్యర్థమైపోతుంది; ఏమి నేను చెప్పేది అర్థమవుతున్నదా?

అతి విశాలమైన యీ జీవితాన్ని, అందలి సూక్ష్మాంశాలను, అందలి అసాధారణ సౌందర్యాన్ని, అందలి సుఖాలను, దుఃఖాలను, అర్థం చేసికోవ డంలో మీరు చదివిన చదువు ఉపయోగపడకపోతే ఆ చదువు నిరర్థకము. మీరేవేవో డిగ్రీలు సంపాదించుకోవచ్చు, మీ పేరు తరువాత ఏవేవో అక్షరాలను ఎన్నింటినో చేర్చుకోవచ్చు, ఎంతో పెద్ద వుద్యోగాన్ని చేజి క్కించుకోవచ్చు, అయినా ఫలితమేమి? వీటిని సంపాదించుకొనే లోపల మీ మనస్సు మొద్దుబారి చురుకుదనం పోగొట్టుకొని అలసి సొలసి, తెలివి లేనిదై పోయినట్లయితే ఇక ఎన్నివుండి యేమి లాభము? అందువలన మీరు మీ బాల్యంలోనే — అంటే విద్యార్థులుగా వున్న దినములలోనే — ఈ జీవితమంటే యేమిటో గ్రహించడానికి ప్రయత్నించవద్దా? ఈ సమస్యల కన్నింటికిని సమాధానాలను కనుగొనగల తెలివిని మీలో పెంపొందించుకోవద్దా? అదేకదా చదువు యొక్క నిజమైన వుద్దేశము?

మరి, 'తెలివి' అంటే యేమిటో మీకు తెలుసునా? 'తెలివి' అంటే స్వతంత్రంగా, భయంలేకుండా, ఏదో యొక పద్ధతి ప్రకారం గాకుండా ఆలోచింపగల సామర్థ్యం. అదిగనక వుంటే సత్యమేదో, వాస్తవమేదో మీయంతట మీరు తెలిసికో నారంభిస్తారు. కాని మీలో భయం గూడు కట్టుకొని వుంటే మీ రెన్నటికిని తెలివిగలవారు కాలేరు. ఎటువంటి వాంఛలైనను — ఐహికములుగాని, ఆధ్యాత్మికములుగాని — వ్యాకుల తను కలిగిస్తాయి, భయమును కలిగిస్తాయి. కాబట్టి అట్టి వాంఛలు - ఏవేవో సాధింపవలెననే పెద్ద పెద్ద కోరికలు - గలవాని మనస్సు నిర్మలముగా, నిరాడంబరముగా, ఋజువుగా వుండజాలదు, అంటే అట్టి మనస్సు తెలివిగలది కాదు.

భయరహితమైన వాతావరణంలో మీరు మీ బాల్యమును గడపడం చాల అవసరము, తెలుస్తూవున్నదా? మనలో చాలమందికి వయస్సు పెరిగేకొలది భయంకూడ పెరుగుతూ వుంటుంది. మనకు జీవించడమంటే భయం, ఉద్యోగం పోతుందేమో అని భయం, సంప్రదాయమంటే భయం, ఇరుగుపొరుగువారు లేదా భార్యగాని భర్తగాని ఏమంటారో అని భయం, మృత్యువంటే భయం. ఇటువంటి యేదో ఒక భయమంటూ లేనివారు చాల అరుదు. ఎక్కడ భయముంటుందో అక్కడ తెలివి వుండదు. మరి మనం చిన్న పిల్లలమై వున్నప్పుడు భయరహితమై స్వాతంత్ర్య పూరితమైన వాతావరణంలో వుండడానికి వీలుపడదా? మనకు స్వాతంత్ర్యం, మన యిష్టారాజ్యంగా నిర్లక్ష్యంగా ప్రవర్తించడం కోసంకాదు, జీవితగమనాన్ని అంతను పూర్తిగా గ్రహించడం కోసం కావాలి. అన్ని వత్తిడులనుండి, అన్ని బంధములనుండి విముక్తమైన మనస్సే, దానిని - అంటే పూర్తి జీవితవిధానాన్ని - గ్రహింపగలదు. జీవితం నిజంగా చాల అందమైనది. దానిని మనమే చెడగొట్టి అందవికారంగా చేసికొన్నాము. దాని అసాధారణ సౌందర్యాన్ని, గాంభీర్యాన్ని, పరిపూర్ణత్వాన్ని గ్రహించి మెచ్చుకోవలెనంటే మీరు ప్రతిదానిని ఎదురుతిరిగి ప్రశ్నించవలసి వుంటుంది. వ్యవస్థీకృతమైన మతాన్ని, సంప్రదాయాన్ని, క్రుళ్ళిపోయిన నేటి యీ సంఘాన్ని — ప్రతిదానిని మీరు ఎదిరించవలసి వుంటుంది. అప్పుడే సత్యమనగానేమో మీకు మీరే తెలిసికొనగలుగుతారు. మనం చేయువలసిన పని ఇతరులను అనుకరించడంకాదు, స్వయంగా విచారణచేసి కనుగొనడం — అదే చదువంటే, కాదా? మీరున్న సంఘముగాని, మీ తల్లిదండ్రులుగాని, ఉపాధ్యాయులుగాని నడిపినట్లు నడుచుకోవడం, వారు చెప్పినట్లే చేయడం, చాల తేలిక. అది చాలా సులభం, సురక్షితమైన మార్గం. కాని అందులో భయము, క్షయము, మృత్యువు ఉంటాయి. జీవించడమంటే అదికాదు. జీవించడమంటే మీయంతటు మీరు సత్యమేదో తెలిసికోవడం. దాని కోసం ఎటువంటి వత్తిడులు లేని మానసిక స్వాతంత్ర్యముండాలి, లోలోన ఎడతెగని జిజ్ఞాస — ప్రతిదానిని ఎదురుతిరిగి ప్రశ్నించడం - కావాలి.

కాని యిందుకు మిమ్మెవ్వరును ప్రోత్సహించరు. ప్రతి దానిని ప్రశ్నించుడని, దేవుడంటే యేమిటో మీయంతటమీరే తెలిసికొండని మీకె వరున్ను చెప్పరు. కారణమేమంటే, మీరు తిరుగబడేటట్లయితే, యీ ప్రపంచంలోని మిథ్యాత్వమున కంతటికిని, అసత్యాని కంతటికిని, మీరొక ప్రమాదకరమైన వ్యక్తిగా పరిణమిస్తారు. మీ తల్లిదండ్రులున్ను మీరున్న సంఘమున్ను మీరు సురక్షితంగా జీవించవలెనని కోరుకొంటారు. మీరున్ను అదే కోరుకొంటారు. సురక్షితంగా జీవించడమంటే మామూలుగా ఇతరులను అనుకరిస్తూ, వారి అడుగుజాడలలో — అంటే భయంతో — జీవించడమే. కాని వాస్తవానికి చదువు యొక్క ఉద్దేశం అదికాదు. మనలో ప్రతియొక్కరును స్వేచ్ఛగా, స్వతంత్రంగా, నిర్భయంగా జీవించడానికి సహాయపడడమే దాని ఉద్దేశం, అవునా, కాదా? అందుకు మరి, భయరహితమైన వాతావరణాన్ని కల్పించడానికి మీరు, మీతోబాటు మీ ఉపాధ్యాయులూ ఎంతో దూరం లోతుగా ఆలోచించి పనిచేయవలసి వుంటుంది.

అంటే అర్థమేమిటో తెలుసునా? భయరహితమైన వాతావరణాన్ని కల్పిస్తే అదెంత అద్భుతంగా వుంటుందో మీకు తెలుసునా? అట్టి వాతావరణాన్ని తప్పక కల్పించవలసి వుంది. ఈ ప్రపంచం అంతులేని యుద్ధాలలో ఎట్లు తగుల్కొని వున్నదో మనము చూస్తూనే వున్నాము. అధికార దాహంతో తపించే రాజకీయ నాయకులచేత ఈ ప్రపంచం నడుపబడుతూవున్నది. హోదాను, అధికారాన్ని కోరుతూ దానికోసమై ఒకరితో నొకరు పోరాడే న్యాయవాదులది, రక్షక భటులది, సైనికులది మరియు అత్యాశలు పెట్టుకొన్న స్త్రీ పురుషులదిన్ని యీ ప్రపంచము. వీరితోబాటే సాధువులు మహాత్ములనబడేవారున్ను, మతగురువులు వారి అనుయాయులున్ను వుంటారు. వారికి గూడ అధికారం కావాలి, హోదా కావాలి - అది యిహలోకంలోనైనా సరే, పరలోకంలోనైనా సరే. ఇది ఒక పిచ్చి ప్రపంచం, పూర్తిగా అయోమయమైన ప్రపంచం. ఇందులో సామ్యవాది (communist) పెట్టుబడిదారుతో (capitalist) పోరాడుతుంటాడు. సమాజవాది (socialist) వారిద్దరిని ఎదిరిస్తూ వుంటాడు. ప్రతివాడున్ను

మరియొకడితో పోటీపడుతూ, ఎదిరిస్తూ వుంటాడు. ఇంతకున్ను అందరి గమ్యస్థానము ఒకటే — ఒక సురక్షితమైన ప్రదేశము, అధికారము మరియు అన్ని అనువులు గల ఒక పదవి. పరస్పర విరుద్ధములైన నమ్మకాలతో, కులమతభేదాలతో, వర్గభేదాలతో, వేర్వేరు జాతీయతలతో, అన్నివిధాలైన మూర్ఖతలతో, క్రౌర్యములతో ఈ ప్రపంచము ముక్కలు ముక్కలుగా చీల్చబడియున్నది. ఇటువంటి ప్రపంచంలో ఒక భాగంగా ఇమిడిపోవడం కోసమేనా మీరు చదువుకోవడం? ఇట్టి భయంకరమై వినాశకరమైన సంఘమనే చట్రంలో ఒక భాగమైపోవడానికై, అందులో ఇమిడిపోవడానికై మీరు ప్రోత్సహింపబడుతున్నారు. మీ తల్లిదండ్రులు కోరేది అదే, మీరు కోరుకొనేదిన్నీ అదే.

చదువుయొక్క ఉద్దేశము ఈ క్రుళ్ళిపోయిన సంఘ వ్యవస్థకు లొంగి, అందులో ఒక భాగమైపోవడానికి సహాయపడడమా? లేక ఉత్తమ మానవులుగా పెరిగి పెద్దవారై, క్రొత్త సంఘమును, క్రొత్త ప్రపంచమును నిర్మించడం కోసం మిమ్ము పూర్ణ స్వతంత్రులను చేయ డమా? మనకీ స్వతంత్రము ఎప్పుడో భవిష్యత్తులోకాదు, ఇప్పుడే, ఇక్కడే కావాలి. లేనిచో మనకు వినాశమే. కాబట్టి స్వేచ్ఛా పూరిత వాతావరణమును మనము వెంటనే కల్పించుకొనవలె. అందులో మాత్రమే జీవిస్తూ, మీయంతట మీరు సత్యమును కనుగొన గలరు, తెలివి పొందగలరు; ప్రపంచాన్ని ఎదుర్కొని, - దానికి లొంగిపోకుండ - దానిని అర్థము చేసికోగలరు; లోతుగా మీ మనస్సులో నిరంతరము ప్రతి దానిని ఎదిరించి ప్రశ్నిస్తూ ఉండగలరు. అట్లు నిరంతరము ప్రతిదానిని ప్రశ్నించేవాడే సత్యమును కనుగొనగలడు, గ్రుడ్డిగా లొంగిపోయి సంప్ర దాయము ననుసరించేవాడు కాదు. నిరంతరము ప్రశ్నిస్తూ, నిరంతరము పరిశీలిస్తూ, నిరంతరము గ్రహిస్తూ వుండేవాడే సత్యమును, లేదా దేవుని లేదా ప్రేమను కనుగొనగలడు. భయపూరితుడు ఎదిరించి ప్రశ్నించలేడు, పరిశీలించలేడు, గ్రహించలేడు, పూర్ణమగు జాగృతిని పొందలేడు. కాబట్టి చదువుయొక్క ప్రధానోద్దేశము భయమును, - అంటే ఏదైతే మానవుల ఆలోచనా సరళిని, మానవుల పరస్పర సంబంధమును, ప్రేమను నశింప

జేస్తుందో ఆ భయమును — అది అంతర్గతముగా మనస్సులోనున్నను లేక బహిర్గతముగా వ్యక్తమగుచున్నను - దానిని నిర్మూలించడమే.

1. ప్రశ్న :- అందరు మనుష్యులు ఎదురుతిరిగితే ప్రపంచంలో అల్లకల్లోల మేర్పడదంటారా మీరు?

కృష్ణమూర్తి :- మొట్టమొదట ప్రశ్నను సరిగా వినండి. ఎందుకంటే ప్రశ్నను అర్థం చేసికోడం చాల ముఖ్యం, సమాధానంకోసం వేచియుండడం కాదు. ప్రశ్న యేమంటే, అందరు మనుష్యులు ఎదురు తిరిగితే ప్రపంచంలో అల్లకల్లోల మేర్పడదా? అని. ప్రతివాడూ ఎదురు తిరిగితే అల్లకల్లోల మేర్పడడానికి, ప్రపంచమిప్పుడేమైనా సరియైన తీరులో నడుస్తూ ప్రశాంతంగా వున్నదంటారా? ఇప్పుడులేదా ఆ అల్లకల్లోలము? ప్రతిది అందంగాను, న్యాయంగాను నడుస్తున్నదా? ప్రతివాడూ సుఖంగా, సంతోషంగా, నిండుగా జీవిస్తున్నాడా? ఒకడు మరియొకనికి విరుద్ధంగా ప్రవర్తించడంలేదా? ఏవో సాధించవలెననే మితిమీరిన కోరికలు లేవా? దయాదాక్షిణ్యాలు లేకుండా ఒకరితో నొకరు పోటీపడడంలేదా? కావున ఇప్పటికే ప్రపంచమంతా అల్లకల్లోలంగా వుండడం ఖాయం. ఈ విషయం ముందుగా గ్రహించి తెలిసికోవాలి. ఇది నిజంగా క్రమబద్ధమైన సంఘమని భావించవద్దు. మాటలతో మిమ్ము మీరు మోసగించుకోవద్దు. ఇక్కడగాని, ఐరోపాలోగాని, అమెరికాలోగాని, రష్యాలోగాని ప్రపంచమిప్పుడు వినాశ మార్గమున పయనిస్తూ వున్నది. మీ రా క్షయమును చూడగల్గితే అదే మీకొక సవాలు. ఈ త్వక్షణ సమస్యను పరిష్కరించడానికి మార్గమును కనుగొనుడని మీరు సవాలు చేయబడుతున్నారు. ఈ సవాలునెట్లా ఎదుర్కొంటారో అది ముఖ్యము, కాదా? మీరొక హిందువుగాగాని, బౌద్ధునిగాగాని, క్రైస్తవునిగా గాని లేక ఒక సామ్యవాదిగా గాని మీ రా సవాలు నెదుర్కొంటే అది సరియైన పద్ధతిలో ఎదుర్కొనడం కాదు. ఆ యెదుర్కొనడం అసంపూర్ణము. అది దానికి పరిష్కార మార్గము కానేకాదు. మీరు దానిని సంపూర్ణంగాను, తృప్తికరంగాను ఎదుర్కొనవలెనంటే, మీలో భయముండరాదు; మీరు హిందువుగా గాని

సామ్యవాదిగా గాని పెట్టుబడిదారుగాగాని గాక సమస్యను పరిష్కరింప యత్నించే ఒక సంపూర్ణ మానవునిగా మిమ్ము మీరు భావించుకొన్నప్పుడు మాత్రమే అది సాధ్యము. మీరు దీనికంతకు విరుద్ధంగా, ఈ సంఘమున కాధారభూతముగా నున్న లోభగుణమునకు విరుద్ధంగా, అంతామనకే వుండాలి అనే దురాశకు విరుద్ధంగా మీరు తిరుగబడినపుడే మీరా సమస్యకు పరిష్కారమును కనుగొనగలరు. అసలు మీలో మీకు పేరాశలు లేనప్పుడే, లోభబుద్ధి లేనప్పుడే, మీ క్షేమము మీ భద్రత మాత్రమే ప్రధానంగా చూచుకోకుండా, మీరు వాటిని అంటి పెట్టుకోకుండా వున్నప్పుడే మీరా సవాలును సరియైన రీతిని ఎదుర్కొనగలరు, క్రొత్త ప్రపంచమును సృష్టింపగలరు.

2. ప్రశ్న :- ఎదురు తిరిగి ప్రశ్నించడం, నేర్చుకోవడం, ప్రేమించడం - ఈ మూడున్ను మూడు వేర్వేరు ప్రక్రియలా, లేక ఒకే సమయంలో జరిగేడివా?

కృష్ణమూర్తి :- నిజమే, అవి మూడును వేర్వేరు ప్రక్రియలు కావు. అవి మూడును ఒకే ప్రక్రియ. ఈ ప్రశ్నకు అర్థమేమిటో తెలిసికోవడం చాల ముఖ్యం. గమనించితిరా, ఈ ప్రశ్న అనుభవం మీద ఆధారపడినది కాదు. ఇది కేవలం మాటల కూర్పు; ఊహాగానం మీద ఆధారపడిన ప్రశ్న. కాబట్టి దీనికి విలువలేదు. భయరహితుడైన వ్యక్తి నిజంగా తిరుగబడి నేర్చుకోవడమంటే యేమిటో, ప్రేమించడమంటే యేమిటో తెలిసికోడానికై ప్రయత్నిస్తూ వుంటే అటువంటి వ్యక్తి అవి మూడును ఒకటేనా లేక వేర్వేరా అని అడుగడు. మాటల గారడీలో మనకు తెలివితేటలు ఎక్కువ. మాటలకు అర్థమును వివరించడంతో సమస్యాపరిష్కారమైనట్లే భావిస్తాము.

నేర్చుకోవడమంటే యేమిటో మీకు తెలుసునా? నిజంగా మీరు నేర్చుకొంటూ వున్నట్లయితే, ఆ నేర్వడం జీవితమంతా వుంటుంది. పైగా దీనికొక గురువంటూ ప్రత్యేకంగా వుండడు. మీరు ప్రతిదాని

నుండి నేర్చుకొంటూ వుంటారు. అంటే, ఎండిన ఆకు, ఎగురుతున
పిట్ట, వాసన, కన్నీరు, ధనికులు, బీదవారు, ఏడుస్తున్నవారు, స్త్రీ వ
ముమీది చిరునవ్వు, పురుషుని ధార్ష్ట్యము — ప్రతిదిన్నీ మీకు గుర
అందువలన దీనికోసమై ప్రత్యేకంగా ఒక మార్గదర్శిగాని, వేదాం
గురువుగాని అక్కరలేదు, ఉండదు. స్వయంగా జీవితమే మీకు గు
మీరు నిరంతరము నేర్చుకొంటూనే వుంటారు. మీ మనస్సు ని
లము జీవితమిచ్చే బోధలను గ్రహించే స్థితిలోనే వుంటుంది.

***3.* ప్రశ్న :- సంగ్రహణ శీలతమీద, ఆశలు ఆకాంక్షలమీద నేట మానవ సంఘం ఆధారపడివున్నమాట నిజం. కాని అట్టి కోరికలే లేక పోతే మనము క్షయించిపోమా? పెరుగుదల ఆగిపోదా?**

కృష్ణమూర్తి :- ఇది నిజంగా చాల ముఖ్యమైన ప్రశ్న. దీనిని సావధానంగా పరిశీలించవలసి వుంటుంది.

దేనిమీదనైనా మనస్సు నిల్పడమంటే యేమిటో మీకు తెలుసునా? అదేమిటో చూద్దాం. తరగతి గదిలో మీరు కిటికీ గుండా బయటికి అదేపనిగా చూస్తున్నారనుకోండి లేదా ఎవరి జుట్టునైనా పీకుతున్నారనుకోండి. అప్పుడు ఉపాధ్యాయుడేమంటాడు? పాఠంమీదికి మనస్సు మరల్చమంటాడు. అంటే యేమిటి? మీకు చదువుతున్న పాఠంమీద అభిరుచి లేదని, అందువలన దాని మీదికి మనస్సును మరల్చమని ఉపాధ్యాయుడు మిమ్ములను హెచ్చరిస్తాడు, బలవంత పెడతాడు. కాని నిజాని కావిధంగా చేయడం మనస్సు నిల్పడంకాదు. దేనిమీదనైనా మీకు బాగా అభిరుచి వున్నప్పుడే మనస్సు నిల్పడం, — అంటే అవధానము — సాధ్యమవుతుంది. అటువంటి సందర్భంలోనే దానిగురించి పూర్తిగా తెలిసికోవడానికై ప్రేమతో ప్రయత్నిస్తారు. అప్పుడే మీ మనస్సంతా మీ ప్రాణమంతా దానిమీదనే వుంటుంది. అదేవిధంగా "పెద్దపెద్ద కోరికలు లేకపోతే, మనము క్షయము పొందమా?" అనే ప్రశ్న నిజంగా చాల ముఖ్యమైనదని మీరు గ్రహించినపుడు, మీకందులో అభిరుచి కలిగి, అందరి

సత్యమును కనుగొన గోరుతారు.

ఇక, పెద్ద పెద్ద కోరికలు పెట్టుకొన్న మనిషి - అంటే ఆశాప రుడు - తనకుదాను నష్టం కలుగజేసికోవడం లేదా? ఇది మొదట తెలిసికోవలసిన విషయం. పెద్ద పెద్ద కోరికలుండడం మంచిదా చెడ్డదా అని అడగడం కాదు కావలసింది. మీ చుట్టూ చూడండి. కోరికలు పెట్టుకొన్న మనుష్యులను బాగా గమనించండి. మీకు కోరికలున్నప్పు డేమవు తుంది? మీ గురించే మీరు ఆలోచించుకొంటూ వుంటారు. ఇతరులను గురించి పట్టించుకోరు, కాదా? మీలో క్రూరత్వము చోటు చేసికొం టుంది. ఇతరులను ప్రక్కకు త్రోసివేసి ముందుకు పోజూస్తారు. ఏలయన మీ కోరికను తీర్చుకోవడం మీకు ముఖ్యం. మీరు చాల గొప్పవారు కావా- లని ప్రయత్నిస్తూ వుంటారు. ఆ ప్రయత్నంలో సఫలత పొందే వారికిని, సఫలత పొందక వెనుకబడిపోయే వారికిని మధ్య - సంఘంలో - పోటీని పోరాటాన్ని కల్పిస్తారు. మీకున్ను మీమాదిరి కోరికలే పెట్టుకొన్న వారి కిన్ని మధ్య పోటీ పెరుగుతుంది, పోరాట మారంభమవుతుంది. ఇట్టి పోరాటము నిర్మాణాత్మకమైన జీవితము నడపడానికి దోహదమిస్తుందా? నేను చెప్పేది మీకేమైనా అర్థమవుతున్నదా, లేక చాల కష్టంగా వున్నదా?

ఏదైనా పనిని ప్రేమతో చేయదలిస్తే అందులో అత్యాశ వున్నట్లా? మీరు ఏదైనా ఒక పనిని మనస్ఫూర్తిగా చేస్తున్నట్లయితే, ఏదో పెద్ద స్థితికి చేరుకొనవలెననిగాని, ఇంకా ఎక్కువ లాభాలు పొందవలెనని గాని, గొప్ప ఫలితములను సాధించవలెనని గాని కోరక, కేవలం ఆ పని చేయడంమీది కోరికచేతనే చేస్తున్నట్లయితే అందులో అత్యాశ లేదు; ఉన్నదంటారా? అందులో పోటీలేదు. అగ్రస్థానమును పొందడానికై మీరెవరితోను పోటీప డడంలేదు, పోరాడడంలేదు. అందుకని మీ దృష్టిలో చాల ముఖ్యమైన దని చేయదగినదని అనుకొన్న పనిని జీవితమంతా చేస్తూ వుండవలెనంటే మీ మనస్సుకు నిజంగా నచ్చినపని యేదో, మీరు ప్రేమతో చేయగలపని యేదో తెలిసికోవడంలో మీరు చదివిన చదువు మీకు తోడ్పడవలె నంటారా లేదా? అట్లా గాకపోతే మీ శేషజీవితమంతా అధ్వాన్నమై

పోతుంది, దైన్యంతో కాలం గడుపుతూ వుంటారు. నిజంగా మీకు నచ్చి నపని యేదో తెలిసికోలేక మీ మనస్సు అర్థంలేని ఒక అలవాటులో పడిపోతుంది. అందులో మీకు లభించేది విసుగుదల, క్షయము, మృత్యు వున్ను. అందువలన నిజంగా మీకు నచ్చిన పనియేదో, మీరు ప్రేమతో చేయగల పనియేదో మీ చిన్నతనంలోనే మీరు తెలిసికోవడం చాల అవసరము. నవసమాజ నిర్మాణాని కదియే మార్గము.

4. ప్రశ్న :- పెక్కు ఇతర దేశములలో వలె, ఇండియాలోను విద్యావి ధానము ప్రభుత్వాధీనంలో వున్నది. అట్టి పరిస్థితిలో, మీరు చెప్పేరకం ప్రయోగములను కొనసాగింపవలెనంటే సాధ్యమా?

కృష్ణమూర్తి :- ప్రభుత్వ సహాయం లేకపోతే ఇటువంటి పాఠశాలలు స్వతంత్రంగా నిలబడడం సాధ్యమా? ఇది యీ పెద్ద మనిషి అడిగే ప్రశ్న. ప్రపంచమంతటా రానురాను ప్రతి చిన్న విషయం ప్రభుత్వం యొక్క చేతులలోనికి, రాజకీయనాయకుల చేతులలోనికి పోవడం ఆయన చూస్తున్నాడు. అధికారంలో వున్నవారు మన మనస్సులను, హృదయాలను తమ కనుగుణంగా మలచివేసికో జూస్తున్నారు. వారు ఉద్దేశించిన తీరులోనే మనచేత ఆలోచింప జేస్తున్నారు. రష్యాలోగాని, మరింకే దేశంలోనైనా విద్య ప్రభుత్వము యొక్క అధీనంలోనికి పోవడం ఇప్పటి ప్రవృత్తి. అందుకని యీ పెద్దమనిషి అడిగేదేమంటే నేను మాట్లాడుతున్నరకం బడి ప్రభుత్వ సహాయం లేకుండా అస్తిత్వములోనికి రాగలదా? వచ్చినా అది మనగలదా? యని.

సరే, మీరేమంటారు? ఏదైనా ఒక విషయం చాల ముఖ్యమైనదని మీరు తలిస్తే, నిజంగా చేయదగినదని మీరు భావిస్తే, ప్రభుత్వములు అవు నన్నా కాదన్నా సంఘమర్యాదలు అనుకూలమైనా కాకపోయినా మీరు మీ హృదయమంతా దానికై అర్పిస్తారు. అప్పుడది విజయవంత మవుతుంది. కాని మనలో చాల మందిమి మన మనోహృదయములను దేనికిని అంకి తము చేయము. అందువల్లనే యిటువంటి ప్రశ్నలు వేస్తూ వుంటాము.

మనలో ప్రతి యొక్కరము అంతర్గతంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా పూర్తిగా ఎదురుతిరిగి నిలబడితే అప్పుడే నవసమాజ నిర్మాణము జరుగుతుందని, క్రొత్త ప్రపంచము వెలుగులోనికి వస్తుందని దృఢంగా భావిస్తే అప్పుడు మనము మన హృదయాలను, మన మనస్సులను మన శరీరాలను అర్పించి, భయంగాని దానివలన గలిగే ఫలితాలు గాని లేని బడిని స్థాపించడానికై పని చేయగలము.

అయ్యా, సత్యమేదో తెలిసికొని, ఆ సత్యమున కనుకూలంగా నడువ నిశ్చయించుకొన్నట్టి యేకొద్దిమంది ద్వారానే నిజమైన విప్లవము రాగలదు. కాని సత్యమేదో తెలిసికోడానికి సంప్రదాయము నుండి విముక్తి, అంటే అన్ని విధములైన భయాలనుండి విముక్తి చాల అవసరము.

27 డిశంబరు, 1954

2

స్వతంత్రము – విముక్తి

ఈ రోజు మీతో స్వతంత్రత లేదా ముక్తావస్థ అనే విషయం గురించి చర్చించుదామని వున్నది. ఇది చాల క్లిష్టమైన విషయం. దీనిని చాల లోతుగా పరిశీలించి అర్థం చేసికోవలసివుంటుంది. స్వాతంత్ర్యం గురించి, — అంటే మత స్వాతంత్ర్యం గురించి, మన యిష్టం వచ్చినట్లు చేయడానికి గల స్వాతంత్ర్యం గురించి — చాలమంది చెప్పడం వింటాము. పండితులు ఈ విషయమై ఎన్నో గ్రంథాలు వ్రాసి వున్నారు. కాని మన మా అనవసరపు చర్చలు, వాదముల జోలికి పోకుండా, నేరుగా ఈ విషయాన్ని పరిశీలిద్దాం. బహుశా అట్లా చేస్తేనే ఈ సమస్యకు సరియైన సమాధానం లభింపవచ్చు.

పడమటి దిక్కున, సూర్యుడు అస్తమించేటప్పుడు కనబడే అద్భుతమైన సంధ్యారాగాన్ని అదే సమయంలో చెట్ల మీదుగా తొంగి తొంగి చూస్తూ వుండే బాలచంద్రుణ్ణి చూడడం కోసం మీ రెన్నడైనా క్షణ కాల మాగినారా? నా కనుమానమే. సాధారణంగా, ఆ సమయాన నది చాల ప్రశాంతంగా ప్రవహిస్తూ వుంటుంది. వంతెన, దానిపై పోతున్న రైలు, లేత జాబిల్లి, యింతలో చీకటిపడగానే నక్షత్రాలు — ఇవన్నీ అందులో ప్రతిఫలిస్తూ వుంటాయి. ఈ దృశ్యము చాల మనోహరంగా వుంటుంది. అయితే అట్టి అందమైన దాన్ని దేనినైనా బాగా గమనించి చూడవలెనంటే, మీ మనస్సంతా దానిమీద నిల్పవలె నంటే ఆ మనస్సును ఆక్రమించుకొనివున్న ఆలోచనలన్నీ లేకుండా పోవాలి, కాదా? సమస్యలతో, చింతలతో, ఊహలతో నిండిపోకుండా మనస్సు చాల ప్రశాంతంగా వున్నప్పుడు మాత్రమే, మీరు దేనినైనా నిజంగా పరిశీలించి చూడగలరు. అప్పుడే మీ మనస్సు అసాధారణ సౌందర్యాన్ని

గ్రహింపగల స్థితిలో వుంటుంది. బహుశా యిందులోనే వుంటుంది మన స్వాతంత్ర్య సమస్యకు కీలకం.

స్వేచ్ఛగా, స్వతంత్రంగా వుండడమంటే అర్థమేమిటి? మీ కేది అనుకూలమో దానిని చేయడమా? మీ యిష్టం వచ్చిన చోటికి పోవడమా? మీ యిష్టం వచ్చినట్లు ఆలోచించడమా? ఇదంతా మీ రెట్లాగూ చేస్తూనే వుంటారు. ఇతరుల మీద ఆధారపడకుండా వుంటేనే స్వతంత్రులైనట్లా? ప్రపంచంలో చాలమంది పరతంత్రులు కారు. కాని వారిలో స్వతంత్రులు చాల తక్కువ మంది మాత్రమే. స్వాతంత్ర్యంలో తెలివివున్నది; స్వతంత్రంగా వుండడమంటే తెలివి కలిగి వుండడమే. అయితే, స్వతంత్రులం కావలెనని కేవలం కోరుకొంటూ వుంటే తెలివి రాదు. మీ పరిసరాలను, నిరంతరము మిమ్ము లోబఱచుకొంటున్న సాంఘిక ధార్మిక పరిస్థితులను, తల్లి దండ్రుల మరియు సంప్రదాయముల ఒత్తిళ్ళను అర్థం చేసికోవడం ఆరంభించినప్పటినుండి మీలో తెలివి వికసించడం ఆరంభమవుతుంది. అయితే రకరకాలైన యీ ఒత్తిళ్ళను అర్థం చేసికోవలెనంటే, — మీ తల్లిదండ్రుల యొక్క, మీ ప్రభుత్వము యొక్క, మీరున్న సంఘముయొక్క, సంస్కృతి యొక్క, దేవతలయొక్క, వివిధములైన అంధవిశ్వాసముల యొక్క, రకరకాలైన నమ్మికల యొక్క మరియు అనాలోచితంగా మీరు అనుసరిస్తూ వున్న సంప్రదాయము యొక్క ఒత్తిళ్ళను అన్నిటిని అర్థము చేసికొని, వాటినుండి విడివడవలెనంటే — ఎంతో లోతైన అంతర్దృష్టి కావాలి. కాని, అదిలేనందున వాటికన్నిటికీ మామూలుగా మీరు త్వరగా లొంగిపోతారు. ఎందుకంటే లోలోపల మీలో రకరకాల భయాలు నిండివుంటాయి. జీవితంలో మీకొక మంచి స్థానం లేదని భయం. మీ పురోహితుడు లేదా మతగురువు మి మ్మేమంటాడోనని మరొక భయం. సంప్రదాయము ననుసరించ లేదని భయం. సరియైన మార్గమున పోవడం లేదని సరియైన పని చేయడం లేదని భయం. కాని వాస్తవానికి స్వతంత్రత లేదా ముక్తావస్థ భయముగాని బలవంతముగాని, తన భద్రత గురించిన ఆదుర్దాగాని లేని ఒక విధమైన మానసిక స్థితి.

మనలో చాలమందిమి సురక్షితంగా భద్రంగా వుండాలని కోరు కోమా? మనమెంత గొప్పవాండ్లమో, ఎంత అందంగా కనబడతామో లేక ఎంత అసాధారణ ప్రజ్ఞావంతులమో అని అందరూ మెచ్చుకో వాలని కోరుకోమా? లేకపోతే మన పేర్ల చివర అక్షరాలు ఎందుకు తగిలించుకొంటాము? అదంతా మనకు ఆత్మవిశ్వాసాన్ని మనం చాల ముఖ్యమైన వాండ్ల మనే భావాన్ని కలిగిస్తుంది. మనమంతా చాల ప్రసిద్ధమైన వాళ్ళం కావాలని కోరుకొంటాము. మన యొక్క స్థితి పెర గాలని ఎప్పుడైతే అనుకొంటామో ఆ క్షణం నుండే మనము బద్ధులమై పోతాము, బంధములలో చిక్కుకొంటాము.

బంధ విముక్తిని గూర్చిన సమస్యను అర్థం చేసికోవడానికి ఇదే నిజమైన కీలకము-మీరును చూడండి. రాజకీయ నాయకులు, అధికా రము, పదవి హోదాలున్న యీ లౌకిక ప్రపంచంలోగాని, ధర్మాత్ముడు, ఉదారుడు, సాధువు, మహాత్ముడని అనిపించుకోవాలని మీరు కోరుకొనే ఆధ్యాత్మిక ప్రపంచమనే దానిలో గాని, మీరొక ఉన్నత స్థితిని పొందవ లెనని కోరుకొన్న క్షణమునుండి మీరు బద్ధులే, బంధవిముక్తులు కారు.

వీటన్నిటిలోని అర్థరాహిత్యమును, అసమంజసత్వమును, తెలివితక్కు వతనాన్ని గ్రహించిన వ్యక్తి యొక్క హృదయము పసిపిల్లల హృదయమువలె అమాయికమైనది, నిర్మలమైనది. ఏదో స్థితిని పొందవలెననే కోరిక అట్టి హృదయములో కలుగదు. అట్టి వ్యక్తియే విముక్తుడు. ఇదెంత సరళమైన విషయమో మీరు తెలిసికొంటే, ఇందలి అసాధారణ సౌందర్యమును, గాంభీర్యమును గూడ తెలిసికొనగలరు.

ఇంతకున్ను మీరు వ్రాయబోయే యీ పెద్ద పెద్ద పరీక్షలన్నీ యెందు కోసం? మీకొక హోదానిచ్చి, మిమ్మొక వ్యక్తిగా - చెప్పుకోదగిన వ్యక్తిగా - చేయడం కోసమే. బిరుదులు, పదవులు, మీరు సంపాదించుకొన్న జ్ఞానము ఇవన్నీ మిమ్మొక విశిష్ట వ్యక్తిగా చేయడానికి తోడ్పడతాయి. మీరు జీవితంలో ఏదో సాధించవలెనని మీరు గూడ మీ పిన తండ్రి పెత్తండ్రులవలె, మీ తాత ముత్తాతల వలె జీవితంలో విజయంపొందవలె

నని మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులున్ను బోధించడం చూడలేదా? ఎవరో యొక మహావీరునివలె, మహాత్ముని వలె, సాధువువలె, సన్న్యాసి వలె కావాలని మీరు మాత్రం కోరుకోరా? అందుచేత మీరున్ను బద్ధులే; స్వతంత్రులు కారు. ఒక మహాత్ముడినో, భక్తుడినో, ఉపాధ్యాయుడినో లేక బంధువునో అనుకరించినా, లేదా ఏదేని ఒక సంప్రదాయాన్ని అంటిపెట్టుకొని వున్నా దాని అర్థము మీరేదో కోరిక పెట్టుకొన్నట్లే, బంధము పెంచుకొన్నట్లే. ఈ విషయాన్ని మీరు బాగా అర్థం చేసి కొంటే, అప్పుడే విముక్తులవుతారు.

అందువలన చదువు యొక్క వుద్దేశమేమంటే చిన్నప్పటినుండి ఎవ రినీ అనుకరించకుండా మీరు మీరు గానే ఉండిపోవునట్లు చేయడమే. ఇది చాలా కష్టమైన పని. మీరు అందముగా నున్నా సరే లేకపోయినా సరే, మీలో ఈర్ష్యాసూయలున్నా సరే లేకున్నా సరే మీరు మీరుగానే ఉండాలి. అయితే మీ స్థితిని మీరు అవగాహన మాత్రం చేసికోవాలి, అంతే.

మీరు మీరు గానే వుండడం చాల కష్టం. ఎందుకంటే మీ దృష్టిలో మీరు ఉత్తములు కారు; మీలో చాల చెడ్డ గుణాలున్నాయి. అందువ లన గట్టిగా ప్రయత్నం చేసి చాల ఉత్తములుగా మారినట్లయితే ఎంత బాగుండును? అని అనుకొంటూ వుంటారు. కాని అట్లా ఎప్పటికిని జరుగదు. అట్లుగాక, వాస్తవంగా మీరెవరో ఎట్లున్నారో చూచికొని మీ స్థితిని మీరు అర్థం చేసికొంటే ఆ అర్థం చేసికొనడంలోనే మీలో మార్పు వస్తుంది. కాబట్టి స్వతంత్రము లేదా విముక్తి అనేది వేరొక విధంగా మారిపోవడానికి ప్రయత్నించడంలో లేదు; ఏమి చేయాలని బుద్ధిపుడితే అది చేయడంలో లేదు; సంప్రదాయంగాని తల్లిదండ్రులు లేక గురువు గాని చెప్పిన దానిని ఆచరించడంలో లేదు. కాని క్షణక్షణము మిమ్ము మీరు ఉన్నదున్నట్లు అర్థం చేసికొనడంలోనే వున్నది.

ఇందుకై మీ చదువు ఉపయోగపడడంలేదు. మీరు మీరుగా ఉండ కుండ మరియొక విధంగా మారవలెనని మీ చదువు మిమ్ము ప్రోత్సహి

స్తున్నది. అది మిమ్ము మీరు అర్థం చేసికోడం ఎట్లా అవుతుంది? మీ యాత్మ లేదా మీరు అనబడే వ్యక్తి చాల క్లిష్టమైనది. అది రోజూ బడికి పోయేది, దెబ్బలాడేది, ఆటలాడేది, భయపడేది మాత్రమే కాదు. ఇంకా యెంతో నిగూఢమై, బయటికి తెలియరానిది కూడాను. అందులో మీరు ఆలోచించే ఆలోచనలన్నీ వున్నాయి. పైగా ఇతర మనుషులు, పుస్తకాలు, వార్తాపత్రికలు, నాయకులు — వీరందరు మీలో నింపిన వన్నీ చేరతాయి. వాటినన్నిటిని అర్థం చేసికోవాలంటే మీరు మరియొకరుగా మారిపోవాలని కోరుకోరాదు. ఇతరులను అనుకరించరాదు, అనుసరించరాదు-అంటే అర్థమేమిటి? మీరు ఇంకొకరుగా మారిపోవాలని చెప్పే సంప్రదాయానికి విరుద్ధంగా మీరు తిరుగబడాలి. అదే నిజమైన తిరుగుబాటు. అందుమూలాన మీకు అసాధారణ మైన స్వాతంత్ర్యము అంటే విముక్తి లభిస్తుంది. ఇట్టి బంధవిముక్తిని కలుగ జేయడమే చదువు యొక్క నిజమైన ఉద్దేశము.

ఏదో విధంగా మీకు గుర్తింపు లభిస్తే అప్పుడే మీకు సుఖ సంతోషాలు, భద్రత లభిస్తాయని మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులేగాకుండ మీలోని కోరికలు గూడ మీకు చెప్తూ వుంటాయి. కాని మిమ్ము బానిసగా చేసి అణగదొక్కి వేసే ఆ ఒత్తిళ్ళ నన్నిటి నుండి బ్రద్దలు కొట్టుకొని బయటికిరాకపోతే మీకు నిజమైన తెలివి యెట్లు లభిస్తుంది?

సత్యంకానిదేదో గ్రహించి, దానికి విరుద్ధంగా — కేవలం మాటలతో గాకుండా, యథార్థంగా — మీలో ఎవరైతే తిరుగబడతారో వారిమీదనే ఆధారపడివుంది, క్రొత్తప్రపంచం వస్తుందనే ఆశ. అందువల్ల సరియైన విద్యార్జన కోసం మీరు ప్రయత్నించాలి. ఎట్టి ఒత్తిడులులేని వాతావరణంలో పెరిగినపుడే, సంప్రదాయం మీద ఆధారపడనటువంటిది, ఎవరో వేదాంతి లేక ఆదర్శవాది యొక్క పిచ్చి ఆలోచనల ప్రకారం నడవనటువంటిది అయిన క్రొత్త ప్రపంచాన్ని మీరు సృష్టించగలరు. కాని మీరు, ఎవరో మరొకరుగా మార్పు చెందాలని ప్రయత్నిస్తూవున్నా లేదా ఏదో యొక గొప్ప ఆదర్శాన్ని పెట్టుకొని దాని మాదిరి వుండాలని

ప్రయత్నిస్తూ వున్నా మీకు విముక్తి వుండదు, స్వతంత్రముండదు. అది దూరమైపోతుంది.

1. ప్రశ్న:- 'తెలివి' అంటే ఏమిటి?

కృష్ణమూర్తి:- ప్రశ్నను మెల్లగా ఓర్పుతో పరిశీలించి తెలిసి కొందాం. తెలిసికోడం అంటే ఒక నిర్ణయానికి రావడంకాదు. ఈ రెంటికీ గల తేడా మీకు తెలుసునో తెలియదో? 'తెలివి' అంటే ఏమిటో మీరొక నిర్ణయానికి వచ్చినారంటే, ఆ క్షణంనుండి మీకు తెలివి లేనట్లే! చాల మంది పెద్దవాండ్లు చేసిన పనే అది. వాండ్లొక నిర్ణయానికి వచ్చినారు. దానితో వాండ్లు తెలివిగల వాండ్లు కాకుండా పోయినారు. అంటే దీనిని బట్టి మొట్ట మొదటనే మీరొక విషయం తెలిసికొన్నట్లే — అదేమిటంటే తెలివిగల మనస్సు ఎప్పుడూ పరిశీలించి గ్రహిస్తూ వుంటుందేగాని ఎట్టి నిర్ణయాలకున్ను రాదని.

'తెలివి' అంటే ఏమిటి? ఆ పదానికి ఒక నిర్వచనమిస్తే చాల మంది తృప్తిపడతారు. "ఆ నిర్వచనం చాల బాగుంది" అనియైనా అంటారు లేదా తాము సొంతంగా తమ నిర్వచనాన్ని మనకందిస్తారు. నిర్వచనాలతో, వ్యాఖ్యానాలతో వివరణలతో తృప్తిపడే మనస్సు లోతు లేనిది కాబట్టి తెలివి గలదికాదు.

వివరణలతో, నిర్ణయాలతో, సిద్ధాంతాలతో తెలివిగల మనస్సు తృప్తి పడదని మీరు తెలిసికోసాగినారు. అట్లే అది నమ్మకాల మీద ఆధారపడింది కూడ కాదు. ఎందుకంటే నమ్మకమన్నా ఒక విధమైన నిర్ణయమే కదా! తెలివిగల మనస్సు విచారణ చేస్తూ, పరిశీలిస్తూ, నేర్చుకొంటూ, అధ్యయనం చేస్తూ వుంటుంది. అంటే యేమిటి? తెలివి అనేది భయవిముక్తుడవయితేనే వుంటుంది. దేవుడననెవరో లేదా దేనియొక్క మూల తత్త్వము నైనా తెలిసికొనడానికై సత్యాన్ని తెలిసికొనడానికై సంఘపు కట్టుబాట్లకు విరుద్ధంగా పోవ సిద్ధమైతేనే, తిరుగబడడానికి ఇష్టపడితేనే, తెలివియున్నట్లు.

తెలివి అనేది కూడబెట్టుకొన్న జ్ఞానరాశికాదు. ప్రపంచంలోని పుస్త కాలనన్నిటినీ చదివినా అది మీకు తెలివి నీయదు. తెలివనేది చాల సూక్ష్మమైనది. అది దేనిమీదను ఆధారపడదు. దేనినీ అంటిపెట్టుకొని వుండదు. మనస్సు పని చేసెడి తీరునంతను మీరు అర్థం చేసికొంటే — ఎవరో వేదాంతిగాని, గురువు గాని చెప్పినట్లు గాక (వారి యుద్దేశం ప్రకారంగాక) మీ మనస్సును మీరు అర్థం చేసికొంటే, అప్పుడే తెలివి జాగృతమవుతుంది, ప్రస్ఫుటమవుతుంది. మీ మనస్సు అనాదికాలము నుండి వున్న మానవత యొక్క ఫలితము. దానిని మీరు అర్థం చేసి కొంటే, మీరు వేరే యే పుస్తకాన్ని గూడ చదువనక్కరలేదు. ఏలయన భూతకాలమందలి జ్ఞానమంతా ఆ మనస్సులో చేరివున్నది. అందుకని మిమ్ము మీరు అర్థం చేసికొనడంతో తెలివి అభివ్యక్తమవుతుంది. అయితే యీ ప్రపంచములోని మానవులు, వస్తువులు, ఆలోచనలు, ఉద్దేశములు - వీనితో మీకుగల సంబంధము ద్వారానే మిమ్ము మీరు అర్థము చేసికోగలరు. తెలివి యనేది చదువు మాదిరి గానే సంపాదించి కూడబెట్టుకొనేదికాదు; ఎదిరించి ప్రశ్నింపసాగినపుడు అంటే మీలో భయములేనప్పుడు — అంటే నిజానికి, మీలో ప్రేమభావమున్నప్పుడు మాత్రమే — తెలివి ఉద్బుద్ధమవుతుంది. భయము లేనప్పుడే కదా ప్రేమ వుండేది

మీకు వివరణలు వ్యాఖ్యానాలే కావలసి వుంటే మీ ప్రశ్నకు నేను జవాబివ్వనట్లే! తెలివి అంటే యేమిటి అని అడగడం, జీవితమంటే యేమిటి అని అడిగినట్లే. జీవితమంటే చదువూ సంధ్యా, ఆటాపాటా, కామవాంఛ, సుఖం సంతోషం, పని చేయడం, తగవు లాడడం, ఈర్ష్య, అసూయ, తృష్ణ, ప్రేమ, సత్యం, సౌందర్యం — ఇట్లా ప్రతిదీ జీవితమే కాదా? కాని మనలో చాలమందికి దీని గురించి లోతుగా నిలకడగా విచారణ చేయడానికి తగినంత ఓపిక వుండదు.

2. ప్రశ్న:- **మొరటు మనస్సు సున్నితమైన మనస్సుగా మారగలదా?**

కృష్ణమూర్తి:- ముందు ప్రశ్నను వినండి, మాటల వెనుక గల

అర్థాన్ని గమనించండి. మొరటు మనస్సు సున్నితమైన మనస్సుగా మారగలదా? నా మనస్సు మొరటైనది కాబట్టి దానిని సున్నితమైన దానినిగా మార్చడానికై ప్రయత్నిస్తే, ఆ చేసే ప్రయత్నమే మొరటుతన మనిపించుకొంటుంది. ఇదివిని తెల్లపోవద్దు. జాగ్రత్తగా గమనించండి. అట్లుగాక నేను మొరటుగా వున్నానని గ్రహించి మారవలెననే కోరికలేకుండా, సున్నితమైన మనస్సు కొరకు ప్రయత్నించకుండా, మొరటుతనమంటే యేమిటో అర్థం చేసికోడం ఆరంభిస్తే ప్రతిదినము నాలోని మొరటుతనాన్ని గమనిస్తూ వుంటే — ఆబగా తినడం, త్రాగడం, మొరటుగా ఇతరులతో ప్రవర్తించడం, నా గర్వాన్ని, అహంకారాన్ని, నా అలవాట్లు నా ఆలోచనలలోని మోటు తనాన్ని గమనిస్తూ వుంటే—ఆ గమనికయే వస్తుస్థితిని మార్చివేస్తుంది.

అదే విధంగా నేను మందబుద్ధిని సూక్ష్మబుద్ధిగా మారవలెనని చెప్పి, అందుకోసమై ప్రయత్నించసాగితే ఆప్రయత్నమే మీలోని మితిమీరిన మందబుద్ధితనాన్ని సూచిస్తుంది. ఏలయన మీరు మీ మందబుద్ధితనాన్ని అర్థం చేసికోడం ప్రధానంగాని దానిని మార్చ ప్రయత్నించడంకాదు. బుద్ధిమంతుణ్ణి కావాలని ఎంతగా ప్రయత్నించినా నా బుద్ధి మాంద్యమదెక్కడికినిపోదు. విద్యావంతులలో వుండే పైపై లక్షణాలను సాధింపవచ్చు, పైపై సొగసులను అలవరచుకోవచ్చు, అనేక పుస్తకాలలోనుండి మాటలను వాక్యములను ఉటంకించవచ్చు. గొప్పగొప్ప రచయితలు రచించిన గ్రంథాలలో నుండి పేజీలకు పేజీలు వల్లెవేసి అప్పగించవచ్చు. కాని మూలమందున్న బుద్ధి మాంద్యమును మాత్రము పోగొట్టలేము - అది పోదు. అట్లుగాక నా దైనిక జీవితంలో - క్షణ క్షణము - నా బుద్ధి మాంద్యమెట్లా ప్రతి ఫలిస్తున్నదో గ్రహింపగల్గితే — నా పనిమనుషుల యెడ నేనెట్లా ప్రవర్తిస్తున్నానో, నా యిరుగు పొరుగువారి యెడ నాభావములెట్టివో, బీదవాడు, ధనికుడు, గుమాస్తా- వీరినెట్లా ఆదరిస్తున్నానో గమనింపగలిగితే, ఆ గమనికయే నా బుద్ధి మాంద్యమును బ్రద్దలు చేసి పోగొట్టుతుంది.

ప్రయత్నించి చూడండి-మీరు మీ పనిమనిషితో ఎట్లా మాట్లాడుతున్నారో, గవర్నరును ఎంత ఎక్కువగా గౌరవిస్తారో, మీ కివ్వడానికేమిస్నీ లేని బీదవానిని ఎంత తక్కువగా చూస్తారో గమనించండి. అప్పుడు మీ కర్థమవుతుంది మీరెంత అల్పబుద్ధులో! ఆ విధంగా మీరు మీ బుద్ధి మాంద్యమును అర్థం చేసికోడంలోనే తెలివియున్నది, బుద్ధి సూక్ష్మతయున్నది. వేరే బుద్ధిమంతునిగా మారవలసిన అవసరం లేదు. ఏదో విధంగా మారవలెనని కోరుతూ అందుకోసమై ప్రయత్నించేవాడే మొరటు మనిషి, కురూపి, కొరడు పారిన మనస్సు గలవాడు.

3. ప్రశ్న:- తల్లి దండ్రులు మరియు ఉపాధ్యాయుల సహాయం లేకుండా పసిపిల్లవాడు తానెవరో ఎట్లు తెలిసికోగలడు?

కృష్ణమూర్తి:- తెలిసికోగలడని నేను చెప్పితినా? లేక నేనన్న మాటలకు మీ సొంత వ్యాఖ్యానమా యిది? పిల్లవానికి అతడున్న వాతావరణము పరిసరములున్ను సహకరిస్తే అతడు తనంతట తానే తన్ను గురించి తెలిసి కోగలడు. తల్లిదండ్రులు గాని ఉపాధ్యాయులు గాని పిల్లలు తమ్ము గురించి తాము తెలుసుకోవలెనని నిజంగా-వారి మీది ప్రేమతో — భావిస్తే వారిని ఏవిధంగాను నిర్బంధించరు. అందుకు తగిన వాతావరణాన్ని మాత్రం వారు కల్పిస్తారు - అంతే!

మీరీ ప్రశ్నను అడిగినారు. బాగానే వుంది. కాని మీకిది అంత ముఖ్యమైన సమస్యా? పిల్లవాడు తన గురించి తాను తప్పక తెలిసికోవాలని మీరు నిజంగా మీ అంతస్సులో భావించి వుంటే, ఆ పిల్లవానిపై అధికారము, జబర్దస్తీ చూపించినట్టయితే వాడా పని చేయలేడని మీ నిజంగా తలిస్తే దానికి తగిన మంచి వాతావరణాన్ని కల్పింపజూడరా ఇక్కడ మళ్ళీ పాతపాటే — "ఏమి చేయాలో చెప్పు, చేస్తాను" అని. అంతేగాని "మనందరం కలిసి పనిచేద్దాం" అని అనము. పిల్లవాడు తన్ను గూర్చిన జ్ఞానము తనంతట తాను సంపాదించుకోవాలంటే దానికి తగిన వాతావరణాన్ని ఎట్లా కల్పించాలి అనే సమస్య ప్రతి

యొక్క నికిన్ని సంబంధించినది – తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, స్వయంగా పిల్లలకున్ను. అయితే, ఆత్మజ్ఞానము — అంటే తన్ను గురించిన జ్ఞానము—తన కితరులు కల్గించేదికాదు. ఒకరు తెచ్చి యిచ్చేది కాదు. ఈ అవగాహన నిర్బంధం చేస్తే వచ్చేదికాదు. ఈ సమస్య మీకు నాకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు అందరికిన్నీ సంబంధించి నది, అత్యావశ్యకమైనదిన్ని అని అనుకొంటే, మనందరం కలిసి దానికి తగిన సరియైన పాఠశాలలను నిర్మిస్తాం.

4. ప్రశ్న:- పల్లెలలో దెయ్యం పట్టడం లాంటి విషయాలను చూచినా మని, తమకు దెయ్యాలు భూతాలు అంటే భయమని పిల్లలు చెప్తూతూ వుంటారు. 'చావు' అంటే యేమిటని కూడ వారడుగుతారు. దీని కంతకు ఏమని సమాధానమివ్వాలి?

కృష్ణమూర్తి:- చావు అంటే యేమిటో తరువాత చర్చిద్దాం. కాని భయమనేది చూశారా, చాల విలక్షణమైన విషయం. దెయ్యాల గురించి మీకు-(పిల్లలకు)-మీ తల్లిదండ్రులు ఇంకా యితర పెద్దలు చెప్పి వుంటారు. లేకపోతే మీరు బహూశా వాటిని చూడరు. దెయ్యం పట్టడం గురించి యెవరో మీకు చెప్పి వుంటారు. ఈ విషయాలు తెలిసికోడానికి మీరింకా చాలా చిన్న పిల్లలు. ఇది మీ స్వానుభవం లోని విషయంకాదు. మీ పెద్దలు చెప్పినదాని ఫలితమిది. మరి ఆ పెద్దలకైనా మామూలుగా ఈ విషయాల గురించి యేమిన్నీ తెలి యదు. ఏదో పుస్తకంలో వారీ విషయమై కేవలం చదివి వుండి, అంతా తమకు అర్థమైనట్లే భావిస్తారు. ఇందులో నుండి యింకొక క్రొత్త ప్రశ్న పుట్టుకొస్తుంది – భూతకాలపు స్మృతులతో మలినము చేయబడని అను భవమంటూ వుంటుందా? భూతకాలమందలి జ్ఞానముతో దూషితమైన అనుభవము ఆ జ్ఞానమునకనుబంధము వంటిదేగాని మౌలికమైనది కాదు, సరిక్రొత్తదికాదు.

పిల్లలతో వ్యవహరించుచున్న మీరెవరున్ను మీ మీ భ్రమలను భ్రాంతు

లను దెయ్యాల గురించిన మీమీ నమ్మకాలను, ఉద్దేశాలను, అనుభవాలను ఆ పిల్లలమీద రుద్దవద్దు. ఇది చాల ముఖ్యం. అయితే యిది మాన్పించడం చాల కష్టం. జీవితానికి బొత్తిగా ఉపయోగపడని యిటువంటి అనావశ్యకమైన విషయాల గురించి వృద్ధులు అతిగా మాట్లాడుతూ వుంటారు. క్రమక్రమంగా వారు తమ ఆందోళనలను, భయాలను, మూఢవిశ్వాసాలను పిల్లలకు సంక్రమింప జేస్తారు. ఇక పిల్లలో, తాము విన్న దానిని సహజంగానే మళ్ళీ మళ్ళీ చెప్తూ వుంటారు. జ్ఞాపకం తెచ్చుకొంటూ వుంటారు. అందువలన పెద్దలు తమకే సరిగా తెలియని యీ విషయాల గురించి పిల్లల యెదుట మాట్లాడనే కూడదు. దాని బదులు పిల్లలు స్వేచ్ఛగా భయం లేకుండా పెరగడానికి దగిన వాతావరణాన్ని కల్పించడంలో తోడ్పడడం చాలమంచిది.

28 డిశంబరు, 1954

3

స్వతంత్రము – ప్రేమ

స్వతంత్రము లేదా విముక్త స్థితిని గురించి నేను చెబుతూ వచ్చి నది బహూశా మీలో కొందరు సరిగా అర్థం చేసికోలేక పోవచ్చును. కాని మీరు క్రొత్తక్రొత్త విషయాలను మీ వాడుకలో లేనివాటిని, మీరలవాటు పడని వాటిని గూడ వినడం చాల అవసరం. జీవితంలో అందమైన వాటినే గాదు, అందంగాలేని వాటిని గూడ చూడాలి. ప్రతిదానిని మీరు పరిశీలిస్తూ వుండాలి. అదేవిధంగా మీకు బహూశా సరిగా అర్థం గాని విషయాలను గూడ మీరు వింటూ వుండాలి. ఎందుకంటే మీ కర్థంగావడానికి కొంత కష్టంగా కనబడే యీ విషయాల గురించి మీరు ఆలోచన సాగించే కొలది మీరు మీ జీవితాన్ని ఎక్కువ సార్థకంగా, ఆనందంగా గడపగల్గుతారు.

సూర్యోదయ సమయంలో నీళ్ళమీద బడే సూర్యకాంతిని మీరెవ రైనా యెప్పుడైనా గమనించారా? ఆ కాంతి యెంత మృదువుగా, ఎంత అందంగా వుంటుందో! ఆకాశంలో ఒంటరిగా చెట్లమీదుగా కనబడే వేగుజుక్కతో బాటు క్రిందనున్న నల్లటి నీళ్ళు ఎట్లా ఆడుకొంటూ వుంటాయో యెప్పుడైనా చూచారా? లేక మీ దినచర్యలో మీరు మునిగిపోయి, బొత్తిగా తీరుబడి లేక, మనం నివసించే యీ భూమి యొక్క అందాన్ని మరచి పోయినారా? లేదా మన భూమి చాల అందంగా వుంటుందని కూడ మీరెరుగరా? మనము సామ్యవాదులమైనా భూస్వామ్యవాదులమైనా, హిందువులమైనా, బౌద్ధులమైనా, మహమ్మదీయులమైనా, క్రైస్తవులమైనా, గ్రుడ్డివారమైనా, కుంటివారమైనా లేక అంతా బాగున్నవారమైనా — ఎవరమైనా సరే యీ భూమి మనం దరిదిన్నీ. మీ కర్థమౌతోందా? ఈ భూమి మనది, మరింకెవరిదో

కాదు. ఇది కేవలం ధనవంతులదిగాని, బలవంతులైన రాజులదిగాని, భూస్వాములది గాని కాదు. ఇది మీది, నాది, మనందరిదీని. మనకు ఊరూపేరూ లేకపోవచ్చుగాక, అయినా మనంగూడ ఈ భూమి మీదనే నివసిస్తున్నాము. దీనిమీదనే మనందరం కలిసి జీవించాలి. ఈ ప్రపంచం ధనవంతులదే కాదు, బీదవారిది కూడ; చదువుకొన్నవారిదేకాదు, చదువురానివారిది కూడ. ఈ ప్రపంచం మనది. ఈ విధంగా మనం మనసార భావించి మన యీ భూమిని ప్రేమించాలి — ఎప్పుడో యొక నాడు, ప్రశాంత ప్రభాత కాలంలోనే కాదు, ఎప్పుడూ, ఎల్లప్పుడున్నూ. అయితే యిది మన ప్రపంచమేయని మనసార భావించి దానిని ప్రేమించాలంటే, మనకు స్వాతంత్ర్యమంటే యేమిటో అర్థమైయుండాలి.

ప్రస్తుతం మనకు స్వాతంత్ర్యమనేదే లేదు. దాని అర్థమే మనకు తెలియదు. మనం స్వతంత్రంగా వుండాలని కోరుకొంటాము. కాని గమనించి చూస్తే ప్రతివాడూ — ఉపాధ్యాయుడు, తల్లి, తండ్రి, న్యాయవాది, రక్షకభటుడు, సైనికుడు, రాజకీయనాయకుడు, వ్యాపారి — ఇట్లా అందరూ తమతమ చిన్న చిన్న పరిధులలో ఆ స్వాతంత్ర్యానికి అడ్డుకట్టలు వేస్తూ వున్నారు. స్వతంత్రంగా వుండడమంటే మీ యిష్టంవచ్చిన పని, యిష్టం వచ్చినట్లు చేయడంకాదు, లేదా మిమ్ము బంధించే బాహ్య పరిస్థితులనుండి త్రెంచుకొని పారిపోవడం కాదు. మీరు మీ పరాధీనతను అర్థం చేసికోవడంలోనే స్వాతంత్ర్యమున్నది. పరాధీనత అంటే యేమిటో మీకు తెలుసునా? మీరు మీ తల్లి దండ్రులమీద ఆధారపడతారు, కదా? మీ ఉపాధ్యాయుల మీద ఆధారపడతారు. మీకు వండి పెట్టే వానిమీద ఆధారపడతారు. జాబులు తెచ్చి యిచ్చే తపాలా వానిమీద, పాలు తెచ్చి పోసే పాలవానిమీద — ఇట్లా యెందరిమీదనో ఆధారపడతారు. ఈ విధమైన పరాధీనతను సులువుగా అర్థంచేసికోవచ్చు. కాని యింతకంటే చాలలోతైన పరాధీనత యొకటి వున్నది. స్వతంత్రులం కావాలంటే ఆ పరాధీనతను తప్పక అర్థం చేసికోవాలి. అదేమంటే తన సుఖసంతోషాల కోసం ఇతరులమీద ఆధారపడడం. అంటే అర్థమేమిటో తెలుసునా? బాహ్యంగా ఒకరిమీద ఆధారపడడం కాదు,

మిమ్ము అంతగా బంధించేది; సుఖమనబడే దానిని పొందడం కోసం, లోలోపల, అంతరంగంలో — (మానసికంగా) — ఇతరులమీద ఆధార పడడం మిమ్ము బంధించి వేస్తుంది. అట్టి పరాధీనత వలన మీరు బానిసలై పోతారు. మీరు పెరిగి పెద్దవారయ్యే కొలది భావాత్మకంగా మీ తల్లి దండ్రులమీద, మీ భార్య లేక భర్తమీద, గురువు మీద లేక ఏదేని యొక భావన మీద లేక ఒక నమ్మకంమీద ఆధార పడితే, దానితో మీకు బంధ మారంభమవుతుంది. మనమిది గ్రహించము — మనలో చాల మందిమి, ముఖ్యంగా మనం చిన్న పిల్లలంగా వున్నప్పుడు, స్వతంత్రంగా వుందామని కోరుకొన్నప్పటికిన్ని.

స్వతంత్రంకోసమై మనం మన ఆంతరంగిక పరాధీనతకు విరుద్ధంగా తిరుగబడవలసి వుంటుంది. అయితే మనం ఎందువలన పరాధీనుల మైనామో తెలిసికొనక పోతే మనం తిరుగబడలేము. ఆంతరంగిక పరాధీనత అంటే యేమిటో అర్థంచేసికొని, దానినుండి త్రెంచుకొని బయ టికి రాకపోతే మనకు స్వతంత్ర మెన్నటికిని రాదు. దానిని అర్థం చేసి కోవడంలోనే స్వతంత్రమున్నది. స్వతంత్రమనేది కేవలం ప్రతిక్రియ లాంటిది కాదు. ప్రతిక్రియ (Reaction) అంటే యేమిటో తెలుసునా? మీ మనస్సుకు నొప్పి కలిగించే మాట ఏదైనా అంటే, లేదా మిమ్ము చెడ్డపేరు పెట్టి పిలిస్తే, మీకు నామీద కోపం వస్తుంది. అదే ప్రతిక్రియ అంటే. అది పరాధీనతలో నుండి పుట్టుకొని వస్తుంది. పరాధీనత వలెనే స్వాధీనత (Independence) కూడ ఒక ప్రతిక్రియయే. కాని స్వతంత్రమనేది (Freedom) ప్రతిక్రియకాదు. ప్రతిక్రియను అర్థంచేసికొని దానిని అతిగమించిపోని యెడల మన మెన్నటికిని స్వతంత్రులము కాలేము.

ఎవరినైనా ప్రేమించడమంటే అర్థమేమిటో మీకు తెలుసునా? ఒక చెట్టును గాని పిట్టనుగాని, పెంపుడుజంతువును గాని ప్రేమించడమంటే యేమిటి? మీ ప్రేమకు బదులుగా అది మీకేమీ యివ్వకపోయినప్పటి కిన్నీ, మీకు నీడ యివ్వక పోయినప్పటికిన్నీ, మీ వెనువెంట తిరుగక పోయినప్పటికిన్నీ, మీమీద ఆధారపడక పోయినప్పటికిన్నీ మీరు దాని

గురించి అన్ని జాగ్రత్తలు తీసికొంటారు. దానికి తిండి పెడతారు. దానిని లాలిస్తారు, పాలిస్తారు. మనలో చాలమందిమి ఆవిధంగా ప్రేమించము. అటువంటి ప్రేమసంగతినే మనమెరుగము. మన ప్రేమ యెల్లప్పటికిన్ని చింత, అసూయ, భయము — ఈ అడ్డుగోడల మధ్యనే చిక్కుకొని వుంటుంది. అంటే దాని అర్థం మనం లోలోపల పరులపై ఆధార పడి వున్నామన్నమాట. మనము ప్రేమించి, అంతటితో వూరుకోము; దానికి బదులుగా మనకేదైనా లభించాలి. ఇతరులనుండి కూడ మనకు ప్రేమ కావాలి. మన ప్రేమకు బదులు కావాలని కోరడంతోటే మనము పరాధీనులమౌతున్నాము.

కాబట్టి స్వతంత్రము, ప్రేమ — రెండున్ను తోడుగా పోతుంటాయి. ప్రేమ యనేది ఒక ప్రతిక్రియ కాదు. మీరు నన్ను ప్రేమిస్తే నేను మిమ్ము ప్రేమిస్తాను అని యంటే అది వ్యాపారమన్నమాట, మారు బేరమన్నమాట. ఆ ప్రేమ బజారులో కొనదగిన వస్తువన్నమాట — అట్టిది నిజమైన ప్రేమ కాదు. ప్రేమించడమంటే దాని బదులు మరి యొకదానిని అడగడం కాదు. అసలు మీరేదో యిస్తున్నట్టి భావనే వుండరాదు. అట్టి ప్రేమకే స్వతంత్రమంటే యేమిటో తెలుస్తుంది. కాని మీకీవిధమైన చదువు బోధింపబడడం లేదు. మీకెంతసేపటికిని గణితము, రసాయన శాస్త్రము, భూగోళ శాస్త్రము, దేశ చరిత్ర — యిటువంటి వాటిని మాత్రమే బోధిస్తారు. అంతటితో చదువుసరి. ఎందువల్లనంటే మీ తల్లి దండ్రుల వుద్దేశము మీ రొక మంచి ఉద్యోగం సంపాదించుకొని, ఆ విధంగా జీవితంలో సఫలురు కావాలని మాత్రమే. వాండ్ల దగ్గర డబ్బుంటే మిమ్ము వాండ్లు విదేశాలకు గూడ బంపవచ్చు. కాని ప్రపంచంలోని అందరి మాదిరే వారి లక్ష్యమంతా మీరు ధన వంతులై సమాజంలో ఒక గౌరవనీయమైన స్థానమును పొంగవలెనని మాత్రమే. అయితే మీరు పైపైకి వెళ్ళుకొలది మీ వలన ఇతరులకు ఎంతో యిబ్బంది, కష్టము కలుగుతూ వుంటుంది. ఎందుకనగా, మీరు పైస్థానానికి పోవలెనంటే ఎంత మందినో పోటీలో క్రూరంగా అణగ ద్రొక్క వలసి వుంటుంది గదా! అందుచేత ఇతరులకంటే ఘనమైన

పేరు ప్రఖ్యాతులు సంపాదించ వలెననే కోరికను, పోటీలను ప్రోత్సహించే బడులకే తల్లిదండ్రులు తమ పిల్లలను బంపుతుంటారు. అట్టి బడులలో ప్రేమకు తావు లేదు. అందువల్లనే మన యీ మానవసమాజము ఇట్లా ఎడతెగని సంఘర్షణతో నలిగి నలిగి నిరంతరము క్షీణించి పోతూనే వున్నది. రాజకీయ నాయకులు, న్యాయాధిపతులు మరియు దేశములోని పెద్దలనబడే వారందరు శాంతిని గురించి ఏమేమో మాట్లాడుతారు కాని అదంతా బూటకం, అర్థరహితం.

ఇక మన మీ స్వతంత్రమంటే లేదా, బంధరాహిత్యమంటే యేమిటో పూర్తిగా అర్థం చేసికోవలసి యున్నది. ప్రేమించడమంటే యేమిటో మనం తెలిసికోవలసి యున్నది. మనలో గనక ప్రేమ లేకపోతే అప్పుడు మనం ఇతరులను గురించి పట్టించుకోము, ఇతరుల అవసరాలను చూడము, ఇతరుల యిబ్బందులను గమనించము. అంటే యేమిటో తెలుసునా? చెప్పులు లేకుండా చాలమంది నడిచే చోట దారికడ్డంగా ఒక పదునైన రాయి వుందనుకోండి, దానిని మీరు వెంటనే తీసివేస్తారు — తీయమని మిమ్మెవరును అడుగక పోవచ్చు. కాని ఎవరికైనా గ్రుచ్చు కొంటుందేమోయని తలచి దానిని తీసిపారవేస్తారు — ఆ మనిషి యెవరైనా గానీ; ఆ మనిషిని మీ రెన్నటికిని కలియక పోవచ్చు. ఒక మొక్కను నాటి దానిని పెంచుతారు. నదిని చూచి భూమియొక్క నిండుదనానికి ఆనందిస్తారు. పక్షియెగరడం చూచి, ఆ యెగరడంలోని అందాన్ని గమనిస్తారు. సున్నితమై ప్రేమార్ద్రమైన బుద్ధితో అద్భుతమైన యీ జీవిత మనబడే చైతన్య ప్రవాహాన్ని విముక్తమైన మనస్సుతో పరికిస్తుంటారు. దీనికంతకును స్వతంత్రముండడం అవసరం. స్వతంత్రం కావాలంటే ప్రేమించాలి. ప్రేమలేనిదే స్వతంత్రం లేదు, బంధరాహిత్యము లేదు. ప్రేమలేని స్వతంత్రము కేవలం భావన మాత్రమే; దానికి విలువ లేదు.

కాబట్టి మానసికమైన పరాధీనతను అర్థంచేసికొనడం ద్వారా దాని నుండి విడివడిన వారే ప్రేమ అంటే యేమిటో తెలిసికోగలరు. వారికే

స్వతంత్రమిస్తుంటుంది. అట్టివారే బంధ రహితులు. వారే క్రొత్తనాగరికతను స్థాపించగలరు, క్రొత్త ప్రపంచాన్ని సృష్టింపగలరు.

1. ప్రశ్న:- కోరికకు మూలమేమి? దాని నెట్లు తొలగించగలను?

కృష్ణమూర్తి:- ఈ ప్రశ్నను అడిగే మనిషి ఒక యువకుడు. అతడెందుకని కోరికలు లేకుండ చేసికోవలెనో? వింటున్నారా? అతడు యువకుడు, పూర్తిగా జవసత్త్వములున్నవాడు. అతడెందుకోసమై కోరికలు లేకుండ చేసికోవలెను? కోరికలు లేకుండా వుండడం గొప్ప సుగుణమని, మిక్కిలి శ్రేయోదాయకమని, ఎట్టి కోరికలులేని వానికి దైవము సాక్షాత్కరిస్తాడని, మోక్షము లభిస్తుందని చెప్పగా వినియున్నాడు. అందువల్లనే "కోరికలకు మూలమేమి? వానినెట్లు లేకుండ చేసికోగలను?" అని అడుగుతున్నాడు. కాని 'కోరికలు లేకుండ చేసికోవాలి,' అనేది కూడ ఒక విధమైన కోరికయే గదా? నిజానికి కోరిక భయము వలన కలుగుతుంది.

కోరికకు మూలమేది? ఉత్పత్తి స్థానమేది? దానికి ఆరంభమేది? మీ మనస్సున కింపైన దానిని దేనినో చూస్తారు, అది కావాలని కోరుకొంటారు. ఒక కారునో పడవనో చూస్తారు. దానిని పొందాలని కోరుకొంటారు. లేదా ఒక ధనవంతుని కుండేహోదాను సాధించాలని కోరుకొంటారు, లేదా సన్న్యాసి కాగోరుతారు. కోరికకు మూలమేమంటే, మొదట చూడడము పిదప దానితో సంపర్కము, దానివలన సంవేదన, అనగా ఇంద్రియ జ్ఞానము, అందుండి కోరిక పుట్టుతుంది.

కోరికల వలన విరోధములు, ఘర్షణలు కలుగుతాయని గ్రహించి "మేమీకోరికలనుండి యెట్లు విడుదల పొందగలము?" అని మీరడుగుతారు. కాని నిజంగా మీరు కోరేది కోరికలనుండి విడుదలకాదు. కోరికల వలన కలిగే చింతలు, చీకాకులు, ఆందోళనలు, బాధలు మొదలైన వాటినుండి విడుదలను కోరుతారు. అంటే కోరికల వలన కలిగే దుష్టఫలితాల నుండి మాత్రమే విడుదలను కోరుతారు, కాని కోరికల

నుండికాదు. ఇది అర్థంచేసికొనడం చాలముఖ్యం. కోరికలతో బాటు వచ్చే బాధలు, కష్టాలు, ఘర్షణలు, రకరకాల చింతలు, భయాలు లేకుండ కేవలం సుఖం మాత్రమే వచ్చేటట్లయితే అప్పుడు గూడ మీరు కోరికల నుండి విడుదల పొందగోరుతారా? కోరరు.

ఏదైనా లాభం పొందాలని, దేనినైనా సాధించాలని, ఏదో యొక స్థితికి చేరుకోవాలని, బాగా వృద్ధి చెందాలని కోరుకొంటూ వున్నంత కాలము చింత, దుఃఖము, భయమున్ను తప్పవు. ధనవంతుణ్ణి కావాలని ఇంకా ఏమేమో సాధించాలని కోరుకొనే పెద్దపెద్ద కోరికలన్నీ — ఆ కోరికలలో వుండే క్రుళ్ళును, వాటి దూషిత స్వభావాన్ని చూచినప్పుడు, తొలగిపోతాయి. ప్రధాన మంత్రిగాగాని, న్యాయాధిపతిగాగాని, మతబోధ కుడుగా గాని, గురువుగా గాని మరియే విధంగానైనా సరే అధికారం చెలాయించాలని కోరే కోరిక మౌలికంగా దుష్టమైనదని మనం గ్రహించి నప్పుడే ఆవిధంగా అధికారం కోసం ప్రాకులాడడం మానివేస్తాము. కాని అట్టి పేరాశలు మనుషులను చెడగొడతాయని, అధికారదాహం దుష్టమై నదని మన మనస్సుకే తట్టదు. పైగా అధికారాన్ని సద్వినియోగం చేస్తామని ప్రగల్భాలు పలుకుతాం. అది అర్థరహితమైన ప్రేలాపన. సన్మార్గాన పోతేనే సత్ఫలితం కలుగుతుంది; దుర్మార్గాన పోతే దుష్ట ఫలితమే కలుగుతుంది. మంచి చెడ్డలు ఒక దాని కొకటి వ్యతిరేకము కాదు. చెడ్డ అనేది పూర్తిగా లేకుండా పోయినప్పుడు మాత్రమే మంచి అనేది బహిర్గతమవుతుంది.

కాబట్టి కోరిక అనగానేమిటి? దానివలన కలిగే ఫలితాలేమిటి? వాటితోబాటు వచ్చే ఆనుషంగిక ఫలితాలేమిటి? ఇవన్నీ తెలిసికోకుండా కేవలం కోరికలను తొలగించుకొందామని చేసే ప్రయత్నానికి అర్థములేదు.

2. ప్రశ్న:- సమాజంలో ఉన్నంతకాలం ఒకరిమీద నొకరు ఆధా రపడకుండా ఎట్లా ఉండగలం?

కృష్ణమూర్తి:- సమాజమంటే యేమిటో మీకు తెలుసునా? సమా

జమంటే మనిషికీ మనిషికీ మధ్య గల అన్యోన్య సంబంధము - కాదా? ఈ విషయాన్ని జటిలంచేయకండి. ఏవేవో పుస్తకాలనుండి అనుకూలం గానో ప్రతికూలంగానో ప్రమాణ వాక్యాలను ఉటంకించకండి. దీని గురించి మీరు తిన్నగా, సరళంగా ఆలోచిస్తే మీకు, నాకు, ఇతరులకు మధ్య గల అన్యోన్య సంబంధమే సమాజమని సంఘమని గుర్తించ గలుగుతారు. మానవుల మధ్యగల అన్యోన్య సంబంధము వల్లనే సమాజమేర్పడు తుంది. ఈ నాటి మన సమాజము సంగ్రహణశీలతా సంబంధము మీద ఆధారపడి నిర్మింపబడినది. అంటే మన యీ నాటి సమాజములోని వ్యక్తులమధ్య గల సంబంధము ఒకరినిజూచి మరియొకరు అంతకంత కెక్కువగా వస్తువాహనాదులను కూడబెట్టుకొనడంపై ఆధారపడి వున్నది, కాదా? మనలో చాలమందికి డబ్బు, అధికారము, ఆస్తి, పలుకుబడి - యివన్నీ కావాలి. ఏదో యొక స్థాయిలో మనకు హోదా, పదవి, పేరు, ప్రతిష్ఠా కావాలి. ఈ విధంగా మనం నిర్మించుకొన్న యీ సమాజము కూడబెట్టుకొనే స్వభావాన్ని ప్రోత్సహించే సమాజము. అందువలన మనం రకరకాలైన వాటిని కూడబెట్టుకొంటూ వున్నంతకాలము, హోదా, ప్రతిష్ఠ, అధికారము మొదలైన వాటికోసం ప్రాకులాడుతూ వున్నంతకాలము మన మీ సంఘానికి చెందిన వారమవుతాము. దాని మీద ఆధారపడిన వారమౌతాము. ఇవేవీ అక్కర లేదనుకొని తాను తానుగానే విన యంగాను, నిరాడంబరంగాను వుండిపోతే అట్టివానికి ఈ సంఘముతో పని లేదు; దానికి ఎదురు తిరిగి దాని కట్టుబాట్లను త్రెంచుకొని బయటికి వచ్చి వేస్తాడు.

దురదృష్టవశాత్తు స్వార్థపూరితమై వివిధ వస్తు సంగ్రహణశీలమైన యీ సంఘమునకు లోబడి దానిలో ఒకభాగమై పోవడానికి, దానితో సమాధానం పొందడానికి మాత్రమే నేటి చదువు మీకుపయోగపడు తున్నది. మీ తల్లిదండ్రులు, మీ ఉపాధ్యాయులు, మీ పుస్తకాలు — అన్నింటి వుద్దేశమదే, అందరి ఉద్దేశమదే. మీరు అందుకనుకూలంగా వుంటూ వున్నంతకాలం, పెద్ద పెద్ద కోరికలతో అన్నింటిని కూడబెట్టు కొంటూ అవినీతి పరులై హోదాను అధికారాన్ని సంపాదించుకొంటూ,

ఆ సంపాదనా క్రమంలో ఇతరులను నాశనం చేస్తూ వుంటున్నం తకాలం మీరు గౌరవనీయులైన పౌరులుగా లెక్కింప బడతారు. ఆ విధంగా సంఘంలో ఇమిడి పోవడం కోసమే మీరు చదివింపబడుతున్నారు. కాని అది నిజమైన చదువు కాదు. సంఘమర్యాదకు అనుకూలంగా మీ మనస్సును మార్చివేయడానికి మాత్రమే ఆ చదువు ఉపయోగ పడుతుంది. నిజానికి చదువుయొక్క ఉద్దేశము మిమ్ము గుమాస్తా లుగానో, న్యాయాధిపతులుగానో, ప్రధాన మంత్రులుగానో చేయడంగాదు; ఈ కుళ్ళిపోయిన మానవ సమాజము యొక్క నిర్మాణ మెట్టిదో మీకవగాహన గావించి, యెట్టినిర్బంధములులేని స్వేచ్ఛాపూరిత వాతావర ణంలో మీరు పెరుగునట్లు చేయడమే చదువుయొక్క ప్రధానోద్దేశము. అప్పుడే మీరీ సమాజమునుండి బయటపడి క్రొత్త సమాజాన్ని, క్రొత్త ప్రపంచాన్ని సృష్టింపగలరు. ప్రాతకట్టుబాట్లకు విరుద్ధంగా — ఆంశికంగా గాకుండా, సంపూర్ణంగా — తిరుగ బడగలవారు కొందరైనా వుంటే, వారే క్రొత్త ప్రపంచాన్ని — సంగ్రహణ బుద్ధి, స్వార్థము, అధికారము, ప్రతిష్ఠ వీటి మీద ఆధారపడని క్రొత్త ప్రపంచాన్ని — సృష్టింపగలరు.

అయితే, "అట్లెన్నటికిని జరుగబోదు; మానవ స్వభావము మారే దికాదు; మీరు చెప్పేదంతా అర్థరహితము" — అని కొందరు పెద్దలనడం నేను వినియున్నాను. కాని యువకుల మనస్సులలో నుండి అందు నాటు కొనిపోయిన సంస్కారముద్రలను తొలగించడం శిశువుల మనస్సులను సంస్కారబద్ధములు చేసి చెడగొట్టకుండా యథాతథంగా వుంచడం — ఈ విషయమై మనమెప్పుడున్నూ ఆలోచింప లేదు. నిజానికి విద్య అనేది వ్యాధిహరము, వ్యాధి నివారకము కూడ. మీలో పెద్ద పిల్లలు ఇప్పటికే మారిపోయినారు. మీ మనస్సులు ఇప్పటికే మలచబడిపోయినాయి. ఇప్ప టికే మీలో పెద్ద పెద్ద కోరికలు పుట్టడం ఆరంభమైంది. మీరు మీ తండ్రుల మాదిరిగానో, లేదా గవర్నరు మాదిరిగానో, లేక మరియొకరి మాదిరిగానో జీవితంలో విజయం పొందాలని, ఏదో సాధించాలని కోరడం మొదలుపెట్టినారు. అందువలన విద్యయొక్క ప్రధానోద్దేశమేమంటే మీ మనస్సులలో నాటుకొనిపోయిన ఇట్టి సంస్కారములనెడి కలుపు మొక్కలను

తీసివేసి మరల వాటిని నిర్మలము చేసికోడంలోను దిన దినమును మీరు జీవించు ప్రక్రియనంతను అర్థంచేసికోడంలోను మీకు సహాయ పడడమే. అప్పుడే మీరు స్వేచ్ఛా వాతావరణంలో పెరుగుతూ క్రొత్త ప్రపంచాన్ని సృష్టింప గలరు — ఆ ప్రపంచము నేటి యీమన ప్రపంచానికి పూర్తిగా భిన్నమైనది. దురదృష్టవశాత్తు, మీ తల్లి దండ్రులకు గాని ఉపాధ్యాయులకు గాని, మామూలు ప్రజలకుగాని, యీ విషయంలో అభిరుచి లేదు. అందుచేత ఇట్టి విద్యా బోధన కేవలం విద్యార్థులకే గాకుండ వారి ఉపాధ్యాయులకు గూడ అవసరమవుతున్నది.

3. ప్రశ్న:- మనుష్యులెందుకు కొట్లాడుకొంటారు?

కృష్ణమూర్తి:- చిన్న పిల్లలెందుకు కొట్లాడుకొంటారు? ఒక్కొక్కసారి మీరు మీ అన్నతోనో, తమ్ముళతోనో లేదా యితర పిల్లలతోనో తగవులాడుతారు కదా, ఎందుకని? ఏదో చిన్న ఆటబొమ్మకోసం మీరు కొట్లాడుకొంటారు. ఆ రెండో పిల్లవాడు బహుశా మీ బంతినో, మీ పుస్తకాన్నో తీసికొంటాడు. అందుకు మీరు వాడితో కొట్లాడుతారు. పెద్దవాండ్లు కూడ సరిగ్గా యిటువంటి కారణాలమీదనే కొట్లాడుకొంటారు. అయితే వాండ్ల ఆటవస్తువులు హోదా, సంపత్తి, అధికారమున్ను. మనిద్దరికిని అధికారం కావాలి. దానికోసం మనిద్దరం కొట్లాడుకొంటాము. వివిధ జాతులు పరస్పరం కలహించుకోడానికి కూడ ఇదే కారణము. ఇదంతా సులభంగా తెలిసే మామూలు విషయం. కాని వేదాంతులు, రాజకీయనాయకులు, ధార్మిక పురుషులనబడే వారున్ను దానిని క్లిష్టపరుస్తారు, పెద్ద సమస్యగా మారుస్తారు: ఎంతో జ్ఞానము, అనుభవము కలిగి వుండడంతోబాటు, జీవిత సంపదను, సృష్టి సౌందర్యమును, పోరాటములు, సుఖదుఃఖాలు, నవ్వులు, కన్నీళ్ళు — వీటినన్నిటిని ఎఱిగి యుండడంతోబాటు మనస్సును నిర్మలంగా, శాంతంగా వుంచుకో గల్గడం ఒక గొప్ప కళ. ప్రేమించడమెట్లో తెలిస్తేనే మీ మనస్సును మీరు నిర్మలంగా శాంతంగా వుంచుకోగలరు.

4. ప్రశ్న:- అసూయ అంటే యేమిటి?

కృష్ణమూర్తి:- అసూయ అంటే మీరున్న స్థితితో మీరు తృప్తి పడకపోవడం. ఇతరులను చూచి ఓర్చుకోలేక పోవడం, కాదా? మీరున్న స్థితితో మీరు తృప్తి పడకపోవడంతో అసూయ ఆరంభమౌతుంది. మీకంటె ఎక్కువ జ్ఞానముగల వానిని, ఎక్కువ అధికారము గలవానిని, ఎక్కువ హోదాగల వానిని, పెద్ద యిల్లు గలవానిని, లేదా ఎక్కువ అందమైన వానిని చూచి, వారి వలె వుండాలని మీరు అనుకొంటారు. ఇతరులకంటే మించి ధర్మాత్ములనిపించుకోవాలని కోరుకొంటారు. ఇంతకంటే బాగా ధ్యానమెట్లా చేయవలెనో తెలిసి కొనగోరుతారు. దేవుని సన్నిధికి పోగోరుతారు. మొత్తంమీద మీరు మీరుగా వుండకుండ మరియొకరుగా మారగోరుతారు. దానితో మీలో ఈర్ష్యాసూయలు ఆరంభమౌతాయి. మీరెవరో యేమిటో తెలిసికోడం చాల కష్టమైన పని. అది తెలిసికోవాలంటే మీరు మరియొకరుగా మారిపోవాలనే కోరిక పూర్తిగా తొలగిపోవాలి. మిమ్ము మీరు మార్చుకోవాలని, వేరొకరుగా మారిపోవాలని కోరే కోరికనుండియే ఈర్ష్యాసూయలు పుట్టుకొని వస్తాయి. అట్లుగాకుండ మిమ్ము మీరు ఉన్నదున్నట్లుగా అర్థం చేసికోవడంతో సహజంగానే మీలో పరివర్తనము కల్గుతుంది. ఆ పరివర్తనము ప్రయత్నము ద్వారా సాధింపబడేదికాదు. కాని చూచారూ, మీరు చదివిన చదువంతా వేరొక క్రొత్త మనిషిగా మారిపోవడానికి ప్రయత్నించుమని మిమ్ము ప్రోత్సహిస్తుంది, ప్రేరేపిస్తుంది. కాని మిమ్ము మీరెవరో తెలిసికొండని చెప్పదు. మీలో అసూయ కలిగినట్లయితే "అసూయపడవద్దు, అది మంచిది కాదు, చాల చెడ్డది" అని మీకు చెప్తుతుంది. అందువలన అసూయపడకుండా వుండాలని ప్రయత్నిస్తారు. కాని ఆ ప్రయత్నం కూడ అసూయలో ఒక భాగమే. ఎందువల్లనంటే, మీరు మరియొకరుగా మారి పోవాలని కోరుకొంటున్నారు కదా!

అందమైన గులాబీ (యెప్పటికైనా, ఎక్కడనైనా) అందమైన గులాబీయే. మనకు — మానవులకు — ఆలోచించే శక్తి ప్రసాదింప బడినది.

కాని మనం సరిగా ఆలోచించం. మనం చేసే ఆలోచన అంతా తప్పుమార్గాననే పోతూ వుంటుంది. 'ఎట్లా' ఆలోచించాలో తెలిసికోవాలంటే ఎంతో లోతుగా పోయి చూడాలి. అవగాహన చేసికోవాలి. కాని 'దేనిని' గురించి ఆలోచించాలో తెలిసికోవడం చాల సులభం. మన ప్రస్తుత విద్యావిధానం ఏమి ఆలోచించాలో తెల్పుతుంది, ఎట్లా ఆలోచించాలో ఎట్లా లోతుగాపోయి విషయవిచారణచేయాలో తెల్పదు. ఉపాధ్యాయునకున్ను విద్యార్థి కిన్ని ఇద్దరికిని ఎట్లా ఆలోచించాలో తెలిస్తేనే యీ బడికి గల మంచిపేరు సార్థకమౌతుంది.

5. ప్రశ్న:- నేను దేనికిని ఎప్పుడును తృప్తిపడను, ఎందువలన?

కృష్ణమూర్తి:- ఈ ప్రశ్నవేసింది ఒక చిన్న ఆడపిల్ల. ఈ ప్రశ్నవేయుమని ఆ పిల్లనెవరైనా ప్రేరేపించి వుంటారని నేను అనుకోను. ఇంత లేతవయస్సులో ఈ పిల్ల తనకు దేనిమీదను ఎందుకు తృప్తికలుగడంలేదో తెలిసికొనగోరుతూ వున్నది. దీనికి మీ పెద్దవాండ్ల సమాధానమేమి? ఇదంతా మీరు చేసిన పని. చిన్న పిల్లలు తమ కెందుకు తృప్తి లేదని ప్రశ్నించే ప్రపంచాన్ని సృష్టించినవారు మీరు. ఉపాధ్యాయులమని విద్యాబోధకులమని పేరు పెట్టుకొన్న మీరు ఇందులోని విషాద పరిణామాన్ని గమనించరు! మీరు ధ్యానం మాత్రం చేస్తారు గాని ఉపయోగంలేదు. మీరు మందబుద్ధులు, శ్రాంతచిత్తులు. మీ అంతరాత్మ మృతప్రాయము.

మానవ మాత్రులకెందుకని సంతృప్తి అంటూ లేదు? సుఖంకోసం ప్రాకులాడుతూ వుండడం వలన కాదా? మాటి మాటికి మారిపోతూ వుంటే సుఖంగా వుంటామని వారి తలంపు. వారు ఒక ఉద్యోగాన్ని వదిలి మరియొక ఉద్యోగానికి, ఒక సంబంధాన్ని వదిలి మరియొక సంబంధానికి, ఒక మతాన్ని లేదా ఒక వాదాన్ని విడిచి పెట్టి మరియొక దానికి మారుతూ వుంటారు. ఆ విధంగా ఎప్పుడూ మారుతూ వుంటే సుఖం పొందవచ్చునని వారనుకొంటారు. అట్లాగాకపోతే, జీవిత ప్రవాహానికి దూరంగా ఎక్కడనో ఒక చోటు చూచుకొని అక్కడే వుండిపోయి

నిలకడ నీటివలె మురిగిపోతారు.

అయితే సంతుష్టి అనేది మాత్రం దీనికి పూర్తిగా భిన్నమైనది. సంతృప్తి (satisfaction) వేరు, సంతుష్టి (contentment) వేరు. మారాలని కోరిక పెట్టుకోకుండా, మిమ్ము మీరు పొగడుకోవడంగాని, తెగడుకోవడం గాని లేదా ఒకరితో పోల్చుకోవడంగాని లేకుండా మీ యథార్థ స్వరూపాన్ని మీరు చూచుకోగల్గితే అప్పుడు కలిగేది సంతుష్టి. అంటే దాని అర్థం మీరు చూచిన దానిని "బాగానే వుందిలే" అని సమాధానపడి నిద్రపొమ్మని కాదు. ఎప్పుడైతే మనస్సు పోల్చడం, నిందించడం, ప్రశంసించడం, విలువనీయడం మానుతుందో అప్పుడే సత్యస్వరూపాన్ని — దానిని మార్చవలెననే కోరిక లేకుండా — ప్రతిక్షణము సాక్షాత్కారము చేసికొనగల్గుతుంది. ఆ దర్శనంలోనే ఆద్యంతరహితమైనది, అనంతమైనదేదో అది వున్నది.

6. ప్రశ్న:- మేమెందుకు చదువుకోవాలి?

కృష్ణమూర్తి:- మీరెందుకు చదువుకోవాలి? శాంతంగా వినండి. మేమెందుకు ఆడుకోవాలి? మేమెందుకు తినాలి? ఏటివైపు ఎందుకు చూడాలి? ఎందుకని క్రూరంగా వున్నాము? — ఇట్లా మీ రెప్పుడున్ను అడుగరు. ఏదైనా యెందుకు చెయ్యాలి అని, అది చెయ్యడానికి ఇష్టము లేనప్పుడే ఎదిరించి అడుగుతారు. కాని చదవడం, ఆడడం, నవ్వడం, క్రూరంగా వుండడం, మంచిగా వుండడం, ఏటిని మబ్బులను చూడడం — ఇదంతా జీవితంలో ఒక భాగం. మీకు చూచి చదవడం రాకపోతే, నడవడం చేతకాకపోతే, ఆకు ఎంత అందంగా వుందో మెచ్చుకోలేకపోతే, మీరు జీవిస్తున్నట్టు కాదు. జీవితాన్నంతను మీరు అవగాహన చేసికోవాలి; అందులోని ఒక చిన్న భాగాన్ని మాత్రమే కాదు. అందు కోసం మీరు చదవాలి, అందుకోసం మీరు ఆకాశంవైపు చూడాలి, అందుకోసం మీరు పాటపాడాలి, నృత్యంచెయ్యాలి, పద్యాలు వ్రాయాలి, కష్టపడాలి, అర్థంచేసికోవాలి. ఎందుకంటే అదంతా జీవితమే.

7. ప్రశ్న:- సిగ్గంటే యేమిటి?

కృష్ణమూర్తి:- క్రొత్త మనిషిని ఎవరినైనా కలిసికొన్నప్పుడు మీరు సిగ్గుపడరా? నన్నొ ప్రశ్నను అడిగేటప్పుడు మీరు సిగ్గు పడలేదా? నా మాదిరి యీ వేదికమీద గూర్చుండి మాట్లాడాలంటే సిగ్గుపడరా? అనుకోకుండా ఒక మంచి అందమైన చెట్టునుగాని, మృదువైన పూవునుగాని, తన గూటిమీద కూర్చున్న పక్షిని గాని చూడడం తటస్థిస్తే సిగ్గుతో క్రేగంట చూడరా? సంభ్రమముతో అట్లే నిలబడిపోరా? అందువలన సిగ్గుపడడం మంచిదే. కాని మనలో చాలమందికి సిగ్గుపడడమంటే తన్ను జూచి యెవరేమనుకొంటారో యని సంకోచించడం. ఎవరినైనా ఒక పెద్ద మనిషిని — నిజంగా అటువంటి మనిషేగనక వుంటే — మనం కలిసినప్పుడు మనలను మనం చూచుకొని సిగ్గు పడతాం. మనలో మనం అనుకొంటాం గదా — "ఆ మనిషి యెంత గొప్పవాడు? ఎంత పేరు ప్రఖ్యాతులు గలవాడు? ఆయన ముందు నేనెంతపాటి? నేనొక నలుసును" అట్లా అనుకొని సిగ్గు పడతాం. అంటే మనస్థితి మనకు గుర్తుకు రావడమన్నమాట. ఇటువంటి సిగ్గుగాకుండా, మరియొక విధమైన సిగ్గున్నది. అందులో మనస్సు చాల సున్నితమై, ప్రేమార్ద్రమవుతుంది. అది మనస్థితిని మనము చూచుకొని జంకడముకాదు, మనలను జూచుకొని మనం సిగ్గుపడడం కాదు.

29 డిశంబరు, 1954

4

వినడం

నేను చెప్పే మాటలు మీరు ఎందుకు వింటున్నారు? అసలు ఒకరు చెప్పే మాటలను మరియొకరు ఎందుకు వింటారో మీరు ఎప్పు డైనా ఆలోచించారా? ఎవరు చెప్పేదైనా వినడమంటే అర్థమేమిటి? నేను మాట్లాడుతూ వుంటే మీరందరు నా ముందు ఇక్కడ కూర్చుండి వింటున్నారు గదా, మీ అభిప్రాయాలను బలపరచే మాటల కోసం గాని మీ అభిప్రాయాలతో నేను చెప్పేదానిని సరిపోల్చి చూచుకోడం కోసంగాని వింటున్నారా లేక తెలిసికొందామనే కోరికతో వింటున్నారా? ఈ రెండింటికీ గల తేడాను గమనించండి. మీ యాలోచనలను దృఢ పరచుకోవడం కోసం వినడానికిన్ని, కేవలం తెలిసికొందామనే కోరికతో వినడానికిన్ని చాల వ్యత్యాసమున్నది. మీ యాలోచనలను దృఢపరచుకో వడం కోసంగాని మీ యాలోచనలకు ప్రోత్సాహం లభిస్తుందనే వుద్దేశం తోగాని మీరిక్కడ వున్నట్లయితే అప్పుడు నా మాటలను మీరు వినడం నిరర్థకం. అట్లుగాక తెలిసికొందామనే వుద్దేశంతో వింటూవున్నట్లయితే అప్పుడు మీ మనస్సు విముక్తము; దేనికిన్ని కట్టుబడినది కాదు. అట్టి మనస్సు దర్భమొనవలె తీక్ష్ణమైనది; అది సునిశితము, సజీవము, విచారణ శీలము మరియు జిజ్ఞాసాయుతము . అట్టి మనస్సే సత్యమును గ్రహించేశక్తి గలిగి వుంటుంది. అందువలన మీరెందుకు వింటున్నారో ఏమిటి వింటున్నారో తెలిసికోవడం చాల ముఖ్యంకాదా?

మీరెప్పుడైనా చాల నిశ్శబ్దంగా కూర్చున్నారా? మీ మనస్సును దేనిమీదనైనా స్థిరంగా నిలపడంగాని, ఏకాగ్రతకోసం ప్రయత్నం చేయ డంగాని లేకుండా, యథార్థంగా ప్రశాంతమై నిశ్చలమైన మనస్సుతో ఎప్పుడైనా కూర్చున్నారా? అటువంటప్పుడు మాత్రమే మీరు ప్రతిది చక్కగా వినగలరు. ఏమంటారు? చాల దూరమునుండి వినబడేది

ధ్వనులే గాకుండా దగ్గరలోనున్న ధ్వనులను, ఇంకా దగ్గరగా మీ ప్రక్కనే వున్న ధ్వనులను గూడ వినగలరు. అంటే మీరు ప్రతి దిన్నీ వినగలరన్నమాట. అప్పుడు మీ మనస్సు విశాలమవుతుంది, ఏదో యొక యిఱుకైన మార్గమునకు పరిమితమై యుండదు. మీరీ విధంగా, అనాయాసంగా, ఎట్టి ప్రయత్నము లేకుండా, వినగలిగితే అప్పుడు మీలో పల అసాధారణమైన పరివర్తనము సంభవించడం కనుగొనగలరు. ఆ పరివర్తనము మీ సంకల్పము లేకుండా, మీరు కోరుకోకుండానే, జరుగుతుంది. ఆ పరివర్తనములో గొప్ప అందమున్నది, ఆనందమున్నది, లోతైన అంతర్దృష్టి వున్నది.

ఒకసారి ప్రయత్నించి చూడండి; ఇప్పుడే ప్రయత్నించండి. నా మాటలు వినేటప్పుడు, నా మాటలనే కాకుండా మీ చుట్టూరా వున్న ధ్వనుల నన్నిటిని వినండి. గుడి గంటలు, ఆవుల మెడగంటలు — అన్నిటిని వినండి. దూరంగా పోతున్న రైలుబండిని, రోడ్డుమీద పోతున్న యెద్దుల బండిని వినండి. ఇంకా దగ్గరి దగ్గరివి వింటూ వచ్చి నా మాటలున్ను వినండి. అప్పుడు వినడంలో లోతువుందని గమనిస్తారు. ఇట్లా వినాలంటే మీ మనస్సు చాల ప్రశాంతంగా నిశ్శబ్దంగా వుండాలి. నిజంగా మీరా విధంగా వినడం మొదలుపెట్టితే, మీ మనస్సు సహజంగానే నిలకడ పొంది ప్రశాంతమవుతుంది, కాదా? అప్పుడు మీ ప్రక్కన ఏమి జరుగుతున్నా దానికి మీ మనస్సు విక్షిప్తము కాదు, చలించదు. ప్రతిదిన్నీ మీరు చాల లోతుగా వింటూ వుండడంచేత మీ మనస్సు సహజంగా శాంతిస్తుంది. ఈ విధంగా మీరు అనాయాసంగా, ఆనందంతో — పరమానందంతో వినగల్గితే, అప్పుడు మీ హృదయంలో, మీ మనస్సులో అద్భుతమైన పరివర్తనము వస్తున్నట్లు గమనింపగలరు. ఇట్టి పరివర్తనము మీరెన్నడును ఊహించనిది. ఇది యే విధంగాను ఉత్పాదితము కాదు, ప్రయత్న సాధ్యము కాదు.

ఆలోచన చాల విచిత్రమైనది, కాదా? ఆలోచన అంటే యేమిటి మీకు తెలుసునా? ఆలోచన లేదా ఆలోచించడమనేది చాలమంది విషయంలో కేవలమొక మనోవ్యాపారం. వారు తమ ఆలోచనలతో సత

మతమవుతూ వుంటారు. కాని మీరు ప్రతిదానిని నిజంగా వినగల్గితే — నదిలోని నీరు ఒడ్డుకు తపతప కొట్టుకోడవం, పక్షులు పాటలు పాడడం, బిడ్డ యేడవడం, మిమ్ము మీ అమ్మ తిట్టడం, మీ స్నేహితుడు మిమ్ము ఏడిపించడం, మీ భార్యగాని, భర్తగాని మిమ్ము దెప్పిపొడుస్తూ సాధించడం — ఇవన్నీ నిజంగా వినగలిగితే అప్పుడు మీరు, మిమ్ము చీల్చివేస్తూ పీడిస్తూ వున్న ఆ మాటలను దాటి, యింకా ముందుకు పోవడం గమనిస్తారు.

ఇట్లా పైపై నోటి మాటలను దాటి యింకా ముందుకు పోవడం చాల అవసరం. ఇంతకు, మనందరకి కావలసిందేమిటి? మనం పిల్లల మైనా, పెద్దలమైనా, మన కనుభవమున్నా లేకపోయినా మనందరము సుఖంగా వుండాలని కోరుకోమా? విద్యార్థులంగా వున్నప్పుడు మన ఆట లపాటలతో, వ్రాయడం చదవడంతో, ఇంకా రకరకాలైన చిన్నచిన్న విష యాలతో సుఖంగా వుండాలని కోరుకొంటాము. మనం పెద్ద వాండ్లమైన తరువాత ఆస్తిపాస్తులు సంపాదించుకోవడంలో, డబ్బు కూడబెట్టుకోవ డంలో, మంచి యిల్లు కట్టించుకోవడంలో, మనయెడ సానుభూతి గల భార్యనుగాని భర్తనుగాని కలిగివుండడంలో, మంచి వుద్యోగం చేయడంలో సుఖాన్ని అన్వేషిస్తాము. ఇవన్నీ మనకు తృప్తినీయకపోతే మనం వేరే విషయంవైపు దృష్టి మరలిస్తాం. అప్పుడంటాము గదా, "వీటన్నిటితో సంబంధం వదలుకొని, వైరాగ్యం సాధిస్తేగాని సుఖంగా వుండము" అని. అందుచేత వైరాగ్యాన్ని అభ్యాసం చేయడం ప్రారంభిస్తాము. మనం కుటుంబాన్ని వదలివేస్తాం; ఆస్తిని వదలుకొంటాం; సంసార బాధ్యత లను వదులుకొని అడవులకు పారిపోతాం లేదా సన్యసిస్తాం. అట్లాగాకపోతే యేదైనా మత సంప్రదాయంలో జేరిపోతాం. మనలాంటి మరికొందరితో కలిసి ఒక నాయకుణ్నో, ఒక గురువునో, ఒక మహాత్మున్నో లేదా ఒక ఆదర్శాన్నో నమ్ముకొని అనుసరిస్తాం. ఇదంతా వాస్తవానికి ఆత్మవం చన, భ్రాంతి, మూఢ విశ్వాసము. కాని యిందులోనే సుఖమున్నదని భావిస్తాం.

నేను దేని గురించి మాట్లాడుతున్నానో అర్థమౌతున్నదా? తల

దువ్వుకోవడం, శుభ్రమైన బట్టలు వేసికోవడం, నీటుగా కనబడాలని ప్రయత్నించడం — ఇదంతా సుఖాభిలాషలో ఒక భాగమే కదా. మీరు పరీక్షలు పాసై మీ పేరు తరువాత వర్ణమాలలోని కొన్ని పొడి అక్షరాలు తగిలించుకొంటే, ఏదైనా వుద్యోగాన్ని సాధించుకొంటే, ఇల్లు ఆస్తి సంపాదించుకొంటే, పెండ్లి చేసికొని పిల్లలను కంటే, మనకంటికి కనబడనటువంటి దివ్యర్షులనుండి సందేశాలు తీసికొని వచ్చినామని చెప్పుకొనే పెద్దలను వారి నాయకత్వములోని మత సంప్రదాయాలను అనుసరించడం ప్రారంభిస్తే — వీటన్నిటి వెనుక సుఖం పొందడం కోసం మనం పడేపాట్లు, తాపత్రయం, అసాధారణమైన ప్రేరణ అంతర్లీనమై కనిపిస్తాయి.

కాని, చూశారా, సుఖం అంత సులువుగా రాదు. ఎందుకంటే, సుఖమనేది వీటిలో దేనిలోను లేదు. వీటివలన తాత్కాలికంగా ఇంద్రియ సుఖాన్ని కొంత తృప్తిని మీరు పొందవచ్చు; కాని తుదకదంతా కేవలం ఆయాసపాటుగా పరిణమిస్తుంది. ఎందువల్లనంటే మనకు తెలిసిన విషయాలలో వేటిలోను శాశ్వత సుఖమంటూ లేదు. ముద్దుతోబాటు కన్నీరు, నవ్వుతోబాటు ఏడుపు, మఱియు నిరాశతో కూడిన ఏకాకితనమున్ను అవినాభావములు. ప్రపంచంలో ప్రతిదిన్నీ విశీర్ణమై క్షయించేదే. కాబట్టి చిన్నతనంలోనే మీరు సుఖమనే యీ వింత పదార్థమేమిటో విచారించి తెలిసికోవాలి. మీరు చదివే చదువులో అదియొక ముఖ్యభాగము.

సుఖమనేది మీరు దానికోసం తంటాలుపడుతూ వున్నంతకాలము రాదు. అదే అందులోని గొప్ప రహస్యం. అయితే అది చెప్పడం మాత్రం తేలిక. నేనిదంతా క్లుప్తంగా మామూలు మాటలలో చెప్పగలను. కాని కేవలం నేను చెప్పేది వినడంచేత గాని, విన్నదాన్ని మీరు మళ్ళీ మళ్ళీ వల్లించడం చేతగాని మీకు సుఖంరాదు. సుఖమనేది చాల వింత వస్తువు. మీరు దానికోసం ప్రయత్నిస్తూ వున్నంతకాలం అది మీకు లభించదు. సుఖంగా వుండాలనే ప్రయత్నమే మానివేసినప్పుడు, అనుకోకుండా, అతి నిగూఢంగా సుఖం మీకు లభిస్తుంది. దాని జన్మస్థానము పవిత్రత, ప్రాణికిగల సహజ రమణీయత. దాని లబ్ధికి ఎంతో అవగాహన

అవసరము — ఏదో సంఘంలోనో సమాజంలోనో చేరడంగాని, లేదా ఒక విశిష్టవ్యక్తిగా మారప్రయత్నించడంగాని అవసరము కాదు. సత్యమనేది ప్రయత్నించి సాధింపదగిన వస్తువుకాదు. మీ మనో హృదయములలో నుండి సాధించడమనే భావనయే లేకుండ తుడిచి వేయబడినపుడు, మీరొక విశిష్ట వ్యక్తిగా మారుటకై చేయు ప్రయత్నము పూర్తిగా మాని వేసినపుడు, సత్యము సాక్షాత్కరిస్తుంది. మనస్సు మిక్కిలి ప్రశాంతముగా నుండి, చుట్టూ జరుగుతున్న ప్రతిదానిని, కాలస్మృతి లేకుండా, వింటూ వున్నప్పుడు 'సత్యము' అభివ్యక్తమవుతుంది. నేను చెప్పే యీ మాటలను మీరు వినవచ్చు. కాని సుఖప్రాప్తి కావాలంటే మాత్రం మీ మనస్సును సర్వభయ విముక్తమెట్లు చేయనగునో మీరెరిగి యుండవలెను.

మీరెవరికైనా దేనికైనా భయపడుతూ వున్నంతకాలము మీకు సుఖమంటూ వుండదు. మీ తల్లిదండ్రులకు గాని ఉపాధ్యాయులకుగాని, పరీక్షలు పాసు కాలేమేమో యనిగాని, సరిగా అభివృద్ధి చెందడం లేదనిగాని, మహాత్ములగు దివ్య గురువుల సమీపమునకు పోలేకపోతిమనిగాని సత్యమును సాక్షాత్కారము చేసికొనలేక పోతిమనిగాని, మీరు చేసే పని బాగున్నదని యెవరున్ను మీ వీపు తట్టి మెచ్చుకొనలేదనిగాని మీరు బాధపడుతూ వున్నంతకాలము మీకు సుఖముండదు. కాని మీరు నిజంగా దేనికినీ భయపడనిచో, అప్పుడు — ప్రొద్దుటి పూట మీరు నిద్రనుండి మేల్కొనగానే లేదా ఒంటరిగా నడుస్తున్నప్పుడో లేదా మరొకప్పుడో హఠాత్తుగా ఒక వింత అనుభవం కలుగుతుంది. మీ పిలుపుగాని, ప్రార్థనగాని, ఎదురు చూడడంగాని ఇట్టివేమీ అక్కరలేకుండా, ప్రేమ, సత్యము, పరమ సుఖము, ఆనందము ఇట్లనేక నామములతో పిలువబడునదేదో అది తటాలున, హఠాత్తుగా, అభివ్యక్త మవుతుంది.

అందువలన చిన్నప్పుడే సరియైన మార్గమున మీరు చదువుకోవడం — మిమ్ము చదివించడం - చాల అవసరం. ఇప్పుడు మనం చదువు అని దేన్ని పిలుస్తున్నామో అది నిజంగా చదువుకాదు. ఎందుకంటె ఈ విషయాలన్నిటి గురించి యెవ్వరున్ను మీతో మాట్లాడరు. పరీక్షలు పాసవడం కోసం ఉపాధ్యాయులు మిమ్ము తయారుచేస్తారు కాని

జీవించడమంటే యేమిటి అనే అతి ముఖ్యవిషయం గురించి యేమిన్నీ చెప్పరు. అసలు వారికే చాలమందికి తెలియదు జీవించడమెలాగో! మనలో చాలమందిమి ఎల్లాగో బ్రతికి ప్రాణంతో వుంటాము; ఏదో విధంగా శ్రమపడి జీవిత శకటాన్ని లాగుతూవుంటాము. అందు వలన మనకు జీవితమంటేనే భయం. నిజానికి జీవించాలంటే ఎంతో ప్రేమ, ఎంతో ప్రశాంతమైన మనస్సు, దానితోబాటు మౌనంగా వుండ డంలో అభిరుచి, ఎంతో అనుభవంతో గూడిన నిరాడంబరత కావాలి. స్పష్టంగాను సరళంగాను ఆలోచింప గలిగినదై దురాగ్రహము చేతగాని, అంధ విశ్వాసము చేతగాని, ఆశచేతగాని, భయం చేతగాని మలినము కాని మనస్సు కావాలి. ఇదీ జీవితమంటే. ఇట్టి జీవితం కోసం మిమ్ము చదివించనిచో ఆ చదువు నిరర్థకము. మీరు చాలా నీటుగా వుండడం నేర్చుకోవచ్చు, ఎక్కడ ఎట్లా నడచుకోవాలో, ఆ మర్యాదలన్నీ తెలిసి యుండవచ్చు — శిష్టాచారాలను పాటించవచ్చు, అన్ని పరీక్షలలో పాసుకావచ్చు, కాని సంఘ వ్యవస్థ యంతా శిథిలమై కూలబడిపోతూ వున్న యీ సమయంలో ఈ పైపై విషయాలకు ప్రాధాన్యమివ్వడం ఎల్లాగున్నదంటే, ఇల్లు తగలబడిపోతూ వున్న సమయంలో చేతివ్రేళ్ళ గోళ్ళకు మెరుగుబెట్టుకొంటూ వున్నట్లున్నది.

ఈ విషయాల గురించి మీతో యెవ్వరున్ను మాట్లాడరు, మీతో బాటు ఎవ్వరున్ను వీటి గురించి లోతుగా చర్చించరు. ఏవో పాఠ్య విషయాలను — గణితము, దేశచరిత్ర, భూగోళ శాస్త్రము ఇట్లాంటి వాటిని — ప్రతిదినం వదలక చదువుతూ వున్నట్లే, యీ లోతైన విషయాల గురించి చర్చించడానికి గూడ తగినంత సమయాన్ని మీరు వెచ్చించాలి. అప్పుడే మీ జీవితం సుందరము సుసంపన్నము అవుతుంది.

1. ప్రశ్న :- దేవున్ని పూజించడం నిజమైన మతము కాదా?

కృష్ణమూర్తి :- మొట్టమొదట మతం కానిదేదో చూద్దాం. అదికదా సరియైన పద్ధతి? మతం కానిదేదో ముందు తెలిసికొంటే అప్పుడు బహుశా

మనకొక క్రొత్త విషయం తెలుస్తుంది. అది దుమ్ముగొట్టుకొన్న కిటికీని శుభ్రం చేయడం లాంటిది; అప్పుడే దానిగుండా స్పష్టంగా చూడగలం. అందువలన మనం ముందు మతం కానిదేదో అర్థం చేసికొని దానిని మన మనస్సులలోనుండి తుడిచి పారవేద్దాం. "దాని గురించి తరువాత ఆలోచిద్దాంలే" యని, ఉపయోగంలేని మాటలతో కాలక్షేపం చేయవద్దు. బహుశా మీరు దాని గురించి ఆలోచింపవచ్చునేమో గాని చాలమంది పెద్దలు మాత్రం ఇప్పటికే ఊబిలో చిక్కుకొని బయట పడలేకున్నారు. వారు మతంకానిదేదో దానిలో బాగా స్థిరపడిపోయినారు. దానిలో నుండి వారు బయటికి రావడాని కిష్టపడరు.

ఇంతకు, మతం కాని దేది? మీరు ఎప్పుడైనా దాని గురించి ఆలోచించారా? మతమంటే యేమిటో ఎవరెవరో మీకెన్నో పర్యాయాలు, ఎన్నో విధాలుగా నూరిపోసి వుంటారు — దేవునిమీద నమ్మకముంచడం ఇంకా ఎన్నో చాలా విషయాలు. కాని యెవ్వరున్ను మతంకానిదేదో కనుక్కోమని మిమ్మలిని అడుగలేదు. అది యిప్పుడు మనం చేయబోతున్నాం.

నేనేకాదు, ఎవరైనా ఏదైనా చెప్తూ వుంటే ఆ చెప్పిందెల్ల సత్యమని గ్రుడ్డిగా నమ్మవద్దు. ఆ చెప్పిన దానిలో సత్యమెంతవరకో వివేచించడం కోసం ముందు జాగ్రత్తగా వినండి. మతంకానిదేదో ఒకసారి మీరు స్వయంగా తెలిసికోగల్గితే, యిక మీ జీవితంలో మళ్ళీ పూజారులుగాని, పురోహితులుగాని, ధార్మిక గ్రంథాలు గాని ఎవరుగాని మిమ్ము వంచించలేరు. ఎట్టి భయమున్ను మీలో భ్రాంతిని బుట్టించి గ్రుడ్డిగా అనుసరించేటట్లు చేయుదు. మతం కానిదేదో తెలిసికోవడం కోసం మొదట మనం ప్రతిదినం చేసే పనులతో ఆరంభించి, క్రమంగా పైకి పోదాం. దూరం పోవలసినవాడు దగ్గరలో ఆరంభించాలి కదా. అందులోను మొట్టమొదట వేసే అడుగు చాల ముఖ్యమైన అడుగు. ఇంతకు మతంకానిదేది? జాతకర్మ, వివాహము మున్నగు నిత్యనైమిత్తిక కర్మకలాపము మతమా? మాటిమాటికి పూజలు చేయడం మతమా?

ఎట్లా ఆలోచించాలో నేర్చుకోవడమే చదువు, ఏమిటి ఆలోచిం

చాలో నేర్చుకోవడం కాదు. ఎట్లా ఆలోచించాలో మీకు తెలిస్తే నిజంగా అట్టి శక్తి మీకున్నట్లయితే అప్పుడు మీరు స్వతంత్రులు; అప్పుడు మీరు స్వమతమునందు దురభిమానమును జూపరు. అంధ విశ్వాసములు జాతకర్మాది కర్మకాండలనుండి విముక్తులవుతారు. అందువలన అప్పుడే మీరు నిజమైన మతమేదో కనుగొన గలుగుతారు.

కర్మకాండ నిజమైన మతము కాదన్నది స్పష్టము. ఎందువల్లనంటే ఆ కర్మకాండను జరపడంలో తరతరాలుగా మీ కందజేయబడిన ఏదో యొక విధానమును ఒక పద్ధతిని గ్రుడ్డిగా అనుసరిస్తూ వుంటారు, దానినే మళ్ళీ మళ్ళీ చేస్తూవుంటారు. దానిని జరపడంలో ఒక విధమైన ప్రీతిని, ఉల్లాసాన్ని మీరు పొందుతూ వుండవచ్చు. అయితే అటువంటి ప్రీతినే ఉల్లాసాన్నే పొగ పీల్చడంలోను, కల్లు సారాయి త్రాగడంలోను గూడ పొందుతూవుంటారు గదా. కాని అది నిజమైన మతమా? కర్మకాండను జరిపేటప్పుడు మీరు చేసే పనుల గురించి మీకేమీ తెలియదు. మీ తండ్రులు, తాతలు చేసినారు కాబట్టి మీరున్ను చేస్తారు. చేయకపోతే వాండ్లు తిడతారు కాబట్టి చేస్తారు. అటువంటిది నిజమైన మతమనిపించుకొంటుందా?

ఇక గుడిలో నేమున్నది? ఒక మానవుడు తన కల్పనాశక్తి నుపయోగించి ఒక రాతి విగ్రహాన్ని చెక్కుతాడు. దానిని అక్కడ గుడిలో పెడతారు. ఆ విగ్రహము దేనికో 'సంకేతము' కావచ్చును; 'ప్రతిరుపకము' కావచ్చును. అయినా అది కేవలం విగ్రహమే గాని మరేదీ కాదుగదా! సంకేతము లేదా పదము, దానిచేత సూచింపబడే వస్తువు ఒకటికాదు. తలుపు అనేమాట అసలు తలుపు కాదు గదా. పదము వేరు, దానిచేత సూచింపబడు వస్తువు, అంటే పదార్థము, వేరు. మనము పూజించడానికై గుడికి పోతాము — దేనిని పూజించడానికి? దేనికో సంకేతముగా నున్న విగ్రహాన్ని పూజించడానికి పోతాము. కాని సంకేతము అసలు వస్తువు కాదుగదా? అందుకని అక్కడికే యెందుకు పోవాలి? ఇది నిజమైన స్థితి. నేను దేనినీ ఖండించడంలేదు. యథార్థ పరిస్థితి యిది. కాబట్టి గుడికి ఎవరు పోతేనేమి? స్పృశ్యులు పోయినా,

అస్పృశ్యులు పోయినా, బ్రాహ్మణులు పోయినా అబ్రాహ్మణులు పోయినా, ఎందుకు పట్టించుకోవాలి? ఇదంతా ఎవరికి కావాలి? పెద్దవాండ్లు ఆ సంకేతాన్నే, ఆ విగ్రహాన్నే, మతమన్నారు. దానికోసం పోరాడడానికి, చంపుకోడానికి గూడ వారు వెనుదీయరు. కాని యింతకు దేవుడక్కడ లేడు. దేవుడెన్నడును ఒక విగ్రహంలో లేడు. అందువలన ఒక సంకేతాన్ని లేక ఒక విగ్రహాన్ని పూజించడమనేది నిజమైన మతము కాదు.

ఇక నమ్మకమనేది మతమా? ఇది యింకా చిక్కు సమస్య. మనం దగ్గరలో మొదలు పెట్టాం, ఇప్పుడు కొంచెం లోతుకు పోతున్నాం. నమ్మకమనేది మతమా యని ప్రశ్న. క్రైస్తవులు ఒక విధంగా నమ్ముతారు, హిందువులు మరియొక విధంగా నమ్ముతారు, మహమ్మదీయులు మరియొక విధంగాను, బౌద్ధులు ఇంకొక విధంగాను నమ్ముతారు. వాండ్లందరు గూడ ఎవరికి వారు గొప్ప ధార్మిక పరులమనే చెప్పుకొంటారు. వారికందరికీ తమతమ గుడులు, అందులో దేవుళ్ళు లేదా సంకేతములు, లేదా చిహ్నములు, నమ్మకాలున్ను ఉన్నాయి. అదంతా నిజమైన మతమేనా? దేవునిలో, రామునిలో, సీతలో, ఈశ్వరునిలో ఇంకా అటువంటి వాటిల్లో నమ్మకమున్నట్టయితే అది నిజమైన మతమా? అట్టి నమ్మకము మీ కెట్లా కలిగినది? మీ తాతలు, ముత్తాతలు నమ్మినారు కాబట్టి మీరున్ను నమ్ముతారు. లేదా శంకరుడో బుద్ధుడో ఎవరో చెప్పినారని అనుకొనే విషయాలను మీరు చదివి వాటిని నమ్ముతారు. అవన్నీ నిజమేనంటారు. భగవద్గీత చెప్పినది నమ్మడంలో ఇక ప్రశ్నేలేదు, దానిని చాలమంది యథాతథంగా, ఎట్టి శంక పెట్టుకోకుండా నమ్ముతారు. అందుచేత ఏ యితర పుస్తకాన్నైనా విమర్శిస్తూ చూచినట్లుగా మీరా పుస్తకాన్ని విమర్శనా దృష్టితో చూడలేరు. సత్యమేదో కనుక్కోడానికి మీరసలు ప్రయత్నమే చేయరు.

ఇంతవరకు మనం తెలిసికొన్న దానిని బట్టి కర్మకాండ చేయడం గాని, గుడికి పోవడంగాని, నమ్మకాలు పెట్టుకోవడంగాని నిజమైన మతముకాదని తేలినది. అసలు నమ్మకమనేది మనుష్యులను వేరు చేస్తుంది. క్రైస్తవులలో కొన్ని నమ్మకాలున్నాయి; అందువలన వా రితరులతో

విభేదిస్తున్నారు. వారిలో వారికిన్ని విభేదాలున్నాయి. హిందువులలోని విభేదాలు ఈనాటివి కావు; అనాది కాలమునుండి వస్తున్నాయి. వీటి కంతము లేదు. బ్రాహ్మణులని, అబ్రాహ్మణులని, యింకా ఇదని అదని ఎన్ని విభేదాలో! కాబట్టి నమ్మకమనేది విరోధాన్ని, విభేదాన్ని, నాశనాన్ని తెస్తుంది. అందువలన అది నిజమైన మతం కాదనే మాట స్పష్టము.

అయితే యింతకున్నూ నిజమైన మతమేది? మీరు కిటికీ అద్దాన్ని బాగా శుభ్రంచేస్తే — అంటే, కర్మకాండలు చేయడం నిజంగా మాని వేస్తే, అన్ని విధాలైన నమ్మకాలను వదిలిపెడితే, ఏ గురువునుగాని, నాయకుణ్ణిగాని అనుసరించడం మానుకొంటే అప్పుడు మీ మనస్సు కిటికీ అద్దంవలె శుభ్రంగా నిర్మలంగా వుంటుంది; దాని గుండా మీరు స్పష్టంగా చూడగలరు. ఎప్పుడైతే మనస్సు అన్ని విధాలైన సంకల్పముల నుండి, కర్మకాండలనుండి, నమ్మకములనుండి, సంకేతముల నుండి, మాటలు మంత్రములు జపములనుండి, వివిధములైన భయములనుండి విముక్తమై శుభ్రము చేయబడి నిర్మలముగా నుంటుందో అప్పుడు సాక్షాత్కరించునదే సత్యము. అది నిత్యము, అనంతము, త్రికాలా బాధితము. దానినే దేవు డని పిలువ వచ్చును. కాని దీనికి ఎంతో అంతర్దృష్టి - లోచూపు - కావాలి, అవగాహన వుండాలి, ఓరిమి వుండాలి. నిజమైన మతమంటే యేమిటో లోతుగా విచారణచేస్తూ దినదినమును వదలక ఆ విచారణను తుదివరకు కొనసాగిస్తూ వుంటే అట్టివానికే అది సాధ్యము.

అట్టివారే నిజమైన మతము నెఱుగ గల్గినవారు. తక్కిన వారు చెప్పెడివన్నీ కేవలం పుక్కిటి పురాణాలు, సారములేని పలుకులు. వారు పెట్టుకొనే ఆభరణములు, శరీరమునకు జేసికొనెడి అలంకరణలు, వారి పూజలు, పురస్కారములు, ఘంటానాదములు — ఇవన్నీ అంధ విశ్వాసములు; వాటి కెట్టి అర్థమును లేదు ప్రాధాన్యమును లేదు. మతమని పిలువబడే దానికి విరుద్ధముగా మనస్సు తిరుగబడి ప్రశ్నిస్తే, అప్పుడే దానికి సత్యము గోచరిస్తుంది.

30 డిశంబరు, 1954

5

సృజనాత్మకమైన అసంతుష్టి

మీరెప్పుడైనా బొత్తిగా కదలకుండా — చాల శాంతంగా కూర్చున్నారా? ప్రయత్నం చెయ్యండి. నిశ్చలంగా కూర్చోండి, మీ వీపును నిటారుగా నిలపండి. అంతట మీ మనస్సు ఏమి చేస్తూ వున్నదో గమనించడం మొదలుపెట్టండి. దానిని వశం చేసికొందామని అందుకోసం ప్రయత్నించకండి. ఒక ఆలోచన నుండి మరియొక ఆలోచనకు గాని, ఒక అభిరుచి నుండి మరియొక అభిరుచికిగాని మనస్సు దుముకుతూ వుంటే దానిని ఆపడానికి ప్రయత్నించకండి. మీ మనస్సు ఎట్లా దుముకుతూ వున్నదో అది మాత్రం గమనించండి. అంతకంటె మించి మరేమీ చేయవద్దు. నది గట్టున నిలబడి నదిలో నీరెట్లా ప్రవహిస్తూ వున్నదో చూస్తున్నట్లే మనస్సులోని ఆలోచనలను గమనిస్తూ వుండండి. ఆ ప్రవహించే నీటిలో చేపలు, ఆకులు, చచ్చిన జంతువులు — ఇట్లా ఏవేవో వుంటాయి. కాని ఆ నది మాత్రము ఎల్లప్పుడు సజీవమే, ఎల్లప్పుడు ప్రవహిస్తూనే వుంటుంది. మీ మనస్సు గూడ అటువంటిదే, ఎగురుతున్న సీతాకోక చిలుక మాదిరి ఒక దానిమీది నుండి మరియొక దానిమీదికి ఎగిరిపోతూ వుంటుంది. దాని కెన్నటికిని విశ్రాంతి అంటూ లేదు.

ఏదైనా పాట వినేటప్పుడు మీరెట్లా వింటారు? ఆ పాటపాడే వాడంటే మీకిష్టముండవచ్చు, అతని ముఖం అందంగా వుండవచ్చు, ఆ పాటకు అర్థం మీకు తెలిసియుండవచ్చు. కాని వీటన్నిటి వెనుక, మీరు పాట వినేటప్పుడు, స్వరములను, వాటి మధ్య గల నిశ్శబ్దతను వింటూ వుంటారు గదా. అదే విధంగా కాళ్ళు చేతులు కదిలించకుండా ప్రశాంతంగా కూర్చుండి మనస్సును గమనించడం మొదలు పెట్టండి. అది

యొక తమాషాగా వేడుకగా వుంటుంది. అట్లా దానినొక తమాషాగా, ఒక వినోదంగా మీరు ప్రయత్నిస్తే దానితో మనస్సు తేటపడడం ఆరంభ మవుతుంది. అందుకోసం మీరేమీ ప్రయత్నం చేయనక్కర లేదు. దానిని లొంగదీసికోవడం కోసం తంటాలు పడనక్కరలేదు. అటువంటప్పుడు మీ మనస్సులో ఇది మంచి పని, ఇది కాదు, ఇది చేయవచ్చును, ఇది చేయరాదని విమర్శించే ధర్మాధ్యక్షుడు, న్యాయ నిర్ణేత, విలువ నిర్ణ యించేవాడు ఉండడు. అట్లా మనస్సు దానంతటనదే శాంతించినపుడు, ఎట్టి ప్రయత్నం లేకుండా తనకుదానే నిలకడ పొందినపుడు, ఉల్లా సంగా వుండడమంటే యేమిటో అర్థమౌతుంది. ఉల్లాసమంటే యేమిటో మీకు తెలుసునా? ఉల్లాసమంటే ఆహ్లాదము, ఆనందము, నవ్వు. దేనిని జూచినా ఆనందమే, చూడకపోయినా ఆనందమే. అప్పుడే జీవించడంలో ఆనందముంటుంది. దానితోబాటు ముఖంమీద చిరునవ్వు ఉంటుంది. అప్పుడే ఎట్టి భయం లేకుండా ఇతరుల ముఖంలోకి నేరుగా చూడగలరు.

నేరుగా ఎవరి ముఖంలోకైనా మీ రెప్పుడైనా నిజంగా చూచివు న్నారా? మీ ఉపాధ్యాయుని ముఖంలోకి గాని, మీ తల్లిదండ్రుల ముఖంలోకి గాని, పెద్ద ఉద్యోగస్థుని ముఖంలోకి గాని, సేవకుని ముఖంలోకి గాని, పేద కూలివాని ముఖంలోకి గాని మీ రెన్నడైనా చూశారా? చూస్తే యేం జరిగింది? మనలో చాలమందిమి మరియొకరి ముఖంలోకి నేరుగా చూడడానికి జంకుతాము. అట్లే వాండ్లు గూడ వాండ్ల ముఖంలోకి మనం చూడడం ఇష్టపడరు. ఎందుకంటే, మన మాదిరి వాండ్లకును భయమే, సంకోచమే. ఎవరున్ను తమకు తాము బయటపడిపోవాలని కోరుకోరు. ఎవరికి వారు చాల జాగ్రత్తగా చాల మెలకువగా వుంటారు పొరలుపొరలుగా గడ్డకట్టిపోయిన తమ తమ దుఃఖాలను, బాధలను, కోరి కలను మరియు ఆశలను వెనుకకు దాచిపెట్టి, బయటికి తెలియనీయరు. మీ ముఖంలోకి నేరుగా చూచి చిరునవ్వుతో పలుకరించగల వారరుదు. ఇంతకు చిరునవ్వుతో సంతోషంగా ఉండడం చాల అవసరం. ఎవరి హృద యవీణ మూగపోయినదో అట్టివాని జీవితం నీరసం, నిరర్థకం. ఒక గుడి నుండి మరియొక గుడికి ఒక భర్తనో భార్యనో విడిచి మరియొక భర్త

లేక భార్యవద్దకు, ఒక ఉపాధ్యాయుని లేదా గురువును వదలి మరియొకని వద్దకు పోవచ్చు. కాని హృదయంలో ఆనందమే లేనిచో అట్టి జీవితము నిష్ప్రయోజనము, అర్థరహితము. అయితే యీ ఆంతరికానందమును పొందడం సులువుకాదు. ఎందుకంటె మనకున్న అసంతుష్టి పైపైననే గాని లోతుగా లేదు.

మరి అసంతుష్టిగా వుండడమంటే అర్థమేమిటో తెలుసునా? దానిని అర్థం చేసికోవడం చాల కష్టం. ఎందుకంటే మనలో చాలమందిమి మన అసంతుష్టిని ఏదో యొక దిశకు మరలించి, ఆ విధంగా అది అణగారి పోయేటట్లు చూస్తాము. అంటే ఒక సురక్షితమైన స్థానంలో, స్థిరమైన అభిరుచులతోను, పేరు ప్రతిష్ఠలతోను పదిలంగా నిలద్రొక్కుకొని, యే విధంగాను మన స్థితికి భంగం కలుగకుండా చూచుకోడంలోనే మన శ్రద్ధ అంతా. ఇట్లా మన యిండ్లలోనే గాకుండ, మన స్కూళ్ళలోగూడ జరుగుతుంది. ఉపాధ్యాయులు తమ పదవికి ముప్పు వాటిల్లాలని యెన్నడును కోరుకొనరు. అందువల్లనే వారు తమ పాత పద్ధతులను వదలక వాటినే పాటిస్తూ వుంటారు. ఎప్పుడైతే మనిషి నిజంగా అసంతుష్టి పొంది, ప్రతిదానిని గురించి విచారణ చేయడం, ప్రశ్నించడం మొదలు పెడతాడో అప్పుడే అతనిలో కదలిక ఆరంభమౌతుంది. అతని శాంత జీవితము భగ్నమౌతుంది. అయితే నిజమైన ఆ యసంతుష్టి నుండియే వినూత్న ప్రయత్నముల కుత్సాహము కలుగుతుంది, క్రొత్తదారి త్రొక్కాలని కోరిక గలుగుతుంది. చొరవ పుడుతుంది.

మరి చొరవ అంటే యేమిటి? ఎవరిచేతను బోధింపబడకుండ, ఎట్టి ప్రేరణ లేకుండ, ఏదైనా పనిని మీయంతట మీరు పూనుకొని చేయసాగితే అప్పుడు మీలో చొరవ వున్నట్లు. అదేదో ఘనకార్యము అసాధారణ కార్యము కానక్కరలేదు. అట్టి ఘనకార్యాలు ముందుముందు చేయవచ్చును. కాని మొదట్లో మీయంతట మీరు ఒక మొక్కను నాటితే, అవ్యాజమైన అనురాగాన్ని, దయను చూపితే, ఏదైనా పెద్ద భారం మోస్తున్న మనిషిని జూచి సానుభూతితో చిరునవ్వు నవ్వితే,

దారికడ్డంగా నున్న రాతిని తొలగిస్తే, దారిన బోతున్న పశువు వీపుపై ప్రేమతో తట్టితే మీలో చొరవ ఏ కొంచెమో వున్నట్లే. బ్రహ్మాండమగు చొరవ కిది నాంది. అట్టి చొరవ మీలో వున్నప్పుడే అసాధారణమైన సృజనాత్మకత అంటే యేమిటో మీరు తెలిసికొన గలుగుతారు. సారాంశ మేమనగా లోతుగా అత్యధికమైన అసంతుష్టి లేనిచో నూతనారంభములం దుత్సాహముగాని అభిలాషగాని కలుగదు. దానిలోనుండే యీ సృజనాత్మ కత — ఉపజ్ఞ — పుట్టుకొనివస్తుంది.

కాబట్టి అసంతుష్టికి భయపడకండి. దానికి తగిన దోహదమివ్వండి. అప్పుడే అగ్నికణము పెరిగి పెద్దదై జ్వాల అవుతుంది. మీరు చేసే ఉద్యోగము, మీ కుటుంబము, ధనమును, పదవిని, అధికారమును సంపా దించడం కోసం పారంపర్యంగా చేస్తూ వచ్చిన ప్రయత్నములు — వీటన్నింటి యెడల మీకసంతుష్టి పెరుగుతుంది. అంతట మీరు నిజంగా ఆలోచించడం మొదలుపెడతారు, క్రొత్త విషయాలను కని పెట్టడం మొదలుపెడతారు. కాని మీరు పెద్దవారయ్యే కొలది యీ అసంతుష్టిని యిట్లే కొనసాగించడం చాల కష్టమైపోతుంది. దాని తీవ్రత తగ్గిపోసాగుతుంది. మీరు మీ పిల్లల బాగోగులు చూచుకోవలసి వుంటుంది. ఉద్యోగములోని బాధ్యతలు ఎక్కువౌతాయి. మీ యిరుగుపొ రుగువారి అభిప్రాయాలకు మీరున్న సంఘము యొక్క అభిప్రాయాలకు మీరు లొంగిపోవడం మొదలు పెడతారు. క్రమక్రమంగా యీ మండు చున్న అసంతుష్టి జ్వాల చల్లారడం మొదలు పెడుతుంది. ఎప్పుడైనా యీ అసంతుష్టి జ్వాల మరల తలయెత్తితే రేడియో పెట్టుకొంటారు, గురువు దగ్గరికి పోతారు, పూజలు చేస్తారు, ఏదేని క్లబ్బులో జేరతారు, త్రాగుడు అలవాటు చేసికొంటారు లేదా ఆడవాండ్ల వెంటబడతారు — ఏమైనా చేస్తారు ఆ జ్వాలను చల్లార్చడానికై. కాని, చూశారా, ఆ జ్వాలయే లేకపోతే నూతనారంభములందు మీ కభిరుచియే కలుగదు, ఉత్సాహమే ఉండదు, చొరవ వుండదు. మరి ఆ చొరవయే స్వయం కల్పనా శక్తికి, సృజనాత్మకతకు మూలము.

సత్యమేదో తెలిసికోవాలంటే స్థిరంగా నాటుకొనిపోయిన యీ సంఘ వ్యవస్థకు విరుద్ధంగా మీరు తిరుగబడవలసి వుంటుంది. కాని మీ తల్లిదండ్రులయొద్ద డబ్బెంత ఎక్కువగా వుంటుందో మీ ఉపాధ్యాయులు తమ యుద్యోగాలలో ఎంతగా స్థిరపడిపోయి సురక్షితంగా వుంటారో అంత తక్కువగా వారు మిమ్ము తిరుగబడడానికి ప్రోత్సహిస్తారు.

స్వయం కల్పనా శక్తి లేదా సృజనాత్మకత (creativity) అంటే కేవలం బొమ్మలకు రంగువేయడంగాని పద్యాలు వ్రాయడంగాని కాదు. అవి మంచి పనులే, కాని అవికాదు ముఖ్యము. మరి, ముఖ్యమైన దేమిటంటే సంపూర్ణమైన అసంతుష్టి. దానివల్లనే నూతనారంభములం దభినివేశము (initiative) కలుగుతుంది. చొరవ పుడుతుంది. అదియే రానురాను సృజనాత్మక శక్తిగా పరిణమిస్తుంది. అది మాత్రమే సత్యమును లేదా దైవమును కనుగొనడానికి గల ఏకైక మార్గము. ఏలయన సృజనాత్మకతయే దైవము.

అందువలన ఇట్టి సంపూర్ణమైన అసంతుష్టి చాలా అవసరము. అయితే దీనితోబాటు ఆనందముండవలె. ఏమి, అర్థమవుతున్నదా? పూర్తి అసంతుష్టి వుండవలసినదే గాని దాని గురించి మొరబెట్టు కొంటూ, బాధపడుతూ వుండరాదు. ఆనందంగా, ఉల్లాసంగా, ప్రేమగా వుండాలి. అసంతుష్టి గలవారు చాలమంది మన ప్రాణాలు తోడేస్తారు, ...లను విసిగిస్తారు. అది బాగాలేదని, ఇది బాగాలేదని, యింతకంటె ...చి స్థితిలో తాముండవలసిన వారమని, పరిస్థితులు మారిపోవాలని అదే ...గా ఆక్రోశిస్తూ వుంటారు. అదెందువల్లనంటే, వారికున్న అసంతుష్టి పైపైన వుండేది మాత్రమే, లోతుగా వుండేదికాదు. ఇక అసంతుష్టి బొత్తిగా లేనివారో, మృతప్రాయులే.

మీరు మీ చిన్నతనంలోనే అసంతుష్టితో తిరుగబడి, వయస్సు పెరుగుకొలది ఆ యసంతుష్టిని అణగారిపోకుండా చూచుకోగలిగితే, దానితోబాటు ఆనందమయ చైతన్యము, అత్యధిక వాత్సల్యము, ప్రేమ, ఉండినట్లయితే అప్పుడా అసంతుష్టి జ్వాల అత్యధికమైన మహత్త్వము

కలదై, అపూర్వ సృష్టికి కారణమవుతుంది; నూతనములైనవాటిని కనిపె డుతుంది. ఇందుకోసం మీకు సరియైన విద్యాబోధన జరగవలసి యున్నది. కేవలం ఏదో వుద్యోగాన్ని సంపాదించుకోడానికి, విజయ సోపానాన్ని అధిరోహించడానికి సాయపడే విద్య కాదు. ఆ విద్య మీకు మీ ఆలో చనా విధానంలో తోడ్పడాలి, మీకు ఎదగడానికి చోటివ్వాలి. అంటే విశాలమైన పడక గదినిగాని, ఎత్తైన కప్పుగల యింటినిగాని యివ్వడం కాదు; మీ మనస్సు ఎదగడానికి తగిన యెడము కల్పించాలి. నమ్మకాలు, భయాలతో మనస్సు సంకుచితము గాకుండ, విశాల మవడానికి తగిన అవకాశము కల్పించగల విద్యయే విద్య. అట్టి విద్య మనకు కావాలి.

1. ప్రశ్న:- అసంతుష్టి గనక వుంటే సరళంగా స్పష్టంగా ఆలోచింప లేము. ఈ అవరోధాన్ని మనమెట్లు అతిక్రమించగలము?

కృష్ణమూర్తి:- నేను చెప్పినదానిని మీరు సరిగా విన్నారని అనుకోను. బహుశా మీరు వేయదలచిన ప్రశ్న గురించి, అదెట్లా వేయవలెనా యనే ఆలోచనలో మునిగియుంటారు. ఇంతకు మీమీ ధోరణు లలో మీరందరున్ను చేసేది అదే. ప్రతివాడూ, ఏదో యొక ఆలోచనలో మునిగివుంటాడు. మీ మనస్సంతా మీ సమస్యలతోనే నిండివుంటుంది గనుక మీరు వినదలచుకొన్నదేదో అది నేను చెప్పకపోతే దానిని మీరిక వినిపించుకోరు, ప్రక్కకు త్రోసివేస్తారు. అట్లే నేను చెబుతూవున్న విషయాన్ని యీ పృచ్ఛకుడు సరిగా వినియుండినట్లయితే, అసంతుష్టి, ఉల్లాసము, సృజనాత్మకత — వీటి అంతర్గత నైజాన్ని తాను మనసా గ్రహించి వున్నట్లయితే అసలీ ప్రశ్ననే వేసి యుండేవాడు కాదు.

ఇంతకు, అసంతుష్టి స్పష్టమైన ఆలోచనను అడ్డగిస్తుందా? స్పష్ట మైన ఆలోచన అంటే యేమిటి? మీ యాలోచనకు ఫలితంగా మీరు దేనినైనా పొందగోరితే అప్పుడు మీ యాలోచన సరళంగా, స్పష్టంగా సాగుతుందా? రాబోయే ఫలితంమీదనే మీ మనస్సంతా లగ్నమై వుంటే సక్రమంగా, స్పష్టంగా ఆలోచింపగలరా? లేక ఒక ప్రయోజనాన్నిగాని,

ఫలితాన్ని గాని కోరనప్పుడు మాత్రమే — ఏదో లాభం కోసం ప్రయ త్నించనప్పుడు మాత్రమే — మీరు సరిగా ఆలోచింపగలరా?

మీకు దేనియందైనా దురభిమానంగాని లేదా విశేషమైన నమ్మకం గాని వుంటే — అనగా హిందువుగానో, కమ్యూనిష్టుగానో లేక క్రైస్త వుడిగానో మీరు ఆలోచిస్తూ వుంటే — మీ యాలోచన సరళంగా, సక్రమంగా సాగుతుందా? వాస్తవానికి ఒక త్రాటితో మేకుకు కట్టబడిన కోతివలె మీ మనస్సు ఏదోయొక నమ్మకానికి కట్టుబడి యుండకపోతే అప్పుడు మాత్రమే మీరు సరియైన మార్గమున ఆలోచింపగలరు. ఏదైనా ఫలితాన్ని ఆశించనప్పుడు మాత్రమే మీరు స్పష్టంగా ఆలోచింపగలరు. దేనియందైన దురభిమానము, పక్షపాతము లేనప్పుడు మాత్రమే మీరు స్పష్టంగా ఆలోచింపగలరు. ఇంతకు సారాంశమేమంటే ఏ విధమైన భద్ర తకోసమున్ను ప్రాకులాడక, భయవిముక్తమై యున్నప్పుడు మాత్రమే మీ మనస్సు స్పష్టంగా, సరళంగా ఋజు మార్గమున ఆలోచింపగలదు. ఒక విధంగా చూస్తే, అసంతుష్టి స్పష్టమైన ఆలోచనకు తప్పక అడ్డు పడుతుంది. అసంతుష్టి మూలాన మీరేదేని ఫలితం కోసం ప్రాకులా డుతూ వుంటే లేదా మీరు మీ మనస్సులో శాంతి భంగాని కిష్టపడక, ఏవిధంగానైనా ప్రశాంతంగా సుఖంగా వుండగోరడంచేత మీ అసంతుష్టిని అణచివేయగోరినట్టయితే, అప్పుడు మీ యాలోచన సక్రమంగా, స్పష్టంగా సాగదు. అట్లుగాక, మీరు మీకున్న దురభిమానాలతో, పక్షపాతాలతో, నమ్మకాలతో, భయాలతో — ప్రతిదానితోను అసంతుష్టి చెందియుండి, అదే సమయంలో ఎట్టి ఫలితం కోసమైనా ప్రాకులాడకుండావుంటే అప్పుడా యసంతుష్టి మీ యాలోచనను ఏదో యొక విశేష విషయం మీదికిగాని, ఏదో యొక విశేష దిశకుగాని పోనీయకుండా తన వెలుగులో నికి తీసికొంటుంది. దానితో మీ యాలోచనా ప్రక్రియ చాల సరళము, ఋజువు, స్పష్టమున్ను అవుతుంది.

పెద్దవాళ్ళుంగాని, చిన్నవాళ్ళుంగాని మనలో చాల మందికి అసంతుష్టి తప్పకుండా ఉంటుంది. కాని అది యెందుకుంటుంది? ఇప్పటికంటె

ఇంకా ఎక్కువ జ్ఞానము, మంచి ఉద్యోగం లేదా ఇంతకంటె మంచి కారు, మంచి జీతము, ఇంకా ఏవేవో కావాలని కోరుకుంటాము కాబట్టి అసంతుష్టి చెందుతూ ఉంటాము. మన అసంతుష్టి అంతా మనకున్నదాని కంటె ఎక్కువ కావాలనే కోరిక మీదనే ఆధారపడి ఉంటుంది. అందువలన సరళమైన ఆలోచనకు అవరోధమును కల్పించేది "ఇంతకంటె మించి కావా"లనే మన కోరికయే గాని మరొకటి కాదు. దాని గురించి నేను మాట్లాడడం లేదు. మనకేదో కావాలని గాక, మనకేమి కావాలో తెలి యక మనము అసంతుష్టి జెంది వున్నట్లయితే; మన యుద్యోగాలతో, మన ధనసంపాదనతో, అధికారం కొరకై హోదా కొరకై మనము చేసే ప్రయత్నాలతో, మన సంప్రదాయంతో, ఇప్పుడు మనకున్న దానితో మరియు ఇకముందు మనకుండబోయే దానితో ఇట్లా ఏదో యొక దానితో గాకుండా, ప్రతియొక్క దానితోను అసంతృప్తి జెంది వున్న ట్లయితే; అప్పుడు మాత్రమే మన అసంతుష్టి స్పష్టతకు దారితీస్తుందని అనుకొంటాను. ప్రతి దానిని గ్రుడ్డిగా అంగీకరించడంగాని, అనుసరించ డంగాని చేయకుండా దాని బదులు ప్రశ్నించడం, విచారణ చేయడం, లోతుకు పోయి పరిశీలించడం చేస్తూ వుంటే, అప్పుడు అంతర్దృష్టి యేర్పడి, దానినుండి సృజనాత్మక శక్తి, ఆనందమున్ను కలుగుతాయి.

2. ప్రశ్న:- ఆత్మజ్ఞాన మనగానేమి? అది మనకెట్లు లభిస్తుంది?

కృష్ణమూర్తి:- ఈ ప్రశ్న అడిగేవాని మనస్సు ఎట్లా పనిచేస్తుం టుందో తెలుసునా? అతని యెడ నిరాదరణతో నేను మాట్లాడడం లేదు. కాని "నాకది యెట్లా లభిస్తుంది? దానినెంతకు కొనవచ్చు? దానికోసమై నేనేమి చేయవలె? నేనేమి త్యాగం చేయవలె? ఎట్టి నియ మాలను పాటించవలె? ఎట్టి క్రమశిక్షణ పాటించవలె? ఎట్టి ధ్యాన పద్ధతిని అవలంబించవలె?" ఈ విధమైన ప్రశ్నలు అడిగేవాని మనస్సు భావం ఎట్టిదో చూద్దాం. "దానిని పొందడం కోసం, దీనిని చేస్తాను" అని చెప్పే మనస్సు యాంత్రికమైనది, మట్టమైనది. ధార్మిక పరుల మనుకొనేవారు ఇట్లే ఆలోచిస్తారు. కాని ఆత్మజ్ఞాన మెవరికైనా యీ

విధంగా కలుగదు. అది ప్రయత్నంచేతగాని అభ్యాసం చేతగాని కొనబడేది కాదు. మీ తోడి విద్యార్థులతోను, మీ ఉపాధ్యాయులతోను, మీ చుట్టూరా వున్న జనులందరితోను మీకు గల సంబంధములో మిమ్ము మీరు పరిశీలించి చూచుకొంటుంటే అప్పుడు మీ కాత్మజ్ఞానము లభిస్తుంది. ఆత్మజ్ఞానమంటే మీ గురించిన, మీ వ్యక్తిత్వమును గురించిన జ్ఞానము. ఎదుటివాని ప్రవర్తన, అతని చేష్టలు, అతడు ఉడుపులు ధరించిన తీరు, మాట్లాడే విధము, అతడు చేసే పొగడ్తలు లేక తెగడ్తలు, వాటికి మీ బదులు సేతలు, — వీటినన్నిటిని గమనిస్తుంటే మీ వ్యక్తిత్వమును గూర్చిన జ్ఞానము మీకు లభిస్తుంది. మీలోను, మీ చుట్టుపట్లను గల ప్రతిచిన్న విషయాన్ని మీరు పరికిస్తుంటే, అద్దంలో మీ ముఖాన్ని మీరు చూచుకొన్నట్లే మిమ్ము మీరు చూచుకొంటుంటే మీకు మీ వ్యక్తిత్వ జ్ఞానము లభిస్తుంది. అద్దంలోకి చూచుకొన్నప్పుడు మిమ్ము మీరు ఉన్నదున్నట్లు చూచుకొంటారు కదా! మీ తల యింకొక విధంగా ఉంటే బాగుంటుందని, యింకొంత జుట్టుంటే బాగుంటుందని, మీ ముఖం ఇంకొంత అందంగా వుంటే బాగుంటుందని బహుశా మీరు కోరుకోవచ్చు. కాని యథార్థ స్వరూపాన్నే అద్దం ప్రతిఫలింపజేస్తుంది కాని మీరు కోరుకొన్న రూపాన్ని కాదు గదా. అద్దాన్ని ప్రక్కకు నెట్టివేసి, "ఆహా! నేనెంత అందమైనవాణ్ణి!" అని చెప్పకోలేరు గదా.

మామూలు అద్దంలో చూచుకొన్నట్లే, మీకును ఇతరులకును గల పరస్పర సంబంధమనే అద్దంలో మిమ్ము మీరు చూచుకొంటున్నట్లయితే అప్పుడు కలిగే వ్యక్తిత్వ జ్ఞానానికి అంతములేదు. ఇది యెట్లుంటుందంటే అంతము లేని అగాధమైన సముద్రములోనికి ప్రవేశించినట్లుంటుంది. మనలో చాలమందిమి గట్టుకు చేరాలని, "నాకు నా వ్యక్తిత్వ జ్ఞానము పూర్తిగా లభించినది, నేను హాయిగా వున్నాను" అని చెప్ప గలిగితే బాగుండునని అనుకొంటాము. కాని అది అట్లా జరుగనే జరుగదు. చూచిన దానిని నిందించకుండా, మరొకరితో మిమ్ము మీరు పోల్చుకోకుండా, ఇంకొంత అందంగా వుండాలనిగాని, యింకను గొప్ప ధర్మపరుల మనిపించుకోవాలని గాని కోరుకోకుండా, మిమ్ము మీరు చూచుకో గల్గితే,

కేవలము మీ యథార్థ స్వరూపాన్ని మాత్రం చూచుకొంటూ పోతే, అనంత దూరమిట్లాగే పోతూ వుండగలరని తెలిసికొంటారు. అప్పుడా ప్రయాణానికి అంతములేదు. అదే దానిలోని వింత, దానిలోని అంగము!

3. ప్రశ్న:- ఆత్మ లేదా జీవాత్మ అంటే యేమిటి?

కృష్ణమూర్తి:- మన సంస్కృతి, మన నాగరికత ఈ ఆత్మయనే పదాన్ని కల్పించినవి. నాగరికత అంటే యేమిటి? అనేకుల యొక్క సాముదాయికమైన ఇచ్ఛ మరియు సంకల్పము. భారతీయుల నాగరికతనే చూడండి, అది చాలమంది భారతీయుల యిచ్ఛ మరియు సంకల్పముల ఫలితము కాదా? ఏ నాగరికతయైనా అంతే. సాముదాయిక లేదా సమిష్టి సంకల్పము యొక్క ఫలితమేయది. ఈ భారతీయ సంస్కృతిలో సాముదాయిక సంకల్ప మేమన్నదంటే, యీ మరణశీలము క్షయశీల మయిన భౌతిక శరీరమున కంటె గొప్పది, విశాలమైనది, క్షయము పొందనిది మరియు మరణములేని దొకటి — ఆత్మ అనబడేది — తప్పక వుండవలెనని అన్నది. ఈ విధంగా ఆత్మభావన మనుష్యులలో స్థిరపడి పోయినది. అప్పుడప్పుడు ఏ యొకరిద్దరో అసాధారణమైన యీ మృత్యురహిత స్థితిని — అంటే అమృతత్వమును — గురించి తమకు దాము కనుగొని వుండవచ్చు. అప్పుడు తక్కిన సామాన్య బుద్ధిగల వారందరు, "అవును, అది సత్యమే యైయుండవలెను; అతడు చెప్పినది నిజమే యైయుండును" అని అనుకొన్నారు. వారికందరికిన్ని అమృతత్వము కావాలి కాబట్టి, యీ 'ఆత్మ' అనే పదాన్ని గట్టిగా వదలకుండ పట్టుకొన్నారు.

ఈ భౌతిక శరీరమున కంటె మించిన దేదైనా ఉన్నదా యని మీరు గూడ తెలుసుకొన గోరుతారు. నిజమేనా? ప్రతిదినము ఆఫీసుకు పోవడం, అక్కడ మీ కంతగా ఇష్టంలేని పని యేదో చేస్తూ వుండడం, ఇతరులతో కలహించడం, ఈర్ష్యాసూయలు, బిడ్డలను కనడం, ఇరుగుపొరుగు వారితో వారిమీదను, వీరిమీదను చాడీలు చెప్పకోవడం,

ఉపయోగంలేని మాటలు ఆడుకోవడం ఇవన్నీ గాకుండా యింతకంటె వేరే యేమైనావున్నదా? అని మీరున్ను తెలిసికొన గోరుతారు. ఆత్మ అనే పదం అవినాశ్యమై, త్రికాలాబాధితమైన ఒకానొక స్థితిని సూచిస్తుంది. కాని అట్టి స్థితి వున్నదో లేదో మీ యంతట మీరు ఎన్నటికిని తెలిసికొనగోరరు. "ఏసుక్రీస్తు గాని, శంకరుడు గాని, మరెవరైనా సరే యేమి చెప్పినారో మాకు అక్కర లేదు. ప్రాచీన సంప్రదాయంగాని, ఆర్య వ్యవహారంగాని యేమి చెబుతున్నదో దానితో గూడ మాకు సంబంధములేదు. మా యంతట మేమే అట్టి త్రికాలాతీతమైన స్థితి నిజంగా ఉన్నదో లేదో తెలిసికొంటాము" అని మీరు అనరు. లోక వ్యవహారంగాని సాముదాయిక సంకల్పంగాని వ్యక్తము చేసిన దానికి విరుద్ధముగా మీరు తిరుగబడరు. పైగా మీరు దాని కంగీకరించి "నిజమే, ఆత్మ యనేది ఉన్నది" అని అంటారు. మీరు దానినొక పేరుపెట్టి పిలుస్తారు, మరి యొకరు మరియొక పేరుపెట్టి పిలుస్తారు. అప్పుడు మీ యిద్దరి మధ్య భేదాభిప్రాయము లేర్పడి, మీ మీ విభిన్న విశ్వాసాల కారణంగా, విరోధులౌతారు.

కాలచక్రమున కతీతంగా ఏదైనా స్థితి ఉన్నదో లేదో నిజంగా కనుగొన దలచినవాడు ముందుగా లోక వ్యవహార మనబడే దానినుండి విముక్తి పొందవలసి వుంటుంది. అంటే సాముదాయిక సంకల్పమునకు వశీభూతుడుగాక, స్వతంత్రుడై తనంతట తాను ఏకాకిగా నిలబడగల్గి యుండవలె. ఇది మీ చదువులో నొక ముఖ్య భాగము — అనేకుల యొక్క సంకల్పమునకుగాని లేదా ఏ యొక్కని సంకల్పమునకుగాని లొంగిపోకుండా, స్వతంత్రంగా నిలబడగలగడం నేర్చుకోవాలి. అప్పుడే యేది సత్యమో మీ యంతట మీరు తెలిసికొన గలరు.

ఎవరిమీదను ఆధారపడవద్దు. నేనుగాని మరి యొకరుగాని త్రికాలాతీతమైన స్థితి యొకటి ఉన్నదని చెప్పవచ్చు. దానివలన మీకేమి ప్రయోజనము? మీకు ఆకలిగా వుంటే తిండి తింటారు, అంతేగాని వట్టి మాటలతో మీ కడుపు నిండుతుందా? ఇంతకును ప్రధాన మేమంటే మీ

యంతట మీరు తెలిసికోవడం. మీ చుట్టూ వున్నదెల్ల క్షయించిపోతూ వుండడం, నాశనమవడం మీరే చూస్తున్నారు గదా. నాగరికత అని పిలువబడేది క్షయించి పోకుండా సమాజం యొక్క సంకల్పము నిలబెట్టలేకపోతూ వున్నది. ఆ నాగరికత ముక్కలు ముక్కలైపోతూ వున్నది. అడుగడుగునా జీవితము మిమ్ము సవాలు చేస్తూవున్నది. దానిని మీ అలవాటు ప్రకారం ఎదుర్కొనేటట్లయితే అంటే, దానికి మీరు తలవొగ్గుతూ వుంటే, అది సమంజసమైన పనికాదు. అందులో "ఇతరులు చెప్పే దానినెల్ల మేమంగీకరించము, వారిమీద మేమాధారపడము; మేము స్వయంగా విమర్శించి చూచి, లోతుగా పరిశీలించి తెలిసికొంటాము" అని మీరు చెప్పగలిగితే, అనగా మీకు ఒంటరిగా నిలబడగల ధైర్యముంటే త్రికాలాతీతమైన స్థితియున్నదా లేదా ఎక్కువ తక్కువ లనెడి భేదములులేని స్థితియున్నదా లేదా యనే విషయం కనుగొనగలరు.

31 డిశంబరు, 1954

6

జీవిత సమగ్రత

మనలో చాలమందిమి జీవితంలోని ఏదోయొక చిన్నభాగాన్ని అంటి పెట్టుకొనివుండి, దాని ద్వారానే సంపూర్ణ జీవితమర్మాన్ని తెలిసికో గలమని అనుకొంటాము. మనముండే గదిని వదిలి పెట్టకుండానే నదియొక్క పొడవు వెడల్పులను పరిశోధించగలమని దాని తీరమందలి పచ్చని బయళ్ళ సౌందర్యమును చూడగలమని అనుకొంటాము. ఒక చిన్న గదిలో వుంటూ ఏదో చిన్న పరదా గుడ్డమీద రంగులు వేసి, జీవితాన్ని చేతిలోనుండి జారిపోకుండ గట్టిగా పట్టుకొన్నామని, మృత్యు రహస్యమును తెలిసికొన్నామని తలుస్తాము. కాని మనమట్లా చేయలేము. అట్లా చేయవలెనంటే మనం బయటికి రావాలి. అయితే మనమున్న గదిని, అందులోని చిన్న కిటికీని వదిలి పెట్టి బయటికి రావడం, బయటికి వచ్చి, మంచి చెడ్డలు విమర్శించకుండా, దేనినీ ఖండించ కుండా, "ఇది నాకిష్టము, అది నాకిష్టముకాదు" అని చెప్పకుండా చూడడం చాల కష్టమైన పని. దానికి కారణం దేనిలోనైనా ఒక భాగం గురించి తెలిసికొంటే అంతా తెలిసికొన్నట్లే యని చాలమంది భావించడం. చక్రము యొక్క ఒక ఆకు ద్వారా చక్రమునంతను అర్థము చేసికోగలమని అనుకొంటారు. కాని ఒక్క ఆకుతో చక్రమవుతుందా? చక్రమంటే చాల ఆకులుండాలి, మధ్యలో కుండ ఉండాలి, చుట్టూ అంచువుండాలి. ఇవన్నీ కలిస్తేనే చక్రమవుతుంది. అందువలన చక్ర మునంతను ఆకళింపు చేసికోవాలంటే, దానినంతను ఒకేసారి పూర్తిగా చూడాలి. అదే విధంగా జీవితాన్ని నిజంగా అర్థంచేసికోవాలంటే జీవిం చుప్రక్రియ నంతను పూర్తిగా పరిశీలించి చూడాలి.

ఇదంతా మీకర్థమవుతున్నదని అనుకొంటాను. మొత్తం జీవితాన్ని

అర్థం చేసికొనడంలో మీరు చదివిన చదువు తోడ్పడాలి గాని కేవలం ఉద్యోగం సంపాదించుకోవడంలోను, పెండ్లి, పిల్లలు, జీవిత భీమా, పూజలు పునస్కారములు, మీ చిల్లరదేవుళ్ళు — వీటితో మామూలు జీవితం గడపడంలోను తోడ్పడడం కాదు. కాని ఇందుకు సరియైన విద్యా బోధన జరుగవలెనంటే ఎంతో తెలివి, లోచూపు ఉండాలి. అందువల్ల జీవించు విధానము నంతటిని అర్థం చేసికొనడం కోసం ముందుగా విద్యా బోధకునికే విద్యగరపడం చాల అవసరమవుతున్నది. అంతే కాని, పాత పద్ధతిలోనో, క్రొత్త పద్ధతిలోనో — ఏదో యొక పద్ధతిలో మీకు కేవలం పాఠాలు చెప్పడం కోసం కాదు.

జీవితమనేది ఒక నిగూఢ తత్త్వము. అది పుస్తకాలలో దొరికేది కాదు, మనుష్యులు మాట్లాడుకొనేది కాదు. దాని రహస్యమును ఎవరికి వారు తెలిసికోవలసినదే. అది చాల గంభీరమైన విషయము. కాబట్టి ముందు అల్పము, సంకీర్ణము, క్షుద్రమునైన దానిని గ్రహించిన పిదప అంతకంటే లోతుగా పోయి దాని రహస్యమును గ్రహింపవలసి వుంటుంది.

చిన్నవారుగా నున్నప్పుడే మీరు జీవితాన్ని అర్థంచేసికో నారంభించ కపోతే, తుదకు పెద్దవారయ్యేటప్పటికి మీ మనస్సు అందవికారంగా, భయంకరంగాను తయారవుతుంది. బయటికి చూడడానికి మీవద్ద చాల డబ్బుండవచ్చు, చాల ఖరీదుగల కార్లలో మీరు ప్రయాణం చేయవచ్చు, ఆడంబరంగా కనబడవచ్చు, లేనిపోని బడాయిాలకు పోవచ్చు. కాని మీలోపల చూస్తే డొల్ల, ఏమీ సారముండదు, చుఱుకుదనముండదు. అందువలన మీరున్న చిన్న గదిని వదిలిపెట్టి బయటికి రండి. ఈ విశాలాకాశాన్ని పరికించండి. అయితే మీలో ప్రేమలేకపోతే ఆపని మీరు చేయలేరు. అది శారీరిక ప్రేమాకాదు, దివ్యమైన ప్రేమాకాదు; కేవలం ప్రేమ — అంతే!! అంటే పక్షులను, వృక్షములను, పువ్వులను, ఉపాధ్యా యులను, తల్లి దండ్రులను అంతేగాదు, అంతకు మించి మానవతనే ప్రేమించడం.

ప్రేమించడమంటే యేమిటో మీయంతట మీరు కనుగొన లేకపోతే,

అది చాల విషాదకరమైన విషయం కాదా? ప్రేమ అంటే యేమిటో యిప్పుడే మీకు తెలియకపోతే పెద్దైన తరువాత అసలే తెలిసికోలేరు. అప్పుడు ప్రేమ కొనడానికి అమ్మడానికి పనికి వచ్చే ఒక వ్యాపార వస్తువుగా లేదా మీకున్న ఆస్తిలో భాగంగా మారిపోయి అందవికారంగా తయారవుతుంది. కాని యిప్పుడే గనుక మీ హృదయంలో ప్రేమ అనేది వుంటే, — మీరు నాటిన మొక్కను మీరు ప్రేమిస్తే, దారితప్పి వచ్చిన జంతువును ప్రేమతో తట్టితే — అటువంటప్పుడు పెద్దవారైన తరువాత మీరు చూచే చిన్న కిటికీని మీరున్న యిఱుకైన గదిని వదిలి పెట్టి బయటికి వచ్చి సమస్తప్రాణికోటినే ప్రేమించడం మొదలు పెడతారు.

ప్రేమ అనేది ఒక యథార్థమైన తత్త్వము. అది కంటనీరు తెప్పించే భావోద్రేకము కాదు. అది భావుకతయూ కాదు, శృంగారాదిభావమునూ కాదు. మీరు చిన్న వారుగా నున్నప్పుడే యీ ప్రేమ అంటే యేమిటో తెలిసికోవాలి. ఇది చాల ముఖ్యమైన మరియు గంభీరమైన విషయము. బహూశా మీ తల్లి దండ్రులకుగాని, ఉపాధ్యాయులకుగాని ప్రేమ అంటే యేమిటో తెలియక పోవచ్చు. అందువల్లనే యిటువంటి దారుణమైన ప్రపంచాన్ని సృష్టించారు; ఇటువంటి సమాజాన్ని — అంటే తనలో తానే గాకుండ, యితర సమాజాలతోను నిత్యమూ కలహించే సమాజాన్ని - సృష్టించారు. వాండ్ల మతములలో, వేదాంతములలో, వాదములలో ప్రేమ అనేది లేదు; అందువలన అవి యన్నీ బూటకాలు. వారొక వైపే చూస్తారు; వారు చూచే సన్నని కిటికీ గుండా కనబడే దృశ్యము చాల మనోహరంగా, విశాలంగా కనబడవచ్చు; కాని సంపూర్ణమై అతి విశాలమైన జీవితమదికాదు. ఈ ఆత్యంతికమైన ప్రేమభావము లేకుండా సంపూర్ణత్వాన్ని దర్శించలేరు. మీకది ప్రత్యక్షానుభవము కాబోదు. అట్టి ప్రేమ భావము లేనిచో మీకు నిరంతర దైన్యము తప్పదు. జీవితాంత మున మీకు మిగుల బోయేది కేవలం బూడిద, వట్టి మాటల ప్రోగు మాత్రమే.

1. ప్రశ్న:- కీర్తిప్రతిష్ఠలు పొందాలని మనమెందుకు కోరుకొంటాము?

కృష్ణమూర్తి:- కీర్తి ప్రతిష్ఠలు పొందాలని మీరెందుకు కోరుకొంటారు? నేను మీకు వివరించి చెప్పవచ్చు; కాని చివరికి అంతా విని మీరా కోరికను మానివేస్తారా? సమాజంలో మీ చుట్టూ వున్నవారందరు పేరు ప్రఖ్యాతులు కోరుకుంటూ వుంటారు, కాబట్టి మీరున్ను అట్లే కోరుకొంటారు. మీ తల్లిదండ్రులు, మీ ఉపాధ్యాయులు, గురువు, యోగి — అందరికిన్ని పేరు ప్రఖ్యాతులు కావాలి. అట్లే మీకున్ను.

దీనిని గురించి మనందరం కలిసి ఆలోచిద్దాం. ఎందువలన ప్రజలు పేరుకోసం ప్రాకులాడుతారు? మొదటి కారణం, దానివలన కొంత లాభముంటుంది. దాని వలన మన మనస్సున కెంతో తృప్తి కలుగుతుంది. కదా? ప్రపంచమంతా మిమ్మెరిగివున్నట్లయితే, 'మేము చాల ముఖ్యమైన వాండ్లము, గొప్పవాండ్లము' అని అనుకొంటారు. 'మా పేరు శాశ్వతము కాన మేము శాశ్వతము — మాకు చావు లేదు' అనే భావన కలుగుతుంది. కాని నిజానికి పేరు ప్రఖ్యాతులు కావాలని, అందరికి మీరు తెలియాలని, ప్రపంచంలో అందరూ మీ గురించి చెప్పకోవాలని మీరెందుకు కోరుకొంటున్నారో తెలుసునా? లోలోపల మీరు వట్టి అనామకులు, మీలో ఆంతరిక సంపదా లేదు, ఆత్మ సౌందర్యమూ లేదు, అసలు ఏమీ లేదు, ఖాళీ. అందువల్లనే బయటి ప్రపంచంలో పేరు కోసం ప్రాకులాడుతున్నారు. అట్లుగాక మీలో గనుక ఆత్మసౌందర్యముండి యున్నట్లయితే, బయటి ప్రపంచంలో మీకు పేరున్నా లేకపోయినా ఒకటే.

బాహ్యసంపదను, కీర్తిప్రతిష్ఠలను కల్గియుండడం కంటె ఆంతరి! సంపదను, ఆత్మసౌందర్యమును కల్గియుండడం మిక్కిలి కష్ట సాధ్యమైన పని. దీనికి శ్రద్ధాసక్తులును, అవధానతయు (attention) మరింత అవసరము. మీలో ఏమాత్రమైనా నైపుణ్యముండి, యితరులనెట్లు మీ సొంతానికి ఉపయోగించు కొనవచ్చునో తెలిసివుంటే, యితరులనెట్లు దోపిడీ చేయవచ్చునో తెలిసివుంటే మీరు ప్రసిద్ధులై పోతారు. కాని యింతసులువుగా ఆత్మసౌందర్యము లభ్యము కాదు. అది కావాలంటే మీ మనస్సు కీర్తి ప్రతిష్ఠలు మొదలగు అముఖ్యములైన వానిని అర్థము

చేసికొని వాటిని దూరంగా విడిచి పెట్టవలసి వుంటుంది. ఆత్మసౌందర్య మంటే (లేక ఆత్మసంపద అంటే) ఒంటరిగా స్వతంత్రంగా నిలబడగల గడం. కాని కీర్తి ప్రతిష్ఠలు పొందగోరినవాడు ఒంటరిగా నిలబడడానికి భయపడతాడు. ఎందుకంటే మరి అతడు ప్రజల పొగడ్తల మీదను, వారి మంచి అభిప్రాయాలమీదను ఆధారపడి వుండాలి కదా!

2. ప్రశ్న:- మీ చిన్నప్పుడు మీరు వ్రాసిన ఒక పుస్తకంలో, "ఇవి నా మాటలు కావు, ఇవి నా దివ్యగురువు యొక్క మాట" లని వ్రాసి నారు. కాని యిప్పుడు ఎవరికి వారాలోచించుకోవలసిందేనని పట్టు బట్టుతున్నారు. ఎందువలన? మీదివ్య గురువు ఎవరు?

కృష్ణమూర్తి:- ఎవరికైనా జీవితంలో ఏదైనా ఒకే అభిప్రాయానికి కట్టుబడి పోకుండా వుండడం చాల కష్టమైన పనులలో నొకటి. కట్టు బడిపోవడాన్నే స్థిరత్వమంటున్నాము. దౌర్జన్యరాహిత్యము లేదా అహింస అనే ఆదర్శాన్ని మీరు పాటించదలచు కొన్నట్లయితే ఆ యాదర్శాన్ని విడిచి పెట్టకుండా, దాని మీదనే స్థిరంగా వుండిపోవడానికి ప్రయ త్నిస్తారు. ఇంతకున్ను ఇప్పుడీ పృచ్ఛకుడడిగేదేమంటే "మాకు మేము ఆలోచించుకోవాలని మీరిప్పుడు చెబుతున్నారు. మీరు చిన్న పిల్లవాడు గానున్నప్పుడు చెప్పిన దానికి ఇది కేవలం విరుద్ధం. మీ రెందుకని అప్ప డొకమాట, ఇప్పుడొక మాట చెబుతున్నారు? మీ కెందుకు స్థిరత్వం లేదు?" అని.

స్థిరబుద్ధితో వుండడమంటే అర్థమేమిటి? ఇది చాల ముఖ్య మైన విషయం. స్థిరబుద్ధితో వుండడమంటే ఒకే విధమైన ఆలోచనా విధానాన్ని, అటునిటు తొలగి పోకుండా, అంటి పెట్టుకొని వుండడం, అంటే పరస్పర విరుద్ధములైన పనులు చేయకుండా వుండడం; ఇవ్వేళ ఒక మాట చెప్పి, రేపు తద్విరుద్ధంగా ఇంకోమాట చెప్పకుండడం. స్థిరమైన మనస్సంటే యేమిటో తెలిసికోడానికై మనమిప్పుడు ప్రయ త్నిస్తున్నాం. "నేనొక విధంగా వుండడానికి శపథం చేసికొన్నాను; ఇక

నా జీవిత పర్యంతం అట్లే వుంటాను" — ఇట్లా చెప్పే మనస్సు స్థిరమైన మనస్సు అని అంటున్నాం. కాని నిజానికట్టి మనస్సు వట్టి తెలివి తక్కువ మనస్సు, మొండి మనస్సు. ఎందుకని అంటే, అది యొక నిశ్చయానికి వచ్చి, ఆ నిశ్చయానికనుకూలంగా జీవిస్తూ వున్నది. ఇది యెట్లాగున్నదంటే, ఒక మనిషి తన చుట్టూర గోడ కట్టుకొని దానిలోపలనే వుంటూ జీవితాన్ని జారవిడుచుకొంటున్నట్లున్నది.

ఇది చాల చిక్కు సమస్య. నేను దీనిగురించి ఎంతో తేలికగా చెప్పవచ్చును. కాని నిజానికిది అంత తేలికకాదు. కేవలం ఏకరీతిగా వుండే మనస్సు యాంత్రికమై, తనజీవశక్తిని, వెలుగును, స్వేచ్ఛా గమన సౌందర్యాన్ని పోగొట్టుకొంటుంది. అది ఒకే గాడిలో నడుస్తూ వుంటుంది. అది పూర్వనిశ్చితమార్గాన్నే పట్టుకొని వదలక, దానివెంబడే పోతూ వుంటుంది. అడిగిన ప్రశ్నలోనిదియొక భాగం.

ఇక రెండవ భాగమేమంటే, "దివ్యగురువనగా నెవరు?" అని. దీనిలో గర్భితమైయున్న యితర విషయాలను మీ రెరుగరు. అయితే అవి తెలిసినా తెలియకపోయినా ఒకటే. నా చిన్నప్పుడు నేనొక పుస్తకాన్ని వ్రాసినానుట. ఒక దివ్య గురువు దానిని వ్రాయడా నికి నాకు తోడ్పడినట్లు అందులో ఉన్నదట! ఆ విషయం యీ పెద్ద మనిషి ·యెత్తి చూపుతున్నాడు. హిమాలయాలలో మారుమూల దివ్య గురువులు నివసిస్తున్నారని, వారు ప్రపంచాన్ని సరియైన మార్గాన నడుపుతూ సహాయపడుతూ వుంటారని దివ్యజ్ఞాన సమాజమువారు అటువంటి మరికొందరున్ను నమ్ముతారు. ఆ దివ్యగురువెవరో ఈ పెద్దమనిషి తెలియ గోరుతున్నాడు. జాగ్రత్తగా వినండి, బహుశా మీకు గూడ ఈ సందేహముండవచ్చు.

గురువు లేక మహాత్ముడెవరనేది చాల ముఖ్యమైన విషయమా? జీవితమనేది చాల ముఖ్యమైన విషయమా? ఆ జీవితానికి అర్థమేమిటో వివరించి చెప్పుతాననే గురువు గాని, మహాత్ముడుగాని, నాయకుడుగాని, బోధకుడుగాని ముఖ్యులు కాదు. జీవితాన్ని అర్థం చేసికోవలసింది మీరు;

బాధపడేది, దుఃఖంలో వుండేది మీరు; మృత్యువు, జన్మము, ధ్యానము, దుఃఖము - వీటి అర్థమును తెలియగోరేది మీరు. కాని దీనినెవరునూ ఇతరులు మీకు చెప్పలేరు. ఒకవేళ చెప్పినా, వారు చెప్పిన వివరణలు సరియైనవనడానికి వీలులేదు. అవన్నీ పూర్తిగా అసత్యములు, తప్పులు కావచ్చును.

అందువలన ప్రతిదానిని శంకించడంలో మేలున్నది. అప్పుడే అసలు మీకొక గురువు అవసరమా అనే విషయాన్ని స్వతహాగా తెలిసి కోడానికి అవకాశముంటుంది. ఇంతకును ప్రధానమైన విషయమేమంటే మీకు మీరే వెలుగు కావాలి, మీకు మీరే దివ్యగురువులు, మీకు మీరే శిష్యులు. గురు శిష్యులిద్దఱున్ను మీరే. స్వయంగా మీరన్ని విషయాలు గ్రహిస్తూ వున్నంతకాలం గురువు లేడు. అది మానినప్పుడు — అంటే పరిశోధించడం, కనిపెట్టడం, సంపూర్ణ జీవిత విధానాన్ని అర్థం చేసికోవడం మానినప్పుడు — గురువు వస్తాడు. కాని ఆ గురువుకు విలువలేదు. అటువంటప్పుడు మీరు మృతప్రాయులు, మీ గురువున్ను మృత ప్రాయుడే.

3. ప్రశ్న:- మనిషికి గర్వమెందుకు?

కృష్ణమూర్తి:- మీరు చాల అందంగా వ్రాస్తే, లేక ఏదైనా ఆటలో గెలిస్తే, లేక ఏదైనా పరీక్షలో పాసయితే మీకు మాత్రం గర్వంరాదా? మీరు స్వయంగా ఏదైనా పద్యం వ్రాసిగాని, రంగులతో ఏదైనా బొమ్మ వేసిగాని, మీ స్నేహితుని కెన్నడును చూపలేదా? మీ స్నేహితుడు ఆ పద్యాన్ని గాని బొమ్మనుగాని చూచి చాల బాగున్నదని మెచ్చుకొంటే మీకెంత సంతోషం? ఏదైనా ఒక పని చేసి అది చాల బాగున్నదని ఎవరైనా మెచ్చుకొంటే మీకప్పుడు ఎంతో సంతోషం కలుగుతుంది. అయితే అంతవరకది మంచిదే, అందులో తప్పేమున్నది? కాని మళ్ళీ ఇంకోసారి మీరు పద్యాన్ని వ్రాసినప్పుడో లేక రంగు బొమ్మ వేసినప్పుడో, లేక గదిని శుభ్రంగా తుడిచినప్పుడో ఏం జరుగుతుంది? ఎవరైనా మీ వద్దకు వచ్చి మీరెంత మంచి పిల్లలో అని మెచ్చుకోవాలనిపించదా?

అట్లా యెవరూ వచ్చి మిమ్మ మెచ్చుకోకపోతే, మళ్ళీ మీరా పనులు చేస్తారా? చేయరు. అంటే యేమిటన్నమాట? ఇతరులు మిమ్మ పొగడుతూ వుంటే మీకు కలిగే సంతోషం మీకు ముఖ్యమన్న మాట! ఆ సంతోషానికి మీరు లొంగిపోయినారన్నమాట. దానికి దాసులై పోయినారన్నమాట! ఇది అంతా మామూలుగా జరిగే విషయం. తరువాత జరిగే దేమిటి? మీరు పెద్దవారయ్యే కొలది మీరు చేసే ప్రతి పనిని ఇతరులు మెచ్చుకోవాలని తలుస్తారు. "నేనీ పనిని మా గురువుగారికోసం చేస్తాను. నా దేశంకోసం చేస్తాను, మానవ జాతికోసం చేస్తాను, దేవునికోసం చేస్తాను." అని యనడం మొదలు పెడతారు. కాని నిజంగా మీరు దేనికోసం చేస్తున్నారు? ఇతరుల మెప్పుకోసం చేస్తున్నారు. ఇతరులు మిమ్మ గుర్తించడంకోసం చేస్తున్నారు. అందులో నుండే గర్వం పుట్టుకొస్తుంది. కాబట్టి ఆవిధంగా మీరేమి చేసినా సరే దానికి విలువలేదు. ఇదంతా మీ కర్థమౌతున్నదాయని నా అనుమానం.

గర్వంలాంటి విషయాన్ని అర్థంచేసికోవాలంటే లోతుగా తుదివరకు ఆలోచింపగల సామర్థ్యముండాలి. అది యెట్లా ఆరంభమవుతుంది, దాని వలన కలిగే చేటు ఏమిటి, యిట్లా దానిగురించి పూర్తిగా ఆలోచించాలి. అంటే మీకావిషయంలో సంపూర్ణమైన అభిరుచి వుండాలి. అప్పుడే మీ యాలోచన తుదివరకు కొనసాగుతుంది, మధ్యలో ఆగదు. ఆటలో మీకభిరుచి వున్నట్లయితే, తుదివరకు ఆడతారు. హఠాత్తుగా మధ్యలో ఆపివేసి యింటికి పోరు. మీ మనస్సు ఈ విధంగా ఆలోచించడానికి అలవాటుపడి లేదు. జీవితంలోని ప్రతివిషయాన్ని — జీవించు ప్రక్రియ నంతను – పరిశీలించడానికి మీరు చదివే చదువు తోడ్పడాలి. అంతేగాని యేవో కొన్నిపాఠ్య విషయాలు చదవడంలో మాత్రమే కాదు.

4. ప్రశ్న:- ఏది అందమైనదో, ఏది కాదో పిల్లలమైన మాకు ముందుగానే చెప్పడంచేత ఇక జీవితమంతా 'ఇది అందమైనది, యిదికాదు' అని చెప్పుకొంటూ పోతాం. నిజంగా అందమైనదేదో, కానిదేదో ఎట్లా తెలిసికోవడం?

కృష్ణమూర్తి:- అర్ధచంద్రాకారంలో కట్టిన ఆ కట్టడము, ఆ 'ఆర్చి' చాల అందంగా వున్నదని మీరన్నారనుకోండి. మరియొకడు అట్లా లేదన్నాడనుకోండి. అప్పుడు మీరేం చేస్తారు? మీరిద్దరు పరస్పర విరుద్ధములైన మీ మీ అభిప్రాయాల మీద దెబ్బలాడుకొంటారా, లేక సౌందర్యమును గాని అసౌందర్యమును గాని, రెండింటిని సమ బుద్ధితో సూక్ష్మంగా, పరిశీలించి అవగాహన చేసికొంటారా? ఇందులో ఏది ముఖ్యము? జీవితంలో మలము, మాలిన్యము, కలుషము, కల్మషము, దారిద్ర్యము, అవమానము, అధోగతి, అశ్రుబిందువులు — ఇవన్నీ వున్నాయి. వీటితో బాటు అందము, ఆనందము, నవ్వు, సూర్యరశ్మిలో అందముగా మెరిసే పువ్వు కూడ ఉన్నాయి. అందువలన ప్రతిదానిని సూక్ష్మబుద్ధి నుపయోగించి, సమచిత్తంతో చూడడం ముఖ్యం గాని, "ఇది అందమైనది, ఇది కాదని" ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చి ఆ నిర్ణయానికి కట్టుబడివుండడం కాదు. "నేను అందాన్ని అభివృద్ధి చేస్తాను, అందం కాని దాన్ని త్రోసివేస్తాను, తొలగిం చేస్తాను" అని అంటూ వుంటే ఏమౌతుంది? కేవలం అందాన్ని అభివృద్ధి చేయడమంటే అది నీలోని కొరడుబారిన మనస్తత్త్వాన్ని తెలియ జేస్తుంది. కుడి చేతికి మాత్రమే పుష్టిని బలమును కలిగిస్తూవుంటే, అప్పుడు ఎడమచేయి ఏమౌతుంది? ఇది క్రమంగా క్షయించి పోతుంది గదా! అట్లే యిదిన్నీ. అందువలన మీరు అందమైనదానినే కాదు, అందంకానిదానిని గూడ మెలకువతో గమనిస్తూ వుండాలి. దీనిని తక్కువ చేయరాదు. గాలిలో నాట్యము చేసే ఆకులు, వంతెన క్రిందుగా ప్రవహించే నీళ్ళు, సంధ్యాకాల సౌందర్యము – వీటితో బాటు, వీధినపోవు బిచ్చగానిని కూడ మీరు చూడాలి. తలమీది బరువుతో తడబడుతూ పోయే పేదరాలికి సహాయం చేయడానికి సిద్ధపడాలి, ఆమెకు చేతినందివ్వాలి. ఇదంతా అవసరమే. ఈ విధంగా ప్రేమార్ద్రమైన మనస్సుతో ప్రతిదానిని గమనింప సాగినప్పుడే మీరేదైనా పని చేయగల్గుతారు. ఎవరికైనా సహాయపడగల్గుతారు. దేనినీ నిరాకరించరు, దేనినీ నిందించరు.

5. ప్రశ్న:- క్షమించండి. ఇంతకున్నూ మీదివ్యగురు వెవరో చెప్పనే లేదు.

కృష్ణమూర్తి:- ఇది అంతముఖ్యమా? ఆ పుస్తకాన్ని తగల బెట్టి పారవేయండి. ఎవరా దివ్య గురువు? — ఇలాంటి అత్యల్ప విషయానికి మీరంత ప్రాధాన్యమిచ్చేటట్లయితే, యీ చరాచర జగత్తునే అత్యల్ప విషయంగా చేస్తున్నారన్న మాట. దివ్యగురు వెవరో, అన్నీ తెలిసిన పండితుడెవరో, బొమ్మకు రంగు వేసిన చిత్రకారుడెవరో మనం తెలిసి కొనగోరుతాం. కాని ఆ బొమ్మను వేసిన చిత్రకారునితో సంబంధం లేకుండ, అందులో చూపబడిన విషయాన్ని స్వయంగా తెలిసికోడానికి ప్రయత్నించం. కవి యెవరో తెలిసికొని, ఆ పిదపనే యీ కవిత్వం బాగున్నదని అంటాం! ఇదంతా కేవలం డంబం, లేనిపోని బడాయీలు చెప్పకోవడం, ఇతరుల అభిప్రాయాన్ని కేవలం చిలుక పలికినట్లు పలకడం మాత్రమే అవుతుంది. అసలు వాస్తవమేదో లోలోన గ్రహించ గలశక్తిని ఇది నశింప జేస్తుంది. బొమ్మ చాల అందంగా వున్నదనే విషయం మీరు స్వయంగా చూడగల్గితే అందుకు మీరు మీ ఆనందాన్ని వెలి బుచ్చితే, ఆ బొమ్మనెవరు గీసినారో తెలిసికోవడం అంత ముఖ్యమా? అందులో చిత్రింప బడిన దేమిటో, అది యెంత వరకు సత్యమో — అది మాత్రమే మీరు తెలిసికొనగోరితే దాని మీదనే మీ శ్రద్ధ అంతా వుంటే, అప్పుడు, బొమ్మ తన ప్రాధాన్యమును గురించి స్వయంగానే మీకు తెలుపు కొంటుంది, తన అంతరార్థమును తెలియ జేసికొంటుంది.

5 జనవరి, 1955

7

పేరాశ

ప్రేమ అనేది వుండడం ఎంత అవసరమో మనం చర్చిస్తూ వచ్చినాం. దానిని ఏవిధంగాను సంపాదించలేమని డబ్బుపెట్టికొనలేమని గూడ తెలిసికొన్నాం. అయితే ఆ ప్రేమే గనక లేకపోతే, దోపిడీ విధానము మితిమీరిన కట్టుబాట్లున్ను లేని చక్కని సంఘవ్యవస్థకై మనం వేసే ప్రణాళికలన్నీ వ్యర్థములైపోతాయి. ఈ విషయాన్ని మనం మన చిన్నతనంలోనే తెలిసికోవడం చాల అవసరమని నేననుకొంటున్నాను.

ప్రపంచంలో ఏ మారుమూలలకు పోయినా ఎడతెగని సంఘర్షణతో నిండివున్న సంఘాన్నే చూస్తాము- ఒకవైపు అధికారము, ఐశ్వర్యము కలిగిన సంపన్నులున్ను మరియొకవైపు కార్మికులు, కర్షకులున్ను. ప్రతియొక్కడు మరియొకనిని చూచి అసూయతో పోటీ పడుతూ వుంటాడు. ప్రతివానికి పెద్ద పదవి కావాలి, పెద్ద జీతం కావాలి, ఎక్కువ అధికారం ఎక్కువ గౌరవం కావాలి. ఇదీ ప్రపంచస్థితి. కాబట్టే లోపలా, బయటా కూడ నిరంతర సమరము కొనసాగుతూనే వుంటుంది.

ఇటువంటి సంఘవ్యవస్థలో మనిద్దరం కలిసి సంపూర్ణ పరివర్తనాన్ని తేగోరినట్లయితే మొట్టమొదట మనం అర్థం చేసికోవలసింది యీ అధికారం కోసం ప్రాకులాడే లక్షణాన్ని. ఇది అందరికీ పుట్టుకతో వచ్చే గుణం. ఏదో రూపంలో మనలో చాలమందికి అధికారం కావాలి. ఐశ్వర్యమూ అధికారమూ వున్నట్లయితే మనం ఎక్కడికంటే అక్కడికి పోవచ్చు. లేదా అత్యుత్తమ మైన సంఘాన్ని నిర్మించడానికై కలలు గనవచ్చు. అధికారం ద్వారా 'మంచి'ని సాధింపవచ్చునని తలుస్తాం. కాని అధికార దాహమనేది-అయధికారం మనకోసమైనా సరే, మన దేశం కోసమైనా సరే, మన ఆదర్శం కోసమైనా సరే, — అది చెడ్డది, వినాశహే

తువు. ఎందువల్లనంటే దాని వలన తప్పని సరిగా విరోధమేర్పడుతుంది. ప్రత్యర్థులు బయలు దేరుతారు. దానివలన నిత్య సంఘర్షణ తప్పదు.

అందువలన లోపలను బయటను సంఘర్షణ లేనట్టి ప్రపంచాన్ని, మీకు మీ పొరుగువానితో గాని లేదా యితర జాతులు, వర్గములతో గాని సంఘర్షణ లేనట్టి ప్రపంచాన్ని, సృష్టించడం అవసరం కాదా? ఆ యవసరాన్ని గుర్తించడంలో మీరు మీ చిన్నప్పుడు చదివిన చదువు, పెద్దవారగు కొలది మీకు సహాయపడుతూవుండవలెను కాదా? మనిషి ఆశకు దాసుడు కాకపోతే, అంటే పదవీ వ్యామోహము అధికార వాంఛ రెండున్ను అతనిలో నుండి పూర్తిగా తొలగిపోతే అప్పడే సమాజములో సంఘర్షణ వుండదు.

ఆ విధంగా ఆంతరంగికంగాను, బహిరంగంగాను ఘర్షణ లేనట్టి సమాజాన్ని నిర్మించడం సాధ్యమా? మీకును నాకును మధ్యగల అన్యోన్య సంబంధమే సంఘము. మన ఆ సంబంధము మన మన కీర్తి కాంక్షలమీద ఆధారపడి వుంటే, మనిద్దరం ఒకరికంటె మించి మరియొకరము పైకి రావాలని కోరుకొంటూ వుంటే, మన మధ్య ఘర్షణ తప్పదనుట స్పష్టం కాదా? అందువలన మన మీ ఘర్షణకు మూలమైన దేదో దానిని తొలగించగలమా? మనలో మనం ఒకరితో నొకరము పోటీ పడకుండా స్పర్థ వహించకుండా వుండడం, ఒకరితో మరియొకరము పోల్చుకోకుండా వుండడం, ఈ పదవి కావాలి ఆ పదవి కావాలి అని కోరుకోకుండా వుండడం నేర్చుకోగలమా? అనగా ఒక్క ముక్కలో చెప్పాలంటే - ఆశాపరులము కాకుండా వుండగలమా? ఆశను వదలిపెట్టగలమా?

మీరు బడి వదలిపెట్టి, బయటికి పోయి బయటి ప్రపంచాన్నిచూస్తే, వార్తా పత్రికలను చదివితే, ప్రజలతో మాట్లాడితే దాదాపు అందరూ ప్రపంచంలో మార్పు తేవాలని కోరడం గుర్తిస్తారు. కాని యీ మనుషులే ఏదో ఒకదాని కోసం — తమ అభిప్రాయాలకోసమో, నమ్మకాలకోసమో, ఆస్తిపాస్తుల కోసమో, లేదా తమ జాతి కుల మత భేదాలకో

సమో, తమలో తాము నిత్యమూ పోరాడుకొంటూ వుండడం గూడ మీరు గమనిస్తారు. మీ తల్లిదండ్రులు, ఇరుగుపొరుగువారు, మంత్రులు, రాజకీయోద్యోగులు అందరూ పేరాశలు గలవారే; కాదా? అంతకం తకు పెద్ద పెద్ద పదవులు పొందాలని తంటాలు పడుతూవుండరా? అందుకోసం నిత్యము ఎవరితోనో ఒకరితో ఘర్షణ పడుతూ వుండరా? వాస్తవానికి ఇతరులతో పోటీపెట్టుకొనే యీ స్వభావం మనలో నుండి పోతేనే గాని శాంతి పూర్ణమైన సమాజ మేర్పడదు. అట్టి సమాజంలో మాత్రమే ప్రతి యొక్కడు సుఖసంతోషాలతో సృజనాత్మక శక్తి గలిగి జీవించగలడు.

మరి యిది యెట్లా సాధించాలి? నియమ నిబంధనలు చేసిగాని, ప్రభుత్వ శాసనముల ద్వారాగాని, పేరాశలు పెట్టుకోకుండుటకై మన స్సునకు తగిన శిక్షణ నివ్వడం చేతగాని మనలోని ఆశాపాశమును ఛేదింప గలమా? ఆ విధంగా చేస్తే ఆశ మనలను వదిలిపెట్టిపో తుందా? ఆశాపరులు కాకుండుటకై మీకు పైపైన తగిన శిక్షణ నిప్పించవచ్చు. సంఘము లోని ఇతరులతో మీరు పోటీపడడం మానివే యవచ్చు. కాని అంతరంగికంగా ఆశ మిమ్ము వదిలిపెట్టి పోతుందా? పోదు.. మానవ మాత్రుని కెవరికైనా యింత దుఃఖాన్ని తెచ్చి పెట్టు నట్టి ఆశను పూర్తిగా నిర్మూలము చేయగలమా? బహుశా మీరింతకు ముందు దీని గురించి ఆలోచించి వుండరు. ఎవరున్ను మీతో ఈ విధంగా మాట్లాడి వుండరు. ఇప్పుడొకరు మీతో మాట్లాడుతున్నారు కాబట్టి వినాశకరమైన యీ ఆశాప్రేరణకు లొంగకుండా ఇతరులతో పోటీ పెట్టుకొనే స్వభావం లేకుండా సుసంపన్నమై సుఖవంతమై సృజ నాత్మకత గల్గిన నిండైన జీవితాన్ని ప్రపంచంలో జీవించడం సాధ్యమౌనా కాదా యన్నది తెలిసికొనగోరరా? మీ వలన మరియొకరి జీవితము నాశ నము కాకుండా, మీ నీలి నీడలు మరి యొకరి దారికడ్డము రాకుండా జీవించడమెట్లాగో తెలిసికొనగోరరా?

ఇదంతా అందమైన పగటికలలు కనడమని, వాస్తవిక ప్రపంచానికి

సంబంధించిన విషయాలు కావని మనమనుకొంటాం. నేనట్టి కాల్పనిక జగత్తు గురించి మాట్లాడడం లేదు. అది అర్థం లేనిమాట. మనం మాయ మర్మాలు తెలియని మామూలు మనుషులం. అధికార దాహము, పదవీ వ్యామోహము మొదలైన రూపాలతో అభివ్యక్తమగు ఆశకు లొంగ కుండ సృజనాత్మక శక్తి గలిగి యీ ప్రపంచంలో జీవింపగలమా లేదా? దీనికి సరియైన జవాబు మీరు చేసే పనిమీద మీకు ప్రేమ వున్నప్పుడే తెలుస్తుంది. కేవలం జీవనాధారం కోసంగాని లేక మీ తల్లిదండ్రులో సంఘమో చెప్పినారని గాని మీరు ఇంజనీరింగు వృత్తిని చేపట్టినట్లయితే అది యొక విధమైన నిర్బంధమే. అది యే రూపంలో వున్నను మనస్సులో వైరుధ్యమును, ఘర్షణను కలిగిస్తుంది. అట్లుగాక మీరు ఇంజనీర్లో వైజ్ఞాని కులో కావాలని మనస్ఫూర్తిగా కోరుకొన్నట్లయితే, లేదా గుర్తింపు పొందాలనే కోరికతో గాకుండా, కేవలం ప్రేమతో మీరొక మొక్కను నాటితే, ఒక బొమ్మకు రంగు వేస్తే లేదా ఒక పద్యాన్ని వ్రాస్తే అందులో పోటీ పడ డమంటూలేదు. ఇదే దీనికి నిజమైన కీలకమని అనుకొంటాను-మనమే పని చేసినా దానిని ప్రేమతో చేయడం.

అయితే యేపని మీద మీకు నిజంగా ప్రేమ కలుగుతుందో చిన్నప్పుడే తెలిసికోవడం మామూలుగా చాల కష్టం. ఎందుకంటే చిన్నప్పుడు మీరు ఎన్నో పనులు చేయాలని కోరుకొంటూ వుంటారు. ఇంజనీర్లు కావాలను కొంటారు. లేకపోతే రైలింజను నడపాలను కొంటారు. లేదా నీలాకా శము గుండా జుమ్మని దూసికొని పోయే విమానాన్ని నడిపే చోదకులు కావాలను కొంటారు. అదీ గాక పోతే పేరు మోసిన వక్తలో రాజ కీయ వేత్తలో కావాలనుకొంటారు. లేదా చిత్రకారులో రసాయనశాస్త్ర వేత్తలో కవులో అదికాకపోతే వడ్రంగులో కావాలనుకొంటారు. మెదడు నుపయోగించి పనిచేయడమో లేదా చేతులనుపయోగించి పనిచేయడమో మీరు కోరుకోవచ్చు. ఇందులో ఏదైనా సరే మీరు ప్రేమతో చేయ గలరా? లేకవీటి యందు మీకు గలిగిన అభిరుచికి కారణము సంఘము యొక్క ఒత్తిడులా? ఏ విధంగా తెలిసికోగలరు? అది తెలిసికోవడంలో సహాయపడడమే చదువు యొక్క నిజమైన ఉద్దేశము కాదా? అప్పుడు

మాత్రమే మీరు పెద్ద వారైన తరువాత మీ మనస్సును, హృదయమును, శరీరమును పూర్తిగా వినియోగించి మీరు ప్రేమించిన పనిని చేయడం మొదలుపెడతారు.

ఏ పనిచేయడం మీద మీకు ప్రేమ కలుగుతుందో అది తెలిసికోవడానికి చాల తెలివి వుండాలి. జీవనాధారం (బ్రతుకు తెరువు) దొరకడం కష్టమౌతుందేమో అనే భయమున్నా లేక యీ క్రుళ్ళి పోయిన సంఘంలో ఇమడమేమో అనే భయమున్నా మీరు దానిని తెలిసికోలేరు. అట్లుగాక అసలు మీలో భయమంటూ లేకపోతే, మీ తల్లిదండ్రుల చేతగాని ఉపాధ్యాయుల చేతగాని సంఘము యొక్క పైపై ఒత్తిడుల ద్వారాగాని సంప్రదాయపు గాడిలోనికి త్రోయబడడాన్ని మీరు నిరాకరింపగలిగితే అప్పుడు మీరు నిజంగా దేన్ని ప్రేమతో చేయగలుగుతారో బహూశా తెలిసికోగలరు. కాబట్టి అది తెలిసికోవాలంటే మా బ్రతుకెట్లనా? అనే భయం బొత్తిగా వుండరాదు.

కాని మనలో చాల మందికి మా బ్రతుకెట్లనా అనే భయముంటుంది. "మా తల్లి దండ్రులు చెప్పినట్లు మేము నడుచుకోకపోతే అప్పుడు మాగతి యేమవుతుంది? ఈ సంఘంలో మేము ఇమడలేకపోతే మేమేమై పోతాము? ఎక్కడికి పోతాము?" అని అంటాము. అట్లా భయపడి వారు మనకు చెప్పిన పనులెల్లా చేస్తాము. అందులో ప్రేమలేదు. పరస్పర వైరుధ్యమున్నది. అనుకొనేదొకటి, చేసేదింకొకటి. అంతరంగములోని యీ పరస్పర వైరుధ్యమే, ఒకదానికొకటి పొందికలేకపోవడమే, వినాశకరములైన పేరాశలకు మూలకారణము.

అందువలన మీరు నిజంగా దేనిని ప్రేమతో చేయగలుగుతారో తెలిసికోవడంలో మీకు సహాయపడడమే విద్య యొక్క ప్రధాన కర్తవ్యము. అట్లా మీరు ప్రేమతో చేయగల పనియందు మాత్రమే మీ మనోహృదయముల నర్పించి పనిచేయగలరు. అప్పుడే మానవునికి గణ్యత లభిస్తుంది. దానితో అల్పబుద్ధి మరియు క్షుద్రమగు బూర్జువా మనస్తత్వము తుడిచిపెట్టుకొని పోతాయి. అందువల్లనే సరియైన ఉపా

ధ్యాయులు, సరియైన వాతావరణము ఎంతో అవసరము. అప్పుడు మీతో బాటు ప్రేమ కూడ ఎదుగుతుంది. ఆ ప్రేమ మీరు చేసే ప్రతి పనిలోను వ్యక్తమవుతుంటుంది. అది లేకుండా మీరు వ్రాసే పరీక్షలు మీరు సంపాదించుకొన్న జ్ఞానము మీ శక్తి సామర్థ్యాలు మీ పదవి మీ ఆస్తి అన్నీ బూడిదతో సాటి; అర్థ రహితములు. ఇట్టి ప్రేమలేకుండ మీరే పని చేసినా దానివలన ఇంకా యుద్ధము లెక్కువౌతాయి; ఇంకా విరోధమెక్కువౌతుంది; ఇంకా మోసము, నాశము అధికమౌతాయి.

ఇదంతా మీ కిప్పుడు పట్టని విషయము. బయటికి చూడడానికి మీరింకా పసిపిల్లలు. కాని కనీసం మీ ఉపాధ్యాయుల కైనా ఇదంతా కొంత అర్థవంతంగా కనిపిస్తుందని ఆశిస్తాను. మీకు గూడ ఎక్కడో లోలోపల అంతస్సులో నాటుకొంటుందని తలుస్తాను.

1. ప్రశ్న:- మీరెందుకు సిగ్గుపడతారు?

కృష్ణమూర్తి:- ఒక అనామకుడుగా ఎట్టి పేరు ప్రఖ్యాతులు లేకుండా, గొప్ప పండితుడుగానో బ్రహ్మాండమైన సంస్కర్త గానో లేదా పెద్ద విప్లవవీరుడు గానో కాకుండా కేవలం ఊరుపేరు లేని అనామకుడుగా జీవించడం అసాధారణమైన విషయము. ఒకరావిధంగా ఉండాలని మన స్ఫూర్తిగా కోరుకొంటూ వుండగా అనుకోకుండా అతని చుట్టూ పెక్కు మంది కుతూహలంతో మూగితే, అతని హృదయంలో ఒక విధమైన సంకోచము సిగ్గు కలుగుతుంది. అంతే.

2. ప్రశ్న:- మన దైనిక జీవితంలో సత్యము నెట్లు తెలిసికొనగలము?

కృష్ణమూర్తి:- సత్యముపేరు మీ దైనిక జీవితము వేరని తలచి, మీ దైనిక జీవితంలో సత్యమని దేనిని మీరు తలుస్తున్నారో దానిని అనుభవానికి తెచ్చుకొందామని అనుకొంటున్నారు. కాని దైనిక జీవితానికి భిన్నంగా సత్యమంటూ వేరే వున్నదా? పెద్దైన తరువాత మీ జీవనా

ధానాన్ని మీరు సంపాదించుకోవలసి వస్తుంది గదా. ఇంతకు మీరు పరీక్షలు పాసయ్యేది కూడ అందుకోసమే గదా. కాని చాలా మందికి తాము డబ్బు సంపాదించగలిగినంత కాలం అందుకోసం ఏ కార్యక్షేత్రం లోఎక్కడ పని చేస్తున్నా చింతలేదు. ఏదో యొక ఉద్యోగం దొరికితే చాలు-అది సైనికుడుగా గాని రక్షకభటుడుగాగాని, న్యాయవాదిగా గాని లేదా వక్ర బుద్ధిగల ఏ వ్యాపారిగానైనా సరే — ఏదైనా వారి కిష్టమే.

మరి బ్రతుకు తెరువు సంపాదించుకోవడానికి ఏది సరియైన మార్గమో అందులోని సత్యమేమిటో తెలిసికోవడం చాల ముఖ్యం, అవునా కాదా? ఎందుకంటే సత్యము మీ జీవితంలోనే వున్నది, బయటకాదు. మీరు మాట్లాడే తీరు, చెప్పే విషయం, చిరునవ్వు నవ్వేతీరు, మోసంచేసే బుద్ధి మీలో వుందా లేధా, మీ స్వార్థం కోసం ఇచ్చకాలాడి మను షులను ఉబ్బిస్తుంటారా లేదా-ఇదంతా మీ నిత్య జీవితంలోని సత్యం. కాబట్టి మీరు సైనికులో రక్షకభటులో న్యాయవాదులో చులుకైన బుద్ధి గల వ్యాపారులో అయ్యేముందు ఆయావృత్తులలోని సత్యమును మీరు పరీక్షించి తెలిసికోవద్దా? నిజానికి మీరు చేసే పనిలోని సత్యమేమిటో చూచి తెలిసికొని దాని ననుసరించి మీరు నడవక పోతే మీ జీవితము అధ్వాన్నమై పోతుంది.

ఇక మీరు సైనిక వృత్తిలో చేరడం గురించి ఆలోచిద్దాం. ఇతర వృత్తులన్నిటికన్నా మరింత క్లిష్టమైనవి. సైనిక వృత్తిని గురించి చేయబడే ప్రచారాన్ని, ఇతరులెవరెవరో చెప్పే విషయాలను ప్రక్కన పెట్టి ఆ వృత్తికి సంబంధించిన అసలు సత్యమేమిటని కనుక్కొందాం. ఎవడైనా సైనిక వృత్తిని చేపట్టినాడంటే అర్థమేమిటి? అతడు తన దేశరక్షణ కోసం పోరాడవలసి వుంటుంది. అతడు తన మనస్సును ఆలోచించడా నికి కాకుండా, అనుసరించడానికి అలవాటు పరచుకోవలసి వుంటుంది. చంపడానికి గాని, చావడానికి గాని సైనికుడు సిద్ధమై యుండాలి. దేని కోసం? కొందరు మనుష్యులు — వారెవరైనాగాని, అల్పులో అధికులో — మంచిదని చెప్పిన ఒక ఆదర్శంకోసం, ఒక లక్ష్యం కోసం. కాబట్టి

స్వయంగా బలి అవడం కోసమో లేదా పరులను బలిచేయడం కోసమో మీరు సైనికులౌతారు. ఇది మంచి వృత్తే నంటారా? ఇతరుల నడుగ వద్దు. అందలిసత్యమును మీయంతట మీరే కనుక్కోండి. ఇక మీదట ఎప్పుడో ఏదో అద్భుతమైన రామ రాజ్యం వస్తుందని చెప్పి దానికోసమై యిప్పుడు చంపమని మీకు చెబుతారు. అట్లా చెప్పే మనిషికి భవిష్యత్తులో జరగబోయేదంతా మహా తెలిసివున్నట్లు! అసలు చంపడం మంచి వృత్తి యని మీరనుకొంటారా? అది తన దేశం కోసమైనా సరే, మతం కోసం మైనా సరే? అసలు చంపడమనేది, ఎప్పుడైనా సరే ఎక్కడైనా సరే, మంచిదేనా?

కాబట్టి అతి ముఖ్యమైన మీ బ్రతుకుబాటలోని సత్యమును కనుగొనవలెనంటే యీ పై విషయాలనన్నిటినీ క్షుణ్ణముగా విచారించవలసి వుంటుంది. అందుకోసమై మీ మనోహృదయములను అర్పించవలసి వుంటుంది. స్వతంత్రంగా, స్పష్టంగా, ఎటువైపునకును మొగ్గుచూపకుండా ఆలోచించవలసి వుంటుంది. జీవితానికి దూరంగా సత్యమెక్కడనో బయటలేదు; మీ నిత్య జీవితంలోని ప్రతి కదలికలోను అది వున్నది.

3. ప్రశ్న:- ప్రతిమలు, గురువులు, మహాత్ములు, ఋషులు మనకు సరియైన ధ్యానమార్గమును చూపరా?

కృష్ణమూర్తి:- సరియైన ధ్యానమంటే యేమిటో మీకు తెలుసునా' ఇందలి వాస్తవికార్థాన్ని మీయంతట మీరు తెలిసికొనగోరరా? సరియై ధ్యానమంటే యేమిటో ఇతరులు చెప్పిన దాన్నే మీరు గ్రహించేటట్లయి అసలు దాని వాస్తవికార్థాన్ని మీయంతట మీరు స్వయంగా కనుగొనః ఎన్నటికైనా సంభవిస్తుందా?

ఇది యెంతో మహత్తరమైన ప్రశ్న. అద్భుతమగు ఈ ఆలోచన ప్రక్రియ యొక్క లోతు పాతులను పూర్తిగా తెలిసికొంటేనే తప్ప ధ్యాన మననేమో కనుగొన లేము. "ఈవిధంగా ధ్యానము చేయం' డని ఎవరైనా చెప్పిన దానిని మీరు ప్రమాణంగా అంగీకరిస్తే, దానిః

మీరు దాసులైనారన్న మాట. ఆ పద్ధతిని లేదా ఆ భావనను గ్రుడ్డిగా అనుసరిస్తున్నారన్నమాట. ఏదో ఫలితాన్ని పొందగలమనే ఆశ చేతనే ఇతరులు చెప్పిన దానిని ప్రమాణంగా స్వీకరిస్తారు, అందువలన అట్టిది ధ్యానము కాదు.

4. ప్రశ్న:- విద్యార్థి యొక్క కర్తవ్యములేమిటి?

కృష్ణమూర్తి:- కర్తవ్యమనే మాటకు అర్థమేమిటి? దేనియెడ కర్తవ్యము? రాజకీయ నాయకుని దృష్టిననుసరించి దేశము నెడల కర్తవ్యమా? తల్లిదండ్రుల కోర్కె ప్రకారం వారి యెడ గల కర్తవ్యమా? మేము చెప్పినట్లే చేయడం మీవిధి, మీ కర్తవ్యమని వారంటారు. ఇక వారు చెప్పేది వారి సంస్కారము, వారి సంప్రదాయములననుసరించి వుంటుంది.

ఇక విద్యార్థియనగా నెవరు? పరీక్ష పాసవడంకోసం బడికిపోయి ఏవో కొన్ని పుస్తకాలు చదివే వాడా? లేక జీవిత పర్యంతం ఎల్లప్పుడూ నేర్చుకొంటూ వుండేవాడా? అంటే నేర్చుకోడానికి — చదువుకు — ముగింపంటూ లేని వాడా విద్యార్థి? ఏదో యొక పాఠ్య విషయం తీసుకొని చదివి, పరీక్ష పాసై తరువాత చదువు మాని వేసేవాడు వాస్తవానికి విద్యార్థికాదు. నిజమైన విద్యార్థి యెవరంటే ఏదో యిరవై యిరవయ్యైదేండ్లవయసు వరకో కాకుండ, జీవిత పర్యంతం అధ్యయనం చేస్తూ నేర్చుకొంటూ విచారణ సల్పుతగా పరిశోధిస్తూ వుండేవాడే.

విద్యార్థిగా నుండడమంటే ఎల్లప్పుడును నేర్చుకొంటూ వుండడమే. మీరు నేర్చుకొంటూ వున్నంత కాలం వేరే గురువుంటాడా? ఉండడు. మీరు విద్యార్థిగా నున్న క్షణము నుండి మీకు బోధించడానికి ప్రత్యేకంగా ఒకడంటూ వుండడు. ఏలయన మీరే స్వయంగా ప్రతిదాని నుండి నేర్చుకొంటూ వుంటారు. గాలిచే పైకెగురగొట్టబడే ఆకు, ఏటి గట్టున తపతపకొట్టుకొనే నీళ్ళు, గాలిలో పైన ఎత్తుగా ఎగురుతూ వున్న పక్షి, తలమీద పెద్ద బరువుతో మెల్లగా నడుస్తూవున్న బీదవాడు, జీవితం

గురించి అన్నీ తమకే తెలుసుననుకొనే జనులు — వీరందరినుండి మీరు నేర్చుకొంటూవుంటారు. . అందువలన మీకొక గురువంటూ వుండడు. మీరెవరికినీ శిష్యులూ కాదు.

కాబట్టి విద్యార్థియొక్క కర్తవ్యము కేవలం నేర్చుకొనడం. ఒకప్పుడు స్పెయిను దేశంలో గోయా అనుపేరుగల ప్రసిద్ధ చిత్రకారుడొక డుండేవాడు. అతడానాటి చాల గొప్ప చిత్రకారులలో నొకడు. అతడు చాల ముసలి వాడైనప్పుడు తన వర్ణచిత్రాలలో నొక దానిక్రింద "నేనింకా నేర్చుకొంటూ వున్నాను" అని వ్రాసికొన్నాడు. మీరు పుస్తకాలనుండి చదివి నేర్చుకోవచ్చు. కాని అది అంత ఉపయోగకరం కాదు. రచయిత చెప్పదలచిన దేదో అది మాత్రమే మీరు పుస్తకాలనుండి నేర్చుకోగలరు. కాని ఆత్మజ్ఞానము ద్వారా నేర్చుకొనే దానికి అంతములేదు. ఆత్మజ్ఞానము ద్వారా నేర్చుకోవడమంటే శ్రవణ మెట్లు చేయవలెనో, పరిశీలన మెట్లు చేయవలెనో తెలిసికోవడం. అప్పుడు ప్రతిదాని నుండి మీరు విషయాలను గ్రహిస్తూ వుంటారు. సంగీతము నుండి, లోకులు చెప్పేదానినుండి, వారు దానిని చెప్పకొనే తీరునుండి, కోపమునుండి, లోభమునుండి, కీర్తి కాంక్ష నుండి, ప్రతిదాని నుండి మీరు నేర్చుకొంటూవుంటారు.

ఈ భూమి మనది; ఇది సామ్యవాదులదీ కాదు, సమాజవాదులదీ కాదు, పెట్టుబడి దారులదీ కాదు. ఇది మీదీ, నాదిన్నీ. ఎట్టి ఘర్షణ లేకుండా సుఖసంతోషాలతో జీవించడంకోసమే యిది వున్నది. కాని అట్టి జీవన సంపద, అట్టి సుఖము, "ఈ భూమి మనది" అనే భావన — యివి బలవంతం చేస్తే వచ్చేవికావు. చట్టం ద్వారా వచ్చేవికావు. అవి మన అంతస్సులో నుండియే పుట్టుకొని రావలెను. ఎందుకంటే, మన మీ భూమిని అందులోని వాటినన్నిటినీ ప్రేమిస్తున్నాము కాబట్టి. అట్టి స్థితిలోనే మనము నేర్చుకొంటాము.

5. ప్రశ్న:- గౌరవమునకు ప్రేమకు గల భేదమేమి?

కృష్ణమూర్తి:- ఏ నిఘంటువులో నైనా చూస్తే ఆ రెండు మాట

లకు గల అర్థము తెలుస్తుంది. అంత మాత్రమేనా మీరు తెలిసికొనగోరేది? ఆ రెండు మాటలకును గల పైపై అర్థమునా మీరు తెలిసికొనగోరేది లేక వాటి అంతరార్థమునా?

ఎవరైనా ఒక గొప్ప మనిషి, మంత్రిగాని గవర్నరుగాని, వచ్చినప్పుడు అందరున్నూ అతన్ని చుట్టుముట్టి అతనికెట్లు వంగి వంగి నమస్కారాలు చేస్తారో చూశారా? దానినే మీరు గౌరవం చూపడమంటారు. కాని ఆ గౌరవమంతా వట్టి నటన. దానివెనుక భయంగాని ఆశగాని వుంటుంది. అతని నుండి యేదో లాభం పొందాలనే కోరికతో అతని మెడచుట్టు ఒక దండ వేస్తారు. అది నిజమైన గౌరవం కాదు. దేనినైనా కొనడం కోసం ఉపయోగించే నాణెం లాంటిదది. మీపనిమనిషి మీదగాని పల్లెటూరి వాని మీదగాని మీకు గౌరవముందా? ఎవరినుండైతే యేదైనా లాభం వుంటుందని ఆశిస్తామో వాడికి గౌరవం చూపుతాం. కాని నిజానికది గౌరవంకాదు. అది మన భయాన్నే సూచిస్తుంది. ఆ గౌరవాని కర్థమే లేదు. నిజంగా మీ హృదయంలో ప్రేమ అనేది వుంటే అప్పుడు మీకు గవర్నరు, ఉపాధ్యాయుడు, సేవకుడు, గ్రామీణుడు అందరూ సమానమే. అప్పుడు మీరందరినీ గౌరవిస్తారు. అందరియందును అభిమానం చూపుతారు. కారణమేమంటే ప్రేమ ప్రతిఫలాన్ని కోరదు గదా!

6 జనవరి, 1955

8

క్రమబద్ధమైన ఆలోచన

జీవితంలో ఎన్నో విషయాలుంటాయి. అందులో ఒకటి బద్ధకించడం అంటే ప్రాలుమాలిక. మనలో చాలమంది మామూలుగా ప్రతివిష యంలోను బద్ధకిస్తారు. దుస్తులు వేసికోవడంలో, నడిచే నడతలో, చేసే ఆలోచనలో, పనులు చేసే తీరులో — అన్నిటిలోను ప్రాలుమాలిక, అశ్రద్ధ కనిపిస్తాయి. ఏ సమయానికి చేయవలసిన పనిని ఆ సమయానికి చేయక యితరులకు ఇబ్బంది కలిగిస్తారు. మనం గుడ్డలు ధరించడంలో, ఆలోచించడంలో, మాట్లాడడంలో, దారిన నడవడంలో, మనకంటె దుర దృష్టవంతులను మనం చూచుకొనే తీరులో — ఇట్లా ప్రతిదానిలోను ఒక క్రమమును, ఒక కట్టుబాటును తెచ్చి పెట్టేది యేదైనా వున్నదా? ఈ కట్టుబాటు యెట్టి బలవంతము లేకుండ, ప్రయత్నము చేయ కుండా, కావాలని ముందుగా ఆలోచించి తెచ్చి పెట్టుకొన్నది కాకుండా దానంతట అది రావలసిన కట్టుబాటు. ఈ వింతైన కట్టుబాటు యెట్లా వస్తుంది? దీని గురించి యెప్పుడైనా ఆలోచించారా? కట్టుబాటు అంటే నా యుద్దేశమేమిటో తెలుసునా? ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా కూర్చోవడం, గబగబా కాకుండా సొంపుగా తినవలసిన తీరులో తినడం, తీరికగా వుంటూనే ఏది యెప్పుడు ఎట్లా చేయవలెనో అట్లా — పద్ధతి ప్రకారం — చేస్తూ వుండడం, ఆలోచనలలో స్పష్టంగా వుంటూనే, ఇతరులతో స్వేచ్ఛగా మాట్లాడడం, మాట్లాడించడం — ఇదీ కట్టుబాటు లేదా వ్యవస్థ లేదా క్రమబద్ధత అంటే. జీవితంలో ఈ కట్టుబాటును తెచ్చేది యేది? ఇది నిజంగా చాల ముఖ్యమైన విషయం. ఇటువంటి కట్టుబాటు దేనిమూలంగా వస్తుందో దానిని తెలిసికోడంలో మీరు చదివే చదువు ఉపయోగపడితే అది యెంతో సార్థకమైనదని నేన

నుకొంటాను.

నిజానికి సౌశీల్యము వల్లనే కట్టుబాటు వస్తుంది — చిన్నచిన్న విషయాలలోనే కాదు, అన్ని విషయాలలోను సౌశీల్యమనేది లేకపోతే జీవితము అస్తవ్యస్తమై పోతుంది; ఏమి నిజం కాదా? కేవలం సౌశీల్యము కలిగివుండడంలో లేదు దాని సార్థకత; కాని సౌశీల్యము కలవాని మనస్సు క్రమపద్ధతిలో పనిచేయ సాగుతుంది. దానితో జీవితమంతా క్రమబద్ధమౌతుంది. అదియే సౌశీల్యము వలన కలిగే ప్రధాన ప్రయోజనము.

కాని సౌశీల్యవంతుడగుటకై మనిషి ప్రయత్నించసాగితే, దయాదాక్షిణ్యములు, శక్తిసామర్థ్యములు కలిగి వుండాలని, ఆలోచించి పనులు చేయాలని పరుల కష్టములందు సానుభూతి చూపాలని తనలో తానొక నియమం పెట్టుకొని, దాని ప్రకారం పనిచేయసాగితే, ఇతరులను నొప్పించకుండా వుండడంకోసం గట్టి ప్రయత్నం చేయసాగితే, క్రమబద్ధ జీవితం నడపడం కోసం, మంచివాడుగా వుండడం కోసం తన శక్తియుక్తుల నన్నింటెని ఉపయోగించి ప్రయత్నించ సాగితే, ఏమవుతుంది? అతని ప్రయత్నాలన్నీ అతనికి సంఘంలో గౌరవాన్ని తెచ్చి పెడతాయి. కాని దాంతో అతని మనస్సు మాత్రం మట్టమైపోతుంది; అందువలన అటువంటివాడు సౌశీల్యవంతుడు కానేరడు.

ఎప్పుడైనా మీరొక పువ్వును చాల దగ్గరగా వుండి చూచారా? అది రేకలన్నిటితో హెచ్చు తగ్గులు లేకుండా, ఎంత అద్భుతంగా వుంటుందో! అంతేగాదు, అది యెంతో మృదువుగా, మంచి వాసన గలిగి చూడ సొంపుగా నుంటుంది. ఇక, మనిషి క్రమబద్ధ జీవితం నడపడానికై ప్రయత్నిస్తే, అతని జీవితం హెచ్చుతగ్గులు ఒడుదుడుకులు లేకుండా, — ఏది, యెప్పుడు, ఎట్లా వుండవలెనో అట్లా — కొనసాగవచ్చును. కాని పూవులో వున్నట్లుగా అప్రయత్నంగా వచ్చే సొంపు, సౌమ్యత అతని జీవితంలో కన్పించవు. కాబట్టి యిప్పుడు మనకున్న కష్టమేమంటే, యెట్టి ప్రయత్నం చేయకుండానే, మన చేతలు సమతూకంగా వుండాలి, మన ఆలోచనలు స్పష్టంగా సహేతుకంగా వివేకవంతంగా సాగాలి. మన

సంభాషణలు స్వేచ్ఛగా సావకాశంగా జరగాలి.

చూశారూ, క్రమబద్ధ జీవితం నడపడం కోసం తీర్చి దిద్దినట్లు నీటుగా వుండడంకోసం మనం చేసే ప్రయత్నం మన మనస్సును సంకుచితము చేస్తుంది. అది మన అల్పత్వాన్ని సూచిస్తుంది. నా గదిలో ప్రతిదిన్ని క్రమ పద్ధతిలో వుంచడానికై నేను కావాలని ప్రయత్నిస్తూ వుంటే, ప్రతి దానిని దేని స్థలంలో దానిని వుంచడంకోసమై జాగ్రత్తపడుతూ వుంటే, ఎక్కడ నేను అడుగువేస్తున్నానో, ఎటు పోతున్నానో ఇట్లా ప్రతి చిన్న విషయంలోను నన్ను నేను ఎల్లప్పుడూ గమనించుకొంటూ వుంటే, అప్పుడేం జరుగుతుంది? నాకేగాదు, ఇతరులకున్ను నేనొక భరింపరాని పీడగా తయారవుతాను, అందరినీ విసిగిస్తాను. ఏదో యొక స్థితికి చేరాలని ఎల్లప్పుడూ ప్రయత్నం చేసే మనిషి, తన ఆలోచనలను ఒక పద్ధతి ప్రకారం జాగ్రత్తగా కొనసాగిస్తూ ఈ ఆలోచన మంచిది కాదని అది, అది మంచిది కాదని యిది -- యిట్లా ఎన్నుకొంటూ ఆలోచనలను సాగించేమనిషి - యితరులకు విసుగుపుట్టిస్తాడు, చిరాకు కలిగిస్తాడు. అటువంటి మనిషి చాల నీటుగా కనబడవచ్చు. సహేతుకముగా తూచి తూచి మాట్లాడవచ్చు, ఇతరుల ఎడల చాల శ్రద్ధ చూపవచ్చు, వారి బాగోగులను పట్టించుకోవచ్చు. కాని జీవితంలో సృజనాత్మక శక్తివలన కలిగెడి ఆనందమును మాత్రము పోగొట్టుకొన్న వాడవుతాడు.

కావున ఇప్పుడింతకు మనకుగల సమస్య యేమిటి? ఎవరైనా సరే, జీవితంలో సృజనాత్మక శక్తివలన గలిగెడి ఆనందమును పొందటమెట్లు? విముక్త భావములు, విశాలమగు ఆలోచనలు కలిగియుండి, వానికి తోడుగా మన చేతలు సమతూకములై, మనమాటలు సహేతుకములై మరియు సుస్పష్టములై జీవితము సక్రమపద్ధతిన కొనసాగడమెట్లు? మనలో చాలమంది అట్లుండరని నా తలంపు. మన భావములు గంభీరములు కావు; మనము మన మనోహృదయములను దేనియందును పూర్తిగా లగ్నము చేయము. నేనొకప్పుడు పొడవైన కుచ్చుతోకలు, ఒళ్ళంతా మెత్తని బొచ్చుతో అందమైన రెండు ఎఱ్ఱని ఉడుతలను చూచినాను. అవి చాల యెత్తుగా వున్న

ఒక చెట్టు మీదికి పైకెసి క్రిందికెని పరుగెత్తుతూ, పది నిమిషాలసేపు, ఆగకుండా ఒకదాని నొకటి తరుముకొంటూ వుండినాయి. ఇదంతా ఎందుకోసం? కేవలం జీవితానందమును అనుభవించడం కోసమే! మన కటువంటి ఆనందమును గూర్చి బొత్తిగా తెలియదు. అది తెలియ వలెనంటే దేని గురించైనా మన భావములు లోతుగా పోవాలి. మన జీవితంలో ఉత్కంఠ పెరగాలి -- అది యేదో మంచి చేయడం కోసం కాదు, ఏదో సంఘసంస్కరణ కోసం కాదు. ఉత్కంఠ (Passion) అంటే దేనియందైనా దృఢమైన భావన, అత్యంతమగు ఔత్సుక్యము. అటువంటి మహత్త్వపూర్ణమగు ఉత్కంఠ మనలో కలుగవలెనంటె మన ఆలోచనా సరళిలోనే సమూల పరివర్తనము జరగాలి, మన సమగ్ర వ్యక్తిత్వములోనే పూర్తి మార్పు రావాలి.

దేని గురించైనా దృఢమైన భావన మనలో ఎంత తక్కువ మందికుంటుందో మీరు గుర్తించారా? మీరెన్నడైనా మీ ఉపాధ్యాయులను గాని మీ తల్లిదండ్రులను గాని వ్యతిరేకించినారా? ఆ వ్యతిరేకించడం మీకు దేనిమీదో ఇష్టం లేకపోవడంచేత కాదు; కాని ఏవో కొన్ని పనులు మీరు చేయుగూడదని చాల గట్టిగా భావించడంచేత. దేనిమీదనైనా మీకు దృఢమైన భావన లోతుగా నాటుకొని వున్నట్లయితే ఆ దృఢమైన భావనయే వింతగా మీ జీవితాన్ని క్రమబద్ధం చేయడం గమనించగలరు. మీ జీవితం సక్రమ మార్గాన నడవడం గమనించగలరు.

క్రమపద్ధతిన నడుచుకోవడం, ఇంటాబయటా నీటుగా నుండడం, ఆలోచనలలో స్పష్టత ఇవి వానికవే ప్రధానం కాదు. కాని సున్నితమైన మనస్సు గలవానికి, జాలి గుండె గలవానికి, నిరంతరము ఆంతరిక పరివర్తనము పొందుతున్న వానికివి చాల ముఖ్యములు. పేదవాని దుర్దశను, ధనవంతుడు కారులో పోతుంటే వాని కారు దుమ్మెగిరి మొగంమీద పడే పిచ్చవానిని జూచి మీ గుండె కరిగిపోతే, ఇతరుల మాటలను వినిపించుకోగల అపూర్వమైన శక్తి మీకుంటే, ప్రతిదానిని ప్రేమార్ద్రమగు మనస్సుతో మీరు చూడగల్గితే, అట్టి మనస్సే మీ జీవితంలో

క్రమబద్ధతను, సౌశీల్యమును కొని తెస్తుంది. దీనిని అర్థం చేసికోవడం ఉపాధ్యాయునకును, విద్యార్థికిని — ఇద్దరికిని — చాల అవసరం.

దురదృష్టవశాత్తు, తక్కిన ప్రపంచంలో మాదిరే ఈ దేశంలోను దేనినీ మనము లక్ష్యపెట్టము. దేనినీ మనస్సుకు గట్టిగా పట్టించుకోము. మనలో చాల మందిమి బుద్ధిజీవులము — అదైనా పైపై అర్థములో మాత్రమే. అంటే మనకు తెలివితేటలు లెక్కువ. ఏది మంచి, ఏది చెడు అనే దాని గురించి, ఏమి ఆలోచించాలి, ఎట్లా ఆలోచించాలి, ఏం చెయ్యాలి అనేదాని గురించి, మనం తెగ చర్చిస్తాం, వాదిస్తాం. మానసికంగా మనం చాల అభివృద్ధి చెందినాం. కాని ఆంతరికంగా మనలో సత్తా దాదాపు శూన్యం; పనికి వచ్చేదంటూ ఏమీ లేదు. కాని నిజానికి లోపలవుండే ఆ సత్తాయే సరియైన ఆచరణకు దారి చూపేది. ఆ యాచరణ ఏదో యొక అభిప్రాయాన్ని నమ్మకాన్ని అనుసరించి జరిగేది కాదు.

అందువలన మీలో చాల దృఢమైన భావన లుండాలి — ఉద్రేకము, ఉత్కంఠ, క్రోధము లాంటివి. వాటిని చాల జాగ్రత్తగా గమనించండి; వాటితో ఆడుకోండి; వాటి యందలి సత్యాన్ని కనుక్కోండి. అట్లు గాక వాటిని పూర్తిగా అణచివేస్తే, "నేను కోపం తెచ్చుకోరాదు, నేను దేనికినీ ఉద్రేకపడరాదు, అది తప్పు" అని అంటే అప్పుడు మీ మనస్సు క్రమక్రమంగా ఆ యభిప్రాయానికి లొంగిపోయి, దానిలో చిక్కుకొని, మట్టమైపోతుంది. మీరెంతో తెలివిగల వారు కావచ్చు, విజ్ఞాన సర్వస్వ గ్రంథములోని విషయమంతా మీకు కరతలామలకంగా తెలిసి వుండవచ్చు. కాని హృదయమును స్పృశించు దృఢమైన భావనయే లేనిచో, మీ అవగాహనము నిర్గంధ కుసుమము (వాసనలేని పువ్వు).

ఈ విషయాలన్నీ మీరు మీ చిన్నతనంలోనే అర్థం చేసికోవడం చాల అవసరం. అట్లాగైతేనే మీరు పెద్దైన తరువాత నిజమైన విప్లవ వీరులు, క్రాంతివాదులు కాగలరు. ఏదోయొక వాదము ననుసరించియో లేదా ఏదో యొక సిద్ధాంతమునో గ్రంథమునో అనుసరించియో కాకుండ,

అసలా పదము యొక్క నిజమైన అర్థములో విప్లవవీరులై క్రాంతివాదులై కడకంట సంపూర్ణ మానవులుగా జీవింపగలరు. తత్ఫలితంగా పాతకాలపు వాసనలచే దూషితమైన అంశము మీలో ఏమాత్రమును శేషించదు. అప్పుడు మీ మనస్సు నిర్మలమై, పసిపిల్లల మనస్సువలె అమాయికమై రాణిస్తుంది. అట్టి మనస్సే అసాధారణమైన సృజనాత్మక క్రియను కొనసాగింప సమర్థము. దీని ప్రాముఖ్యాన్ని మీరు గ్రహించక పోతే మీ జీవితము ఆనందరహితమై వ్యర్థమైపోతుంది. మీ చుట్టునున్న సంఘము, మీ కుటుంబము, భార్య లేక భర్త, సిద్ధాంతములు, మతములు, మత సంస్థలు, రాజకీయ సంస్థలు - అన్నీ మిమ్ము ముంచెత్తి పూర్తిగా లొంగదీసికొంటాయి. అందువలన మీరు చిన్నప్పుడే సరియైన విద్యను పొందడం చాల అవసరం. అందుకోసం యీ బండబారిన నాగరికత అనబడే దానిని బ్రద్దలు కొట్టడంలో మీకు సహాయపడగల ఉపాధ్యాయులుండాలి. మీరు చెప్పిందే చెప్పెడి యంత్రముల వలె గాకుండ, హృదయములందు సంగీతము గల స్వతంత్ర వ్యక్తులుగా, సృజనాత్మకత గల మానవులుగా సుఖసంతోషాలతో జీవించాలి.

1. ప్రశ్న:- కోపమనగా నేమి? ఎవరికైనా కోపమెందుకు వస్తుంది?

కృష్ణమూర్తి:- మీ కాలివ్రేళ్ళను నేను త్రొక్కితే, లేదా మిమ్ము నేను గిల్లితే, లేదా మీ వస్తువును దేనినైనా నేను తీసివేసికొంటే మీకు కోపంరాదా? ఎందుకని కోపం రాగూడదు? అసలు కోపం చెడ్డదని ఎందుకనుకొంటారు? మీతో ఎవరైనా అట్లా అన్నారా? కాబట్టి ఎవరికైనా కోపమెందుకు వస్తుందో తెలిసికోవడం చాల ముఖ్యం. కోపము యొక్క నిజమైన తత్త్వమేమిటో చూడాలి. అంతేగాని కోపము చెడ్డదని ఊరక పలికినంత మాత్రాన ఉపయోగంలేదు.

సరే, మీకెందుకు కోపం వస్తుంది? ఎవరైనా మీకు నొప్పి కలిగించడం మీకిష్టముండదు. ఇది చావకుండా బ్రతికి వుండడంకోసం మానవమాత్రునికుండే మామూలు కోరికలో ఇది ఒక భాగము. ఎవరైనాసరే ఒక

వ్యక్తిగాని, ప్రభుత్వంగాని, సంఘంగాని మిమ్ము ఉపయోగించుకోరాదని, మిమ్ము అణగద్రొక్కి వేయరాదని, నాశనం చేయరాదని మిమ్ము నిలువు దోపిడీ చేయరాదని అనుకొంటారు. ఎవ్వరైనా మిమ్మొక చెంపదెబ్బ కొట్టితే మీరు బాధపడతారు; అవమానం జరిగినట్లు భావిస్తారు. అది మీకిష్టముండదు. మిమ్ము కొట్టిన మనిషి మీ కంటె పెద్దవాడై బల వంతుడైతే, మీరు వాణ్ణి మళ్ళీ కొట్టలేరు. అందుకు బదులుగా మీరు మరొకణ్ణి కొడతారు — మీ తమ్ముణ్ణో, మీ చెల్లెలినో లేదా మీకు పనిమనిషి వుంటే ఆ పనిమనిషినో కొట్టి మీ కోపం చల్లార్చుకొంటారు. ఈ విధంగా ఈ కోపమనే ఆట కొనసాగుతూ వుంటుంది.

అసలు, దెబ్బనుండి తప్పించుకోవడం ప్రాణి సహజమైన క్రియ. ఎవరైనా మిమ్మెందుకు తమ స్వార్థంకోసం ఉపయోగించుకోవాలి? అందుచే దెబ్బ తగులకుండా మిమ్ము మీరు కాపాడుకొంటారు. మీ చుట్టూ ఒక రక్షణ శ్రేణిని, ఒక అడ్డుగోడను నిర్మించుకొంటారు. అంతర్గతంగా మీ చుట్టు మీరొక గోడను నిర్మించుకొని మిమ్ము మీరు మూసివేసికొంటారు. అంటే మీ మనస్సు సంవేదన శూన్యమౌతుంది. అందుచేత మీరు తత్త్వాన్వేషణ చేయడానికి పనికిరారు. మీలో విశాల భావాలకు చోటులేదు. మనస్సులో కలిగే వివిధ భావాలను ఖండిస్తు న్నట్లే, కోపమును గూడ చాల చెడ్డదని చెప్పి దానిని ఖండిస్తారు. అందుచేత మీ హృదయము క్రమక్రమంగా ఎండిపోయి వట్టిపోతుంది. అందులో బలమైన భావాలేవియు ఉద్బుద్ధమవడానికే అవకాశముండదు. ఏమి, మీ కర్థమయినదా?

2. ప్రశ్న:- మనం మన తల్లులను ఎందుకెక్కువగా ప్రేమిస్తాము?

కృష్ణమూర్తి:- మీరు మీ తండ్రిని అసహ్యించుకొనేటట్టయితే తల్లిని ప్రేమించ గలరా? జాగ్రత్తగా వినండి. మీరొకరిని ఎక్కువగా ప్రేమిస్తూ వుంటే, అట్టి ప్రేమకు పాత్రులు కాకుండ ఇతరులను బహిష్కరిస్తారా? మీ తల్లిని మీరు నిజంగా ప్రేమిస్తూ వుంటే మీ తండ్రిని, పినతల్లిని,

ఇరుగుపొరుగువారిని, మీ పనిమనిషిని గూడ ప్రేమించరా? మొట్టమొదట ప్రేమభావమంటూ మీలో వుంటే, ఆ తరువాతగదా ప్రత్యేకంగా ఎవరినో యొకరిని ప్రేమించడమనేది? "నా తల్లిని, నేను చాల ఎక్కువగా ప్రేమిస్తున్నాను" అని మీరంటే ఆమె యొక్క బాగోగులను పట్టించుకోవడం కాదా? అప్పుడు మీరామెకు ఎన్నో లేనిపోని కష్టాలు కలిగిస్తారా? మీతల్లి బాగోగులు మీరు చూచుకొంటూ వుంటే, మీ తమ్ముడు, చెల్లెలు ఇరుగుపొరుగు వారి బాగోగులను గూడ చూచుకోరా? అట్లా చూచుకోకపోతే మీరు మీ తల్లిని గూడ నిజంగా ప్రేమిస్తున్నట్లు కాదు. అప్పుడా ప్రేమ అర్థంలేని కేవలం ఒకమాట, స్వార్థ సాధనకోసం పనికివచ్చే ఒక పనిముట్టు మాత్రమే.

3. ప్రశ్న:- నానిండా అసహనము, ద్వేషము. ప్రేమించడమెట్లో దయచేసి నాకు నేర్పుతారా?

కృష్ణమూర్తి:- ప్రేమించడమెట్లో ఎవరును ఎవరికిని నేర్పలేరు. ప్రేమించడమెట్లో ప్రజలకు నేర్పగల్గితే, యిక ప్రపంచ సమస్య దాదాపు తీరినట్లే కాదా? పుస్తకం చూచి లెక్కలు చేయడం నేర్చుకొన్నట్లుగా ప్రేమించడం నేర్చుకోగల్గితే, యీ ప్రపంచమే అద్భుతంగా మారిపోతుంది. అప్పుడిక్కడ ద్వేషముండదు, దోపిడీ వుండదు, యుద్ధములుండవు, బీదవారు ధనికులనే భేదముండదు. మనమందరము అన్యోన్య మైత్రితో జీవిస్తాము. కాని ప్రేమ అనేది అంత సులువుగా వచ్చేది కాదు. ద్వేషించడమే సులువు. అది యొక పద్ధతిలో మనుషులను కలుపుతుంది గూడ. అది వారిలో రకరకాలైన భ్రమలను పుట్టిస్తుంది. యుద్ధములో చేసికొన్నట్లే అనేక విధముల పరస్పర సహాకారము చేసికోడానికది తోడ్పడుతుంది. కాని ప్రేమభావన చాల కష్టసాధ్యం. మీరు ప్రేమించడమెట్లో నేర్చుకోలేరు. కాని ద్వేషమననేమిటో జాగ్రత్తగా గమనిస్తూ, మెల్లగా దానిని తొలగించుకోవచ్చు. ద్వేషభావనతో పోరాటం పెట్టుకోకండి. "ప్రజలను ద్వేషించడం ఎంత దారుణమైనపని" అని అనకండి. కాని అసలు ద్వేషమంటే యేమిటో శ్రద్ధగా గమనిస్తూ దానిని మెల్లగా జారి

పోనివ్వండి. దానిని ప్రక్కకు త్రోసివేయండి. నిజానికది ముఖ్యంకాదు. ముఖ్యమేమంటే ద్వేషము మీ మనస్సులో నాటుకోకుండా వుండడం. అర్థమౌతున్నదా? మీ మనస్సు సారవంతమైన భూమిలాంటిది. తగినంత అవకాశమే యిస్తే, అడ్డంవచ్చిన ప్రతిసమస్య మడిలోని కలుపు మొక్కవలె సారవంతమైన ఆ మనోభూమిలో నాటుకపోతుంది. అప్పుడు దానిని లాగిపారవేయుడం కష్టసాధ్యమవుతుంది. ఆ సమస్యకు నాటుకొనడానికి తగినంత సమయం మీరీయకపోతే, దానికప్పుడు పెరగడానికి అవకాశంలేక వాడిపోతుంది. ద్వేషానికి ప్రోత్సాహమిస్తే, వేరూనడానికి పెరగడానికి పక్వమవడానికిన్ని తగినంత సమయమిస్తే, అది యొక బ్రహ్మాండమైన సమస్యగా తయారై కూర్చుంటుంది. అట్లుగాక ద్వేష భావన తలయెత్తినప్పుడెల్ల దానిని పట్టించుకోకుండ దానిదారిన దానిని పోనిస్తే అప్పుడు మీ మనస్సు భావుకత లోనికి జారుకోకుండా మిక్కిలి సున్నితము సూక్ష్మగ్రాహకమవుతుంది; కాబట్టి అట్టి మనస్సే ప్రేమ నెఱుగ గలదు.

ఇంద్రియాల ద్వారా జ్ఞానమును పొందడం కోసం, కోరికలను తీర్చు కోడం కోసం మనస్సు ప్రయత్నించవచ్చు. కాని ప్రేమనుమాత్రం ప్రయత్నించి సాధించుకోలేదు. ప్రేమయే మనస్సు వద్దకు రావాలి. ప్రేమంటూవుంటే దానిలో ఇంద్రియ సంబంధమగు శారీరక ప్రేమయని, దివ్యప్రేమయని విభాగముండదు. ప్రేమంటే ప్రేమే.... అదే అందులో వుండే అసాధారణ విషయము. ఆ గుణమొక్కటే సృష్టి తత్త్వమంతను పూర్తిగా అర్థము చేసికొనడంలో సహాయపడగలది.

4. ప్రశ్న:- జీవితంలో సుఖమంటే యేమిటి?

కృష్ణమూర్తి:- మీ మనస్సునకు సంతోషాన్ని కలిగించేపని చేస్తే మీకు సుఖం కలుగుతుందని అనుకొంటారు. చాల గొప్ప ధనవంతులం కావాలని లేదా చాల అందమైన బాలికను పెండ్లి చేసికోవాలని అనుకొంటారు. ఏదో పెద్ద పరీక్ష పాసుకావాలని, అందరూ మిమ్ము

మెచ్చుకోవాలని అనుకొంటారు. ఈ విధంగా మీరు కోరుకొనే కోరికలన్నీ నెరవేరితే సుఖం కలుగుతుందని అనుకొంటారు. కాని అది నిజంగా సుఖమేనా? ఆ సుఖము త్వరలోనే నశించదా? ప్రొద్దున వికసించి సాయంకాలానికి వాడిపోయే పువ్వులాంటిది కాదా ఆ సుఖము? కాని అదే మన జీవితం, అదే మనం కోరుకొనేది. అటువంటి పైపై విషయాలతోనే మనం తృప్తిపడతాం. మనకొక కారువుంటే, ఏదైన మంచి యుద్యోగం, సురక్షితమైన పదవి దొరికితే, ఏదో యొక పనికిమాలిన విషయముపై కొంత భావావేశం కలిగితే దానితో తృప్తి పడతాం. ఆ సుఖమెట్లాంటిదంటే చిన్నపిల్లవాడు తీవ్రంగా వీస్తూవున్న గాలిలో గాలి పటాన్ని యెగురవేసి సంతోషించడంలాంటిది. ఆ సుఖము క్షణభంగురము. కొద్దిసేపట్లోనే వాడు ఏడుస్తూ కన్నీళ్ళు కార్చడం మొదలుపెడతాడు. అటువంటిది మనజీవితం. దానితో మనం తృప్తి పడతాం. అంతేకాని, "నా హృదయాన్ని, నా శక్తిని, నా సర్వస్వాన్ని ధారవోసి నిజమైన సుఖమంటే యేమిటో కనుక్కొంటా" మని మనమెన్నటికిని అనము. మనం దీనిని తీవ్రమైన విషయంగా తీసికోము, దీని గురించి గట్టిగా మనసుకు పట్టించుకోము. అల్ప విషయాలతో సంతృప్తి చెందుతాం.

అయితే, సుఖమనేది ప్రయత్నించి సాధించుకొనేది కాదు. అది మనము కోరుకోకుండా దానంతట వచ్చెడి ఒక సిద్ధి. మీరు కేవలం సుఖం కోసం ప్రయత్నంచేస్తే ప్రయోజనం లేదు. అది పిలిస్తే వచ్చేది కాదు, కోరుకొంటే కలిగేది కాదు. మీరు సుఖంగా వున్నట్లు మీ మనస్సునకు తట్టిన మరుక్షణంలో ఆ సుఖ మదృశ్యమైపోతుంది. మీరీ విషయాన్ని గమనించలేదని నా అనుమానం. ఏకారణము లేకుండ మీలో తటాలున ఆనందానుభూతి కలిగితే అప్పుడు మీ పెదవులమీద చిరునవ్వు కనిపిస్తుంది. ఆ సుఖము విముక్తస్థితి ఫలితము. కాని సుఖంగా వున్నట్లు మీ మనస్సునకు తట్టిన క్షణమే ఆ సుఖము అంతర్ధానమైపోతుంది. మనసా ఎరిగి యెరిగి సుఖంగా వుండడమంటే, లేదా సుఖాన్వేషణ చేయుడమంటే సుఖమునకు మంగళహారతి పట్టడమే. మీ మనస్సును అందరి కోరికలున్ను వైదొలగినప్పుడే సుఖము దర్శనమిస్తుంది.

మీరు గణితం గురించి ఎంతో చదువుకొన్నారు. దేశచరిత్ర భూగోళ శాస్త్రం, సామాన్య విజ్ఞాన శాస్త్రం, పదార్థ విజ్ఞాన శాస్త్రం, జీవశాస్త్రం — ఇంకా ఏవేవో చదవడానికి మీరు కాలమంతా వెచ్చిస్తున్నారు. కాని ఉపేక్షింపరాని అతి ముఖ్యములైన యీ పై విషయాలగురించి మీరుగాని మీ ఉపాధ్యాయులుగాని యే మాత్రమైనా కాలాన్ని వెచ్చించినారా? మీరెప్పుడైనా వెన్నెముకను నిటారుగా నిలిపి, (పద్మాసనంలో) కదలకుండా, మౌనంగా కూర్చుండి, ఆ మౌనస్థితిలోని అందమును, ఆనందమును ఆస్వాదించినారా? ఎప్పుడైనా మీ మనస్సును అల్ప విషయాలమీదికి పోనీకుండా, విశాలమై గంభీరమైన విషయాలమీదికి స్వేచ్ఛగా పోనిచ్చి సత్యమును అన్వేషించి దర్శించినారా?

ఈ ప్రపంచంలో ఏమి జరుగుతున్నదో మీకు తెలుసునా? మన ప్రతియొక్కరిలోను ఏమి జరుగుతున్నదో అదే బయటి ప్రపంచంలోను జరుగుతున్నది. మనమెట్లున్నామో ప్రపంచమట్లా వున్నది. మనలో చాలమందిమి అశాంతిలో పడి కొట్టుకొంటున్నాము. అంతా మనకే కావాలి అని ప్రతిదీ కూడ బెట్టుకొంటున్నాము. చూచిన దానినెల్ల మన సొంతం చేసికోవాలనుకొంటున్నాము. ఇతరులను చూచి, ఓర్చుకోలేము. ప్రతివానిని నీది తప్పని నిందిస్తుంటాము. సరిగ్గా అదే జరుగుతున్నది బయటి ప్రపంచంలో కూడ; అయితే యింకొంచెం నాటక ఫక్కీలోను, ఇంకొంచెం క్రూరంగాను — అంతే తేడా. అయితే మీరుగాని, మీ ఉపాధ్యాయులుగాని దీనినంతను గూర్చి ఆలోచించడానికి ఏ మాత్రమైనా సమయమును వెచ్చించరు. అట్లుగాక ప్రతిదినం యీ విషయాల గురించి లోతుగా, తీవ్రంగా ఆలోచించడానికై మీరు కొంత సమయాన్ని వెచ్చిస్తూవుంటే, అప్పుడు మాత్రమే సంఘంలో సంపూర్ణ పరివర్తనము తేవడానికి, క్రొత్త ప్రపంచాన్ని సృష్టించడానికి బహుశా అవకాశముంటుంది. క్రొత్త ప్రపంచాన్ని సృష్టించడం చాల అవసరమని నేను నమ్మకంగా చెబుతున్నాను. క్రొత్త ప్రపంచమంటే నేటి యీ క్రుళ్ళిన సమాజమే మరియొక రూపంలో కొనసాగడం కాదు. మీ మనస్సు చురుకుగా వుండి, మెలకువ గలిగి, ప్రతిదానిని గమనిస్తూ వుండకపోతే క్రొత్త

ప్రపంచాన్ని సృష్టించలేరు. అందువలన మీరు చిన్నవాండ్లుగా వున్నప్పుడే చాల గంభీరమై, ఉపేక్షింపరాని యీ విషయాలను గూర్చి పర్యాలోచిస్తూ కొంత సమయాన్ని గడపడం చాల అవసరం. బడిలో బోధించే ఏవో కొన్ని పాఠ్య విషయాలను మాత్రమే చదువుతూ రోజులు గడిపే శారంటే దానివలన ఏదో యొక వుద్యోగం రావడం తుదకు మృత్యువు తప్ప మరియొక ప్రయోజనమేమీ వుండదు. కాబట్టి యీ విషయాలనన్నిటిని మీరు చాల తీవ్రంగా ఆలోచించాలి. ఆ యాలోచనవలన అపూర్వమైన ఆనందానుభవము, సుఖానుభవముంటుంది.

5. ప్రశ్న:- నిజమైన జీవితమనగా నేమి?

కృష్ణమూర్తి:- "నిజమైన జీవితమనగా నేమి" — ఈ ప్రశ్న వేసేది ఒక చిన్న పిల్లవాడు. ఆటలాడడం, మంచి తిండి తినడం, పరుగెత్తడం, దుముకడం, త్రోసుకోవడం — ఇదీ అతనికి నిజమైన జీవితం. చూశారా, మనం జీవితాన్ని వాస్తవమైనదని, అవాస్తవమైనదని రెండుగా విభజించుతాం. వాస్తవమైన జీవితమంటే మీరు ప్రేమించే పనిని, అందులో పూర్తిగా లీనమైపోయి చేయడం. అట్టి జీవితంలో అంతర్విరోధముండదు; తలపులకు చేతలకు పొందిక లేకపోవడమంటూ వుండదు. మీరు సేదానికి చేయవలెనని అనుకొన్నదానికి మధ్య పోరాటముండదు. తమప్పుడొక అఖండమైన, అవిభక్తమైన ప్రక్రియ; ఏకతానముగా సాగునట్టిది. అందులో అత్యంతానందముంటుంది. అట్టి స్థితి రావాలంటే మానసికంగా మీ రేవ్యక్తిమీదను, సంఘము మీదను ఆధారపడరాదు. ఆంతరికంగా సంపూర్ణ వైరాగ్యముండాలి. అప్పుడు మాత్రమే మీరు మీ ప్రేమించిన పనిని చేయడానికి, చేసే పనిని ప్రేమించడానికి అవకాశముంటుంది. మీలో సంపూర్ణ పరివర్తనము కలిగినపుడు మీరు తోటమాలిగా పనిచేస్తున్నా దేశమునకు ప్రధానమంత్రిగా వున్నా, లేక మరింకే పనిని చేస్తున్నా ఒకటే. అప్పుడు మీరు చేసే పనిని మీరు ప్రేమిస్తారు. ఆ ప్రేమలో నుండి అపూర్వమైన సృజనాత్మకభావన కలుగుతుంది?

7 జనవరి, 1955

విముక్తమగు మనస్సు

నేర్చుకోవడమంటే యేమిటో తెలిసికోవడం చాల ఆసక్తిదాయకంగా వుంటుంది. అది మీకు తెలుసా? గణితము, భూగోళ శాస్త్రము, దేశచరిత్ర మొదలైనవి ఏదైనా పుస్తకం చదివిగాని, లేదా ఎవరైనా ఒక ఉపాధ్యాయుడు చెబితే విని గాని నేర్చుకొంటాము. అట్లే లండను, ఎక్కడ వున్నదో, మాస్కో ఎక్కడవున్నదో, న్యూయార్కు ఎక్కడ వున్నదో తెలిసికొంటాం. ఏదైనా యంత్రం ఎట్లా పనిచేస్తుంది, పక్షులు తమగూళ్ళ నెట్లా కట్టుకొంటాయి, అవి తమపిల్లల భద్రత కోసం ఏమి చేస్తాయి — ఇటువంటి విషయాలను గూడ పరిశీలనగా చూచిగాని, పుస్తకాలు చదివిగాని, ఉపాధ్యాయులు చెబితే వినిగాని మనం నేర్చుకొంటాం. నేర్చుకోడంలో ఇది యొక మార్గము.

ఇక నేర్చుకోడానికి మరియొక మార్గం లేదా? స్వానుభవం వలన గూడ మనం నేర్చుకోమా? మనం నదిలో ఒక పడవను, దాని తెరచాపలను, అవి నిశ్చలమైన నీటిలో ప్రతిబింబించడాన్ని చూస్తే అది ఎంతో అద్భుతమైన అనుభవంకాదా? అప్పుడేమి జరుగుతుంది? మనస్సు తనకింతకు ముందు తెలిసి యున్న విషయాలతో బాటు ఈ అను౽ వాన్ని కూడ తనలో భద్రపరచుకొంటుంది. మరునాడు సాయంకాలం ౽ పడవను మళ్ళీ చూద్దామని, చూచి, క్రిందటి నాటి వలె ఆనందానుభవ మును పొందుదామని జీవితంలో ఎప్పుడో అరుదుగాగాని లభించని శాంతిని మరల ఒక సారి పొందుదామని, అక్కడికి వెళ్ళుతాము. మనస్సీవిధంగా తానుపొందిన అనుభవాలను పట్టుదలతో తనలో భద్రంగా నిలువచేసి కొంటూ వుంటుంది. "స్మృతి" లేదా "జ్ఞప్తి" యని పిలువబడే ఆయనుభవాల రాశియే కాదా ఆలోచనలకు మూలము? ఆలోచించబడ

మని మనము దేనినంటామో అది స్మృతిమూలకము. నదిలో పడవను చూచి, ఆనందమనుభవించి, ఆయనుభవాన్ని జ్ఞప్తిరూపేణ భద్రపరచుకొనియుండి, మరల ఇంకొకసారి దానిని అనుభవింపగోరుతాము. ఈ విధంగా ఆలోచనా ప్రక్రియ కొనసాగుతూ వుంటుంది, అవునుకదా?

చూశారా, ఆలోచించడమెట్లో మనలో చాలతక్కువ మందికే తెలుసు. మనలో చాలమంది ఏదో పుస్తకంలో చదివిన దానిని లేదా ఎవరైనా మనకు చెప్పిన దానిని తిరిగి ఒప్పజెప్పుతూ వుంటాం. మన ఆలోచన మిక్కిలి పరిమితమైన మన అనుభవాలనుండి మాత్రమే సాగుతుంటుంది. మనము ప్రపంచమంతా పర్యటించినా, అసంఖ్యాకమైన అనుభవాలను పొంది, వివిధ ప్రజలను గలిసికొని వారు చెప్పినదంతా విని, వారివారి అలవాట్లను మతములను, ఆచారవ్యవహారములను గమనించి అదంతా మనమనస్సులో జ్ఞాపక ముంచుకొంటాం. దానిమీద ఆధారపడి మనం మన ఆలోచనలను సాగిస్తూవుంటాం. ఒక దానితో మరియొకదానిని పోల్చడం, వాని బాగోగులు విమర్శించడం తుదకొకదానిని ఎన్నుకోవడం — ఈ ప్రక్రియ ద్వారా జీవితమునెడల మనమవలంబించవలసిన ఒక సక్రమ వైఖరిని కనుగొన గలమని ఆశిస్తాం. కాని ఆ విధమైన ఆలోచన చాల పరిమితమైనది; అది ప్రసరింపగల క్షేత్రము చాల చిన్నది. నదిలోని పడవను, స్మశానానికి తీసికొని పోతున్న శవమును, ఒక బరువైన మోపును మోయుచున్న పల్లె పడుచును చూడడం లాంటి అనుభవాలు మన మనస్సులో ముద్రింపబడి వుంటాయి. కాని మన మనస్సులు ఎంతగా కొరడు పారి వుంటాయంటే, ఆయనుభవాలు మనలో లోతుగా దిగవు, పక్కానికి రావు. మన చుట్టూరా వున్న ప్రతి దానికి మనం స్పందిస్తూ వున్నప్పుడు మాత్రమే వివిధ సంస్కారములచే నిబద్ధముగాని క్రొత్తదగు ఆలోచనావిధానము మనలో ఆరంభమౌతుంది. మన మాలోచించే తీరులోనే మార్పు వస్తుంది.

మీరొక విధమైన నమ్మకాలను వదలక గట్టిగా పట్టుకొని వుంటే ఆ నమ్మకాల మీదగల దురభిమానం తోనే ప్రతి దానిని చూడడం మొదలు

పెట్టుతారు. అంతేగాని సత్యముతో మీకెట్టి సంబంధమును వుండదు. పల్లెపడుచులు పెద్ద పెద్ద బరువులను తల మీద పెట్టుకొని పట్టణమునకు మోసికొని పోతూవుంటే మీరెన్నడైనా చూచారా? చూచినప్పుడేమి జరుగుతుంది? మీకెట్టి అనుభూతి కలుగుతుంది? లేక ఇటువంటి స్త్రీలను చాల మందిని మీరనేక పర్యాయాలు చూచివుండడం చేత బాగా అలవాటు పడిపోయి వాండ్లను గమనించనే గమనించరా? గమనించినా మీమనస్సులకు పట్టదా? పోనీ, మొదటిసారిగా మీరు దేనినైనా గమనిస్తే ఏంజరుగుతుంది? మీరు మీమీ దురభిమానాలు, దుర్భ్రమలకనుగుణంగా మీరు చూచిన దానికి మీరు యాంత్రికంగా (ఏమీ ఆలోచించకుం డానే) అర్థము చెప్పకోరా? అప్పుడు సామ్యవాదిగానో, సమాజవాదిగానో, భూస్వామ్యవాదిగానో లేక మరొకవాదిగానో మీ మీ సంస్కారాలక నుగుణంగా మీ మీ అనుభవాలు, ఆలోచనలు వుంటాయి. అయితే యిందులో ఎవరును మీరు గాకపోయినచో ఆయా నమ్మకాలు, అభిప్రా యాలనే తెరగుండా చూడరు గాబట్టి అప్పుడు మీరు దేనిని చూస్తా దానితో మీకు సాక్షాత్సంపర్కము కలిగి మీకున్ను మీరు చూచిన దానికి మధ్య ఎంతో అద్భుతమైన సంబంధమొకటి వున్నట్లు గమనింపగలరు. మీకు దేని యందును దురభిమానంగాని, పక్షపాతంగాని లేని యెడల, మీ మనస్సులు నిర్మలములై వున్నయెడల, అప్పుడు మీ చుట్టూ వున్న సృష్టియంతయు అత్యంత సజీవమై అపూర్వ మనోహరమై కనిపిస్తుంది.

అందువలన మీరు చిన్నవారుగానున్నప్పుడే యీ విషయాల నన్ని టిని గమనించడం చాల అవసరం. నదిలో పోతున్న పడవను, నది మీద పోతున్నరైలును, పెద్ద బరువుమోయుచున్న పొలంకాపును — అందరినీ, అన్నిటినీ జాగ్రత్తగా గమనించండి. ధనవంతుల దురుసుతనాన్ని, మంత్రులు తదితర ప్రముఖుల అహంకారాన్ని అన్నీ తమకే తెలుసునను కొనేవారి గర్వాన్ని చక్కగా పరిశీలించండి. వాండ్ల తీరును గమనించండి. అంతే గాని విమర్శించకండి. మీరు విమర్శించిన మరుక్షణం వారికిని మీకును గల సంబంధము తెగిపోతుంది. మీకును వారికిని మధ్య అడ్డుగోడ యేర్పడుతుంది. అట్లుగాక కేవలం పరిశీలనగా గమనిస్తూ వున్నట్లయితే

అప్పుడు ప్రజలతోను పదార్థములతోను మీకు ప్రత్యక్ష సంబంధమేర్పడు తుంది. మీరు, ఎట్టి విమర్శ చేయకుండా ఎట్టి నిర్ణయానికి రాకుండా ఏమరుపాటు లేకుండా ప్రతిదానిని సూటిగా చూడగల్గితే, మీ ఆలోచన అద్భుతంగా పదునవడం గమనిస్తారు. అప్పుడు మీరు నేర్చుకొనే దానికి అంతరాయమంటూ వుండదు. నిరంతరము నేర్చుకొంటూనే వుంటారు.

మీ చుట్టూర, ఎటు చూచినా జనన మరణాలు, ధనంకోసం పదవికోసం అధికారంకోసం పెనగులాటలు, తుదిమొదలులేని సాంసారిక జీవితమున్ను కనిపిస్తాయి. మీరు చిన్నవాండ్లే అయినప్పటికిన్ని 'ఇదంతా యేమి'టని ఎప్పుడో ఒక సారైనా ఆశ్చర్యపడరా? చూశారా, ప్రతిదానికిన్ని మనకు సమాధానం కావాలి. ఇదంతా యేమిటో మనకెవరో చెప్పాలి. అందుకోసం యేదో రాజకీయ గ్రంథమో, ధార్మిక గ్రంథమో తీసికొని చదవడం మొదలుపెడతాం. లేదా, మనకు దాని గురించి చెప్పమని ఎవరినో అడుగుతాం. కాని ఎవరూ మనకు చెప్ప లేరు. జీవితమనేది పుస్తకాలు చదివి అర్థంచేసికొనేదికాదు. ఎవరికో శిష్యరికం చేసిగాని ఏవైనా ప్రార్థనలు చేసిగాని దాని ప్రాముఖ్యాన్ని గ్రహించలేము. దానిని ఎవరంతట వారు గ్రహించవలసిందే. దానిని గ్రహించవలెనంటే మనం చాల చురుకుగా, అప్రమత్తంగా వుండాలి. జాగ్రత్తగా ప్రతిదానిని గమనిస్తూ వుండాలి. మన చుట్టూరా వున్న ప్రతిదానియందును శ్రద్ధ చూపాలి, ఆసక్తి చూపాలి, అప్పుడే అసలు సుఖమంటే యేమిటో తెలిసికోగల్గుతాము.

చాలమంది యొక్క జీవితాలలో సుఖసంతోషాలంటూ వుండవు. దానికి కారణం వారి హృదయాలలో ప్రేమభావన అంటూ లేకపోవడమే. మీకును మరియొకరికిని మధ్య అడ్డుగోడలు లేకపోతే, ఎవరినైనా కలిసి కొన్నప్పుడు వారి తప్పొప్పులవైపు మన దృష్టి పోకుండా విమర్శించకుండా వారిని గమనించి చూడ గల్గితే, నదిలో తెరచాపెత్తికొని పోవుచున్న పడవను చూచి దాని సౌందర్యమున కానందింపగల్గితే, అప్పుడు మీ హృదయాలలో ప్రేమ ఉత్పన్నమవుతుంది. దేనినైనా యథాతథంగా

చూడగలగాలి, అంతేగాని మీ పిచ్చితలంపులు మీ దృష్టికడ్డురాగూడదు. శ్రద్ధగా అవలోకించిన చాలును. కేవల మిట్టి అవలోకనము వలన చెట్లను, పక్షులను, మనుష్యులు నడవడాన్ని, పనిచేయడాన్ని, చిరునవ్వు నవ్వడాన్ని ఇట్లా ప్రతిదానిని మెలకువతో గమనించుచుండడం వలన మీలో ఏదో మార్పురావడం కనుగొంటారు. మీలో ఈ అపూర్వ పరివర్తనము కలుగనిదే, మీ హృదయంలో ప్రేమ ఉద్బుద్ధము కానిదే, జీవితము సార్థకముకాదు. ఈ అన్ని విషయాల ప్రాముఖ్యమును తెలిసికోవడంలో మీకు సహాయపడడం కోసం మును ముందుగా మీ విద్యాబోధకులకు విద్య బోధించడం చాల అవసరము.

1. ప్రశ్న:- భోగమయ జీవితము నడుపవలెనని మనమెందుకు కోరుకొంటాము?

కృష్ణమూర్తి:- భోగమయ జీవితమంటే యేమిటి? శుభ్రమైన బట్టలు వేసికోవడం, శరీరాన్ని శుభ్రంగా వుంచుకోవడం, మంచి తిండి తినడం — దీనిని మీరు భోగమయ జీవితమంటారా? అయితే యివే తిండి లేని వానికి, గుడ్డపేలికలు కట్టుకొనేవానికి, ప్రతిదినం స్నానం చేయలేని వానికి భోగములుగా కనిపిస్తాయి. అందువలన భోగములనేవి వారి వారి కోరికలను బట్టి, మనిషి మనిషికీ భేదిస్తాయి. ఇదంతా తరతమ భావములకు సంబంధించిన విషయము.

భోగమయ జీవితాన్ని మీరు కోరుకొనేటట్లయితే ఎల్లప్పుడు సోఫా మీదనో, మెత్తని కుర్చీలోనో సుఖంగా కూర్చోవాలని మీరు కోరుకొంటూ వుంటే ఏం జరుగుతుందో తెలుసునా? మీ మనస్సుకు నిద్రమత్తెక్కువవుతుంది. కొంత శరీర సౌఖ్యం వుండడం మంచిదే కాని దాని కెక్కువ ప్రాధాన్యమిస్తే మనస్సు నిద్ర పోవడం మొదలు పెడుతుంది. లావుపాటి మనుషులు చాలమంది ఎంత సుఖంగా వుంటారో ఎప్పుడైనా గుర్తించారా? వాండ్ల శరీరం మీద పొరలు పొరలుగా క్రొవ్వు పేరుకొని పోవడంచేత వాండ్లు దేనికిన్నీ తొందరగా కలతచెందరు. ఇది

వారి శరీర పరిస్థితి. కాని మనస్సులో గూడ ఈ క్రొవ్వు పొరలే ర్పడతాయి. అట్టి మనస్సుకు ఎవరైనా వచ్చి తన్ను ప్రశ్నించడం, తన శాంతికి భంగం కలిగించడం ఇష్టముండదు. అటువంటి మనస్సు మెల్లమెల్లగా నిద్రలోకి జారుకొంటుంది.. మనమిప్పుడు విద్యయని దేనిని పిలుస్తున్నామో అది విద్యార్థిని మామూలుగా నిద్రపుచ్చేది. ఎందుకంటే, అతడు నిజంగా వాడిగా సూటిగా ప్రశ్నిస్తే – అంతర్యమును బయటికిలా గగల ప్రశ్నలు వేస్తే, ఉపాధ్యాయుడు కలతచెంది, ఏమి జవాబివ్వవలెనో తోచక, "ముందు పాఠం కానీయండి" అని తప్పించివేస్తాడు.

కాబట్టి మన మనస్సు ఏదైనా ఒక సౌకర్యానికి గాని, ఒక అలవా టుకు గాని, ఒక నమ్మకానికిగాని, 'మాయిల్లు' అనిచెప్పకొనే ఒక స్థలా కిగాని కట్టుబడి పోయినట్టయితే అప్పుడది మెల్లగా నిద్రపోసాగుతుంది. ఈ విషయం అర్థం చేసికోవడం ముఖ్యం. అంతే గాని భోగమయ జీవితం గడుపుతున్నామా లేదా అనేది ముఖ్యం కాదు. ఎల్లప్పుడును చురుకుగా అప్రమత్తంగా, మెలకువతో వుండే మనస్సు శరీర సౌఖ్యానికి ఎన్నటికిని కట్టుబడిపోదు, భోగమయ జీవితమును అదికోరదు. దానిని అది లెక్క సేయదు. ఏవో అల్పంగా గుడ్డలు ధరిస్తాడన్న మాత్రాన, అట్టి వాని మనస్సు హెచ్చరిక గలిగి అప్రమత్తంగా వుంటుందనడానికి వీలులేదు. పైకి చూడడానికి చాల సాదాగా, నిరాడంబరంగా వుండే సన్న్యాసి లోలో లగూడ అట్లే వుంటాడనడానికి వీలులేదు. అతని మనస్సు సంకీర్ణమై, శీల్యమును పెంపొందించుకొన ప్రయత్నిస్తూ సత్యమును, దైవమును సాక్షాత్కరింప గోరుతూ వుండ వచ్చును. ఇంతకును ముఖ్యమేమిటంటే మనిషి యొక్క మనస్సు మిక్కిలి నిర్మలంగా నిరాడంబరంగా పవిత్రంగా వుండాలి, నమ్మకాలతో భయాలతో లెక్కలేని కోరికలతో నిండిపోయి యుండరాదు. అట్టిమనస్సే సరిగా ఆలోచింప గలదు. అన్వేషింపగలదు, కనుగొనగలదు.

2. ప్రశ్న:- మనం మన పరిసరాలతో పోరాటంసల్పుతూ వున్నంత కాలం జీవితంలో శాంతి వుంటుందా?

కృష్ణమూర్తి:- పరిసరాలతో పోరాటం సల్పవలసిన అవసరం లేదా? వాటిని భేదించుకొని బయటికి రానక్కర లేదా? మీ తల్లిదండ్రుల నమ్మకాలు, మీరున్న సంఘముయొక్క పూర్వచరిత్ర, మీ సంప్రదాయాలు, మీరు తినే ఆహారము, మీ చుట్టూ వుండే మతము, పూజారి, పురోహితుడు, ధనవంతుడు, బీదవాడు — ఇవన్ని కలిసి మీ పరిసరాలవుతాయి. ఆ పరిసరాలను ఎదురు తిరిగి ప్రశ్నించి, వాటిపై తిరుగబడి, వాటిని భేదించుకొని బయటికి రావద్దా? మీరు తిరుగబడకపోతే, మీ పరిసరాలకు ఊరక లొంగి పోతే అప్పుడొక విధమైన శాంతి వుంటుంది. కాని అది మృత్యు శాంతి, జీవము లేని శాంతి. అట్లుగాక గట్టి ప్రయత్నంతో మీ పరిసరాలను భేదించుకొని బయటికి వచ్చి సత్యమేదో మీ యంతట మీరు తెలిసికొన గల్గితే, అప్పుడు లభించే శాంతి మరియొక విధమైనది. ఆ శాంతి నిలువ నీటివలె జీవము లేనిదికాదు. కాన పరిసరాలతో పోరాటము చాల అవసరము; అది తప్పదు. కాబట్టి శాంతి కాదు ముఖ్యము, పరిసరాల నర్థము చేసికొని, వాటిని బ్రద్దలుకొట్టుకొని బయటికి రావడం ముఖ్యము. అప్పుడే శాంతి లభిస్తుంది. అట్లుగాక పరిసరాలకు లొంగి పోవడం ద్వారా శాంతి రావాలని కోరితే నిద్రమత్తు మిమ్మలిని క్రమ్మివేస్తుంది. దానికంటే చావడంమేలు. అందుచేత చాల చిన్నవయస్సునుండి మీలో తిరుగబడే స్వభావముండాలి. అదిలేనిచో కేవలం క్షయించిపోతారు, ఏమి పోరా?

3. ప్రశ్న:- మీరు సుఖంగా వున్నారా లేదా?

కృష్ణమూర్తి:- నాకు తెలియదు, నేను దానిగురించి ఎన్నడును ఆలోచించలేదు. సుఖంగా వున్నామని మీ రనుకొన్న మరుక్షణం మీరు సుఖవంతులుకారు, మీ సుఖమాగిపోతుంది, పోదా? మీరు ఆనందంతో కేరింతాలు కొడుతూ ఆడుకొంటూ వున్నప్పుడు, తటాలున మీరానందంగా వున్న విషయం మీ మనస్సునకు తట్టగానే ఏమవుతుంది? మీ ఆనందం ఆగిపోతుంది. ఇది మీరు గ్రహించారా? అందువలన సుఖమనేది, మీరాసంగతి గుర్తించ గానే తొలగిపోవునట్టిది.

మంచి వాండ్లుగా వుండాలని మీరు ప్రయత్నిస్తే, మంచివాండ్లవుతారా? మంచితనమనేది సాధన చేస్తే వచ్చేదా? లేక ప్రతిదానిని చూస్తూ జాగ్రత్తగా గమనిస్తూ, అవగాహన చేసికొంటూ వుంటే దానంతట అది సహజంగా వచ్చేదా? అదే విధంగా సుఖంగావున్నామని మీ మనస్సునకెప్పుడైతే తట్టుతుందో అప్పుడే ఆ సుఖము కిటికీ గుండా అంతర్థానమైపోతుంది. సుఖాన్వేషణ మనేమాట అసంబద్ధమైనది, అసంగతమైనది. ఎందువల్లనంటే సుఖంకోసం అన్వేషణ చేసినంతకాలము అది రాదు; అన్వేషణ మానివేయగనే అది సిద్ధిస్తుంది.

వినయము అనేమాటకు అర్థమేమిటో తెలుసునా? మీరు వినయాన్ని కృషిచేసి అభివృద్ధి చేసికోగలరా? ప్రతిదినము ప్రొద్దున్నే లేచి "నేనికమీదట వినయంగా వుంటాను" అని జపంచేస్తూ వుంటే వినయం గలవారలౌతారా? లేక మీలో గర్వము, అహంభావము తొలగిపోతే, వినయము దానంతట అదే సహజంగా వస్తుందా? అదే విధంగా సుఖనిరోధకములయిన చింత, నిర్వేదము, భద్రతకోసం ప్రయత్నమును నిలిచిపోతే, అప్పుడుండేది సుఖమే!! దానికోసం వేరే ప్రయత్నం చేయనక్కర లేదు.

మీలో ఎక్కువమంది యెందుకని అంత నిశ్శబ్దంగా కూర్చొని వున్నారు? నాతో ఎందుకు చర్చించరు? మీ మనస్సులోని ఆలోచనలను, అభిప్రాయాలను ఎంత చెడ్డగానైనా సరే పైకి చెప్పికోవడం చాల అవసరం. దాని వలన మీకు చాల ప్రయోజనముంటుంది. అది యెందుకో చెబుతా, వినండి. మీ మీ ఆలోచనలను అభిప్రాయాలను, ఎంత సంకోచంతోనైనా సరే ఇప్పుడు పైకిచెప్పకోవడం ఆరంభిస్తే, మీరు పెద్దైన తరువాత మీ పరిసరాలుగాని, తల్లిదండ్రులుగాని, సంఘముగాని సంప్రదాయముగాని — యేదిన్నీ మిమ్ము అణచివేయలేదు. మీ గొంతు నొక్కి వేయలేదు. కాని దురదృష్టవశాత్తు, మీ ఉపాధ్యాయులు మిమ్ములను ప్రశ్నలు వేయడానికి ప్రోత్సహించరు; మీ ఉద్దేశము లేమిటని అడుగరు.

4. ప్రశ్న:- మనమెందుకు ఏడుస్తాము? దుఃఖమంటే యేమిటి?

కృష్ణమూర్తి:- ఒక చిన్న పిల్లవాడు అడుగుతున్నాడు — మనమెందుకు ఏడుస్తామని, దుఃఖమంటే యేమిటని. మీరు ఎప్పుడు ఏడుస్తారు? మీరాడుకొనే బొమ్మను ఇంకెవరైనా తీసికొనిపోతే, లేదా మీకు దెబ్బ తగిలితే, లేదా మీరు ఆటలో ఓడిపోతే లేదా మీ ఉపాధ్యాయులుగాని, తల్లిదండ్రులుగాని మిమ్ము తిడితే, లేదా ఎవరైనా మిమ్ము కొడితే మీరు ఏడుస్తారు. మీరు పెద్దవారయ్యే కొలది ఏడవడం క్రమంగా తగ్గిపోతుంది. ఎందుకనంటే జీవితాన్నెదుర్కొనడంలో మీరు గట్టిపడిపోతారు. పెద్దైన తరువాత గూడ ఏడ్చేవాళ్ళు మనలో చాల తక్కువ మంది మాత్రమే. ఎందువల్లనంటే, చిన్న తనంలో వుండే మెత్తని మనస్సు పెద్దైతే వుండదు, దాని అపూర్వమైన సున్నితత్వము నశించిపోతుంది. కాని దుఃఖమనేది మన మేదైనా పోగొట్టుకొంటేనో, ఎవరైనా మన కష్టం తగిలితేనో మనకాశాభంగము కలిగితేనో వచ్చేది మాత్రమే కాదు. దుఃఖమనేది చాల లోతైనది. అవగాహన లేకపోవడమనే స్థితి యొకటున్నది. అవగాహన లేనప్పుడు దుఃఖముంటుంది. మనస్సు తాను కల్పించుకొన్న అడ్డుగోడలను దాటి ముందుకు పోలేకపోతే అది యొక పెద్ద దుఃఖమే.

5. ప్రశ్న :- ఘర్షణ లేకుండ మనమెట్లు సమగ్రతను సాధింపగలము?

కృష్ణమూర్తి :- ఘర్షణ వుండగూడదని మీరెందుకను కొంటారు? దానినెందుకు ఆక్షేపిస్తారు? ఘర్షణ మిక్కిలి దారుణమైనదని మీరనుకొంటున్నట్లున్నది. ప్రస్తుతము మీకును నాకును మధ్య ఘర్షణమున్నది. మనం ఘర్షణ పడుతున్నాము — పడడం లేదా? నేనేదో మీకు చెప్పడానికై ప్రయత్నిస్తున్నాను, కాని మీరర్థము చేసికోవడం లేదు. అందువలన మనిద్దరి మధ్య ఇప్పుడు ఘర్షణ వున్నది, అశాంతి వున్నది. అయితే దానివలన తప్పేమి? మీ శాంతికి భంగము కలుగకూడదా? మీరెంత ప్రయత్నించినా, ఘర్షణ లేకుండా సమగ్రత రాదు. ఘర్షణ ద్వారా,

ఆ ఘర్షణను అర్థం చేసికొనడం ద్వారానే, సమగ్రత లభిస్తుంది.

సమగ్రత చాల దుర్లభమైన వాటిల్లోనొకటి. సమగ్రత అనగా త్రికరణ శుద్ధి. అంటే మీరు చేసే పనులలో, చెప్పే మాటలలో ఆలోచించే ఆలోచనలలో అభిన్నత్వముండడం. అన్యోన్య సంబంధమును అర్థము చేసికోకపోతే త్రికరణ శుద్ధి కలుగదు. అన్యోన్య సంబంధమనగా సంఘముతో, బీదవానితో పల్లెటూరివానితో బిచ్చగానితో కోటీశ్వరునితో గవర్నరుతో మీకు గల పరస్పర సంబంధమే. ఈ సంబంధాన్ని అర్థంచేసికోవాలంటే దానితో ఘర్షణపడాలి. పరంపరాగతమైన మీ సంప్రదాయము చేతను, తల్లి దండ్రుల చేతను, పూజారి చేతను పురోహితుని చేతను, మతము చేతను, సంఘమందలి ఆర్థికవ్యవస్థ చేతను నిర్ణయింపబడిన విలువల నన్నింటిని మీ రెదురుతిరిగి ప్రశ్నించాలి. అంతేగాని వాటిముందు గుడ్డిగా తలవంచరాదు. అందువల్లనే ఎదురు తిరిగి ప్రశ్నించడం చాల అవసరం, లేకపోతే మీలో త్రికరణ శుద్ధి కలుగదు. సమగ్రత రాదు.

10 జనవరి, 1955

10

అంతస్సౌందర్యము – ప్రేమ

పచ్చపచ్చని పంటచేలు, అస్తమించుచున్న సూర్యుడు, నిశ్చలమైన సరోవరము, మంచుతో కప్పబడి వున్న పర్వత శిఖరములు — వీటినుండి వచ్చి సర్వత్ర వ్యాపించెడి ఒక అద్భుతమైన ప్రశాంతతను మరియు సౌందర్య భావనను మనమెప్పుడో ఒకప్పుడైనా చవిచూచి వుంటాము. ఇంతకును అందమంటే యేమిటి? అది మన మనస్సులో కలిగిన అనుభూతి మాత్రమేనా లేక ప్రత్యక్షానుభూతికి ఇంద్రియానుభవమునకు తోడు మరేదైనా వున్నదా? మీరు వేసికొనే బట్టలను ఎన్నుకోవడంలో మీకు తగినంత నేర్పుంటే, ఒకదానికొకటి పొసగునట్లు రంగులను మీరు ఉపయోగించగలిగితే, మీ ప్రవర్తన గౌరవనీయంగా వుంటే, మీ వాక్కు శాంత గంభీరంగా వుంటే, మీరు తలెత్తుకొని ఠీవిగా నడుస్తూ వుంటే అదంతా అందంగానే పరిగణింపబడుతుంది. ఏమి పరిగణింపబడదా? అయితే అదంతా అంతస్సౌందర్యమునకు బాహ్య వ్యక్తీకరణము మాత్రమే — బుద్ధిస్థమైన దానిని పద్యరూపమునగాని వర్ణచిత్రరూపమున గాని బాహ్యమున వ్యక్తీకరించినట్లు. పచ్చని వరిపొలము నదిలో ప్రతిఫలిస్తూ వుంటే మీరు చూడవచ్చును గాని సౌందర్య భావన మాత్రం మీ మనస్సులో కలుగకపోవచ్చు, దానిని మీరు పట్టించుకోక పోవచ్చు. ఏటి నీటిపై క్రిందుగా ఎగురుతూ పోతున్న వానకోయిలలను ప్రతిదినము చూస్తూవుండే బెస్తవారివలెనే నిర్లిప్తంగా మీరును చూస్తే మీరు వాటిని చూచినను చూడనట్లే. అట్లుగాక అటువంటి దృశ్యముల యందలి అపూర్వసౌందర్యమును మీరు గమనించినట్లయితే మీలో గలిగే మార్పేమిటి? "ఆహా, ఇది యెంత అందంగా వున్నది!" అని మీచేత అనిపించేదేమిటి? ఇట్టి ఆంతరిక సౌందర్యభావనకు మూలమేమిటి? మంచి మంచి గుడ్డలు, అందమైన బొమ్మలు, ఆకర్షకమైన సామాను

లేదా అసలు సామానే లేకుండ, ఒకదానికొకటి అనుగుణమగు కొలతలు గల గోడలు, చక్కని ఆకారముగల కిటికీలు ఇటువంటివన్నీ బాహ్య సౌందర్యాన్ని సూచిస్తాయి. కాని కేవలం బాహ్య సౌందర్యాన్ని గూర్చి నేను మాట్లాడడంలేదు. ఆంతరిక సౌందర్యమునకు మూలమేమని అడుగుతున్నాను.

ఈ ఆంతరిక సౌందర్యముండవలెనంటే సంపూర్ణమగు ఆత్మసమర్పణ (abandonment) అత్యంతావశ్యకము. ఆత్మ సమర్పణలో తన్నెవరో పట్టియుంచినట్లు గాని నిర్బంధములో నున్నట్లు గాని భావన వుండదు (అందులో అనాసక్తి, త్యాగ భావన చేరి వుంటాయి.) ఏక్షణ కోసమై ప్రయత్నమూ లేదు, దేనినీ నిరోధించడమున్నూ లేదు. కాని ఆత్మసమర్పణతో బాటు ఆత్మసంయమము (austerity) లేనిచో అది అస్తవ్యస్తతకు సంక్షోభానికి దారితీస్తుంది. సంయమమంటే తనకున్న కొద్ది పాటితో సంతృప్తి చెందడం, ఇంకా కావలెనని కోరకుండడం. ఆత్మ సమర్పణతో బాటు దృఢమైన ఆంతరిక సంయమము తప్పకుండా వుండాలి. ఇది అత్యంత సులభమైనది కూడ. ఇందులో మనస్సు సాధించుకోవడం, సమకూర్చుకోవడం లేదు. ఇంకా ఎక్కువ కావాలని కోరుకోవడం లేదు. ఇటువంటి ఆత్మసంయమముతో గూడిన ఆత్మసమర్పణ వలన కలిగెడి వినయము లేదా నిరాడంబరత సృజనాత్మక సౌందర్యసిద్ధికి కారణమవుతుంది. కాని ప్రేమభావనలేనిదే వినయమూ లేదు, సంయమమూ లేదు. వినయము, సంయమముల గురించి మీరు చెప్పుకోవచ్చును. కాని ప్రేమభావన లేని వినయము గాని సంయమముగాని బలవంతముగా తెచ్చిపెట్టుకొన్నట్టివి. కాబట్టి ఆత్మ సమర్పణయూ లేనట్లే. ఆత్మ సమర్పణ చేసికొన్నవాడే, తన్ను దాను పూర్తిగా విస్మరించుకొన్న వాడే, ప్రేమ గలవాడు. అట్టివాడే సృజనాత్మక సౌందర్యసిద్ధిని పొందగలవాడు.

సౌందర్యమన్నప్పుడు అందులో బాహ్య సౌందర్యము కూడ తప్పక చేరుతుంది. కాని ఆంతరిక సౌందర్యము లేకుండా, కేవల బాహ్య సౌందర్యము - అనగా ఇంద్రియముల ద్వారా గ్రహింపబడు రూపసౌందర్యము

— మనిషికి అధః పతనము కలిగిస్తుంది. మనోవాక్కర్మల ఐక్యమును చెడగొట్టుతుంది. ఆంతరిక సౌందర్య ముండవలెనంటే మానవులనే కాదు, ప్రపంచమందలి సర్వప్రాణికోటిని సమస్తవస్తు జాతమును గూడ ప్రేమిం చవలెను. [సర్వవ్యాపకమైన ప్రేమభావనయే ఆంతరిక సౌందర్యమునకు మూలము.] అట్టి ప్రేమగలవాడు సర్వప్రాణుల యోగక్షేమముల గూర్చి నిత్యము తీవ్రముగా చింతిస్తుంటాడు. ప్రతిదానిని మిక్కిలి మెలకువతో గమ నిస్తుంటాడు, అంతము లేని ఓర్మి గలిగి వుంటాడు. గాయకునిగా గానపద్ధతి, కవిగా కవిత్వలక్షణము మీకు క్షుణ్ణముగా తెలిసి యుండవచ్చు. బొమ్మలకు రంగులెట్లు వేయవలెనో, రచనలో పదముల నెట్లు కూర్చవలెనో మీరె రిగి యుండవచ్చు. కాని మీలో యీ సృజనాత్మక సౌందర్యమే గనక లేక పోయినట్లైతే మీ ప్రజ్ఞలకు విలువలేదు. మీ సామర్థ్యములకు అర్థములేదు.

దురదృష్టవశాత్తు మనలో చాలమందిమి వివిధ కార్యముల నొన ర్చుట యందు సామర్థ్యము మాత్రమే సంపాదించుకొంటున్నాము. కేవలము సాంకేతిక నిపుణుల మౌతున్నాము. జీవనాధారము కోసమై ఏవేవో పరీక్షలు పాసై, ఏదో యొక సాంకేతిక కళను సాధిస్తాము. కాని మన ఆంతరిక స్థితిని గమనించకుండా, మన మనస్సును దాని మీదికి పోనీకుండా కేవలము ఏదో యొక సాంకేతిక కళను మాత్రమే సాధించడం వలన, ఏదో యొక పనిని చేయగల యోగ్యతను మాత్రం పెంపొందింప జేసికొనడం వలన మనము ప్రపంచ మందలి సౌందర్య భావనకు విఘాతము కలిగిస్తున్నాము, అసౌందర్యమును పెంపొందింప జేస్తున్నాము. ప్రపంచమందు అవ్యవస్థను, సంక్షోభాన్ని పుట్టిస్తున్నాము. మనము మన లోపల సృజనాత్మక సౌందర్యమును ఉద్బుద్ధము చేసి కొన్నట్లయితే అది సహజంగానే బయటికి అభివ్యక్తమవుతుంది. దాంతో సువ్యవస్థ యేర్పడుతుంది. అయితే యిది కష్ట సాధ్యము. ఏదో యొక సాంకేతిక కళను నేర్చుకోవడమే తేలిక. ఎందువల్లననగా ఆంతరిక సృజ నాత్మక సౌందర్యము మనలో జాగృతము కావలెనంటే, సంపూర్ణమైన ఆత్మసమర్పణము అత్యావశ్యకము. అందులో భయముగానీ, రక్షణగానీ, నిర్బంధముగానీ, నిరోధముగానీ లేకుండా వుండవలెను. మనలో సంయ

మనము ఉన్నప్పుడు మాత్రమే ఆత్మ సమర్పణము చేయగలము. బయటికి మనము చాల నిరాడంబరంగా, వినయంగా కనబడవచ్చు. చాల తక్కువ బట్టలతో కాలక్షేపం చేయవచ్చు. దినమున కొక పూట మాత్రమే భోజనం చేయవచ్చు. కాని అది నిజమైన సంయమము కాదు. మన మనస్సు అనంతమైన అనుభూతిని పొందడానికి తగిన యోగ్యత కలిగి యుండి, అట్టి అనుభూతి కలిగినప్పుడు కూడ అది చాల సాధువుగా, వినయంగా వుండగల్గితే, అప్పుడు మాత్రమే సంయమము సిద్ధిస్తుంది. మనస్సున కట్టి స్థితి రావలెనంటే "ఇంకా ఎక్కువ కావాలి" అనే ఆలో చన వుండరాదు. కాలక్రమేణ నేనింకా మారిపోగలనని గాని, ఇంకా ఏదో యెక్కువ సంపాదిస్తానని గాని ఆలోచన వుండరాదు.

నేను మాట్లాడుతూ వున్న విషయాలు మీకు అర్థం చేసికోవడానికి కొంత కష్టంగా వుండవచ్చు. కాని అవి చాల ముఖ్యమైన విషయాలు. సాంకేతిక నిపుణులు నూతన సృష్టికర్తలు కాలేరు. ప్రపంచంలో సాంకేతిక నిపుణుల సంఖ్య పెరిగి పోతూవున్నది. ఏ పని చేయవలెనో ఎట్లా చేయ వలెనో వారికి తెలుసు. కాని వారు సృజన శీలురు కాదు. అమెరికాలో ఒక విధమైన కంప్యూటరులున్నాయి (గణకయంత్రములు). మనిషి దిన మునకు పదిగంటలవంతున పని చేస్తూ నూరు సంవత్సరములలో పరిష్క రింపగల గణిత సమస్యలను ఆ గణకయంత్రము (కంప్యూటరు) కొద్ది నిమి షాలలో పరిష్కరింపగలదు. ఇటువంటి అపూర్వములైన యంత్రములను వారు అభివృద్ధి చేస్తున్నారు. కాని యంత్రములు సృష్టి కర్తలు కానేరవు. మానవులు రానురాను యంత్రముల వలె తయారవుతున్నారు. వారె క్కడైనా తిరుగబడినా, ఆ యంత్రముల పరిధిలోనే తిరుగబడతారు. అందువలన అది నిజానికి తిరుగుబాటుకాదు.

అందువలన సృజనాత్మకత (సృజనశీలత) గలిగి వుండడమంటే యేమిటో తెలిసికోవడం చాల ముఖ్యము. ఆత్మ సమర్పణ వున్నప్పుడే సృజనాత్మకత వుంటుంది. అంటే నిర్బంధమనే భావనయే లేనప్పుడు, తన యునికికి భంగము కలుగునని గాని, ఎట్టి లబ్ధిని పొందలేమని గాని

ఏదోయొక స్థితికి చేరుకోలేమని గాని భయము లేనప్పుడు మాత్రమే అది సంభవమవుతుంది. అప్పుడు కఠినమైన సంయమము, వినయము, దానితో బాటు ప్రేమ వుంటాయి. అదియే సౌందర్యము, అదియే సృజనాత్మక స్థితి.

1. ప్రశ్న:- మరణానంతరం గూడ ఆత్మ జీవిస్తుందా?

కృష్ణమూర్తి:- నిజంగా మీరు దీనిని తెలిసికోదలిస్తే, యెట్లా తెలిసికోగలరు? శంకరుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు వ్రాసిన పుస్తకాలు చదివి తెలుసుకుంటారా లేక మీరు అనుసరించే నాయకుడుగాని, మహాత్ముడుగాని చెప్పిన దానిని విని తెలిసికొంటారా? బహుశా వారందరు చెప్పినదిన్ని అసత్యం కావచ్చుగదా? ఈ విషయాన్ని ఒప్పుకోవడానికి మీరు సిద్ధమేనా? అట్లయితేనే మీ మనస్సు ఈ విషయమై దర్యాప్తు చేయడానికి సిద్ధంగా వున్నట్లు.

నిజానికి మొట్టమొదట తెలిసికోవలసిన విషయం అసలు ఆత్మ అంటూ వున్నదా? అని. ఆత్మ అంటే యేమిటి? మీకు తెలుసునా? లేక మీ తల్లిదండ్రులుగాని, మీ మతగురువు గాని, ఏదో శాస్త్ర గ్రంథముగాని, మీరున్న సాంస్కృతిక వాతావరణం గాని తెల్పితే దానిని మారుమాటాడక అంగీకరిస్తున్నారా?

ఆత్మ అనే పదము పైకి కన్పించే భౌతిక శరీరమును కాకుండా దాని కతీతంగా వుండే మరియొక దానిని దేనినో సూచిస్తుంది. అవునా, కాదా? మీ భౌతిక శరీరము, మీ నడత, మీ ప్రవృత్తులు, మీ మంచి గుణాలు — ఇవన్నీ పైకి తెలిసేవి, వ్యక్తములు. వీటికి అతీతంగా ఆత్మ అనేది వున్నదని మీరంటారు. అసలు అటువంటిదేదైనా వుంటే అది అలౌకికమై త్రికాలాబాధితమై యుండాలి. అటువంటి అలౌకిక మైన వస్తువు మరణానంతరము గూడ జీవిస్తుందా? అని మీ రడుగుతున్నారు. ఇది ప్రశ్నలో నొక భాగము.

ఇక ప్రశ్నలో రెండవభాగము: మరణమనగానేమి? మరణమంటే యేమిటో మీకు తెలుసునా? మరణానంతరము జీవిత ముంటుందో లేదో మీరు తెలిసికొనగోరుతున్నారు. కాని చూశారా, ఆ ప్రశ్నకాదు ముఖ్యము; ముఖ్యమైన ప్రశ్న యేమిటంటే, మీరు జీవించియుండగా మృత్యువు గురించి తెలిసికొనగలరా? అని. మరణానంతరము జీవిత మున్నదని చెప్పినా, లేదని చెప్పినా — మీకు దానివలన గలుగబోయే ప్రయోజన మేమి? ఆ సమాధానం విన్న తరువాత గూడ మీకా విషయమై ఏమియు తెలియనట్లే. కాని మరణమంటే యేమిటో మీ యంతట మీరు తెలిసికోగలరు. అది మరణించిన తరువాత కాదు, జీవించి ఆరోగ్యంగా బలంగా వున్నప్పుడే, మీ మనస్సు ఆలోచిస్తూ అనుభవిస్తూ వున్నప్పుడే.

ఇది కూడ విద్యలో నొక భాగము. విద్యావంతుడవడమంటే గణితము, దేశచరిత్ర, భూగోళశాస్త్రము మొదలైన వాటిల్లో పాండిత్యం సంపాదించడమే కాదు. మృత్యువని పిలువబడే ఈ అద్భుతమైన విషయాన్ని అర్థం చేసికోగల శక్తి గలిగి వుండడం కూడ. అదైనా శారీరకంగా చనిపోతూవున్న సమయంలో కాదు, బ్రతికి వుండంగానే, నవ్వుతూ కేరింతలు కొడుతూ, చెట్లు ఎక్కుతూ, పడవ నడుపుతూ, ఈదుతూ వున్నప్పుడే. మృత్యువనేది అజ్ఞాత మైనది, తెలియనిది. అట్లు అజ్ఞాతమైన దానిని మీరు జీవించియుండగానే జ్ఞాతము చేసికొనడం — తెలిసికొనడం — చాల అవసరము.

2. ప్రశ్న:- మేము జబ్బువడినప్పుడు మా తల్లిదండ్రులు మా గురించి ఎందుకంతగా చింతిస్తారు?

కృష్ణమూర్తి:- చాలమంది తల్లిదండ్రులు కనీసం కొంతవరకైనా తమ పిల్లల బాగోగులు చూచుకొంటారు. వాండ్లగురించి తగిన జాగ్రత్త తీసికొంటారు. కాని వారు తమ పిల్లల గురించి అదేపనిగా చింతిస్తూ వుంటే దాని అర్థం, వాండ్లు తమ పిల్లల బాగుకంటే తమ బాగుకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారన్నమాట. మీరు చనిపోవడం వారి

కిష్టం లేదు. వారనేదేమంటే "మా కొడుకుగాని కూతురుగాని చని పోతే మా సంగతి యేమౌను?" అని. తల్లిదండ్రులు తమ పిల్లలను నిజంగా ప్రేమించినట్లయితే ఏం జరుగుతుందో మీకు తెలుసునా? మీ తల్లిదండ్రులు మిమ్ము నిజంగా ప్రేమించి నట్లయితే మీకు భయకారణ మేమీ లేకుండేటట్లు చూస్తారు. మీరు ఆరోగ్యంగా సుఖంగా జీవించే టట్లు చూస్తారు. ప్రపంచంలో యుద్ధాలనేవి లేకుండేటట్లు, దారిద్ర్యము తొలగిపోయేటట్లు చూస్తారు. మిమ్ముగాని, మీ చుట్టు ప్రక్కల వుండే పల్లె ప్రజలనుగాని, పట్టణవాసులనుగాని, ఆఖరికి జంతువులను గూడ సంఘము అణగద్రొక్కివేయకుండ, నాశనము చేయకుండ చూస్తారు. తల్లి దండ్రులు తమ పిల్లలను నిజంగా ప్రేమించరు కాబట్టే ప్రపంచంలో ఇన్ని యుద్ధాలు జరుగుతున్నాయి. అందువల్లనే ధనవంతులున్నారు, బీద వాళ్ళున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలలో తమ సర్వస్వాన్ని పెట్టుబడి పెట్టుకొన్నారు. వారి ద్వారా తాము శాశ్వతంగా కొనసాగుతామని ఆశిస్తారు. అందుచేత మీరు బాగా జబ్బుపడితే వాండ్లు చింతిస్తారు. కాబట్టి వారికున్న చింత అంతా తమ దుఃఖాన్ని గురించే. కాని దీనికి వారొప్పుకోరు.

చూశారూ, ఆస్తి, భూమి, పేరు ప్రఖ్యాతులు, ధనము, కుటుంబము — ఇవన్నీ మనిషికి శాశ్వతంగా కొనసాగడానికుపయోగపడే సాధనాలు. దీనినే అమరత్వమని కూడ అంటారు. కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలకేదైనా సంభవిస్తే అదిరిపోతారు, దుఃఖ సముద్రంలో మునిగిపోతారు. ఎందుకనగా వారి ప్రధానమైన చింత అంతా తమ బాగుగురించే! అట్లు గాక తల్లిదండ్రులు నిజంగా తమ పిల్లల బాగునే కోరుకొనే టట్లయితే, ఒక్క రాత్రిలో సంఘమంతా మారిపోదా? అప్పుడు మన విద్యావిధానమే వేరు, మన యిండ్లే వేరు. ప్రపంచమునందిక యుద్ధములే వుండవు.

3. ప్రశ్న:- దేవాలయములలో పూజ కొఱకై అందరికీని ప్రవేశార్హత వుండవలెనా?

కృష్ణమూర్తి:- దేవాలయమనగానేమి? అదియొక పూజాస్థానము. అందులో దేవుని ప్రతీక వుంటుంది. ప్రతీక అంటే మనస్సుతో ఊహింపబడిన, రాతియందు చేతితో చెక్కబడిన ఒక విగ్రహము. ఆ రాయిగాని, ఆ విగ్రహముగాని దేవుడుకాదు. అవునుకదా? అది కేవల మొక ప్రతీక మాత్రమే, ఎండలో నడుస్తున్నప్పుడు భూమిమీదపడే మీ నీడలాంటిదా ప్రతీక. నీడ మీరు కాదుగదా? అట్లే గుడిలోని విగ్రహాలు ప్రతీకలే, దేవుడుకాదు, 'సత్యము' కాదు. అందువలన గుడిలోనికి ఎవరు పోతేనేమి, ఎవరు పోకపోతేనేమి? దీనికింత ఆర్భాటమెందుకు? సత్యమనేది యెండిపోయిన ఆకు క్రింద వుండవచ్చు, దారి ప్రక్కనగల రాతిలో నుండవచ్చు, సంధ్యాకాల సౌందర్యమును ప్రతిఫలింపజేయు నీళ్ళల్లో వుండవచ్చు, మేఘాల్లో వుండవచ్చు, బరువును మోస్తూ వున్న పడతియొక్క చిరునగవులో నుండవచ్చు. సత్యమనేది ఒక్క గుడిలోనే కాదు, ప్రపంచమంతటను వున్నది. బహుశా గుడిలో సత్యముండక పోవచ్చును గూడ. ఏలయన ఆ గుడి నిర్మాణానికి కారణము మనిషికుండే భయము, తన భద్రతయందతని కుండే అభిలాష. ఆ గుడి నిర్మాణము మానవులలోని కులమతములమీద ఆధారపడినది. ఈ ప్రపంచము మనది; ఇచ్చట మనమందరము మానవులము కలసిమెలసి జీవిస్తున్నాము. ఎవడైనా ఒక మనిషి నిజంగా దైవాన్ని అన్వేషిస్తూవుంటే, అతడు గుడులవైపు పోడు. అవి మానవులను వేరు చేస్తాయి కాబట్టి వాటినుండి దూరంగా పోతాడు. క్రైస్తవుల చర్చి, మహమ్మదీయుల మసీదు, మీ హిందువుల పడి — ఇవన్నీ మనుషులను విభజించేవి. దైవమును అన్వేషించేవాడికి ఇవేమీ అక్కరలేదు. అందువలన ఎవరైనా గుడిలోకి ప్రవేశించవచ్చునా, ప్రవేశింపరాదా యనేది కేవలము రాజకీయ విషయము. దానికి యథార్థ స్థితితో నెట్టి సంబంధమును లేదు.

4. ప్రశ్న:- మన జీవితంలో క్రమశిక్షణకు గల స్థానమేమి?

కృష్ణమూర్తి:- దురదృష్టవశాత్తు మన జీవితంలో దానికొక ముఖ్యమైన స్థానమే వున్నది. లేదంటారా? మీ జీవితంలో ఎక్కువ భాగము,

"ఇది చేయండి, అది చేయకండి" అనే క్రమశిక్షణలోనే — అనుశాసనములోనే — గడుస్తుంది. ఎప్పుడు నిద్రనుండి లేవవలెనో, ఏమి తినవలెనో, ఏమి తినరాదో, దేని గురించి మీరు తప్పక తెలిసికొనవలెనో, దేని గురించి మీరు తెలిసికోరాదో ఇవన్నీ మీకు చెబుతారు. మీరు చదువుకోవాలని, తరగతులకు పోవాలని, పరీక్షలు వ్రాసుకావాలని ఇట్లా యెన్నో మీకు చెబుతారు. మీ తల్లిదండ్రులు, మీ ఉపాధ్యాయులు, మీ సంఘము, మీ సంప్రదాయము, మీ శాస్త్రగ్రంథములు — ఇవన్నీ మీరు ఏం చెయ్యాలో చెప్తూతూ వుంటాయి. అందువలన మీ జీవితము క్రమశిక్షణకు లొంగి, దానిచే నిర్ణయింపబడిన హద్దులలోనే నడుస్తూ వుంటుంది. ఏమి అట్లా లేదా? "ఇది చేయవచ్చును", "ఇది చేయరాదు" అనే విధి నిషేధములకు మీరు బందీలు; అవే మీ బోనుకు గల ఇనుప కమ్మీలు.

అయితే ఆ విధంగా అనుశాసనబద్ధమైన మనస్సు ఏమైపోతుంది? నిజానికి మీరు దేనికైనా భయపడుతూవుంటే, మీరు దేనినైనా నిరోధిస్తూ వుంటే, అప్పుడే క్రమశిక్షణ అవసరమవుతుంది. అప్పుడు మిమ్ము మీరు అదుపులో వుంచుకోవలసి వస్తుంది, జారి పడిపోకుండ నిలబెట్టుకోవలసి వస్తుంది. అట్టి క్రమశిక్షణలో — మీయంతట మీరే స్వయంగానైనా నడుస్తారు లేదా సంఘమైనా మిమ్ము నడిపిస్తుంది. సంఘమంటే మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంప్రదాయము, శాస్త్ర గ్రంథములున్ను కాని మీయంతట మీరు నిర్భయంగా విచారణ చేయసాగితే, పరిశోధింపసాగితే, నేర్చుకొంటూ అవగాహన చేసికొంటూ వుంటే అప్పుడు గూడ మీకు క్రమశిక్షణ అవసరమవుతుందా? కాదు. అప్పుడా అవగాహనయే మీ జీవితంలో క్రమతను తీసికొని వస్తుంది. ఆ క్రమత పైనుండి విధింపబడినది కాదు, నిర్బంధముచే వచ్చినది కాదు.

దీని గురించి మీరున్ను ఆలోచించండి. మిమ్ము భయపెట్టి మీచేత క్రమశిక్షణను పాటింప జేసేటట్లయితే, సంఘము యొక్క నిర్బంధములో మీరు నలిగిపోయేటట్లయితే, మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులున్ను

మీమీద పెత్తనం చెలాయించేటట్లయితే అప్పుడు మీకు స్వతంత్రమూ లేదు, ఆనందమూ లేదు. మీలో వుండే చొరవ అంతా నశించిపోతుంది. దేశ సంస్కృతి యెంత ప్రాచీనమైనదో సంప్రదాయము అంత బరువైనది. అది మిమ్ము క్రమశిక్షణలో పెడుతుంది. “ఇది చేయండి, అది చేయకండి” అని మిమ్ము నడిపిస్తుంటుంది. మీరా బరువు క్రింద పడి నలిగిపోతారు, మీ మనస్సులు చదును చేయబడతాయి — రోడ్డు రోలరు క్రింద రోడ్లు చదునైనట్లు. భారతదేశములో జరిగినదే అది. పరంపరా గతమైన సంప్రదాయపు బరువుక్రింద పడి నలిగిపోయి స్వతః సిద్ధమైన చొరవ అంతా పూర్తిగా నశించిపోయింది. మీకిక స్వతంత్ర వ్యక్తిత్వమంటూ లేదు; మీరు సంఘమనే యంత్రములో నొక భాగము మాత్రమే. దానితోనే మీరు తృప్తిపడతారు! ఏమి అర్థమవుతున్నదా? మీరు తిరుగబడరు, భగ్గుమని ప్రేలరు, త్రెంచుకొని బయటపడరు! మీరు తిరుగబడడం మీ తల్లిదండ్రుల కిష్టములేదు; త్రెంచుకొని బయటపడడం మీ ఉపాధ్యాయుల కిష్టము లేదు. అందువలన మీ చదువంతా సంప్రదాయమనే యినుప చట్రంలో మిమ్ము బంధించి వేయడం కోసమే; దాని కనుకూలంగా మెలగునట్లు మిమ్ములను మలచడం కోసమే. భయము మీ గుండెలను పిండివేస్తూ వుంటుంది కాబట్టి మీరు సంపూర్ణ మానవులు కాలేరు, కాబోరు. భయమున్నంతకాలము ఆనందమునకు తావులేదు, సృజనాత్మకతకు చోటులేదు.

5. ప్రశ్న:- ఇంతకుముందు దేవాలయములను గూర్చి మాట్లాడేటప్పుడు మీరు దేవుని యొక్క ప్రతీకను మనిషి నీడతో పోల్చినారు కదా. అసలు మనిషే లేనిచో అతని నీడ యెట్లా వుంటుంది?

కృష్ణమూర్తి:- మీరు నీడతోనే తృప్తి పడతారా? ఆకలిగా వున్న వానికి ఆహారమును చూస్తేనే తృప్తి కలుగుతుందా? అట్లే గుడిలోని నీడతో మీరెందుకు తృప్తిపడాలి? సత్యమును తెలుసుకోవాలని గట్టి పట్టుదలే వుంటే, నీడలను వదలి పెట్టెయ్యాలి. కాని చూశారా, మీరా నీడచేత, ఆ ప్రతీక చేత, ఆ రాతి విగ్రహంచేత సమ్మోహితు

లైపోయినారు. ప్రపంచంలో ఏమి జరిగిందో చూడండి. మనుషులలో విభేదాలు ఎందుకు వచ్చాయో చూడండి — మసీదులో ఒక విధమైన నీడను, చర్చిలో ఇంకొక విధమైన నీడను, గుడిలో మరియొక విధమైన నీడను ఆరాధిస్తున్నారు. కాబట్టి ఈ నీడల సంఖ్యకు అంతము లేదు — ఎన్నైనా వుండవచ్చు. కాని సత్యము మాత్రము ఒక్కటే. దాని నెవరును విభజింపలేరు. ఆ సత్యమును చేరుటకు ఒక మార్గమంటూ లేదు. క్రైస్తవుల మార్గము, ముస్లిముల మార్గము, హిందువుల మార్గము ఇంకా ఎవరెవరివో వేర్వేరు మార్గములంటూ లేవు.

6. ప్రశ్న:- ధనవంతుల పిల్లలకు భవిష్యత్తు ఎట్లాగూ నిశ్చితమే. కాబట్టి వారికి పరీక్షలు అనవసరము కావచ్చు; కాని బీద పిల్లలు తమ జీవనాధారమును తాము వెదకుకోవలసి వస్తుంది కాబట్టి వారికి పరీక్షలు అవసరం కాదా? ముఖ్యంగా ఇప్పుడున్న సంఘ పరిస్థితిని బట్టి చూస్తే వారికి వాటి అవసరమేమైనా తక్కువా?

కృష్ణమూర్తి:- ఇప్పుడున్న సంఘాన్ని యథాతథంగా — ఎదురు తిరిగి ప్రశ్నించకుండా — అంగీకరిస్తున్నారు, ఎందువలన? బీద వర్గానికి చెందని మీరు, సంపన్న కుటుంబాలకు చెందిన మీరు ఎందుకు తిరుగబడరు? సామ్యవాదిగానో, సమాజవాదిగానో కాకుండ, ప్రస్తుతమున్న యీ సంఘ వ్యవస్థ కంతటికి విరుద్ధముగా ఎందుకు తిరుగబడరు? మీకా అవకాశమున్నది. సత్యమేదో తెలిసికొనడానికి, క్రొత్త సంఘాన్ని సృష్టించడానికి మీ తెలివితేటలనెందు కుపయోగించరు? బీదవాడు తిరుగబడడు, ఎందువల్లనంటే అతనికి ఆలోచించడానికి తగిన శక్తిగాని, సమయుంగాని లేవు. అతనికి బొత్తిగా తీరుబడి లేదు. అతనికి ఆహారము, పని కావాలి. కాని కొంత తీరుబాటు, మీ తెలివితేటల నుపయోగించుకోడానికి కొంత విడి సమయముగల మీరు ఎందుకు తిరుగబడరు? సరియైన సంఘమంటే, నిజమైన సంఘమంటే యెట్లుంటుందో కనుక్కొని నూతన నాగరికతకు పునాది యెందుకు వేయరు? అది మీతో ఆరంభము కాకపోతే బీదవానితో అసలు కాదనుట స్పష్టము.

7. ప్రశ్న:- బీదవారికోసం ధనవంతులు తమకున్నదానిలో పెద్ద మొత్తం ఇవ్వడానికి ఎప్పటికైనా సిద్ధపడతారా?

కృష్ణమూర్తి:- బీదవారి కోసం ధనవంతులు ఏమి యివ్వాలి అనే విషయమై మనమిప్పుడు చర్చించడం లేదు. వారేమిచ్చినా సరే బీద వారికది తృప్తినీయదు. అసలు సమస్య అదికాదు. సంపన్నులైన మీరు, అందువలన మేధాశక్తిని పెంపొందింప జేసికోడానికి అవకాశమున్న మీరు, తిరుగుబాటు ద్వారా నవసమాజమును నిర్మింపలేరా? అది మీమీదనే ఆధారపడి వున్నది — ఇతరుల మీద కాదు — అది మనలో ప్రతియొక్కని మీదను ఆధారపడి వున్నది; కేవలము ధనవంతుల మీదనో, బీదవారి మీదనో, సామ్యవాదుల మీదనో కాదు. చూశారా, మనలో చాలమందికి తిరుగుబాటు చేసే స్వభావమే లేదు. త్రెంచుకొని బయటపడడానికి గాని, అన్వేషించడానికి గాని తగినంత ప్రేరణలేదు, ఉత్సాహములేదు. అట్టి ఉత్సాహమే అన్నిటికంటె ముఖ్యము.

11 జనవరి, 1955

11

ధ్యానము

ఎప్పుడైనా మీరు కండ్లు మూసికొని ప్రశాంతంగా కూర్చుండి మీ ఆలోచనా ప్రక్రియను మీరు స్వయంగా గమనించారా? మీ మనస్సు ఎట్లా పని చేస్తున్నదో గమనించారా? లేదా, మీ మనస్సే తన్ను దాను ఎట్లా పని చేస్తున్నదో గమనించుకొన్నదా? మీ ఆలోచన లేమిటి? మీ భావాలేమిటి? వృక్షములవైపు, పుష్పములవైపు, పక్షులవైపు, మనుష్యులవైపు మీరేవిధంగా చూస్తున్నారు? ఏదైనా సలహా యిస్తే మీరు దానినెట్లా స్వీకరిస్తారు? ఏదైనా ఒక క్రొత్త అభిప్రాయం వెలిబుచ్చితే దానికి మీ ప్రతిక్రియ యెట్లా వుంటుంది? ఇవన్నీ మీరు గమనించవలసినవే. ఈ పని యెప్పుడైనా చేశారా? చేయకపోతే మీరెంతో నష్టపోయినవారవుతారు. మనస్సు ఎట్లా పనిచేస్తుందో తెలిసికోవడమే విద్యయొక్క ప్రధానోద్దేశము. మీ మనస్సు యొక్క ప్రతిక్రియ లెట్లా వుంటాయో మీకు తెలియకపోతే, మీ మనస్సు తాను చేసే పనులను తానెరుగకపోతే సంఘమంటే యేమిటో అసలు తెలిసికొనలేరు. సాంఘిక శాస్త్ర గ్రంథములను మీరు చదవవచ్చు, సాంఘిక విజ్ఞాన శాస్త్రమును మీరు అధ్యయనం చేయవచ్చు. కాని మీ మనస్సెట్లు పని చేస్తున్నదో మీకు తెలియకపోతే సంఘమంటే యేమిటో మీరు వాస్తవంగా అర్థం చేసికోలేరు. ఎందువల్లనంటే మీ మనస్సు సంఘములో ఒక భాగము—కాదు—అసలదే సంఘము! మీ ప్రతిక్రియలు, మీ నమ్మకాలు, మీరు గుడికి పోవడాలు, మీరు ధరించే బట్టలు, మీరుచేసే పనులు, చేయని పనులు, మీరు వేటిగురించి ఆలోచిస్తారో అవి — ఇవన్నీ కలిస్తే సంఘమవుతుంది. మీ మనస్సులో ఏమి జరుగుతున్నదో దాని ప్రతిరూపమే సంఘము. కావున మీ మనస్సు సంఘముకంటె భిన్నము కాదు. మీ సంస్కృతి మీ మతము మీలో వుండె వివిధములైన వర్గ భేదములు,

మీలో వుండే ఆశలు, ఆరాటాలు, సంఘర్షణలు — వీటన్నింటి కంటే మీ మనస్సు భిన్నము కాదు. ఇదంతా కలిస్తేనే సంఘము; అందులో మీరొక భాగము. సంఘముకంటే వేరుగా 'మీరు' లేరు.

ఇకపోతే, సంఘము చిన్నపిల్లల ఆలోచనా విధానమును ఎల్లప్పుడును తన వశములో వుంచుకొని, దానికొక రూపమిస్తూ దానిని మలచడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ వుంటుంది. మీరు పుట్టిన క్షణం మొదలుకొని, మీకు ఊహవచ్చినది మొదలుకొని, మీ తల్లి దండ్రులు మీరేపనులు చేయవచ్చునో, ఏవిచేయగూడదో, వేటిని నమ్మవచ్చునో, వేటిని నమ్మరాదో ఇవన్నీ అదే పనిగా మీకు నూరిపోస్తూ వుంటారు. దేవుడున్నాడనో, లేక ప్రభుత్వమే తప్ప వేరే దేవుడు లేడనో లేదా ప్రభుత్వాన్ని నడిపే నియంతయే ఈశ్వరుడని లేదా ఈశ్వరుని దూతయని మీకు చెబుతారు. శైశవంనుండి యీ విషయాలతో మీ మనస్సులను నింపుతారు. అంటే ఎటు త్రిప్పితే అటుతిరిగే మీ లేతమనసులు, ప్రతి దాన్ని తెలిసికొందామనే కుతూహలము గల మీ మనసులు — సంవేదనా శీలములు, జిజ్ఞాసువులైన మీ మనసులు — క్రమక్రమంగా అన్నివైపులనుండి మూసివేయబడి మలచబడి ఆయా సంఘపు చట్రములలో ఇమిడి పోవునట్లుగా రూపొందింప బడతాయి. కాన సమూల పరివర్తనము తేగల విప్లవవీరులు, క్రాంతి కారులు మీరు ఎన్నటికిని కాలేరు. ఒకే నిశ్చితమైన పద్ధతిలో ఆలోచించడానికి మీరలవాటు పడిపోవడం చేత, ఒకవేళ మీరు తిరుగుబాటు చేసినప్పటికిన్ని మీరలవాటు పడిన పద్ధతిలోనే, మీరున్న మూసలోనే తప్ప దానిని వదలి బయటికి రారు. ఇది యెట్లాంటిదంటే, ఖైదీలు మంచి భోజనము ఎక్కువ సౌకర్యముల కోసం తిరుగుబాటు చేసినట్లు. వారెంత తిరుగుబాటు చేసినా, అది చెఱసాల యొక్క నాలుగుగోడల మధ్యనే! మీరు దేవునికోసం అన్వేషించినా, మంచి ప్రభుత్వం కోసం ప్రయత్నించినా, అదంతా సమాజము యొక్క పరిధి లోపలనే. సమాజమే చెబుతుంది, "ఇది సత్యము, అది అసత్యము. ఇది మంచిది, అది చెడ్డది. ఇతడు మంచి నాయకుడు. వారు మహాత్ములు" అని. కాబట్టి ఏవేవో పేరాశలు పెట్టుకొన్నవారు

మంచి తెలివితేటలు గలవారు తీసికొని వచ్చిన తిరుగుబాట్లవలె మీ తిరుగుబాటు కూడ గతకాలపు ప్రభావము నుండి బయటపడదు. కాన అది నిజమైన తిరుగుబాటు కాదు. అది తన హద్దులలోనే జరిగెడి, ఉత్కృష్టకర్మాచరణము, వీరోచితమైన పోరాటము మాత్రమే. కాని తన పరిధిని ఛేదించుకొని బయటికి వచ్చి విచారణ చేయడమే నిజమైన తిరుగుబాటు, వాస్తవమగు క్రాంతి.

చూశారా, సంస్కర్తల కందరికిని గల శ్రద్ధ అంతా — వారెవ రైనా సరే — చెఱసాలలోని పరిస్థితులను చక్కదిద్దడం లోనే. అంతే గాని సంఘ మర్యాదలకు సంఘపు కట్టుబాట్లకు లొంగిపోనక్కరలేదని, సంప్రదాయము మరియు అధికారమనెడి గోడలను బ్రద్ధలుకొట్టుకొని మన సులను పట్టి వదలని సంస్కారములను విదిలించుకొని బయట పడమని వారెన్నటికిని చెప్పరు. కాని అదే నిజమైన విద్య; మీ బుఱ్ఱ నిండా నింపుకొన్న పాఠ్య విషయాలతో ఏదో విధంగా పరీక్షలు పాసు కమ్మని చెప్పడం, కంఠస్థము చేసి వ్రాయమనడం కాదు నిజమైన విద్య అంటే. మీ మనస్సును బందీ చేసిన చెరసాల గోడ లేవో చూచి గ్రహించడంలో సహాయపడడమే నిజమైన విద్యయంటే. సంఘము చేత మనమందరము ప్రభావితుల మౌతున్నాము. అది మన ఆలోచనాసరళిని నిరంతరము మార్చివేస్తూవున్నది. దాని వత్తిడి తీవ్రమై అది లోపలినుండియే వచ్చిన ఒత్తిడేమో అనిపిస్తుంది. కాని ఆ ఒత్తిడి యెంత బలమైనదైనను ఎంత లోతుగా పోయినను అది బయటినుండి వచ్చిన ఒత్తిడేగాని, లోపలి నుండి వచ్చినది కానేరదు. బాహిరమగు ఒత్తిడులచే మనస్సు మీద పడిన ప్రభావములను, సంస్కారములను పగులగొట్టుకొని బయటపడ నంతవరకు ఆంతరికమనేదిలేదు. మీరు ఏమి ఆలోచిస్తున్నది, ఎట్లు ఆలోచిస్తున్నదిన్ని మీకు తెలియాలి; అంటే మీ రేమతంలో పుట్టడం సంభవించిందో దానిననుసరించి హిందువుగా ఆలోచిస్తున్నారా? ముస్లి ముగా ఆలోచిస్తున్నారా? క్రైస్తవునిగా ఆలోచిస్తున్నారా? అనేది మీకు తెలియాలి. మీరు దేనిని నమ్ముతున్నారో దేనిని నమ్మడంలేదో మీరెరిగి యుండాలి. ఇదంతా సంఘము నడిచేతీరు, దానినెరిగి దాని నుండి

విడివడితే తప్ప మీకు విముక్తిలేదు. అప్పటివరకు మీరు బందీలే, స్వతంత్రుల మని మీరనుకొన్నప్పటికిన్ని.

కాని మనలో చాలమందికి చెఱసాల యొక్క నాలుగు గోడల మధ్య తిరుగబడడంలోనే వారికి గల శ్రద్ధ అంతా. మరికొంత మంచి తిండి, మరికొంత వెలుతురు, మరికొంత ఆకాశాన్ని చూడగల్గడంకోసం ఇంకొంత పెద్దకిటికీ — ఇవే మనకు కావలసినవి! హీనజాతివారు దేవాలయ ప్రవేశము చేయవచ్చునా లేదా అనేది మనకిప్పుడున్న పెద్ద చింత! ప్రస్తుత మొక కులాన్ని నాశనం చేయగోరుతాం. కాని ఒక కులాన్ని నాశనం చేయడంలో మరియొక ఉచ్చకులానికి జన్మనిస్తున్నాం. అందు వలన మనమెప్పటికిని బందీలమే, కారాగార బద్ధులమే. కారాగారంలో స్వాతంత్ర్యము లేదు. స్వాతంత్ర్యము చెఱసాల గోడలకు బయట వుంటుంది, సంఘము యొక్క పరిధికి బయట వుంటుంది. ఆ సంఘము నుండి బయటపడవలెనంటే దాని యొక్క నిర్మాణమును మీరు అర్థం చేసికోవాలి, అంటే మీ మనస్సును మీరు అర్థం చేసికోవాలి. నేటి నాగరికతను సృష్టించినది మనస్సు; సంప్రదాయ బద్ధమైన సంస్కృతిని లేదా సమాజమును సృష్టించినది మనస్సు. మీ మనస్సును మీరు అర్థం చేసికోకుండా కేవలము సామ్యవాదిగానో, సమాజవాదిగానో లేక మరొకవాదిగానో తిరగబడడంలో ప్రయోజనము మృగ్యము. అందువలన మీగురించి మీరు తెలిసికోవడం చాల అవసరం. మీరు చేసే కార్యకలాపాలను మీ ఆలోచనలను మీ భావాలను జాగ్రత్తగా గమనిస్తూ వుండాలి. ఇదే విద్యయంటే, కాదా? ఇట్లు మిమ్ము మీరు జాగ్రత్తగా గమనించు చుంటూ వుంటే, మీ మనస్సు సున్నితము, సంవేదనశీలము మరియు మిక్కిలి జాగృతమవుతుంది.

ఇది మీరు ప్రయత్నించి చూడండి — ఎప్పుడో భవిష్యత్తులో కాదు, రేపు లేదా ఈ మధ్యాహ్నమే. ఒకవేళ మీగదిలో చాల మంది జనం వుండేటట్లయితే, మీ యింటినిండా మనుషులున్నట్లయితే, మీరు ఒంటరిగా ఎక్కడికో దూరంగా పొండి; ఏదైనా చెట్టు క్రింద

కూర్చోండి లేదా ఏటిగట్టున కూర్చోండి. మీ మనస్సు ఎట్లా పనిచేస్తున్నదో మెల్లగా గమనించండి. దానిని సరిదిద్దవద్దు. "ఇది తప్పు, ఇది ఒప్పు" అని అనవద్దు. ఒక సినిమా చూస్తున్నట్లుగా దానిని చూస్తూ వుండండి. సినిమాకు పోయినప్పుడు మీరా సినిమాలో పాల్గొనడం లేదు గదా. నటీనటులు పాల్గొంటారు; మీరూరక చూస్తూవుంటారు. అదే విధంగా మీ మనస్సు ఎట్లా పనిచేస్తూ వున్నదో గమనించండి. అట్లా గమనించడం చాల వినోదంగా వుంటుంది. సినిమా చూడడం కంటే వినోదంగా వుంటుంది. ఎందువల్లనంటే మీ మనస్సు సమస్త ప్రపంచముయొక్క అవశిష్టాంశము. అందులో మానవ మాత్రులంద రనుభవించిన అనుభవముల సారమున్నది. అర్థమవుతున్నదా? మీ మనస్సే మానవత. ఎప్పుడైతే మీకిది ప్రత్యక్షంగా అనుభూతమవుతుందో అప్పుడు మీలో సర్వవ్యాపకమైన దయారసము నిండిపోతుంది. ఈ అవగాహన నుండి అపరిమితమైన ప్రేమ పుట్టుకొని వస్తుంది. అప్పుడు మీకు అందమైన వాటిలోనుండే అందమేమిటో తెలుస్తుంది.

1. ప్రశ్న:- మీరు మాట్లాడుతున్న విషయాలన్నీ మీకెట్లా తెలిశాయి? అవి మాకెట్లా తెలుస్తాయి?

కృష్ణమూర్తి:- ఇది మంచిప్రశ్న; కాదా?

ఇప్పుడు నాగురించి నేను కొంత చెప్పుకొనేటట్లయితే నేనీవిషయాల గురించి యే పుస్తకాలున్నూ చదవలేదు; ఉపనిషత్తులు, భగవద్గీత మొదలైనవి గాని మనస్తత్త్వశాస్త్ర గ్రంథాలుగాని చదవలేదు. కాని నేనింతకు ముందు చెప్పినట్లుగా, మీ మనస్సును మీరు గమనించి చూస్తూ వుంటే, అన్నీ అందులోనే వున్నాయి. కాబట్టి ఆత్మజ్ఞానమును పొందడంకోసం యాత్ర ప్రారంభించింది మొదలు పుస్తకాలు అప్రధానమైపోతాయి. అది యొక వింత ప్రపంచంలోకి ప్రవేశించినట్లు; అక్కడ క్రొత్త క్రొత్త విషయాలను కనుగొనడం ఆరంభిస్తారు. అద్భుతమైన వాటిని కనిపెడతారు. కాని చూశారా, అక్కడ మీరు మీ 'అహము' నకు ప్రాధాన్యమిచ్చిన

ఎవరైనా మిమ్ము గిల్లితే మీకు నొప్పి పుట్టుతుంది. అంటే అర్థమేమిటి? మీ నాడులు మెదడుకు ఒక విధమైన సంవేదనను తీసికొనిపోతాయి. అప్పుడు మెదడు దానిని నొప్పిగా తెలియజేస్తుంది. అప్పుడు మీరంటారు, "నీవు మాకు నొప్పి కలిగించావు" అని. ఇది శరీరానికి సంబంధించిన అనుభూతి.

అదేవిధంగా మానసికానుభూతి కూడకలదు. ఏమి, లేదా? ఎంతో అందంగా వున్నామని మీరనుకొంటూ వుంటారు. ఇంతలో ఎవరో వచ్చి "మీరు బొత్తిగా అనాకారు" లని అంటాడు. అదివిని మీరు చాల బాధ పడతారు. అంటే దాని అర్థమేమిటి? మీరు కొన్ని మాటలు విన్నారు. అవి మిక్కిలి భరింపరానివని అవమానకరమైన వని మెదడు అర్థం విప్పి చెప్పుతుంది. అప్పుడు మీరు బాధపడతారు. ఎవరో వచ్చి మిమ్ము పొగిడి నప్పుడు "ఈ మాటలు వినడానికెంత యింపుగావున్నాయి" అని మీరంటారు. కాబట్టి ఈ భావన ఈ ఆలోచన ఒక విధమైన ప్రతిక్రియ. గుండు సూది గ్రుచ్చుకొన్నదానికి అవమానానికి పొగడ్తకు ఇంకా యిటువంటి వానికిది ప్రతిక్రియ. ఇదంతా మానసికానుభూతి, ఇదే ఆలోచన జరిగే ప్రక్రియ. ఇంతేకాదు. ఇది యింకా క్లిష్టమైనది. మీరింకా లోతుకు పోయి చూడవచ్చును.

చూశారా, మనకేదైనా అనుభూతి కల్గితే దానికొక పేరు పెడతాము, ఏమి పెట్టమా? అది చాల సుఖకరమనో అసుఖకరమనో అంటాము. మనకు కోపం వచ్చి నప్పుడు ఆయనుభూతి కొక పేరు పెడతాం — కోపమని. కాని అనుభూతికి పేరు పెట్టకపోతే ఏమౌతుందో ఎప్పుడైనా ఆలోచించారా? ప్రయత్నం చేసి చూడండి. ఈ సారి కోపము వచ్చిన పుడు దానికిపేరు పెట్టవద్దు. దానిని కోపమని అనవద్దు. పేరు పెట్టకుండా ఆయనుభూతిని మెలకువతో గమనించండి, ఏమి జరుగుతుందో చూడండి.

4. ప్రశ్న:- భారతీయ సంస్కృతికిని అమెరికా సంస్కృతికిని గల భేదమేమి?

కృష్ణమూర్తి:- అమెరికా సంస్కృతిని గూర్చి మాట్లాడుతున్నామంటే, మన ఉద్దేశం అమెరికాకు తీసికొని పోబడిన ఐరోపా సంస్కృతినిగూర్చియే. అది అమెరికాలో నాటుకొని క్రమపరిణామము చెందుతూ పెరిగి భౌతికంగానూ, మానసికంగానూ గూడ నూతన సీమలను అధిగమించినది.

ఇక భారతీయ సంస్కృతి అంటే ఏమిటి? ఇక్కడ వున్న మీ సంస్కృతి యేమిటి? అసలు సంస్కృతి యనే మాటకు అర్థమేమి? మీరెప్పుడైనా తోట పని చేసివుంటే నేల నెట్లా సంస్కరించి సిద్ధం చేస్తారో మీకు తెలుస్తుంది. మొదట త్రవ్వుతారు, రాళ్ళు తొలగిస్తారు, అవసరమైతే మిశ్రితమైన యెరువును వేస్తారు; అంటే ఆకులు, ఎండుగడ్డి, పెంట ఇంకా రకరకాలైన సేంద్రియ పదార్థములు కలిపి అవన్నీ కుళ్ళిన తరువాత దానిని నేలను సారవంతము చేయడానికై వాడుతారు. అప్పుడు మొక్కలు నాటుతారు. ఈ సారవంతమైన నేల మొక్కకు పుష్టినిస్తుంది, పెంచుతుంది. ఆ మొక్క క్రమంగా పెరిగి పెద్దదై అద్భుతమైన ముద్దులు మూటగట్టే గులాబిపూవును పూస్తుంది.

భారతీయ సంస్కృతి గూడ అట్లాంటిదే. కోట్లకొలది మనుషులు తమ ప్రయత్నాలద్వారా, తమ సంకల్పముల ద్వారా కొన్నిటిని కోరుతూ మరికొన్నిటిని నిరోధిస్తూ, సంతతము ఆలోచన సాగిస్తూ, బాధలను అనుభవిస్తూ, భయపడుతూ, కొన్నిటిని పరిహరిస్తూ, కొన్నిటిని ఉపభోగిస్తూ. నేటి యీ భారతీయ సంస్కృతికి కారకులైనారు. ఇందుకు తోడు ఇక్కడి శీతోష్ణస్థితి, ఆహారము, వస్త్రధారణ కూడ ఆ సంస్కృతి మీద తమ ప్రభావాన్ని చూపించినాయి. కాబట్టి యీ సంస్కృతి కాధారమైన నేల, అంటే మనస్సు, చాల అద్భుతమైనది. అది ప్రస్తుత రూపమును పొందకముందు, — అనగా పూర్తిగా సంప్రదాయ బద్ధము కాకముందు — ఇక్కడ కొందరు సృజన శీలురైన మహాపురుషులుద్భవించి ఆసియా ఖండమునంతటిని ఒక్క ఊపు ఊపియుండిరి. మీమాదిరి "సమాజము యొక్క ఆదేశాలను మేము తప్పక పాటించాలి; లేకపోతే మా తండ్రి యేమనుకొంటాడో" అని వారనలేదు. పైగా వారన్వేషించి అనిర్వచనీయమైన సత్యమును దర్శించినవారు. వారు తమ దర్శనము గురించి

మిక్కిలి ఉత్సాహము చూపియుండిరి గాని ఉదాసీనులుగా నుండలేదు. ఇదంతా కలిసి భారతీయ సంస్కృతి. అయినది. మీరు ఆలోచించే ఆలోచనలు, మీరు తినే తిండి, మీరు ధరించే వస్త్రాలు, మీ ఆచారవ్యవహారాలు, మీ సంప్రదాయము, మీ మాటలు, మీ వర్ణచిత్రాలు, మీ శిలా విగ్రహాలు, మీ దేవతలు, మీ పూజారులు, పురోహితులు, మీ శాస్త్రాలు, ధర్మగ్రంథాలు — ఇవన్నీ కలిస్తే భారతీయ సంస్కృతి అవుతుంది, కాదా?

ఈ విధంగా భారతీయ సంస్కృతి యూరోపియను సంస్కృతి కంటే కొంత భిన్నముగా కన్పించినను ఆ రెండింటి మూల మందున్న ప్రేరణ మాత్రము సమానమే. ఈ ప్రేరణ అమెరికాలో మరి యొక విధంగా అభివ్యక్తం కావచ్చు, అక్కడి అవసరాలు, ఆవశ్యకతలు వేరు కాబట్టి. అక్కడ సంప్రదాయము తక్కువ, శీతలీకరణ యంత్రములు కార్లు మొదలైనవి యెక్కువ. కాని మూలమందున్న ప్రేరణ మాత్రము సమానమే. అది సుఖాన్ని పొందడానికై దేవుడననేమో, సత్యమననేమో, తెలిసికొనడానికైగల ప్రేరణ. ఈ ప్రేరణ ఆగిపోయినట్లయితే సంస్కృతి క్షీణిస్తుంది. అదే జరిగినదీ దేశములో. ఈ సహజ ప్రేరణను అధికారము, సంప్రదాయము, భయమున్ను ఎప్పుడైతే అడ్డగిస్తాయో అప్పుడే సంస్కృతి క్షయిస్తుంది. క్షీణదశను పొందుతుంది.

సత్యమును, దైవమును కనుగొనడానికై గల ప్రేరణయే నిజమైన ప్రేరణ. మిగిలిన ప్రేరణలన్నీ గౌణములు, అముఖ్యములు. నిశ్చలమైన నీటిలోనికి ఒక రాతిని విసరినపుడు అది పడిన చోటునుండి వృత్తాకారంలో చిన్న చిన్న అలలు అనేకం బయలుదేరి విస్తరించుకొంటూ ఒడ్డువరకు పోతాయి. అట్లు విస్తరించుకొనే అలలు అప్రధానములు; అవే సమాజము యొక్క ప్రతిక్రియలు. కాని వాస్తవమైన ప్రేరణ కేంద్రమందుంటుంది; అది సుఖమును, దైవమును సత్యమును కనుగొనడానికి గల ప్రేరణ. భయములో చిక్కుకొని యున్నంతవరకు బెదిరింపులకు లొంగి యున్నంతవరకు మీరు సత్యమును కనుగొనలేరు. బెదిరింపు, భయమున్ను తలయెత్తిన క్షణమునుండి సంస్కృతి క్షీణించడం మొదలుపెడుతుంది.

అందువలన మీరు చిన్నవారుగా నున్నప్పుడు సంప్రదాయమునకు బద్ధులు కాకుండా, మీ తల్లిదండ్రులకు సంఘమునకు భయపడకుండా వుండడం అవసరము. అప్పుడే సత్యమును కనుగొనడానికై కాల ముతో సంబంధము లేని ప్రేరణ మీలో జాగృత మవుతుంది. సత్యమును దైవమును అన్వేషించెడి వారు మాత్రమే నవీన నాగరికతను నూతన సంస్కృతిని సృష్టింపగలరు. అంతేగాని అంధానుసరణము చేసేవారు కాదు, ప్రాత సంప్రదాయమనే కారాగారంలోని నాలుగుగోడల మధ్య తిరుగుబాటు చేసేవారుకూడకాదు. మీరు సన్న్యాసిదుస్తులు వేస్తే వేయవచ్చు, ఏదో యొక సంఘంలో జేరవచ్చు, ఒక మతం వదిలిపెట్టి మరియొక మతం లోకి పోవచ్చు, విముక్తికోసం ఎన్నోవిధాల తంటాలు పడవచ్చు. కాని తత్త్వమును సత్యమును ప్రేమను కనుగొనడానికై తగినంత ప్రేరణ మీలో లేనట్టయితే మీ ప్రయత్నములన్నియు నిష్ప్రయోజనములు, అర్థ రహితములు. మీరు మహాపండితులు కావచ్చు, ప్రజలందరు మెచ్చుకొనే మంచిపనులను చేయవచ్చు. కాని అవన్నియు సంప్రదాయ మనెడి కారాగా రము యొక్క నాలుగు గోడల మధ్యనే కాబట్టి నిజమైన తిరుగుబాటు నిజమైన క్రాంతికి ఉండేవిలువ వాటికి బొత్తిగా వుండదు.

5. ప్రశ్న:- భారతీయుల గురించి మీ అభిప్రాయమేమి?

కృష్ణమూర్తి:- ఇది వట్టి అమ్మాయికుడడిగే ప్రశ్న. ఏమి కాదా? నిజాలను వాటిగురించి ఎట్టి అభిప్రాయాలు పెట్టుకోకుండా చూడడం వేరు, నిజాలపై ఏవో అభిప్రాయాలుంచుకోవడం వేరు. ప్రజలందరు మూఢవిశ్వాసాలలో భయంలో చిక్కుకొని వున్నారనే నిజాన్ని చూడడం వేరు, ఆ నిజాన్ని చూచి దానిని ఖండించడం, నిందించడం వేరు. అభిప్రాయాలు ముఖ్యంకాదు. ఎందుకంటే నాకొక అభిప్రాయం వుండ వచ్చు. మీకొక అభిప్రాయం వుండవచ్చు. మరియొకరికి మరియొక అభిప్రాయం వుండవచ్చు. కేవలం అభిప్రాయాల మీద ఆధారపడి చేసే ఆలోచన తెలివి తక్కువ ఆలోచన. ఇంతకు ఎట్టి అభిప్రాయాలు పెట్టుకోకుండా, మంచి చెడ్డల విమర్శ చేయకుండా ఒకదానితో నొకటి

పోల్చకుండా నిజాలను ఉన్నవి ఉన్నట్లు చూడడం చాల ముఖ్యం.

ఎట్టి అభిప్రాయాలు పెట్టుకోకుండా సౌందర్యమును యథాతథంగా చూడడమే నిజమైన సౌందర్య దర్శనము. అదేవిధంగా భారతదేశము లోని ప్రజలను యథాతథంగా మీరు చూడగల్గితే ఎట్టి నిశ్చితాభిప్రాయాలు లేకుండా మంచి చెడ్డల విచారణ చేయకుండా మిక్కిలి స్పష్టంగా మీరు చూడగల్గితే అప్పుడు మీరు చూచిన విషయాలు వాస్తవము లౌతాయి.

భారతీయులకు తమవైన కొన్ని ఆచారవ్యవహారాలు, అలవాట్లు ఉన్నాయి. కాని వాస్తవానికి తక్కిన మనుజులందరి వలెనే వారున్ను విసుగుచెందుతారు, దుఃఖిస్తారు, భయపడతారు, క్రూరంగా వుంటారు. అందరివలెనే వారున్ను సంఘమనే కారాగారం నాలుగు గోడల మధ్యనే తిరుగబడతారు. అమెరికనుల మాదిరే వారికిన్ని సౌకర్యాలు కావాలి. అయితే ప్రస్తుతం వారికున్నన్ని సౌకర్యాలు వీరికిలేవు. సంసారాన్ని వదిలి సన్న్యసించి ఋషుల మాదిరి వుండడానికి ప్రయత్నించడం వారికిగల బలమైన ఒక సంప్రదాయం. కాని వారికిన్ని బాగా నాటుకొని పోయిన ఆశలు, ఆకాంక్షలు, దంభము, లోభము, ఈర్ష్యాసూయలు కలవు. లోక మంతట అందరు మనుష్యులలో వున్నట్లే వీరిలోను కులభేదములు గలవు. అయితే అవి వీరిలో మరింత తీవ్రమయినవి. ప్రపంచంలో ఏమి జరిగినా దాని ప్రభావాన్ని దాని సంపూర్ణ దృశ్యాన్ని భారతదేశంలో ఇంకా స్పష్టంగా దగ్గరినుండి చూడవచ్చు. మనలనందరు ప్రేమించాలని కోరుకొంటాము. కాని ప్రేమ అంటే యేమిటో మనకు తెలియదు. ఏదో సత్యపదార్థం కోసం తపిస్తూ విచారంగా వుంటాము. దానికోసం ఉపనిషత్తులు, భగవద్గీత, బైబిలు ఇంకా ఇతర పుస్తకాల వైపు మన దృష్టి మరలిస్తాం. తుదకందలి శబ్దజాలములో ఊహాపోహలలో చిక్కుకొని దారితప్పుతాం. ఇక్కడగాని, రష్యాలోగాని, అమెరికాలోగాని మానవుని మనస్సు ఒకే విధమైనది. కాని వేర్వేరు వాతావరణాలలో వేర్వేరు ప్రభుత్వాల క్రింద వేర్వేరు విధాలుగా అది అభివ్యక్తమవుతూవుంటుంది.

12 జనవరి, 1955

12

అభయ భావన

చెఱసాల గోడల మధ్య జరిగే తిరుగుబాటును గురించి యింతవఱకు చర్చిస్తూ వచ్చినాము అంటే సంఘ సంస్కర్తలు, ఆదర్శవాదులు, ఏవేవో ఫలితాలను సాధించడం కోసం నిరంతరము పాటుపడే యితరులున్న ఇటువంటి వారందరు తాము పొందియున్న సంస్కారములనే గోడలమధ్య, తామున్న సంఘవ్యవస్థ యొక్క గోడల మధ్య, పెక్కుమంది జనుల సమిష్టిసంకల్పానికి అభివ్యక్తీకరణముగా నున్నట్టి సభ్యతా సంస్కృతుల యొక్క పరిధిలోపల ఎట్లు తిరుగుబాటును చేస్తారో చర్చించినాము. ఇప్పుడు అభయమంటే యేమిటో అదెట్లా కలుగుతుందో మనము చర్చించడం చాల ప్రయోజనకరంగా వుంటుందని అనుకొంటున్నాను.

చొరవ తీసికొని పనిచేస్తూ వుంటే విశ్వాసం కలుగుతుంది. కాని నిశ్చిత పరిధిలోపల చేసెడి ఆ చొరవ ఆత్మవిశ్వాసాన్ని (Self Confidence) మాత్రమే కలిగిస్తుంది. దీనిని అహంపూర్ణ విశ్వాసమనవచ్చు. దీనికిని అహం శూన్య విశ్వాసానికిన్ని పోలికయే లేదు. ఆ రెండును పూర్తిగా భిన్నములు. విశ్వాసం కల్గియుండడమంటే యేమిటో మీకు తెలుసునా? మీ చేతులతో మీరు స్వయంగా ఏదైనా పనిచేస్తే స్వయంగా ఒకమొక్కను నాటి అది పెరగడం చూస్తే ఏదైనా బొమ్మక రంగు వేస్తే, ఒక పద్యం అల్లితే లేక మీరు పెద్ద వాండ్లైన తరువాత ఒక వంతెన నిర్మిస్తే లేదా ప్రభుత్వ పరిపాలనకు సంబంధించిన పనిని దేనినైనా చాలాబాగా నిర్వహిస్తే అప్పుడు మీలో ఒకపనిని చేయుగలమనే ధీమా - విశ్వాసం - కల్గుతుంది. కాని మనకు తెలిసిన యీ విశ్వాసం చెఱసాల లోపలనే. ఈ చెఱసాల సామ్యవాదుల సమాజంగాని, హిందు

వుల సమాజంగాని, క్రైస్తవుల సమాజంగాని మరి యే సమాజమైనా సరే మనచుట్టు నిర్మించిన చెఱసాల. ఇట్టి చెఱసాల లోపల తీసికొన్న చొరవవలన ఒక విధమైన విశ్వాసం తప్పక కలుగుతుంది. మనం కొన్ని పనులు చేయగలమనే విశ్వాసమది — ఒక మోటారుకు రూపకల్పన చేయగలమని గాని, మంచి వైద్యులమో, గొప్ప శాస్త్రజ్ఞులమో, లేదా మరొకరమో కాగలమని గాని విశ్వాసము కలుగుతుంది. ఈ విధంగా సంఘవ్యవస్థలో నుంటూ సఫలత పొందడంలో, ఆ సంఘాన్ని సంస్కరించడంలో, దాని లోపలికి మరికొంత వెలుతురు వచ్చేటట్లు చేయడంలో, దానిలోపలి గోడలను అలంకరించడంలో సామర్థ్యమున్నట్లయితే, దానితో వచ్చే విశ్వాసము నిజంగా ఆత్మ విశ్వాసము, అహంపూర్ణవిశ్వాసము. అందులో మనమేదో చేయగల మనే జ్ఞానమున్ను, దానిని చేయడంలో మేము సమర్థులము కాన మేము గొప్పవారమనే భావన యున్ను వుంటాయి. అట్లుగాక విచారణ చేయడం ద్వారా, అవగాహన పొందడం ద్వారా మీరున్న సంఘము యొక్క కట్టుబాట్లను ఛేదించుకొని బయటపడితే అప్పుడు పూర్తిగా విభిన్నమైన విశ్వాసమొకటి మీలో కల్గుతుంది. అందులో ఆత్మ ప్రాధాన్యభావనకు చోటులేదు. మన మీ రెండు విధములైన విశ్వాసములకు—అంటే అహంపూర్ణ విశ్వాసమునకును అహంశూన్య విశ్వాసమునకును — గల భేదమును అర్థము చేసికోగల్గితే మన జీవితమెంతో సార్థకమవుతుంది.

బాడ్మింటను, క్రికెట్టు, ఫుట్ బాల్ లాంటి ఆటలను మీరు చాల బాగా ఆడినపుడు మీ మనస్సులో ఒక విధమైన ఆత్మ విశ్వాసం కలుగుతుంది. ఏమి కలుగదా? నేను బాగా ఆడగలననే భావన అందులో వుంటుంది. గణిత సమస్యలను చాల వేగంగా మీరు పరిష్కరింపగలిగితే దానివలన గూడ మీకు ఆత్మప్రత్యయం కలుగుతుంది. సంఘ పరిధిలోనుంటూ, చేసిన పనుల వలన విశ్వాసం కలిగినట్లయితే, దానితో బాటు ఒక విధమైన దురహంకారము కూడ కలుగుతుంది. ఏమి కల్గదా? కార్యక్షమత గల్గినవానికి, కార్యమందు సాఫల్యమును పొంద సమర్థుడైన వానికి ఆత్మవిశ్వాసముతో బాటు దురహంకారముగూడ అంటే "ఆ

పని చేసిన వాణ్ణి నేనే" అనే భావన గూడ తప్పక వుంటుంది. కాబట్టి ఫలితమును సాధించడంలో, చెఱసాల గోడల మధ్యగల సంఘమును సంస్కరించడంలో ఈ ఆత్మ దురహంకారము — అంటే, "నేను చేసితిని, నా ఆదర్శము గొప్పది, నా పక్షము గెలిచినది" ఇటువంటి భావన తప్పక వుంటుంది. సమాజమనే చెరసాల యొక్క గోడల మధ్య వ్యక్తమయ్యే ఆత్మవిశ్వాసముతో బాటు, నేను నాది అనేభావన ఎల్లప్పుడును తప్పక వుంటుంది.

ఆదర్శవాదులు ఎంత దురహంకారముతో వుంటారో మీరు గమనించలేదా? సంఘంలో పెద్ద పెద్ద సంస్కరణలు కొని తెచ్చినట్టి, కొన్ని ఫలితాలను సాధించినట్టి రాజకీయనాయకులు తమ గొప్పతనానికి తాము పొంగిపోతూ తమ ఆదర్శాలకును అందులో తాము పొందిన సిద్ధికిని ఉబ్బిపోతూ వుండడం మీరు గమనించలేదా? వారి దృష్టిలో వారెంతో ముఖ్యులు. కొన్ని రాజకీయోపన్యాసములను చదవండి. సంఘసంస్కర్తలమని చాటుకొనే యీ మనుషులను కొందరిని గమనించండి. వారు కొనసాగించే సంఘ సంస్కరణోద్యమంలో వారు తమ అహమును ఎంతగా పెంచుకొంటున్నారో మీరు చూడగలరు. వారు తలపెట్టిన సంస్కరణలు ఎంత విస్తృతమైనవైనను, అవి చెఱసాల యొక్క నాలుగుగోడల మధ్యనే! కాబట్టి అవి వినాశకరములు; తుదకవి మనిషికి ఎంతో దుఃఖాన్ని సంఘర్షణను కలుగచేస్తాయి.

కాబట్టి, మీరీ సంఘవ్యవస్థనంతను, సంస్కృతి రూపములోనున్న సాముదాయిక సంకల్పమును, నాగరికతయని పిలువబడే దానిని క్షుణ్ణముగా పరిశీలించి చూచినట్లయితే, — అదంతా అర్థం చేసికొని దానిని ఛేదించుకొని బయటపడితే, హిందువులుగాని, క్రైస్తవులుగాని, సామ్యవాదులుగాని, మీరెవరైనా సరే, మీమీ సంఘములనెడి కారాగారముల కుడ్యములను ఛేదించుకొని బయటికి వచ్చివేస్తే, అప్పుడు మీకు కలిగెడి విశ్వాసము దురహంకారముతో దూషితము కానిదని తెలిసికోగలరు. ఆ విశ్వాసము నిర్దోషము, నిర్వ్యాజము. అది పట్టి ఆ ఘాయికమైన శిశువు యొక్క

విశ్వాసము లాంటిది. ఆ పసిపాప దృష్టిలో చేయగూడని పని అంటూ లేదు. ఇటువంటి అమాయికమైన విశ్వాసమే క్రొత్త నాగరికతను సృష్టింపగలదు. కాని మీరు సంఘ వ్యవస్థకు లోబడియున్నంత కాలము ఇట్టి అమాయికమైన విశ్వాసము సిద్ధింపనేరదు. ఇట్టి విశ్వాసమును బహుశా అభయమని పిలువవచ్చు.

ఈ విషయాన్ని దయచేసి జాగ్రత్తగా వినండి. ఈ చెప్పే వక్త కానే కాదు ముఖ్యము. అతడు చెప్పేదానిలోని సత్యమును అవగాహన చేసి కోవడమే ముఖ్యము. ఇంతకును విద్యయంటే అదే; కాదా? సంఘ వ్యవస్థలో ఇమిడి పోవడంకోసం మిమ్ము సిద్ధపరచడం కాదు విద్యయొక్క పరమార్థము. తద్విరుద్ధముగా, సంఘవ్యవస్థను పూర్తిగా లోతుగా క్షుణ్ణంగా అవగాహన చేసికొని, దానిని ఛేదించుకొని బయటపడడం లో సహాయపడడమే విద్యయొక్క ప్రధాన ప్రయోజనము. అప్పుడు మాత్రమే మీరు దురహంకారము లేని స్వతంత్ర వ్యక్తులౌతారు. అప్పుడు మీరు నిజంగా మాయామర్మములేని అమాయికులు, మీకున్న విశ్వాసము మాయామర్మము లేనిది.

సంఘంలో మనమెట్లు ఇమిడిపోగలం? లేదా దానినెట్లు సంస్కరింపగలం? దాదాపు మనందరి ధ్యాస ఇదే. చాల విషాదకరమైన విషయం కాదా ఇది? మీరడిగిన ప్రశ్నలలో ఎక్కువభాగము ఈ వైఖరిని ప్రతిబింబించడం మీరు గమనించలేదా? మీరడిగే ప్రశ్నల సారాంశమేమంటే, "నేనెట్లు సంఘంలో ఇమిడి పోగలను? సంఘంలో ఇమడక పోతే మాతల్లిదండ్రులు ఏమంటారో? నా గతి యేమైపోను?" అటువంటి వైఖరి మీలో వున్న ఆ కొద్దిపాటి విశ్వాసాన్ని మీలో వున్న ఆ కొద్దిపాటి చొరవను నశింపజేస్తుంది. పాఠశాలలు, కళాశాలలు వదిలి స్వయంచాలిత యంత్రముల (automatons) వలె మీరును బయటికి వస్తారు. ఆ యంత్రములవలె బహుశా మీలో మిక్కిలి శక్తి సామర్థ్యములుండవచ్చు. కాని సృజనాత్మకమగు జ్వాల మాత్రముండదు. అందువలన తామున్న సమాజాన్ని, తాము నివసించెడి పరిసరాలను బాగుగా అర్థం చేసికోవడం,

అట్లువాటిని అవగాహన చేసికోవడం ద్వారా వాటినుండి విడివడడం చాల అవసరం.

చూశారా, ప్రపంచమంతటా వున్న సమస్య యిది. ఐరోపాలోగాని, రష్యాలో గాని, ఇక్కడగాని ప్రాత విలువలన్నీ నశించిపోతున్నాయి. జీవితాన్ని క్రొత్త దృష్టితో చూడడానికి దానికి క్రొత్త విలువల నీయడానికిన్నీ మానవుడు ప్రయత్నిస్తున్నాడు. జీవితమనేది యెడతెగని సవాలు. ఆ సవాలు నిత్యనూతనము. అందువలన ఆర్థిక వ్యవస్థలో ఏదోకొంత మార్పు తేవడం ఆ సవాలును సంపూర్ణంగా ఎదుర్కొంటున్నట్లు కాదు. నిత్యనూతన మగు ఆ సవాలును సంపూర్ణంగా ఎదుర్కొనడంలో సంస్కృతులు, నాగరికతలు, మానవజాతులు సమర్థములు కానట్లయితే అవన్నీయు నశించిపోతాయి.

మీకు సరియైన విద్య గలుపబడకపోతే పసిపిల్లలకు వలె యీ అద్భుతమైన విశ్వాసము, ఈ అభయ భావన మీలో లేకపోతే మీరు తప్పనిసరిగా సమిష్టిలో సముదాయింలో లీనమైపోతాయి; మీ జీవితములు నిరర్థకములై పోతాయి. మీ పేళ్ళ చివర కొన్ని అక్షరాలు చేర్చుకొంటారు. తరువాత పెండ్లి, పిదప పిల్లలు, అంతటితో కథకంచికి, మనమింటికి —మీ వ్యక్తిత్వానికి మంగళహారతి.

చూశారా, మనలో చాలమందికి భయం. మీరందరు సంపూర్ణ మానవులైపోతారేమోనని మీ తల్లిదండ్రులకు భయం, మీ ఉపాధ్యాయులకు భయం, ప్రభుత్వములకు భయం, మతములకు భయం. మీరందరు పరిసరముల ప్రభావానికి, సాంస్కృతిక ప్రభావానికి బందీలై 'భద్రంగా' వుండిపోవాలని వారందరి అభిప్రాయం. కాని సంఘనిర్మాణమును అర్థం చేసికొని దానిని ఛేదించుకొని బయటికి వచ్చినవారే, ఆవిధంగా, తమ మనస్సులయందు నాటుకొనిపోయిన సంస్కారములకు బద్దులు కాని వారే క్రొత్త నాగరికతను సృష్టింపగలవారు. అంతేగాని, కేవలం గ్రుడ్డిగా ఇతరుల ననుకరించేవారు కాదు; తాములవాటు పడ్డ పద్ధతికి భిన్నంగా వున్నదని తలచి, మరొక పద్ధతిని ఎదిరించేవారున్ను కాదు. దైవమును

లేదా సత్యమును అన్వేషించడం చెరసాలలో నాలుగుగోడల మధ్య జరిగే పనికాదు. ఆ చెరసాలను అర్థం చేసికొని దాని గోడలను బ్రద్దలుగొట్టుకొని బయటపడడంలో ఆయన్వేషణ ఆరంభమవుతుంది. విముక్తి దిశగా చేసెడి ఈ ప్రయాణమే క్రొత్త సంస్కృతిని క్రొత్త ప్రపంచాన్ని సృష్టిస్తుంది.

1. ప్రశ్న:- కృష్ణజీ, మనకెవరైనా తోడువుండాలని యెందుకు కోరుకొంటాము?

కృష్ణమూర్తి:- మనకు తోడు కావాలని ఎందుకు కోరుకొంటామని ఒక బాలిక అడుగుతున్నది. ఎవరికైనా తోడెందుకు కావాలి? భర్తగాని, భార్యగాని, పిల్లలుగాని, స్నేహితులుగాని లేకుండా ఒంటరిగా ఈ ప్రపంచంలో మీరు జీవింపగలరా? చాలమంది ఒంటరిగా జీవింపలేరు. కాబట్టి వాండ్లకు తోడుకావాలి. ఒంటరిగా వుండవలెనంటే అత్యధిక మైన తెలివి కావాలి. పైగా దైవమును సత్యమును దర్శించవలెనంటే ఒంటరిగా వుండడం చాల అవసరం. భర్తగాని, భార్యగాని, మరెవ్వరైనాగాని తోడుండడం, బిడ్డలుగూడ వుండడం పైకి చూడడానికి చాల బాగుంటుంది గాని ఆ బాదర బందీలో చిక్కుకొని మనం నశించుతాం. కుటుంబ బాధ్యతలలో, ఉద్యోగ నిర్వహణలో క్రొత్తదనం లేక, విసుగు పుట్టిస్తూ ఏకరీతిగా కొనసాగే దైనిక జీవితంలో క్రమంగా క్షీణించి నశిస్తాం. అట్టి జీవితానికి అలవాటుపడిపోయి, ఆ తర్వాత ఒంటరిగా జీవించడమనే ఆలోచన వస్తేనే భయపడిపోతాం. మనలో చాలమందిమి మన భరోసానంతా, మన విశ్వాసమంతా ఏదో ఒకే దానిమీదే వుంచుతాం — అన్ని గ్రుడ్లను ఒకే గంపలో పెట్టినట్లు. మన జీవితాలలో మన సహచరులు, మన కుటుంబాలు, ఉద్యోగాలు తప్ప మనకు మరే సంపదాలేదు. ధన సంపదను, జ్ఞానసంపదను ఎవరైనా సంపాదించుకోవచ్చును. అట్టి సంపదగాకుండా మరొక విధమైన సంపద — అంటే ఆద్యంతములు లేని సత్యము యొక్క అన్వేషణ మనే సంపద — మన జీవితంలో వుండి వున్నట్లయితే అప్పుడు ఇతరుల సాహచర్యం కోసం ప్రాకులాడడము,

అది అప్రధానమవుతుంది.

కాని చూడండి, ఒంటరిగా స్వతంత్రంగా జీవించడమంటే ఎట్లో మీకు ఎవరును బోధించలేదు. మీరెప్పుడైనా ఒంటరిగా వాహ్యాళికి వెళ్తారా? బయటికి ఒంటరిగా పోవడం చాల అవసరం. ఏమీ పుస్తకాలు తీసికొని పోవద్దు. ఎవరినీ తోడుగా తీసికొని పోవద్దు. ఒంటరిగా పోయి ఏదైనా చెట్టుక్రింద కూర్చోండి. అక్కడ అన్నిటిని మెల్లగా పరిశీలిస్తూ వుండండి — చెట్టు నుండి ఆకు రాలడం గమనించండి. నీరు తప తప కొట్టుకోవడం వినండి. బెస్తవాడు పాటపాడడం ఆలకించండి. పక్షి ఎగరడం చూడండి. అట్లే మీ మనో వీధిని ఒక దానివెంట నొకటి తరుముకొంటూ వస్తూవుండే ఆలోచనలను శ్రద్ధగా గమనిస్తూ వుండండి. మీరు ఒంటరిగా వుండి వీటినన్నిటిని గమనించి చూస్తూవుంటే, మీ హృదయంలో అద్భుతమైన సంపదలను కనుగొనగలరు. వాటిపై మరెవరి కిని అధికారములేదు. ఏ ప్రభుత్వమున్ను పన్ను వేయలేదు. ఏ మానవ మాత్రుడున్ను వాటిని చెడ గొట్టలేదు. అవి యెన్నటికిని నశించేవి కావు.

2. ప్రశ్న:- మీరు ఉపన్యాసాలివ్వడం సరదా కోసమా? కాలక్షేపం కోసమా? మాట్లాడి మాట్లాడి అలసిపోరా? మీరెందుకోసం ఈ పని చేస్తున్నారు?

కృష్ణమూర్తి:- ఈ ప్రశ్న అడిగినారు, నాకు చాల సంతోషం. మీరు దేనినైనా ప్రేమిస్తే దానియందు మీకు విసుగు పుట్టదు — అది మీకు తెలుసుగదా. నా వుద్దేశంలో ప్రేమించడమంటే అందులో ఏదో ఫలితం పొందాలనే కోరిక వుండదు. ప్రేమద్వారా ఏదైన ఫలితాన్ని ఆశిం చము. మీరు దేనినైనా ప్రేమించడం ఆత్మతృప్తికోసంకాదు. అందువలన దానిలో నిరాశ పొందడమంటూలేదు. ఆ ప్రేమకు అంతమున్నూ లేదు. ఐతే మరి నేను ఎందుకిది చేస్తున్నాను? బహుశా ఇదేవిధంగా గులాబి పూవు ఎందుకు వికసిస్తుంది? మల్లెపువ్వు ఎందుకు సువా: నలు విరజిమ్ముతుంది? పక్షి యెందుకు ఎగురుతుంది? అని కూడ

మీరడుగవచ్చుగదా?

అయితే, మాట్లాడకపోతే యేమి జరుగుతుందో చూద్దామని తలచి నేను మాట్లాడకుండా వుండడానికి ప్రయత్నించాను. సంభాషణలు, ప్రసంగములు జరుపలేదు. అదీ బాగానే వుంది. ఏమి, నేను చెప్పేది మీకర్థమౌతున్నదా? ధనమో, బహుమానమో, పదిమందిలో గొప్ప పేరో ప్రసిద్ధో ప్రాముఖ్యమో లభిస్తుందని మీరు మాట్లాడుతూ వుంటే అందులో అలసట వుంటుంది. అది చెరుపు కలుగజేస్తుంది. అందుచే అది నిరర్థకము; కేవలము ఆత్మ తృప్తికోసమే చేయబడుతుందది. అట్లుగాక మీ హృదయం లో ప్రేమ అనేది వున్నట్లయితే, ఆ హృదయము మనః కల్పితము లైన వాటితో నిండి వుండకపోతే, అప్పుడది త్రికాలములందును నిర్మల జలమును ద్రవించెడి జలధారాయంత్రము (Fountain) వంటిది, ఊట బుగ్గ (Spring) వంటిది.

3. ప్రశ్న:- నేను ప్రేమించే మనిషికి కోపం వస్తే ఆ కోపమెందు కంత తీవ్రంగా వుంటుంది?

కృష్ణమూర్తి:- అసలు మీరు ఎవరినైనా ప్రేమిస్తారా? ప్రేమించడ మంటే యేమిటో మీకు తెలుసునా? ప్రేమించడమంటే మీ మనస్సును మీ హృదయాన్ని మీ సర్వస్వాన్ని అర్పించి, దానికి బదులుగా ఏమిన్ని ఆశించకపోవడం, ప్రేమకు బదులు ప్రేమనిమ్మని భిక్షాపాత్రను ముందుకు సాచక పోవడం. ఏమి అర్థమవుతున్నదా? అటువంటి ప్రేమ వున్నప్పుడు అక్కడ కోపమునకు అవకాశమే లేదు. మనమెవరినైనా మామూలుగా ప్రేమ అనబడే దానితో ప్రేమిస్తే మనకెందుకు కోపం వస్తుందో తెలుసా? మన ప్రేమకు బదులుగా ఆ మనిషినుండి మనము దేనిని ఆశిస్తామో, అది మనకు లభించడం లేదు, అంతేనా? నేను నా భార్యనుగాని భర్తనుగాని కొడుకునుగాని కూతురునుగాని ప్రేమిస్తాను; కాని వాండ్లెవ్వరైనా తప్పుచేస్తే వెంటనే నాకు కోపం వస్తుంది. ఎందువలన?

తండ్రికి తన కొడుకుమీదగాని కూతురుమీదగాని కోపమెందుకు వస్తుంది? ఎందుకంటే, తన బిడ్డ తాను కోరినట్లుండక, తాను చెప్పినపని చేయక, తానుద్దేశించిన చట్రంలో ఇమడక తిరగబడడం మొదలుపెడుతుంది. తల్లిదండ్రులు తమ ఆస్తి ద్వారాగాని, తమ బిడ్డలద్వారాగాని తమ ఆశలను ఫలింపజేసికోడానికి, తాము చిరంజీవులై పోవడానికి ప్రయత్నిస్తారు. తమకు నచ్చని పనిని బిడ్డ చేసినప్పుడు వాండ్లకు తీవ్రమైన కోపం వస్తుంది. బిడ్డయెట్లా వుండవలెనో వారికొక ఉద్దేశమున్నది, ఒక ఆదర్శమున్నది. దాని ద్వారా వారు తమ ఆశయాలను నెరవేర్చుకొన దలుస్తారు. అందులోనే వారికి తృప్తి. అందువలన తమ ఉద్దేశాలకు భిన్నంగా బిడ్డలు నడుచుకొంటున్నప్పుడు వారికి కోపం వస్తుంది.

ఒక్కొక్కసారి మీ స్నేహితుని మీద మీకెంతో కోపం వస్తుంది, గమనించారా? ఇక్కడ కూడ జరిగేది అదే ప్రక్రియ. మీరతని నుండి యేదో ఆశిస్తూ వుంటారు. మీ ఆశ నెరవేరనప్పుడు మీరు నిరాశ చెందుతారు. నిజానికి దాని అర్థం యేమిటంటే, మీరు ఆంతరికంగా, మానసికంగా, ఆ మనిషి మీద ఆధారపడి వున్నారన్నమాట. కాబట్టి మానసికమైన పరాధీనత ఎక్కడ వున్నదో అక్కడ ఆశాభంగము, చిరాకు తప్పదు. దానివలన కోపము, మాత్సర్యము, అసూయ ఇంకా రకరకాలైన విరోధ లక్షణాలన్నీ కలుగుతాయి. అందువలన చిన్నప్పటినుండి మీరు ప్రేమిస్తూ వుండాలి — చెట్టునుగాని, పిట్టనుగాని, జంతువునుగాని, మీ ఉపాధ్యాయునిగాని, మీ తల్లినిగాని, మీ తండ్రినిగాని — ఎవరినైనా సరే దేనినైనా సరే సంపూర్ణభావముతో, ప్రేమించడం చాల అవసరం. అప్పుడు స్వయంగా మీకే అర్థమవుతుంది — ఘర్షణ లేకుండా, భయం లేకుండా వుండడమంటే యేమిటో.

కాని చూశారా, చదువు చెప్పే ఉపాధ్యాయుడు మామూలుగా తన బాగోగుల గురించి తాను ఆలోచించుకొంటూ వుంటాడు; తన కుటుంబము, తన ఆదాయము, తన పదవి — వీటిని గురించిన చింత

లలో తగుల్కొని వుంటాడు. అతని హృదయంలో ప్రేమంటూ వుండదు. విద్యావిధానంలో వున్న కష్టాలలో ఇది యొకటి. మీ హృదయంలో ప్రేమ ఉండవచ్చు; చిన్న పిల్లలలో ప్రేమ వుండడం సహజం. కాని ఆ ప్రేమను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడు, సాంఘిక వాతావరణమున్ను త్వరలోనే నశింపజేస్తాయి. ఆ అమాయికత్వాన్ని, జీవితమును గుబాళింపజేసెడి ఆ ప్రేమను పోకుండా చూచుకోవడం చాల కష్టమైనపని. దానికెంతో తెలివి, లోచూపున్ను వుండాలి.

4. ప్రశ్న:- మనస్సు తనకున్న అడ్డంకులనెట్లు అతిక్రమించి పోగ లదు?

కృష్ణమూర్తి:- తన అడ్డంకులను తాను దాటుకొని ముందుకు పోవాలంటే మొట్టమొదట ఆ యడ్డంకులేవో మనస్సు తెలిసికోవాలి గదా? మీరు మీ మనస్సునకున్న పరిమితులను, హద్దులను, సరిహద్దులను మొదట తెలిసికోవాలి. కాని మనలో చాల తక్కువమందికే వాటిని గురించి తెలుసును. మనకవి తెలుసునని అంటాం. కాని అది వట్టి నోటిమాట. "ఇదిగో ఇక్కడ వున్నది అడ్డంకి; ఇది నాలోని బంధము. దీనిని నేను అర్థం చేసికోవాలి. కాబట్టి దీనిని విమర్శించి చూచుకొంటాను. ఇది యెట్లా వచ్చినదో, దీని స్వభావమేమిటో నేను చూస్తాను," అని మనమెప్పుడూ అనము. జబ్బేమిటో తెలిస్తే, దానిని నయం చేసికోడానికి అవకాశముంటుంది. కాని జబ్బేమిటో తెలిసికోవాలంటే అనగా మనస్సునకున్న పరిమితులను, దాని కున్న బంధాన్ని లేక ఆటంకాన్ని తెలిసికోవాలంటే, అనగా మనస్సును అర్థం చేసికోవాలంటే దానిని ఖండించకూడదు; ఇది తప్పు, ఇది ఒప్పు అని విమర్శించకూడదు. ముందుగానే ఎట్టి అభిప్రాయాన్ని ఏర్పరచుకోకుండా, దానియెడల పక్షపాతంగాని, విరోధంగాని లేకుండా జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ పని చాల కష్టం. ఎందుకనగా మనం తప్పు పట్టడానికి, ఖండించడానికి అలవాటుపడ్డ వాండ్లం.

పిల్లవాణ్ణి అర్థం చేసికోవాలంటే, ముందా పిల్లవాణ్ణి నిందించడం, తప్పు పట్టడం మానివేయాలి. వాణ్ణి నిందించడంలో అర్థంలేదు. వాణ్ణి ఆడుకొనేటప్పుడు, ఏడ్చేటప్పుడు, తినేటప్పుడు గమనించి చూడాలి. వాడి మనస్సు ఎప్పుడెట్లా వుండేది పరిశీలించాలి. అంతేగాని ఆ పిల్ల వాడు అందవికారంగా వున్నాడు, తెలివ తక్కువ మొద్దు, ఇట్లాంటివాడు, అట్లాంటివాడని మీరన్నట్లయితే, మీరింక వాణ్ణి సరిగా గమనించలేరు, పరిశీలించలేరు. అదే విధంగా మనస్సునకున్న అడ్డంకులను — పైపైన కన్పించేవే గాకుండా, లోతుగా, అంతశ్చేతనలో, వుండేవాటినిగూడ — గమనించాలంటే, వాటిని నిందించకుండా గమనించాలి. అప్పుడు మీ మనస్సు వాటిని దాటి ముందుకు పోగలదు. అట్లా ముందుకు పోవడమే సత్యము దిశగా పోవడము.

5. ప్రశ్న:- ప్రపంచంలో ఇంతమంది స్త్రీ పురుషులను దేవుడెందుకు సృష్టించినాడు?

కృష్ణమూర్తి:- దేవుడు మనలను పుట్టించినాడని ఎందుకనుకొంటారు? దీనికి సరళమైన వివరణమేమంటే — ఇది జీవికి పుట్టుకతో వచ్చిన గుణం, సహజాతం (Instinct). ఈ సహజాతము, కోరిక, ఉత్కంఠ, మోహము — ఇవన్నీ జీవము యొక్క లక్షణములు. "జీవమే దైవ" మని మీరంటే, అది వేరే విషయం. అప్పుడు దైవమంటే సమస్తమున్ను — అంటే ఉత్కంఠ, మోహము, ఈర్ష్య, భయము — అన్నీదైవమే. ఈ కారణాలన్నీ కలిసి మితిమీరిన జనాభావృద్ధికి తోడ్పడినాయి. దీనితో జనాభా సమస్య యేర్పడినది. ఈ దేశానికి వచ్చిన శాపాలలో ఇది యొకటి. కాని చూశారా, యీ సమస్య అంత సులువుగా పరిష్కరింపబడదు. మానవునికి పారంపర్యంగా సంక్రమించిన అవసరాలు, నిర్బంధాలు అనేకములున్నాయి. క్లిష్టమైన ఆ ప్రక్రియ నంతను అవగాహన చేసికోకుండా, కేవలం జనన శాతాన్ని - జనాభ వృద్ధి రేటును — నియమితం చేస్తామనడంలో అర్థంలేదు. మనమ దరమున్ను కలిసి ఈ ప్రపంచాన్నంతను గందరగోళం చేసి వున్నాము.

మనలో ప్రతియొక్కరున్ను దీనికి బాధ్యుడే. మనకు జీవించడమంటే యేమిటో తెలియదు. జీవించడమంటే యీ డాంబికమైన, మధ్యమమైన మరియు క్రమశిక్షణకు లొంగిపోయిన అస్తిత్వము కాదు. జీవించడమంటే దీనికి పూర్తిగా భిన్నమైనది. అది యెంతో సౌందర్యవంతమైనది, నిత్య పరిణామ శీలమైనది. అట్టి శాశ్వతమైన జీవిత ప్రవాహాన్ని అర్థం చేసికోనంత కాలము మన జీవితములు నిరర్థకములవడం తథ్యము.

13 జనవరి, 1955

13

సమానత్వము

ఎండిపోయిన పొడి నేలమీద వాన కురిస్తే చాల అద్భుతంగా వుంటుంది, కాదా? ఆకులు శుభ్రమవుతాయి; నేల చల్లబడుతుంది. వాన నీటిచేత చెట్ల దుమ్మంతా కడిగి వేయబడినట్లే మన మనస్సులు గూడ శుభ్రంగా కడిగివేయబడాలని ప్రక్షాళితములు కావాలని నేననుకొంటాను. మన మనస్సులు ఎన్నో శతాబ్దాల దుమ్ముతో నిండివున్నాయి. ఆ దుమ్మునే మనము జ్ఞానమని, అనుభవమని పిలుస్తాం. ప్రతి దినము మనం మన మనస్సులను శుభ్రం చేసికొంటూవుంటే దుమ్మంతా కడిగివేసికొంటూవుంటే, నిన్నటి జ్ఞాపకాలనుండి యీనాడు విముక్త మవుతూవుంటే, అప్పుడు మన మనస్సులు నిర్మలములై, నవీనములై, జీవితమునకు సంబంధించిన అనేక సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనగలవు.

ఇప్పుడు ప్రపంచాన్ని మిక్కిలి కలత పెడుతున్న పెద్ద సమస్యలలో ఒకటి 'సమానత్వం'. ఒక విధంగా చూస్తే ప్రపంచంలో సమానత్వమనేదేలేదు. మనకున్న శక్తిసామర్థ్యాలు వేర్వేరు — అందరికిని ఒకేరకంగా వుండవు. కాని మనమిప్పుడా అర్థంలో సమానత్వాన్ని గూర్చి చర్చించడం లేదు. 'అందరినీ సమానంగా చూచుకోవాలి' అనే అర్థంలో సమానత్వం గూర్చి చర్చిస్తున్నాం. ఉదాహరణకు బడిలో ప్రిన్సిపాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల గృహపతులు (House parents) — వీరి పనులన్నీ జీతంకోసం చేసే పనులు, ఉద్యోగ ధర్మములు. కాని కొన్నిపనులతో బాటు కొన్ని కర్తవ్యములతో బాటు హోదా అనేది ఒకటుంటుంది. దానిని అందరు గౌరవిస్తారు. ఎందుకంటే హోదా అనగా అధికారము, పేరు, ప్రతిష్ఠ. హోదాలోవున్న వాడు ఇతరులను గద్దించవచ్చు, ఇతరులను ఆజ్ఞాపించి

వారిచేత పనులు చేయించుకోవచ్చు — అదే అధికారమంటే. అతడు తన స్నేహితులకు గాని, బంధువులకుగాని ఉద్యోగాలు ఇచ్చుకోగలడు. కాబట్టి ఉద్యోగ ధర్మంతో బాటు అధికారము లేదా హోదా అనేది ఒక టుంటుంది. కాని యీ హోధా, యీ అధికారం, యీ పదవి, యీ ప్రతిష్ఠ, యీ ఆశ్రిత షక్షపాతం, యీ బంధుప్రీతి — యిటువంటి భావ నలనన్నిటివి మనం తొలగించి వేయగల్గితే అప్పుడు ఉద్యోగానికి సరిక్రొత్త అర్థం వస్తుంది, సరళమైన అర్థం వస్తుంది, ఏమి రాదా? చూడండి, అప్పుడు గవర్నరైనా ప్రధానమంత్రులైనా, వంటమనుష్యులైనా, బీద బడి పంతుళ్ళైనా ఎవరైనా సరే అందరినీ సమానంగా చూస్తారు, అందరికీ సమానంగా గౌరవం లభిస్తుంది. ఎందువల్లనంటే వారందరు సంఘంలో తమతమ కర్తవ్యాలను వేర్వేరుగా ఎవరివివారు చేసికొంటూ వుంటారు.

ముఖ్యంగా బడిలోనుండి అధికారాన్ని హోదాను ప్రతిష్ఠను, "నేను వీరందరికి తలపెద్దను, నేను చాల ముఖ్యమైన వాణ్ణి," అనే భావనను నిజంగా తొలగించి వేయగల్గితే ఏమవుతుందో మీకు తెలుసా? మన ముండే వాతావరణమే పూర్తిగా మారిపోతుంది; ఏమి మారిపోదంటారా? అప్పుడు ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ, ఒకడు గొప్పవాడు, ఇంకొకడు తక్కువవాడు అనే భేద భావమేవుండదు. ఒకరిమీద నొకరు పెత్తనం చెలాయించడం వుండదు. దానితో అందరి మనస్సులలో నుండి అరమ రలు తొలగిపోతాయి, స్వతంత్రముంటుంది. ఏ బడిలోనైనా అటువంటి వాతావరణాన్ని సృష్టించడం చాల అవసరం. అటువంటి స్వేచ్ఛాపూ రిత వాతావరణంలోనే ప్రేమ వుంటుంది. అటువంటి వాతావరణంలోనే ప్రతివాని హృదయ మందును అత్యధికమైన విశ్వాసము అంటే అభ యభావన ఏర్పడుతుంది. చూడండి, స్వగృహంలో మాదిరి నిర్భయంగా నిశ్శంకగా వున్నప్పుడే, మనకేమీ పర్వాలేదనే భావన పూర్తిగా వున్నప్పుడే విశ్వాసమేర్పడుతుంది, అభయముంటుంది. మీ యింట్లో నైనా సరే మీ తండ్రి, మీ తల్లి, మీ నాయనమ్మ మీతో "ఇది చెయ్యి, అది చెయ్యి, ఇదిచెయ్యవద్దు, అది చెయ్యవద్దు" అని అదేపనిగా చెబుతూ వుంటే మీకెంత ఇబ్బందిగా వుంటుంది? దానితో స్వయంగా ఏ పని

చేయడానికైనా సరే మీకుగల విశ్వాసము, మీకుగల చొరవ అంతా క్రమంగా తొలగిపోతుంది. మీరు పెద్దవాండ్లయ్యేకొలది మీరాలోచించేది సత్యమవునా కాదా, సరియవునా కాదా యని చర్చించి తెలుసుకోగల్గి యుండాలి. తెలిసికొని దానిని వదలకుండా పట్టుకొని వుండాలి. మీకు సరియని తోచిన దానికోసం మీరు గట్టిగా నిలబడగల్గియుండాలి — దాని వలన నొప్పికల్గినా సరే, బాధ కల్గినా సరే, డబ్బు పోయినా సరే, ఇంకా యేమి జరిగినా సరే అన్నింటిని భరించగలిగివుండాలి. అట్టి స్థితికి రావలెనంటే, మీరు చిన్నప్పుడు పూర్తిగా సురక్షితమైన వాతావరణంలో నిర్భయంగా, సుఖంగా జీవించవలె.

పెక్కుమంది యువకులు భయగ్రస్తులు; వారి మనస్సులలో మన కేమీ పర్వాలేదనే భావం, మనకు భద్రత గలదనే ప్రత్యయం లేదు. వారికి పెద్దలంటే భయం, ఉపాధ్యాయులంటే భయం, తల్లిదండ్రులంటే భయం. అందువలన వారెన్నటికిని స్వేచ్ఛగా సంతోషంగా వుండలేరు. కాని మీరే గనక అంత స్వేచ్ఛగాను సంతోషంగాను ఉండగల్గితే అద్భుతం జరుగుతుంది. మీరు మీ గదికిపోయి, తలుపు వేసికొని, ఎవరి కంట బడకుండ "అది చెయ్యండి, ఇది చెయ్యండి" అని మీమీద పెత్తనం చెలాయించే వాండ్లెవ్వరూ లేకుండ, మీ యంతట మీరు ఒంటరిగా వుండ గల్గితే అప్పుడు మీలో ఒక విధమైన ఆత్మప్రత్యయం కలుగుతుంది. ఒక విధమైన విశ్వాసము, భద్రతా భావము కలుగుతుంది. దానితో మీరు వికసించడం ఆరంభిస్తారు, నిజమైన బోధ కలుగసాగుతుంది. మనస్సును కప్పిన పొర తొలగడం ఆరంభమవుతుంది. మీరట్లు వికాసం పొంద డంలో తోడ్పడమే — దానికి తగిన దోహదమివ్వడమే — బడియొక్క ముఖ్యకర్తవ్యము. అట్లు వికాసము పొందడంలో తోడ్పడనిచో ఆ బడి బడేకాదు.

ఎక్కడనైనాసరే, మీరు మీ సొంత యింట్లో మాదిరి స్వేచ్ఛగా నిర్భయంగా ఉండగలిగేటట్లయితే, మిమ్ము కొట్టరని తిట్టరని ఆ పనీ యీ పనీ చెప్పి బలవంతంగా మీ చేత యేపనీ చేయించరని నమ్మకం గలి

గినట్లయితే మీరు హాయిగా ఎట్టి ఒత్తిడులు లేకుండా జీవింపగలిగినట్లయితే మీరు అల్లరిపనులు చేస్తారా? చేయరు. నిజంగానే మీరు సంతోషంగా వుంటే మీరు ఇతరులను బాధించరు, ఏవస్తువునూ ధ్వంసం చేయరు. కాని విద్యార్థిని పూర్తిగా సంతోషపెట్టడం చాల కష్టమైన పని. ఎందు కంటే, అతడు బడికి వచ్చేటప్పటికే అతని మనస్సులో ప్రిన్సిపాలు, ఉపాధ్యాయులు, గృహపతులు తాను ఏమేమి చేయవలెనో చెప్తారని, తన చేత నానా చాకిరీ చేయిస్తారని ఒక భావన పడిపోయి వుంటుంది. అందువలన భయముంటుంది.

అంతస్తును, హోదాను గౌరవింపవలెనని బోధింపబడిన యిండ్ల నుండి, పాఠశాలలనుండి మీలో చాలమంది వచ్చియుంటారు. మీ తల్లి దండ్రులకు హోదా వుంటుంది. ప్రిన్సిపాలుకు హోదా వుంటుంది. అందుచేత మీరు భయముతో హోదాకు గౌరవమిస్తూ వస్తారిక్కడికి. కాని మనమిక్కడ పాఠశాలలో నిజమైన స్వేచ్ఛాపూరిత వాతావర ణాన్ని సృష్టించవలెననుకున్నాం. అది సృష్టించబడాలంటే హోదాతో నిమిత్తంలేకుండా, అందరూ సమానమనే దృష్టితో ఎవరి పనులు వారు చేసికొంటూ పోవాలి. అందుకు మీరు దేనికినీ భయపడకుండా హోదాను గౌరవించాలనే తప్పుడు అభిప్రాయం పెట్టుకోకుండా, సూక్ష్మ గ్రాహ్యశక్తి సంపన్నులగు ఉత్తమ మానవులుగా జీవించడంలో సహాయపడడమే సద్విద్యయొక్క నిజమైన లక్ష్యము.

1. ప్రశ్న:- మాకు ఆటలమీద వున్నంత ప్రీతి చదువు మీద ఎందు కుండదు?

కృష్ణమూర్తి:- దాని కొకే కారణం, స్పష్టమైన కారణం — మీ ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పడం చేతకాదు, అంతే! దానికేదో వేరే పెద్ద కారణమంటూలేదు. గణితంగాని, దేశ చరిత్రగాని మరి యేదైనా గాని ఉపాధ్యాయుడు తాను బోధించే దానిని తాను నిజంగా ప్రేమిస్తున్నట్లయితే మీరు గూడ ఆపాఠ్య విషయాన్ని ప్రేమిస్తారు.

ఎందువల్లనంటే ప్రేమ అనేది సాంక్రామికము. దాని ప్రభావము చుట్టు ప్రక్కల నున్నవారి మీద తప్పక పడుతుంటుంది. అది మీకు తెలియదా? గాయకుడు ప్రేమతో గానము చేస్తూ అందులో లీనమైపోతే, వింటూ వున్న మీలో గూడ అదేభావము పుట్టదా? అటువంటి గాయకుని పాట వింటూవుంటే మీకు గూడ అతని మాదిరే పాట పాడడం నేర్చుకొం దామని బుద్ధి పుట్టుతుంది గాదా? అయితే చాలమంది టీచర్లకు తాము బోధించే విషయం మీద తమకే ప్రేమ వుండదు. అదంటేనే వారికి విసుగు. వేరే బ్రతుకు తెరువులేక, తప్పనిసరై ఆ వృత్తిని చేపడతారు. రోజూవాడుక ప్రకారం, గత్యంతరం లేక, పాఠాలు చెబుతూ వుంటారు. అట్లు గాక నిజంగా మీ ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పడంలో ప్రేమే వుండేటట్లయితే మీరేమౌతారో తెలుసా? అద్భుతమైన మానవులుగా తయారవుతారు. అప్పుడు మీరు మీ ఆటలను మీ పాఠాలవే గాదు, పువ్వులను, పక్షులను, నదులను, భూమిని అన్నింటిని ప్రేమిస్తారు. మీ హృదయాలలో ఈ ప్రేమభావము నిరంతరము స్పందిస్తూనే వుంటుంది. మీరు చాల వేగంగా నేర్చుకొంటారు. మీ మనస్సులు మట్టములు గాకుండా అత్యుత్తమములుగా తయారవుతాయి.

అందువలన ముందు విద్యాబోధకులకు విద్యను బోధించడం చాల అవసరం. కాని ఇది చాల కష్టమైన పని. ఎందువల్లనంటే ఎక్కువ మంది విద్యాబోధకులు తమతమ అలవాట్లలో బాగా స్థిరపడిపోయివుం టారు. అలవాట్లకు లొంగిపోయి వుంటారు. పిల్లలలోనైతే అలవాట్లు అంత లోతుగా నాటుకొని వుండవు. మీరు కనీసం ఏదో ఒకదానినైనా నిజంగా ప్రేమిస్తే — అంటే ఆటలనుగాని, లెక్కలనుగాని, దేశచరిత్రన గాని, రంగు వేయడాన్ని గాని, పాటపాడడాన్నిగాని దేనినైనా సరే ఏద ఒకదానిని ప్రేమించినా — మీ బుద్ధి చురుకుగా సజీవంగా పనిచేస్తుంది. అప్పుడు మీరు మీ పాఠాలనన్నిటిని చాల చక్కగా చదువుకోగలుగుతారు. మీ చదువు బాగా కొనసాగుతుంది. అసలు మీ మనస్సుకు అన్నీ తెలుసుకోవాలనే కుతూహల మెక్కువ. మీరు అన్నిటిని విమర్శించి చూడాలను కొంటారు. కాని తప్పుదారిన విద్యాబోధన జరగడంచేత

ఆ కుతూహలమంతా త్వరలోనే చచ్చిపోతుంది. అందువలన విద్యార్థితో బాటు విద్యాబోధకునికి గూడ విద్య బోధింప వలసియున్నది. అసలు జీవించడమంటేనే చదువు కోవడం, నేర్చుకోవడమున్నూ. పరీక్షలకు ముగిం పంటూ వుంటుంది. కాని చదువుకోవడాని కుండదు. మీ మనస్సు జిజ్ఞాసువై, సావధానమై వున్నట్లయితే మీరు ప్రతియొక్క విషయము నుండి నేర్చుకోవచ్చును.

2. ప్రశ్న:- ఏదైనా ఒక విషయం తప్పని గ్రహిస్తే ఇక ఆ తప్పు మనలో నుండి తొలగిపోతుందని మీరు చెప్పివున్నారుగదా. పొగ త్రాగడం తప్పని నేను ప్రతిదినము గ్రహిస్తూనే వున్నాను, కాని ఆ యలవాటు పోవడంలేదు!

కృష్ణమూర్తి:- మీ తల్లిదండ్రులుగాని, ఉపాధ్యాయులుగాని, ఇరుగుపొరుగువారుగాని లేదా మరెవ్వరైనా సరే పెద్దవాండ్లు పొగ త్రాగుతూ వుండగా మీరెన్నడైనా చూచి వుండలేదా? అది వాండ్లకొక అలవాటై పోయింది; కాలేదంటారా? దినం తరువాత దినం, సంవత్సరం తరువాత సంవత్సరం, వాండ్లు అలాగా పొగత్రాగుతూనే వుంటారు. వాండ్లా అలవాటుకు బానిసలై పోయినారు. ఆ విధంగా దానికి బానిసలై పోవడం యెంత బుద్ధి తక్కువపనో చాలమంది తెలిసికొని ఆ యలవాటును పోగొట్టుకోవడంకోసం దానితో పోరాడసాగుతారు. దానికి వ్యతిరేకంగా వారు తమ్ముతాము కట్టుబాటులో వుంచుకోడానికి ప్రయత్నిస్తారు. దానిని ఎదిరిస్తారు. దానిని వదిలించుకోడానికి ఎన్ని విధాలుగానో తంటాలు పడతారు. కాని అదిపోదు; అది యింకా గట్టిపడుతూ వుంటుంది. చూడండి, యీ అలవాటనేది ఒక నిర్జీవమైన వస్తువు, యాంత్రికంగా మారిపోయిన ఆచరణము. దానితో పోరాడేకొలది అది యింకా బలం పుంజుకొంటూ వుంటుంది. అట్లుగాక పొగ త్రాగేవాడు తన అలవాటును తాను సాక్షీభూతంగా వుండి గమనిస్తూ వుంటే, అనగా తన జేబులోనికి చేయిపెట్టడం, సిగరెట్టును పైకి తీయడం, దాని నొకవైపు తట్టడం, నోటిలో పెట్టుకోవడం, వెలిగించడం, గుప్పున పొగవదలటం

— ఈ పనులనన్నిటిని పొగ త్రాగిన ప్రతిసారి అతడు సాక్షీభూతంగా వుండి గమనిస్తూ వుంటే, దానిని తెగడకుండా, పొగ త్రాగడం ఎంత దారుణమైన చెడ్డ పని యని అనకుండా, కేవలం గమనిస్తూ వుంటే, అప్పుడా యలవాటుకతడు క్రొత్తగా బలం చేకూర్చడంలేదు. కాని స్థిర పడిపోయిన ఏ యలవాటునైనా మీరు నిజంగా వదులుకోదలచుకొంటే దాని నింకా లోతుగా పోయి విచారించి చూడవలసి వుంటుంది. అంటే మనస్సు ఆ యలవాటు నసలు ఎందుకు చేసికొన్నదనే ప్రశ్నను పూర్తిగా పరిశీలించవలసి వుంటుంది. అనగా మనస్సు ఎందుకంత అనవధానముగా పరాకుగా వున్నదో, తెలిసికోవలసివుంటుంది. ప్రతిదినం మీరు కిటికీ గుండా బయటికి చూస్తూ పండ్లు తోముకొంటూ వుంటే, ఆ పండ్లు తోము కోవడమనేది ఒక అలవాటుగా మారిపోతుంది. అట్లుగాక ప్రతి దినము చాల జాగ్రత్తగా మీ మనస్సంతా దానిమీదే వుంచి, పండ్లు తోముకొంటూ వుంటే అప్పుడది అలవాటుగా మారిపోదు, ఆలోచనా రహితంగా మరల మరల చేసే ఒక నిత్యచర్యగా అది మారిపోదు.

మీరు ఇది చేసిచూడండి, ఇటువంటి అలవాట్ల ద్వారా మనస్సు ఎట్లా నిద్రలోకి జారుకొంటుందో, ఆ తర్వాత ఆ నిద్ర మత్తులోనే యెట్లా వుండి పోదలుస్తుందో మీరు బాగా గమనించండి. చాలా మంది యొక్క మనస్సులు అలవాటనే గాడిలోనే ఎప్పుడూ నడుస్తూ వుంటాయి. మనం పెద్దవాండ్లమయ్యేకొద్దీ, యీ స్థితి యింకా దిగజారిపోతుంటుంది. బహుశా మీరిప్పటికే డజనులకొలది అలవాట్లు చేసికొనే వుంటారు. మీ తల్లిదండ్రులు చెప్పినట్లు చేయకపోతే, మీ తండ్రి కోరిక ప్రకారం మీరు పెండ్లి చేసికోకపోతే ఏ మౌతుందో యని మీకు భయం. అంటే అప్పుడే మీ మనస్సు ఒక గాడిలో పని చేయడం మొదలు పెట్టిందన్నమాట! మీరు పదిపదిహేనేండ్ల చిన్నపిల్లలేకావచ్చు; కాని ఒకే గాడిలో మీ మనస్సు పని చేయడం మొదలు పెట్టిందంటే మీరు ముసలివారై పోయినట్టే లెక్క. అంటే అంతర్గతంగా మీకు శైథిల్యం ఆరంభమయింది, క్షీణిం చడం మొదలుపెట్టినారు. మీ శరీరం ఆరోగ్యంగా వుండవచ్చు. అంతే, అంతకంటే యేమీలేదు. మీ శరీరం లేలే వయస్సులో నుండి నిటారుగా

నిలబడగలిగి వుండవచ్చు. కాని మీ మనస్సు మాత్రం తన భారంతో తాను క్రుంగిపోతుంటుంది.

కాబట్టి మన మనస్సు ఎందుకెల్లప్పుడు అలవాట్లలో తగులుకుంటుందో, గాళ్ళలోనే యెందుకు నడుస్తూ వుంటుందో, రోడ్డుమీద పట్టాలపై దారితప్పకుండా పోయే రైలుబండివలె బాట వెంబడి ఎందుకు పోతూ వుంటుందో, ప్రశ్నించడానికి లోతుకుపోయి విచారించడానికి ఎందుకు జంకుతుందో — యీసమస్యనంతను అర్థం చేసికోవడం చాల అవసరం. "మా తండ్రి సిక్కు మతస్థుడు, అందువలన నేను గూడ సిక్కు మతస్థుణ్ణే. నేను గూడ జుట్టు పెంచుకొంటాను, తలపాగా పెట్టుకొంటాను" అని మీరంటే — ఏమీ విచారణే చేయకుండా ఏమీ ప్రశ్నించకుండా ఈయలవాటునుండి తప్పించుకొందామనే ఆలోచనే లేకుండా మీరావిధంగా అన్నట్లయితే — అప్పుడు మీకును యంత్రానికిన్ని భేదమేలేదు. పొగ త్రాగే అలవాటు కూడ మిమ్ము యంత్రము వలె మార్చివేస్తుంది. ఆ యలవాటుకు మీరు బానిసలై పోతారు. ఇదంతా మీరు సరిగా అర్థం చేసికొన్నప్పుడే మీ మనస్సు నిర్మలమై నిత్య నూతనమై లేతమనస్సువలె చులుకుదనము గల్గి సజీవంగా పని చేయసాగుతుంది. అప్పుడు ఏదినమున కాదినము క్రొత్త దినమే. నదిమీద ప్రతిఫలించే ప్రతి అరుణోదయము మున్ను ప్రాతగిలక, చూడడానికి ఎప్పటికప్పుడు క్రొత్తదిగ ఆనందమును కలుగజేస్తూ వుంటుంది.

3. ప్రశ్న:- *మా పెద్దలలో కొందరు చాల గంభీరంగా ముఖంపెట్టినప్పుడు మేమెందుకు భయపడతాము? వాండ్లెందుకట్లా గంభీరంగా కనబడతారు?*

కృష్ణమూర్తి:- గంభీరంగా వుండడమంటే యేమిటో మీరెప్పుడైనా ఆలోచించారా? మీరెప్పుడైనా గంభీరంగా వున్నారా? మీరెల్లప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా నవ్వుతూనే వున్నారా లేక ఎప్పుడో కొన్ని క్షణాలపాటైనా శాంత గంభీరంగా — ఏదో కారణంచేత గాకుండా

సహజమైన గాంభీర్యంతో — వున్నారా? మరి పెద్ద వాండ్లు గంభీరంగా కనబడితే యెవరైనా యెందుకు భయపడాలి? భయపడవలసిన అవసరమే మున్నది? మీకే యిష్టంలేని దానిని దేనినైనా మీలో వారు చూస్తారని భయమా? చూడండి, మనలో చాలమందిమి యిటువంటి విషయాలను గురించి ఎన్నడును ఆలోచించం. గంభీరంగా వుండే ఒక వృద్ధుని యెదుట మనం భయపడేటట్లయితే దాని గురించి మనం లోతుగా విచారించం. “ఎందుకు నేను భయపడాలి?” అని మనలో మనం తర్కించుకొనం.

సరే, గంభీరంగా వుండడమంటే యేమిటో ఇప్పుడు తెలిసికొందాం. మామూలు అత్యల్ప విషయాలమీద గూడ గంభీరంగా వుండవచ్చు. ఉదాహరణకు, ఏదైనా చీరె కొంటున్నారనుకోండి. మీ మనస్సంతా ఆ విషయం మీదనే నిలవవచ్చు; దాని గురించే చింతిస్తుండవచ్చు, దానికోసం వేరువేరుగా పది దుకాణాలు తిరుగవచ్చు, రకారకాలైన నమూనాలను చూస్తూ మధ్యాహ్నం దాకా గడుప వచ్చు. దీనినే తీవ్ర విషయంగా, గంభీరమైన విషయంగా తీసికోడమని అంటారు. కాని ఆ గాంభీర్యమంతా అల్ప విషయాలమీదనే. ప్రతిదినం గుడికి పోవడం, అక్కడ విగ్రహానికొక మాలవేయడం, అర్చించడం, పూజారులకు దక్షిణ యిచ్చుకోవడం ఇటువంటి విషయాలను మీరు గంభీర విషయాలుగా తీసికోవచ్చు. కాని అదంతా వట్టి బూటకం కాదా? సత్యమని పిలిచినా, దైవమని పిలిచినా అది గుడిలో లేదు. జాతీయతాభావాన్ని గూడ మీరు గంభీరమైన విషయంగా తీసికోవచ్చు. కాని అది కూడ ఒక మిధ్యా విషయమే, అది కూడ ఒక భ్రమే.

జాతీయతా భావమంటే, యేమిటో మీకు తెలుసునా? “నా భారత దేశమిది, నాదేశమిది — తప్పైనా సరే, ఒప్పైనా సరే —” అనే భావన. లేదా “భారతదేశము ఆధ్యాత్మిక విజ్ఞాన కోశము. ఇచ్చట ఆధ్యాత్మిక విజ్ఞాననిధులు కోకొల్లలు. అందువలన తక్కిన అన్ని దేశములకంటె మా దేశము గొప్పది.” — ఇదే జాతీయతా భావమంటే. ప్రపంచంలోని ఏదేని ఒక దేశంతో మనము తాదాత్మ్యమును పొంది, అందుకు మనం

గర్విస్తూ వుంటే, మనం ప్రపంచం లోకి జాతీయతా భావాన్ని దిగుమతి చేస్తున్నామన్నమాట. ఈ జాతీయతా భావమొక బూటకపు దైవము. ఒక భ్రమ. ఒక మిథ్యాకల్పనము. కాని లక్షలకొలది. ప్రజలు దీని నొక గంభీరమైన విషయంగా పరిగణిస్తారు. అట్టివారు తమ దేశంకోసం పోరాడుతారు. ఒకరినొకరు కుత్తుకలు నరుకుకుంటారు. ఒకరినొకరు నాశనం చేసికొంటారు. ఇటువంటి తీవ్ర భావాలను రాజకీయవాదులు తమ స్వార్థానికి ఉపయోగించుకొంటూ వుంటారు.

కాబట్టి మిథ్యా విషయాలను గూడ మీరు చాల గంభీరమైన విషయాలుగా తీసికోవచ్చు. కాని గంభీరంగా వుండడమంటే యేమిటో మీరు నిజంగా విచారణ చేయ సాగితే అప్పుడు మరియొక విధమైన గాంభీర్యమొకటి వున్నదని, అది భ్రాంతి మూలకము కాదని — మిథ్యా విషయాలపై ఆధారపడిన గాంభీర్యము కాదని, — ఏదో యొక విశేష పద్ధతి ప్రకారము రూపొందింపబడినది కాదని మీరు కనుగొన గలరు. ఆ గాంభీర్యము మన మనస్సొక ఫలితంకోసం, ఒక లక్ష్యసాధన కోసం ప్రయత్నించకుండా నిశ్చలంగా వున్నప్పుడు అభివ్యక్తమవుతుంది.

4. ప్రశ్న:- విధి నిర్ణయము లేదా కర్మఫలమనగానేమి?

కృష్ణమూర్తి:- ఈ సమస్యనుగూర్చి చర్చించాలని మీరు నిజంగా కోరుతున్నారా? ప్రపంచంలో ప్రశ్నలు వేయడం అన్నిటికంటె తేలిక. మీ ప్రశ్నతో మీకేమైనా ప్రత్యక్షంగా ఉపయోగముంటే అప్పుడా ప్రశ్న సార్థకమవుతుంది. అప్పుడు మీరా ప్రశ్నను గంభీరమైన సమస్యగా, చాల ముఖ్యమైన విషయంగా తీసికొంటారు, లేకపోతే లేదు. ఒకసారి ప్రశ్న అడిగివేసిన తరువాత ఎంతమందికి దానిమీద శ్రద్ధ తొలగిపోతుందో ఎంత మంది దానినింక పట్టించుకోరో మీరెన్నడైనా గమనించారా? మొన్న నొక పెద్దమనిషి ఒక ప్రశ్న వేసిన తరువాత ఆవలించడం మొదలుపెట్టాడు. తలగోకుకొనడం ఆరంభించినాడు, ప్రక్కవానితో మాట్లాడసాగినాడు. తానడిగిన ప్రశ్నమీద తనకే అభిరుచి పూర్తిగా తొలగిపోయినదన్నమాట.

కాబట్టి నా సలహా యేమంటే నిజంగా చాల ముఖ్యమని మీకు తోస్తేనే ప్రశ్నలు వేయండి, లేకపోతే వేయకండి.

విధినిర్ణయ మనగానేమిటి? అనే ప్రశ్న చాల కష్టమైనది, జటిలమైనది. చూడండి కారణముంటే దానికి తప్పనిసరిగా కార్య ముంటుంది. కార్య కారణములు అవినాభావ సంబంధము కలవి. రష్యావారు గాని, అమెరికావారుగాని భారతీయులు గాని ఎక్కువమంది జనులు యుద్ధానికి సన్నాహాలు చేస్తూవుంటే వారికి గల విధి నిర్ణయం వారి నుదుటివ్రాత, యుద్ధమన్న మాటే. మేము శాంతి కాముకులమని, మా స్వరక్షణకోసమే సైన్యసన్నాహాలు చేసి కొంటున్నామని వారెంతగా చెప్పుకొన్నా, వారు చేసే పనులన్నీ యథార్థంగా యుద్ధాన్నికొని తెచ్చేవే; వారు అములులో పెట్టే పనులన్నీ యుద్ధానికి దారితీసే కారణాలే. అదే విధంగా ఏదేని ఒక నాగరికతను, ఒక సంస్కృతిని లక్షలాది ప్రజలు శతాబ్దాల తరబడి కలిసి పనిచేసి అభివృద్ధి చేసినట్లయితే, వారట్లు ప్రవర్తింపజేసిన ఉద్యమంలో, ఆ ప్రవాహంలో సాధారణ వ్యక్తులు — వారికిష్టమున్నా సరే, లేకున్నాసరే — చిక్కుకొని కొట్టుకొనిపోతూ వుంటారు. ఈ విధంగా సభ్యతా సంస్కృతుల ప్రవాహంలో తగుల్కొని కొట్టుకొని పోవడాన్నే కర్మ ఫలము లేదా విధి నిర్ణయమని, నుదుటి వ్రాత యని వేర్వేరు పేర్లతో పిలుస్తారు.

ఇంతకు మీరొక న్యాయవాది పుత్రులైనట్టయితే మీరుగూడ న్యాయవాది వృత్తి చేపట్టాలని మీతండ్రి మిమ్ము బలవంతం చేస్తాడు. మీ యిష్టానికి వ్యతిరేకమైనా సరే మీ తండ్రి మాటను, మీరు పాటించినట్లయితే మీ నుదుటి వ్రాత, మీ విధి నిర్ణయం న్యాయవాద వృత్తిని చేపట్టడమే అవుతుంది. ఇది స్పష్టమే గదా. అట్లుగాక న్యాయ వాదులు కావడానికి మీరు నిరాకరించి, మీకు సత్యమని ధర్మమని తోచిన దానిని చేయడానికి దృఢముగా నిశ్చయించుకొన్నట్లయితే, అంటే మీరు నిజంగా ప్రేమించేదాన్ని, అది వ్రాయడంగాని, రంగు వేయడంగాని, డబ్బులేక బిచ్చమెత్తుకోవడంగాని ఏదైనా సరే చేయడానికి గట్టిగా పూనుకొన్నట్లయితే,

అప్పుడు మీరా ప్రవాహంలో నుండి బయటపడినారన్నమాటే. మీతండ్రి మీకై ఉద్దేశించిన విధి నిర్ణయమును త్రోసిరాజని దానిని భంగం చేసినా రన్నమాట. అదేవిధంగా సభ్యతా సంస్కృతుల ప్రవాహవిషయంలోను.

అందువలన మనకు సరియైన విద్యాబోధన చాలా అవసరము. సంప్రదాయము చేత అణగద్రొక్కి వేయబడకుండుటకై ఆయా జాతుల, సంస్కృతుల, వంశముల యొక్క కర్మఫల ప్రవాహంలో కొట్టుకొని పోకుండుటకై ముందుగా నిశ్చయింపబడిన ఒక ప్రయోజనము నుద్దేశించి యాంత్రికముగా సాగిపోవు వ్యక్తులము కాకుండుటకై మనకు సరియైన విద్యాబోధన జరుగవలసియున్నది. ఈ ప్రక్రియ నంతను అర్థము చేసి కొన్న మనిషి, దానిని ఛేదించుకొని బయటికి వచ్చి అసహాయవీరునివలె స్వతంత్రముగా నిలబడగల వ్యక్తి తనకు తాను వేగమును పుంజుకొని ముందుకు సాగి పోగలడు. అట్లు ఛేదించుకొని బయటికి రావడమనేది మిథ్యనుండి సత్యమువైపునకే యైనచో, అప్పుడతడు పుంజుకొన్న వేగమే సత్యమవుతుంది. అట్టి మానవులు విధి నిర్ణయమున కతీతులు.

14 జనవరి, 1955

14

క్రమశిక్షణ – ఒక పెద్ద సమస్య

ఎవరైనా మనలనెందుకు క్రమశిక్షణలో పెడతారో, లేదా మన లను మన మెందుకు క్రమశిక్షణలో పెట్టుకొంటామో ఎప్పుడైనా మీరు ఆలోచించారా? ప్రపంచమందంతటా రాజకీయ పక్షాలు తమ తమ పక్షాల క్రమశిక్షణకు సంబంధించిన నియమాలను పాటించవలెనని తమ తమ సభ్యులనందరిని బలవంతపెడతాయి, నిర్బంధం చేస్తాయి. మీ తల్లిదండ్రులు, మీ ఉపాధ్యాయులు, మీ చుట్టునున్న సమాజము — అందరున్ను మిమ్ము క్రమశిక్షణలో పెట్టాలని, మిమ్ము అదుపులో ఉంచాలని చెబుతూవుంటారు, ఎందుకని? అసలు క్రమశిక్షణ నిజంగా అవసరమా? క్రమశిక్షణ చాల అవసరమని మనం అలవాటుగా అను కొంటుంటాం. అది నాకు తెలుసు. ఈ క్రమశిక్షణను మనమీద సంఘమైనా విధిస్తుంది, మత గురువైనా విధిస్తాడు, నీతి శాస్త్రమైనా విధిస్తుంది, లేదా అనుభవం మీద మనకు మనమే విధించుకొంటాం. ఏదైనా సాధించాలని, ఎంతో డబ్బు సంపాదించాలని, గొప్ప రాజకీయ వేత్త కావాలని పెద్ద ఆశ పెట్టుకొన్న వానికి, ఆ పెద్ద ఆశయే అతనిని క్రమశిక్షణలో పెడుతుంది. అందువలన మీ చుట్టూ ఉన్నవారందరు క్రమశిక్షణ చాల అవసరమని చెబుతూ వుంటారు: మీరు నియతమైన వేళకు పడుకోవాలని, నియతమైన వేళకు నిద్రలేవాలని, చదువుకోవాలని, పరీక్షలు పాసుకావాలని, మీరు మీ తల్లిదండ్రుల మాట వినాలని యిట్లా చెబుతూ వుంటారు.

సరే, అసలు మీరెందుకు క్రమశిక్షణను పాటించాలి? క్రమశిక్షణ అంటే అర్థమేమిటి? క్రమశిక్షణ అంటే దేనికో యొకదానికి అను కూలంగా సర్దుకుపోవడం, అంతేనా? అంటే, యితరులు చెప్పేదానికి

అనుకూలంగా మీ యాలోచనలుండేటట్లు చూచుకోవడం, ఒక విధమైన కోరికలను నిరోధించడం, ఇంకొక విధమైన వాటికి సమ్మతించడం, ఒక విధమైన సాధనకు అలవాటు పడడం, మరియొక విధమైన దానిని మానుకోవడం, గ్రుడ్డిగా అంగీకరించడం, ఆలోచనలను కోరికలను అణచుకోవడం, ఆదర్శాన్ని అనుసరించడం — ఇవన్నీ మనస్సులో — పైపైననే గాదు లోతుగా మనస్సులోని లోపలి పొరల వరకూ — నాటుకొని పోవాలి. ఇదంతా క్రమశిక్షణలో అంతర్భాగము. ఎన్నో శతాబ్దాల నుండి, ఒక యుగం తరువాత మరియొక యుగంలో, విద్యాబోధకులు, గురువులు, మత గురువులు, రాజకీయవేత్తలు, రాజులు, న్యాయ వాదులు, మనముండే సంఘము — అందరున్ను క్రమశిక్షణ చాల అవసరమని మనకు చెబుతూనే వచ్చినారు.

కాబట్టి, అసలు క్రమశిక్షణ అవసరమా? ఈ సమస్యాపరిష్కారానికి వేరే మార్గమేమీ లేదా? అని నాలో నేను ప్రశ్నించుకొంటున్నా. అట్లే మీలో మీరుకూడ ప్రశ్నించుకొంటారని ఆశిస్తున్నా. దీనికింకో మార్గమున్నదనే నా తలంపు. ఇప్పుడు పాఠశాలలే కాదు, ప్రపంచమంతా యెదుర్కొంటున్న సమస్యే యిది. చూడండి, మంచి సామర్థ్యం కలిగి వుండాలంటే మీరు క్రమశిక్షణతో మెలగడం నేర్చుకోవలసి వుంటుందని అందరూ అనుకొనే విషయం. నీతి శాస్త్రం ప్రకారమో, రాజకీయ సంప్రదాయం ప్రకారమో, కర్మాగారంలోని యంత్రంలాగా పని చేయడానికి శిక్షణ పొందడం ద్వారాగాని మీరు క్రమశిక్షణతో మెలగడం నేర్చుకొంటారు. కాని యీ క్రమశిక్షణ విధానము అంధానుకరణానికి దారితీసి, మనస్సును మొద్దుబార జేస్తుంది.

సరే యిక యీ క్రమశిక్షణ అనేది మనిషిని స్వతంత్రుని జేస్తుందా లేక గ్రుడ్డిగా ఏదేని ఒక ఆదర్శానికి అనుగుణంగా ప్రవర్తించునట్లు చేస్తుందా? ఆ యాదర్శము భూలోకంపై స్వర్గలోకాన్ని సృష్టించాలని కలలుగనే సామ్యవాదానిది కావచ్చు లేదా ఏదో యొక విధమైన నీతిమార్గమో ధార్మిక మార్గమో కావచ్చు. అసలు క్రమశిక్షణ అనేది మిమ్మెప్పటికైనా

స్వతంత్రుల జేయగలదా? క్రమశిక్షణ అనేక రూపాలలో వుండవచ్చు. కాని, అదేదైనాసరే, మిమ్మొకసారి బంధించిన తరువాత మరల విడిచి పెడుతుందా? దాని చెఱలో నుండి విముక్తి లభిస్తుందా? అది యెట్లా సాధ్యమవుతుంది? అట్లుగాక దీనికేదైనా వేరేమార్గమున్నదా? అది తెలుసుకోవడం కోసం యీ క్రమశిక్షణ యనే సమస్యనంతను లోతుగా క్షుణ్ణంగా పరిశీలించి చూడవలసి వుంటుంది. వ్యక్తిగతంగా మీరు రెండు పరస్పర విరుద్ధములగు కోరికలను లేదా ఇంకా ఎక్కువ కోరికలను పెట్టుకోకుండా ఒకే యొక కోరికను కలిగియుండగలరా? నేను చెప్పేది మీకు అర్థమవుతున్నదా? రెండు, మూడు లేదా పది కోరికలెప్పుడైతే మీకుంటాయో అప్పుడే క్రమశిక్షణ ఒక సమస్యగా మీకెదురవుతుంది. ఏమి, ఎదురవదా? మీరెంతో ధనం సంపాదించాలని చాలా కార్లు, భవనాలు కలిగి వుండాలని కోరుకొంటారు. అదే సమయంలో వీటినన్నిటిని త్యాగం చేసి సన్న్యాసం తీసికొందామని అనిపిస్తుంది. ఎందుకనంటే, మీ వుద్దేశంలో ఏమీ ఆస్తి లేకుండా (సన్న్యాసి లాగా) వుండడం, ఒకవేళ ఆస్తివున్నా యేకొంచెమో అల్పంగా కలిగి వుండడం నీతియని, న్యాయమని, ధర్మమని, పుణ్యమని అనుకొంటారు. మీ జీవిత మిట్టి పరస్పర వైరుధ్యానికి పాత్రం కాకుండా, సమగ్రమై సాగుటకు వీలు లేదా? అందుకు తోడ్పడగల సరియైన విద్యాబోధనకు అవకాశములేదా? అప్పుడు మీకు క్రమశిక్షణ యొక్క ఆవశ్యకతయే వుండదు. సమగ్రత కలిగి వుండడంలో ఒక విధమైన స్వతంత్రతా భావమంతర్గతమై కన్పిస్తుంది. ఈ సమగ్రత సిద్ధించు సమయంలో క్రమశిక్షణావశ్యకత బొత్తిగా వుండదు. సమగ్రత అంటే ఒకే సమయమున అన్ని స్థాయీలలోః పూర్తిగా ఒకే విధంగా వుండడం.

చూడండి, మీకు పసితనమునుండి సరియైన విద్యాబోధన జరిగి వున్నట్లయితే మీలో ఆంతరికంగాగాని బాహ్యంగాగాని పరస్పర వైరుధ్యముండదు, విసంవాదము (Contradiction) ఉండదు. మాటలకు చేతలకు పొందిక లేకపోవడమంటూ వుండదు. అప్పుడింక మీకు క్రమశిక్షణావశ్యకత లేదు, నిర్బంధము అవసరము కాదు. ఎందువల్లనంటే అప్పుడు మీరేమి

చేసినా పూర్ణ స్వాతంత్ర్యంతో మనఃస్ఫూర్తిగా చేస్తూ వుంటారు. విసంవాద మున్నప్పుడే క్రమశిక్షణ అవసరమవుతుంది. మీరందరొకే విధంగా ఆలోచించాలని రాజకీయవాదులు, ప్రభుత్వములు, మత వ్యవస్థలు కోరుకొంటాయి. ఎందువల్లనంటే అవి మిమ్ము సంపూర్ణ సామ్యవాదులుగా గాని, సంపూర్ణమైన క్యాథలిక్కులుగా గాని లేక మరొకరుగా గాని మలచగల్గినట్టయితే అప్పుడు మీవలన వారి కెటువంటి సమస్యా ఉత్పన్నం కాదు. వారు చెప్పిన దానినెల్ల మీరు గ్రుడ్డిగా నమ్మి యంత్రాలవలె పనిచేస్తారు. అప్పుడును మీలో విసంవాదము — పరస్పర వైరుధ్యము — ఉండదు. కారణమేమనగా మీరు వారిని కేవలం అనుకరిస్తారు. కాని అనుకరణమేదైనా సరే అది యాంత్రికము కాబట్టి, దానివలన నష్టమే కలుగుతుంది. అది కేవలం అంధానుసరణము, అందుండి సృజనాత్మక శక్తి విడుదల కాదు.

ఇంతకు, మీలో పసితనమునుండి సంపూర్ణ భద్రతా భావాన్ని, మనకేమీ భయంలేదనే ధీమాను, విశ్వాసాన్ని పుట్టింపగలమా? అదే గనక పుట్టింపగల్గితే అప్పుడు మీలో ఇట్లా వుండాలని, అట్లా వుండరాదని తీవ్ర ప్రయత్నము చేయడం వుండదు. లేనిచో ఆ మానసిక ప్రయత్నమున్న క్షణమునుండి సంఘర్షణ తప్పదు. [అదా? ఇదా? అని రెండింటి మధ్య విరోధమున్నప్పుడే సంఘర్షణ ముంటుంది.] ఆ సంఘర్షణ నుండి విముక్తి పొందడం కోసం క్రమశిక్షణ అవసరమవుతుంది. అట్లుగాక మీకు సరియైన విద్యాబోధన జరిగినట్లయితే, మీరు చేసే ప్రతిపనీ సమగ్రంగా, సమరసంగా వుంటుంది. అందులో విసంవాదము — పరస్పర వైరుధ్యముండదు. అందుచేత నిర్బంధముతో పనిచేయడ ముండదు. సమగ్రత లేనంత కాలము క్రమశిక్షణ తప్పక అవసరమవుతుంది. కాని క్రమశిక్షణ ఎన్నటికిని ఆత్మస్వాతంత్ర్యమునకు దారితీయదు కాబట్టి అది వినాశదాయకమే.

సమగ్రత కలిగి వుండడం కోసమెట్టి క్రమశిక్షణ అక్కరలేదు. అంటే, నేను చేసేపని మంచిదైతే, అది సహజంగా సత్యమును సుందరమును అయి

నట్లైతే పైగా నేను దానిని అనన్య భావంతో, తత్పరుడనై చేస్తూ వుంటే, అప్పుడు నాలో పరస్పర విరుద్ధ భావములుండవు, విసంవాదము కలుగదు, నేను దేనినీ గ్రుడ్డిగా అనుకరించడమున్ను లేదు. నేను చేసేపని, పూర్తిగా మంచిదై నట్టయితే, స్వతఃసిద్ధంగా సరియైనదైనట్టయితే — అంటే హిందూ సంప్రదాయం ప్రకారంగాని, సామ్యవాద సిద్ధాంతం ప్రకారంగానీ కాకుండా సర్వకాల సర్వావస్థల యందును సరియైనదైనట్టయితే — అప్పుడు నేనొక సమగ్ర మానవుడను, నాకప్పుడు క్రమశిక్షణావశ్యకత వుండదు. ఇట్లు అవిభక్తమై సమగ్రమగు విశ్వాసాన్ని మీలో కల్గించడమే కాదా పాఠశాల యొక్క ప్రధానకర్తవ్యము? అప్పుడు మీరు చేసేపని కేవలం మీరు మనసా కోరుకొన్నదేగాదు, అది మౌలికంగా సరియైనదిన్ని, మంచిదిన్ని, నిత్య సత్యమైనదిన్ని అవుతుంది.

నిజంగా మీలో ప్రేమ వున్నట్లయితే అప్పుడు క్రమశిక్షణ అవసరమవుతుందా? కాదు. ప్రేమ స్వయంగా సృజనాత్మకమైన అవగాహనను కలిగిస్తుంది, కాబట్టి అప్పుడు నిరోధముండదు, సంఘర్షణ వుండదు. అయితే పరిపూర్ణమగు సమగ్రతా భావముతో ప్రేమించడమనేది మీలో అభయము, భద్రతా భావము పూర్తిగా నున్నప్పుడు మాత్రమే, అంటే తల్లి ఒడిలో బిడ్డకున్నట్లు మీలో పూర్ణ విశ్వాసము, — ముఖ్యంగా మీ చిన్న వయస్సులో — వున్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. అంటే దాని అర్థమేమనగా విద్యాబోధకుడు, విద్యార్థి — వీరిద్దరిలో ఒకరి యందొకరికి పరిపూర్ణ విశ్వాసముండవలె; అది లేకపోతే ప్రస్తుత సమాజమువలె వికృతమును వినాశకరమును అగు సమాజమునే మనము సృష్టిస్తాము. పరస్పర వైరుధ్యము లేనట్టిదిన్ని అందుచేత క్రమశిక్షణను కోరనట్టిదిన్ని అయిన సంపూర్ణ సమగ్రతా భావముతో చేయబడు కర్మాచరణము యొక్క ప్రాధాన్యమును మనము గ్రహింపగలిగితే అప్పుడు మనము పూర్తిగా సరిక్రొత్త సంస్కృతిని, సరిక్రొత్త నాగరికతను సృష్టింపగలమని అనుకొంటాను. అట్లుగాక దేనినైనా క్రమశిక్షణ ద్వారా మనము నిరోధించి, అణచి వేసినట్లయితే, అది యెదురు తిరిగి వేరే మార్గముల దిశగా విజృంభించి, తప్పుదారులు త్రొక్కుతుంది, వినాశకర

మైన సంఘటనలకు దారి తీస్తుంది.

అందువలన క్రమశిక్షణకు సంబంధించిన యీ సమస్యనంతను సరిగా అర్థం చేసికోవడం చాల అవసరం. నా దృష్టిలో క్రమశిక్షణ అనేది పూర్తిగా అసుందరమైనది, అసహ్యామైనది. అది సృజనాత్మకము కాదు, వినాశాత్మకము. అయితే అట్లా అని అంతటితో వూరుకుంటే, దాని అర్థం మీ యిష్టారాజ్యంగా, అడ్డూ ఆపూ లేకుండా, ఏదంటే అది చేయవచ్చునని కాదు. అట్లుగాక, నిజానికి ప్రేమపూరిత హృదయము కలవాడు ఇష్టారాజ్యంగా ప్రవర్తించడు. ఎట్లా తోస్తే అట్లా చేయడు. అతనిలోని ప్రేమయే అతనిని సరియైన మార్గమున నడిపిస్తుంది. ప్రపంచంలో సువ్యవస్థను తీసికొని వచ్చేది ప్రేమ మాత్రమే. ప్రేమ యేదిచేసినా అది సరియైనదే. దాని దారికి అడ్డు పోరాదు. దాని పనినది చేసికోనివ్వాలి, అంతే.

1. ప్రశ్న:- మనమెందుకు బీదవారిని అసహ్యించుకొంటాము?

కృష్ణమూర్తి:- నిజంగానే మీరు బీదవారిని అసహ్యించుకొంటున్నారా? నేను మిమ్ము తప్పు పట్టడం లేదు; నేనూరక అడుగుతున్నాను — మీరు నిజంగా బీదవారిని అసహ్యించుకొంటున్నారా? ఒకవేళ నిజంగానే అసహ్యించుకొంటూ వుంటే, ఎందుకని అట్లా చేస్తున్నారు? ఎప్పటికైనా మీరుగూడ బీదవాండ్లమవుతామేమోనని భయపడి అప్పటి మీస్థితిని ఊహించుకొని దానిని మీరు గర్హిస్తున్నారా? లేక, ఆలనా పాలనా లేకుండా, మురికిగా వుండే వారి హీనస్థితిని అసహ్యించుకొంటున్నారా? అశుభ్రత, అవ్యవస్థ, కశ్మలము, మాలిన్యము — ఇటువంటివి మీ కిష్టం లేక పోవడంచేత బీదవాండ్లతో మాకెట్టి సంబంధం లేదని అంటున్నారా? కాని యీ ప్రపంచంలో దారిద్ర్యాన్ని, కశ్మలాన్ని, అవ్యవస్థను సృష్టించింది ఎవరు? మీరు, మీ తల్లిదండ్రులు, మీ ప్రభుతమున్ను కాదా? దానికి మన సమాజమంతా కారణమే. మన హృదయంలో ప్రేమ అనేదిలేదు. మనము మన పిల్లలను ప్రేమించము, పెద్దలను ప్రేమించము. ఇరుగువారినీ ప్రేమించము, పొరుగు వారినీ ప్రేమించము. బ్రతికియున్న వారినీ ప్రేమించము, చచ్చిపోయిన వారినీ ప్రేమించము.

మనకు దేనిమీదను ప్రేమలేదు, ఎవరిమీదను ప్రేమలేదు. ప్రపంచంలోని యీ దైన్యాన్ని దౌర్భాగ్యాన్ని రాజకీయ నాయకులు రూపుమాపలేరు, మతాలు రూపుమాపలేవు, సంఘ సంస్కర్తలనబడేవారున్ను ఏమీ చేయ లేరు. ఎందువల్లనంటే, వీరు చేసేదెల్లా అతుకులపని — ఇక్కడ కొంచెం, అక్కడ కొంచెం బాగుచేస్తున్నట్లు కనబడతారు. కాని వీరిలో గనక ప్రేమే వున్నట్లయితే యీ దౌర్భాగ్య పరిస్థితులన్నీ రేపటికల్లా అదృశ్యమైపోతాయి.

మీరసలు దేనినైనా ప్రేమిస్తారా? అసలు ప్రేమంటే యేమిటో మీకు తెలుసునా? మీరు దేనినైనా అనన్య భావంతో, సంపూర్ణంగా, ప్రేమిస్తే ఆ ప్రేమ భావోద్రేకము కాదు; అది కర్తవ్యం క్రిందికి లెక్కకు రాదు; అందులో భౌతిక ప్రేమయని, దివ్య ప్రేమయని విభాగములేదు. మీరనన్య భావంతో — త్రికరణ శుద్ధిగా — ఎవరినైనా సరే, దేనినైనా సరే ప్రేమించారా? — మీ తల్లినిగాని, తండ్రినిగాని, స్నేహితుని గాని, కుక్కను గాని, చెట్టును గాని — దేనినైనా సరే ప్రేమిం చారా? దేనినీ ప్రేమించరని నా భయం. అందువల్లనే మీలో ద్వేషము, రోషము, అసూయ, కుత్సితము మొదలగునవి ఉండడానికి బాగా అవ కాశం దొరికినది. చూడండి, ప్రేమపూరిత హృదయంలో మరొక దానికి చోటుండదు. మనం మన మనస్సులను పనికిరాని చెత్తతో నింపుకొని, ప్రేమకు తావులేకుండ చేసినాము. నిజానికి మన మనస్సులనుండి ఆ చెత్తను తొలగించడమెట్లో చర్చించడం, చాల అవసరం. అందుకోసం మనమెంత సమయమైనా వెచ్చించవచ్చు. మనం ప్రేమించినప్పుడే సుఖ సంతోషాలతో స్వేచ్ఛగా వుండగలం. ప్రేమమూర్తులు, చైతన్య స్వరూ పులు, సంతోష స్వాంతులైన మానవులు మాత్రమే క్రొత్త ప్రపంచాన్ని సృష్టింపగలరు — రాజకీయ నాయకులుకాదు, సంఘసంస్కర్తలుకాదు, ఆదర్శవాదులైన సన్యాసులున్ను కాదు.

2. ప్రశ్న:- సత్యము, సౌజన్యము, సమగ్రత* (Integration) *ల గురించి మీరు మాట్లాడుతున్నారు. అంటే వాటికి భిన్నంగా అసత్యము, అసౌ జన్యము, అసమగ్రత లున్నట్లే కదా? కాబట్టి క్రమశిక్షణ లేనిదే మనిషి

సత్యవంతుడు, సౌజన్యవంతుడు, సమగ్రతగలవా డెట్లు కాగలడు?

కృష్ణమూర్తి:- మరియొక విధంగా చెప్పాలంటే, ఈర్ష్యాళువు క్రమ శిక్షణను పాటించకుండా ఈర్ష్యా విముక్తుడెట్లు కాగలడు? అని మీ ప్రశ్న. అసలు ప్రశ్నను సరిగా అర్థం చేసికోవడం చాల అవసరమను కొంటాను. ఎందువల్ల నంటే ఈ ప్రశ్నకు సమాధానము ప్రశ్నలోనే అంతర్నిహితమైయున్నది, ప్రశ్నకు బాహ్యంగా లేదు.

ఈర్ష్య అంటే యేమిటో మీకర్థం తెలుసునా? మీరు చాల అందంగా వున్నారు, మంచి దుస్తులు వేసుకొన్నారు, అందమైన పాగా పెట్టుకొన్నారు లేదా అందమైన చీర కట్టుకొన్నారు. నాకు గూడ మీమాదిరే వుండాలని కోరిక. కాని నాకు శక్తిలేదు. అందుకు మిమ్మలిని చూచి ఓర్చుకోలేను. మీకున్నదేదో అది నాకు కావాలి, అందుకనే అసూయ. నేనెట్లా వున్నానో అది నాకు తృప్తినీయడం లేదు. అందుకు భిన్నంగా మీ మాదిరి వుండాలని నా కోరిక. అందుకే మిమ్ము చూస్తే అసూయ, ఈర్ష్య.

మీలాగా అందంగా వుండాలని నా కోరిక. మీకుండేలాంటి సన్నని నాజూకైన (నాణ్యమైన) గుడ్డలు, అందమైన యిల్లు, ఉన్నత పదవి — ఇవన్నీ నాకూ కావాలి. అందుకే మీమీద నాకు అసూయ. నాకున్న దానితో నేను తృప్తిపడక పోవడం చేతనే, మీ మాదిరి వుండాలనే కోరిక నాలో కలుగుతున్నది. కాని నా అసంతృప్తిని దానికి కారణాన్ని నేను అర్థం చేసికోగల్గితే అప్పుడు మీ మాదిరి వుండాలనే కోరిక నాలో ఎందుకు కల్గుతుంది? కల్గదు. మీకుండి నాకు లేదని బాధపడను. అంటే దాని భావమేమనగా, నన్ను నేను అర్థం చేసికోవడం మొదలుపెట్టి నప్పటినుండి నన్ను ఇతరులతో పోల్చుకోవడం మానివేస్తాను. ఎవరిని జూచినా అసూయపడను. నేను మరియొకరుగా మారిపోవాలని ఎప్పుడైతే కోరుకొంటానో అప్పుడే అసూయ ఉత్పన్నమవుతున్నది. అట్లుగాక, "నేనెవరినన్నాగానీ, ఎట్లన్నా ఉండనీ, నన్ను నేను అర్థం చేసికోవాలి, నా నిజమైన స్థితి యేమిటో తెలిసికోవాలి" అని మీరు

సంకల్పించుకొంటే, మీలోని అసూయ దానంతట అదే తొలగిపోతుంది. అప్పుడిక క్రమశిక్షణయే అక్కఱ లేదు. నన్ను నేను అర్థం చేసికొనడంతో నాలో సమగ్రత (Integration) సిద్ధిస్తున్నది.

మనం చదువుకొన్న చదువు, మనమున్న పరిసరాలు, మనం పుట్టి పెరిగిన సంస్కృతి — యివన్నీ మనమేదో యొక ఉన్నత స్థితికి చేరుకోవాలని మనలను ఉద్బోధిస్తూ వుంటాయి, అందుకు మనలను ప్రేరేపిస్తూ వుంటాయి. మన తత్త్వశాస్త్రాలు, మన మతాలు, మన ధార్మిక గ్రంథాలు — ఇవన్నీ చెప్పేది అదే. కాని నాకిప్పుడర్థమైనదేమంటే మరియొక స్థితిలోనికి, లేదా మరియొకరుగా పరిణతి చెందడమనే ప్రక్రియలోనే అసూయ అంతర్లీనమై వుంటుంది. అంటే నేను నా సహజ స్థితితో తృప్తిపడడం లేదన్నమాట! కావున నా సహజ స్థితి యేమిటో నేను అర్థం చేసికోవాలి.

ఒకరితో నన్ను నేనెందుకు పోల్చుకొంటున్నానో ఏదో యొక స్థితికి చేరుకోవాలని ఎల్లప్పుడూ ఎందుకు ప్రయత్నిస్తున్నానో నాకు తెలియాలి. నా సహజ స్థితిని తెలిసికోవాలంటే దానికి క్రమశిక్షణతో పనిలేదు. దానిని అర్థం చేసికొనే ప్రక్రియలోనే సమగ్రత (Integration) సిద్ధిస్తుంది. నన్ను నేను అర్థం చేసికొనడంతో నాలో వున్న పరస్పర వైరుధ్యము (Contradiction) తొలగిపోతుంది. తత్ఫలితంగా సమగ్రమగు కర్మాచరణ — బహుముఖములుకాని కర్మాచరణ — సిద్ధిస్తుంది.

3. ప్రశ్న:- శక్తి యంటే యేమిటి? అధికారమంటే యేమిటి?

కృష్ణమూర్తి:- శక్తి యనేది అనేక విధాలు. అంతర్దహన యంత్రము (Internal Combustion Engine) ద్వారా పుట్టింపబడిన శక్తి, ఆవిరి శక్తి, విద్యుచ్ఛక్తి — ఇటువంటివి యాంత్రిక శక్తిలోని భేదములు. చెట్టులో వుండే శక్తివలన చెట్టునందంతట రసము ప్రవహిస్తుంది; ఇగుళ్ళు, ఆకులు పుడతాయి. మానవునిలో శక్తి వుంటేనే స్పష్టంగా ఆలోచన చేయగలుగుతాడు. ప్రేమించడానికి, ద్వేషించడానికి గూడ శక్తి

కావాలి. నియంతకు గల శక్తి వేరైనది. దేవుని పేరిట, దివ్య గురువుల పేరిట, దేశం పేరిట ప్రజలను దోచుకోవాలంటే శక్తి కావాలి. ఇవన్నీ శక్తి యొక్క విభిన్న రూపాలు.

అయితే విద్యుచ్ఛక్తి, కాంతిశక్తి, అణుశక్తి మొదలైన శక్తి రూపాలు సహజంగా మంచివే, మీరేమంటారు? కాని ఆ శక్తులను దురాక్రమణ కోసం, ప్రజలను హింసించడంకోసం, స్వార్థసిద్ధికోసం ఉపయోగించుకొనే మానవుని మానసిక శక్తి యెట్టి పరిస్థితులలోనైనా సరే, చెడ్డదే. శక్తి యొక్క మరియొక రూపము అధికారము. ఏదైనా సంఘానికిగాని, క్రైస్తవ దేవాలయానికి గాని, అందలి వివిధ సంప్రదాయాలకుగాని, మత శాఖలకు మత వర్గములకు గాని పెద్దగా వుండి యితరులపై అధికారము చూపేవాడు ఎప్పటికిని దుష్టుడే. ఎందువల్లనంటే అటువంటివాడు తన గతేమిటో తనకు తెలియకపోయినా, ఇతరులను మాత్రం తన వశంలో పెట్టుకొని, వారి భవిష్యత్తును తీర్చి దిద్దబోతున్నాడు! తాను పోయేదారి ఎటు పోతున్నదో తనకు తెలియకపోయినా, ఇతరులకు దారి చూపగోరుతున్నాడు! ఇది ప్రపంచంలోని పెద్ద పెద్ద సంస్థల విషయంలోనే కాదు, చిన్న చిన్న సంస్థలు, సంఘాల విషయంలోను అంతే. ఎప్పుడైతే మానవుని మనస్సు నిర్మలము, భ్రమ ప్రమాదరహితము అవుతుందో శాంతము సమాహితము అవుతుందో, ఆ క్షణమునుండి అతడితరులపై పెత్తనం చేసే నాయకుడుగా ఉండగోరడు, ఉండడు. నిర్మల మనస్కుడు, శాంతచిత్తుడు, ఇతరులపై అధికారము చేయడమున్ను — ఈ రెండును ఒకదానికొకటి పొసగని విషయాలు.

కాబట్టి యితరులమీద అధికారం కావాలని మానవుని మనస్సు ఎందుకు కోరుకొంటుందో తెలిసికోవడం చాల అవసరం. తల్లిదండ్రులకు తమ పిల్లలమీద అధికారముంటుంది; భార్యకు భర్తమీద అధికారముంటుంది లేదా భర్తకు భార్యమీద అధికారముంటుంది. ఇట్లా చిన్న కుటుంబంతో ఆరంభించిన యీ చెడ్డ గుణం (evil) పెరిగి పెద్దదై విస్తరించి ప్రభుత్వములకు, రాజకీయనాయకులకు, మత గురువు

లకున్ను వుండే క్రౌర్యంగా, దురాచారంగా పరిణమిస్తుంది. ఇట్టి అధికార దాహం లేకుండా, ప్రజలను తన చెప్పు చేతలలో పెట్టుకోవాలని వారిని తన స్వార్థానికి ఉపయోగించుకోవాలని కోరకుండా, తనకు గాని తన వర్గానికి గాని తన దేశానికిగాని దివ్యగురువులకు గాని దైవభక్తులకు గాని అధికారము కావాలని కోరకుండా మనిషి జీవించలేడా? వివిధ రూపాలలో నున్న ఆ అధికారాలన్నీ వినాశకరములు; వాటివలన మనిషికి హాని కలుగుతుంది, దుఃఖము దైన్యము కలుగుతుంది. అట్లుగాక ఇతరుల కష్టసుఖములను తనవిగా భావించుకొంటూ, దయార్ద్ర హృదయుడై ప్రేమమూర్తియై జీవించడం మిక్కిలి అద్భుతమైన విషయము. అది శాశ్వత ఫలితాన్నిస్తుంది. ప్రేమ అజరామరము, శాశ్వతము; ప్రేమయున్నచోట దుష్ట శక్తులకు తావులేదు, దుష్టమైన అధికారమునకు అవకాశములేదు.

4. ప్రశ్న:- కీర్తి ప్రతిష్ఠల కోసం మనమెందుకు ప్రాకులాడుతాము?

కృష్ణమూర్తి:- మీరెప్పుడైనా దీనిగురించి ఆలోచించినారా? మనం రచయితగానో, కవిగానో, చిత్రకారునిగానో, రాజకీయనాయకునిగానో, గాయకుని గానో, మరి యే విధంగానైనా సరే ప్రసిద్ధులం కాగోరుతాము. ఎందుకని? మనం చేసే పనిమీద మనకు నిజంగా ప్రేమలేదు కాబట్టి. సంగీతాన్ని గాని, కవిత్వాన్ని గాని, చిత్రలేఖనాన్నిగాని దేనినైనా సరే మీరు నిజంగా ప్రేమిస్తే, పేరు ప్రఖ్యాతుల కోసం ప్రాకులాడరు; దాని గురించి అసలు పట్టించుకోరు. పేరు పొందాలనే కోరిక, పైకి అందంగా కనబడే తుచ్ఛమైన కోరిక. అట్టి కోరిక అల్పబుద్ధినే సూచిస్తుంది. ఆ కోరికకు అర్థం లేదు. మనం చేసే పనియందు మనకు ప్రేమలేదు. కాబట్టి ఆ 'ప్రేమ దారిద్ర్యాన్ని' పేరుప్రతిష్ఠలతో కప్పిపుచ్చుకో జూస్తాం. ప్రస్తుతం మనం చదువుకొనే చదువు తుచ్ఛమైన చదువు, అది మనం చేసే పనిని మనం ప్రేమించాలని చెప్పదు, తుట్టతుదకు లభించే విజయాన్ని మాత్రమే ప్రేమించమంటుంది, ఆ విజయ మేవిధంగా లభించినా సరే! కర్మాచరణము కంటె కార్యసిద్ధి మనకు ప్రధానము.

ఇంతవరకు వెలువడిన మా తెలుగు అనువాదములు :

1. శ్రీలంక సంభాషణలు 1980 — సి. హనుమంతరావు
(Sri Lanka Talks)

2. తెలివిడి నుండి స్వేచ్ఛ — 'శ్రీ విరించి'
(Freedom from the Known.)

3. ముందున్న జీవితం — సరోజిని ప్రేమ్‌చంద్
(Life Ahead)

4. ఈ విషయమై ఆలోచించండి (2 భాగాలు)
— సి. హనుమంతరావు
(This matter of culture)

రాబోవు అనువాదాలు :
జీవన వ్యాఖ్యలు — అబ్బూరి ఛాయాదేవి
(Commentaries on Living).

మన దగ్గర యేదైనా మంచి వుంటే, మనమేదైనా మంచి పని చేస్తే దానిని గూర్చి పదిమంది యెదుట గొప్పగా చెప్పకోనక్కర లేదు. అట్లా చెప్పకొంటే అది మన అల్పత్వాన్నే సూచిస్తుంది. మీరేపని చేసినా దానిమీది ప్రేమతో చేయండి; పేరుకోసం చేయవద్దు, ప్రచారం కోసం చేయ వద్దు. అట్లా చేస్తూ, అజ్ఞాత వ్యక్తిగా జీవించడంలోనే గొప్పతనమున్నది. దయారసముచే చిప్పిలు హృదయముగలిగి పేరుకోసం ప్రయత్నించకుండా జీవించు వాడుత్తముడు.

అట్లా చేస్తే మీకు ప్రసిద్ధి రాకపోవచ్చు, వార్తా పత్రికలలో మీ ఫోటో పడకపోవచ్చు, రాజకీయ నాయకులు మీ యింటికి రాకపోవచ్చు. అప్పుడు మీరు అజ్ఞాతంగా జీవితం గడుపుతూవున్న కేవలం సృజనశీలురైన మానవులు మాత్రమే. అయితే అందులోనే గొప్పతనమున్నది, అందమున్నది, ఆనందమున్నది.

18 జనవరి, 1955

ప్రశ్నల సూచి

ట్లయితే — మీకు మీరు ప్రాధాన్యమిచ్చుకొనేటట్లయితే — అదంతా క్షణములో నశించి పోతుంది. "నేను కనిపెట్టినాను, నాకు తెలుసు. నేను దీనిని తెలిసికొన్నాను, దానిని తెలిసికొన్నాను, అందుచేత నేను చాల గొప్పవాణ్ణి" అని మీరనుకొన్న క్షణమే దారి తప్పుతారు. దూర ప్రయాణం చేయదలచుకొన్నవారు తక్కువ సామానుతో బయలుదేరాలి. ఉన్నతమైన పర్వత శిఖరాలనధిరోహింపదలచుకొన్నవారు చాల తేలికగా ప్రయాణం చెయ్యాలి.

కాబట్టి యీ ప్రశ్న నిజంగా చాల ముఖ్యమైనది. తన్ను దాను తెలిసికొనడం (ఆత్మజ్ఞానము) ద్వారా, మనస్సు యొక్క పోకడలను గమనించడం ద్వారా సత్యమును దర్శిస్తాము, అవగాహన కలుగుతుంది. మీ పొరుగువానిని గురించి మీరేమి చెబుతారో, మీరెట్లా మాట్లాడుతారో, ఎట్లా నడుస్తారో, ఆకాశాన్ని అందలి పక్షులను ఎట్లా చూస్తారో, మనుషుల నెట్లా ఆదరిస్తారో, చెట్టు కొమ్మ నెట్లా నరుకుతారో — ఇవన్నీ ముఖ్యమే. ఎందువల్లనంటే యివన్నీ అద్దాలవలె మిమ్ము మీ యధార్థస్వరూపాన్ని యథాతథంగా తెల్పుతాయి. మీరు సావధానులై మిక్కిలి హెచ్చరికతో నుంటే, ఏ క్షణమున కాక్షణము ప్రతిదానిని క్రొత్త క్రొత్తగా కనుగొంటూ వుంటారు.

2. ప్రశ్న:- మనమెవరి గురించి యైనా ఒక అభిప్రాయాన్ని ఏర్పర చుకోవచ్చునా, ఏర్పరచుకోగూడదా?

కృష్ణమూర్తి:- మనుషుల గురించి అభిప్రాయాలు పెట్టుకోవచ్చునా? ఎవరి గురించైనా ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకోవచ్చునా? మంచి చెడ్డ విమర్శించి నిర్ణయాలకు రావచ్చునా? మీ ఉపాధ్యాయుని గురించి మీకు కొన్ని అభిప్రాయాలున్నట్లయితే అప్పుడు మీకు మీ ఉపాధ్యాయుడు కాదు ముఖ్యము, ఆయనపై మీకున్న అభిప్రాయాలు ముఖ్యమౌతాయి. జీవితంలో జరిగేదే అది, కాదా? ప్రజల గురించి మనందరికి వేర్వేరు అభిప్రాయాలుంటాయి. మనమంటాము గదా, "అతడు మంచివాడు."

"అతడు గర్విష్టి." "అతనికి మూఢవిశ్వాసము లెక్కువ." "అతడు అది చేస్తాడు, ఇది చేస్తాడు." ఈ విధంగా మనకున్న ఎదుటివాని కిన్ని మధ్య అభిప్రాయాల తెర అడ్డుగా వుంటుంది. కాబట్టి మనమా మనిషిని నిజంగా చూడలేము, చూడము. ఎవరో ఏదో యొక పనిని చేయడం చూచి "అతడీ పని చేశాడు" అని అంటాము. అందువలన, జరిగిన సంఘటనలను తేదీలవారీగా గుర్తించడం ప్రధానమైపోతుంది. అర్థమౌతున్నాదా? మీరు మంచిదని గాని చెడ్డదనిగాని అనుకొన్న పనిని దేనినైనా ఎవరైనా చేయడం చూస్తే, అప్పుడతని మీద మీకొక అభిప్రాయం ఏర్పడి అది మామూలుగా మీలో స్థిరపడిపోతుంది గూడ. మళ్ళీ పదిరోజుల తర్వాతనో, సంవత్సరం తరువాతనో మీరతనిని కలిసికొన్నప్పుడు మీరింకా మీ అభిప్రాయాల కనుగుణంగానే అతని గురించి ఆలోచిస్తారు. కాని యీ మధ్యకాలంలో అతడు మారిపోయివుండవచ్చు. అందువలన "అతడిట్లాంటివాడు" అని చెప్పగూడదు. ఇది చాల ముఖ్యం. "ఫిబ్రవరినెలలో అట్లా వుండేవాడు." అని చెప్పవచ్చు. ఎందుకంటే సంవత్సరాంతానికి అతడు పూర్తిగా మారిపోయి వుండవచ్చు. "మాకా మనిషి తెలుసును" అని మీరెవరి గురించైనా అంటే మీరన్నది పూర్తిగా తప్పైయుండవచ్చు. ఎందుకంటే అతని గురించి మీకు తెలిసినది కొంతవరకే, లేదా ఒకానొక దినమున జరిగిన సంఘటనలను బట్టి మాత్రమే. అంతకు మించి మీ కతని గురించి .బొత్తిగా తెలియదు. అందువలన ఎప్పుడు ఎవరిని కలిసికొన్నా గతముతో ప్రభావితము కాని నిర్మలమైన మనస్సుతో కలిసికోవలెనేగాని మీమీ పక్షపాతములతో ముందుగానే ఏర్పరచుకొన్న అభిప్రాయాలతో ఉద్దేశాలతో కలిసికొనరాదు.

3. ప్రశ్న:- మానసికమైన అనుభూతి యనగానేమి? మనమెట్లా దానిని పొందుతాము?

కృష్ణమూర్తి:- శరీర విజ్ఞాన శాస్త్రపు పాఠాలు మీకుండి వున్నట్లయితే మీ ఉపాధ్యాయుడు మానవశరీరమందలి నాడీమండల నిర్మాణమును గూర్చి, అది పని చేయు తీరును గూర్చి మీకు వివరించి యుండవచ్చు.